సరస్వతీ గ్రంథమండలి : 53

కపాలకుండల

అనువాదకుడు:

"కవిరాజ హంస - కవికులాలంకార"

శ్రీ వేలేటి పార్వతీశము

894.8273
BAN

పబ్లిషర్స్: ఆద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

AOUA103B 121

సరస్వతి

కపాలకుండల

(బంకించంద్ర చటర్జి)

అనువాదకుడు:

"కవిరాజ హంస - కవికులాలంకార"

శ్రీ వేలేటి పార్వతీశము

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11780

V.R. MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11780



పబ్లిషర్స్: అద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

సర్వస్వామ్యములు
ప్రకాశకులవి

894.8273
BAN

ఖెల రు. 2-50

Printed by Addepally Nageswara Rao
at Saraswathi Power Press, Rajahmundry
and Published for Addepally & Co.,
Order No. 711/1957

౧

కపాలకుండల

ప్రథమ ఖండము

మొదటి ప్రకరణము

సాగరసంగమము

"Floting straight obedient to the stream"

— *Comedy of Errors.*

ఇంచుమించుగా మూఁడువందల సంవత్సరములకుఁ బూర్వము మాఘమాసమునం దొకనాటి వేకువజామునం దొకతీర్థయాత్రికులనౌక గంగాసాగరసంగమమునుండి తిరిగివచ్చుచుండెను. ఆకాలమునందు పోర్చుగీసువారు, నింకను నితరులు నగు నోడదొంగల భయముచేఁ గొన్నిపడవలు గలసి యొకరికొకరుసహాయముగాఁ బ్రయాణము చేయుట వాడుకయైయుండెను. కాని యాపడవమాత్ర మప్పు డెట్టి సహాయమును లేకుండఁగనే యెంటిగాఁ బయనము సాగించుచుండెను.

కారణమేమనిన, తెల్లవారుజామున గాఢాంధకారముగా మబ్బు క్రమ్మికొని యతిప్రబలమగు గాలితో వర్షము కురిసెను. ఆ సమయమునందు నావికులకు దిక్కు తెలిసికొనుట కవకాశము లేకపోయెను. అందుచే వారాయోడను దీరమునకు దూరముగాఁ దీసికొనిపోయిరి. ఓడ గంగామధ్యమున నుండెను. దాని నెటుత్రిప్పి యేవైపుగా నడపింప వలెనో పడవవాండ్రకు బోధపడుట లేదు.

పడవలో నున్న యాత్రికులలోఁ జాలమంది నిద్రించుచుండిరి. ఒకముసలివాఁడును నొకపడుచువాఁడునుమాత్రము మేలుకొనియుండిరి. అప్పుడు వృద్ధుఁడు యువకునితో నేమేమియో సంభాషించుచుండెను.

ఆతఁడొకసారి యాసంభాషణము నాపి నావికులంగాంచి "మనము పోవఁదగినస్థాన మింకను నెంతదూర మున్నది?" అని ప్రశ్నించెను. నావికులు కొంచెము సంకుచిత హృదయములతో "ఏమో, సరిగాఁ దెలియుట లేదు." అని చెప్పిరి.

వృద్ధుఁడు కోపముతో నావికుల ననేకవిధములఁ దిరస్కరించుట కారంభించెను. అది చూచి యువకుఁడు వృద్ధునితో "అయ్యా! జగదీశ్వరుని హృదయమునందుగల యుద్దేశ్యమును విజ్ఞాననిధులగు పండితులే తెలిసికొని చెప్పజాలరుగదా? అట్టిచో మూర్ఖులగువీరు మీప్రశ్న కెట్లు సమాధానము చెప్పఁగలుగుదురు? పడవ నదీగర్భ మందున్నది. గమ్యస్థాన మెప్పటికిఁ జేరునో, యుత్తరక్షణమునం దేమగునో యెవ్వరు చెప్పఁగలరు! అందుకొఱకు మీరు తొందరపడిన నేమిలాభము?" అనెను.

ముసలివాఁడట్లే క్రోధభావముతో "తొందరపడు కొందువా? ఏమనిచెప్పుదును? పదిపదునేనెకరముల భూమిలోని చాల భాగము పంటను దొంగలు కోసికొనిపోయినారఁట! ఇఁక బిల్లలతో నేఁడాదిపొడుగునకు సంసారము గడపుకొనుట యెట్లు?" అనెను.

వృద్ధుఁడు సాగరసంగమయాత్రకుఁ బోయి మరలివచ్చుచుండఁగా ద్రోవలో యాత్రకై వచ్చుచున్న తనయిరుగుపొరుగువారివలన దన పొలము సంగతులను వినియుండెను. అందుచేతనే యాతఁ డెప్పుడిల్లు చేరుదు మని తల్లడిల్లిపోవుచుండెను.

అప్పుడా తరుణపురుషుఁడు మరల "అయ్యా! నేనిదివఱకే చెప్పియున్నాను. మీయింటియొద్ద పొలమువ్యాపారములను జూచు కొనువారెవ్వరును లేనప్పుడు మీరిల్లువిడిచి యీవిధముగా యాత్రలు సేవింపవచ్చుట యంత యుచితమైనపని గాదు!" అనెను.

వృద్ధుఁడు మరింతకోపముతో "ఇది మంచిపని కాదా? మూఁడు వయసులు గడపి ముక్కా-లిముదుసలినై తినిగదా – ఇఁక నుత్తరగతి కొఱకుఁ గావలసినపనులు చేసికొనక యేమి చేయమందువు?" అనెను.

యువ – మీకంతటి శాస్త్రజ్ఞానమే యున్న యెడలఁ దీర్థక్షేత్రముల యందుఁ జేసికొనుధర్మకార్యము లింటివద్దనుండియే చేసికొనవచ్చును. మొట్టమొదట నిల్లుచూచుకొనుటమాత్రము ధర్మముగాదా?

వృద్ధు – అట్లయినచో నీవెందుకు వచ్చితివి?

యువ – నాకు సముద్రమును దర్శింపవలయునని యెంతో కుతూహలముగా నుండెను. అందుచేతనే నేను బయలుదేఱివచ్చుచుంటి నని మీకిదివఱకే చెప్పియుంటినిగాదా?

అని సమాధానము చెప్పి యాతఁడించుకసేపాఁగి మెల్లమెల్లగా "ఆహా! ఎంతయానందముగానున్నది? ఆసాగరసంగమ మనోజ్ఞదృశ్య మును నేను జన్మజన్మాంతరములనై నను మఱవఁజాలను.

దూరాదయశ్చక్ర నిభస్యతన్వీ
తనూలతాళీ వనరాజినీలా
ఆభాతివేలా లవణాంబురాశే
ర్ధారానిబద్ధే వకళంకరేఖా."

ఆకవితారసమాధుర్య మా ముసలివాని చెవి కెక్కుటలేదు. అతఁడప్పుడు నావికులు పరస్పరము సంభాషించుకొనుచున్న మాటలను దదేక చిత్తముతో నాలకించుచుండెను.

ఒకనావికుఁడు రెండవవానిం గాంచి "అన్నా! ఎంతపని జరగిపోయినది! ఇఁక మన మిప్పు డేసముద్రములోఁ బడిపోవుదుమో – ఏదేశమునకుఁ జేరుకొందుమో – ఎంతమాత్రమును దెలియుటలేదు" అనిభయపడుచుఁ జెప్పుచుండెను.

ఆమాటలు విని వృద్ధుఁడుకూడఁ జాల భయపడియెను. ఏదియో యొకవిపత్తు తమకు సంభవింపనున్నదని యాతఁడు సంశయించుచుఁ దత్తరముతో నావికునింగాంచి "ఓయీ! ఇప్పుడు తటస్థించిన యిబ్బంది యేమి?" అని ప్రశ్నించెను. కాని పడవాఁ డెట్టి ప్రత్యుత్తరమును జెప్పలేదు.

ఆయువకుఁడు ప్రత్యుత్తరముకొఱకు నిరీక్షింపకయే యావలికిఁ బోయెను. అప్పటికప్పుడే ప్రభాతచిహ్నములు గానవచ్చుచుండెను. నాలుగుదిక్కులునుగూడ నతిభయంకరమగు విషమప్రభంజనముచే వ్యాప్తములై యుండెను. ఆకాశముగాని, నక్షత్రములు గాని, చంద్రుఁడుగాని, నదీకూలముగాని యేదిక్కనను నెచ్చటను గాన వచ్చుట లేదు. నావికులందఱును దిక్కు తెలియక యల్లాడుచుండిరని యాతఁడు గ్రహించెను. ఇప్పు డేదిక్కుగాఁ బడవను నడపింపవలయునో వారికి బోధపడుట లేదు – పొరపాటున నెటుమరలించిన నోడ సముద్రములోఁ బడిపోవునో యని వారు భయపడుచుండిరి. అందుచే వా రేమియుందోచక విభ్రాంతులై యుండిరి.

ఆపడవలోనున్న వారికి మంచుపడకుండ నెమటఁ గొంతయావరణ మేర్పాటు చేయఁబడి యుండెను. అందుచేతఁ బ్రయాణికులు లోపలనే కూర్చుండి యున్నవారగుటచే వారి కీ సంగతు లేవియును దెలియుట లేదు. కాని యాయువకుఁడు యాత్రికులయవస్థ యేమగునో యంత యును దెలిసినవాఁడగుటచే వృద్ధునిగూర్చి ముందు తటస్థింపనున్న విప ద్విషయమై సవిశేషముగ సంభాషింపఁదొడంగెను. అంతలోఁ బడవ లోపలఁ గోలాహలధ్వనులు బయలువెడలెను. ఆవృద్ధయువకులమాటల సవ్వడివలనఁ నౌకలోపలఁబడున్న వారిలోఁ గొందఱు స్త్రీలకు మెలఁ కువవచ్చెను. వారామాటలను విని చాలభయపడి యార్తనాదములు చేయఁదొడంగిరి. ఆకేకలతో నిదురించుచున్న యాత్రికులందఱును

మేళాఁంచి యన్ని సంగతులును దెలిసికొనిఁగోల పెట్టదొడంగిరి. అది చూచి వృద్ధుఁడు త త్తరముతో నావికుల నుద్దేశించి "పడవ నొడ్డునకుఁ బట్టుఁడు! త్వరగాఁ దీరమునకుఁ జేర్చుఁడు! అట్లు చూ చెద రేమీ?" అని తొందర పెటుఁదొడంగెను.

యువకుఁడు మందహాసము చేయుచూ "ఒడ్డెక్కఁడనున్న ది? ఆసంగతి తెలిసియేయున్న చో నిప్పుడీగోలయంతయు నెందుకు?" అనెను.

ఆమాటలు వినుటచే నధైర్యపడుచుఁ బడవలోనివారందఱును మఱింతభయముతో గోల పెట్టుట కారంభించిరి. అప్పు డాయువకుఁ డనేకవిధములఁ బ్రయత్నించి యాత్రికులనందఱను సమాధానపఱచి నావికులం గాంచి "ఇప్పుడంతగా భయపడి తొందరపడవలసిన యావ శ్యక మేమియును లేదు. తెల్లవారుజామైనది. నాలుగైదుగడియలలో సూర్యోదయ మగును. ఈమధ్యకాలములో మనకుఁ దటస్థించుప్రుట్టి మునుక యేమియును లేదు. మీ రెంతయును బడవనడుప్రుట్కై తెడ్ల నుపయోగింపవలదు. ప్రవాహము ననుసరించి నౌకను దనయిష్టము వచ్చినట్లు పోనిండు! తరువాత వెలుఁగువచ్చినంతనే యేమి చేయవల యునో యాలోచింతము!" అని చెప్పెను.

నావికులందఱు నాతనియాలోచన ననుసరించి యాతఁడు చెప్పినట్లే చేయుట కనుమతించిరి.

చాలసేపటివఱకును బడవవాఁడ్రేమియును జేయక ప్రవాహాను కూలముగాఁ దరణిని బోనిచ్చుచుండిరి. యాత్రికులందఱును గంతగత ప్రాణులై యుత్తరక్షణమున నేమైపోవుదుమో యని తల్లడిల్లిపోవు చుండిరి. అప్పుడు గాలి యంతతీవ్రముగా వీచుట లేదు. అందుచేతఁ దరంగాందోళనమువలనం గలుగు కంపముకూడ యాత్రికుల కనుభవ మగుటలేదు. అయినను బ్రయాణికు లందఱును దాము మృత్యుముఖ మునం దున్నయట్లే భావించుకొని దద్దరిల్లి పోవుచుండిరి. పడవలో

నున్న పురుషులందఱును నిశ్శబ్దముగా దుర్గానామమును జపించుచుండిరి. ఆఁడువాఁడుమాత్రము శోకరసోచితపదవిన్యాసముతోఁ బెద్దపెట్టున రోదనములు గావించుచుండిరి. అందొకస్త్రీ గంగాసాగర సంగమస్థాన మునఁ బరమభక్తితో సంతాన విసర్జనమును గావించియుండెను. ఆమె యట్లు విసర్జించి యంతలోనే మాతృప్రేమవివశయై యాబిడ్డను మరల నెత్తికొనవలెనని ప్రయత్నించెను గాని ప్రయోజనము లేకపోయెను. అందఱిలోనను ఆయువతిమాత్రము కంటఁదడిపైనఁ బెట్టుటలేదు!

అట్లూరక నిరీక్షించుండఁగనే జాముప్రొద్దెక్కినట్లనుభవమును బట్టి తెలియవచ్చెను. అసమయమం దాకస్మికముగా నదీతట దేవతలంగూర్చి ప్రార్థించుచున్న నావికులకోలాహలధ్వనిబయలు దేఱెను. అదివిని పడవ లోనివారందఱును నావికులంగూర్చి "అదియేమి? అదియేమి? ఏమిజరిగి నది?" అని ప్రశ్నింప నారంభించిరి. నావికులందరు నొక్కటేమాటగాఁ బెద్దగొంతులతో "ఎండ వచ్చినది - వెలుఁగు వచ్చినది - అదిగో! ఇసుక బయళ్లు!" అని చూపించుచుండిరి. అందఱు సతికుతూహలముతోఁ బడవపై భాగమునకు వచ్చి తిలకించుచుండిరి. తా మెక్కడికి వచ్చితిమో, ఇఁకముం దేమిచేయవలయునో యని యాలోచించుకొనుచుండిరి.

సూర్యుఁడు నిర్ణిరోధముగాఁ బ్రకాశించుచుండెను. తుషానుచేతను, అంధకారముచేతను సమాచ్ఛన్నములై పోయిన దిక్కులన్నియు నిప్పుడు కలకలలాడుచుఁ గానవచ్చుచుండెను. ఇంచుమించుగా జాముప్రొద్దెక్కి నది. ఇప్పుడు నౌక యెక్కడకుఁ జేరికొన్నదో యా స్థానము కేవ లమును సముద్రము గాదు. సాగరప్రవాహితనదీమాత్రమే — కాని యాస్థలమునందు నది యెంతవిశాలముగనుండెనో యంతటివై శాల్యము మఱియెచ్చటను లేదు. ఆనదికిఁగల యొకవై పుతీరము పడవకుఁ జాల సమీపముగనే యుండెను. పదిపదునేనుబారలదూర ముండవచ్చును. కాని దానియపరతీరమెచ్చటనున్నదో జాడయైన నగపడుట లేదు.

ఆనైపున ననంతమై దిగంతవ్యాప్తమగుజలరాశి చంచలప్రభాకరకిర
ణములచే మిలమిలమెఱయుచు మిన్నులుప్రాలినప్రాంతమున నాకా
శముతో నైక్యమైనట్లు కానవచ్చుచుండెను. ఈనలియొడ్డునందలి
జలము సంప్రాప్తముగ గరమసంకలితమై నదీజలముపలెనే యుండెను.
దూరమునందలిజలమయస్థానమంతయును విసీలకాంతితో విస్ఫారియుం
డెను. పడవలోనివారందఱును బరిపరిపిధముల నాలోచించి తమపడవ
నిశ్చయముగా సముద్రమధ్యమునకుఁ గొట్టుకొనివచ్చెనని సిద్ధాంతము
చేసికొనిరి. కాని యుపకూలము సమీపమునందే యదృష్టవశమున
నుండుటచేఁ దమకంతగా నపాయము తటస్థింపదనునాశ కలుగుచుండెను.

నావికులు సూర్యస్థితినిబట్టి యాలోచించి దిక్కులను నిరూపించు
కొనగలిగిరి. ఎదుట నగపడుచున్న యుపకూలము స్వభావసిద్ధముగ సము
ద్రమునకుఁగల పశ్చిమవేల యని నిశ్చయించుకొనిరి. ఆతీరమునందు
పడవకుఁ గొంచెము సమీపమునందే యొకనదీప్రవాహము వెండినీటి
వెల్లువవలె మందగమనముతోఁ గదలి వచ్చి సముద్రముసఁబడుచుండెను.
ఆనదీసంగమస్థానమునకు దక్షిణభాగమునందు విశాలమగు వాలుకా
మయ భూఖండమున ననేకవిధములగు నసంఖ్యవిహంగములు కలకల
ధ్వనులుచేయుచు విచ్చలవిడిగ విహరించుచుండెను - ఆనది యిప్పుడు
"రసూల్ పురనది" అనునామముతో వ్యవహరింపఁబడుచుండెను.

రెండవ ప్రకరణము

ఉపకూలము

"Ingratitude! Thou marble-hearted fiend!"
— *King Lear.*

ప్రయాణికుల యుత్సాహసూచక సంభాషణములు ముగిసినతరు
వాత నావికులు యాత్రికుల నుద్దేశించి "సముద్రముపొంగువేళ యింకను

గాలేదు. ఈలోపలనే మీరందఱును దీరమునకుఁ జేరి వంటలును భోజనములును గానిండు! తరువాతఁ బోటువచ్చినంతనే మనము పడవ మరలించుకొని మనయూరికిఁబోవుదము" అనిచెప్పిరి. పడవలోనివారంద ఱును నావికులయేర్పాటునకు సమ్మతించిరి. అప్పుడు పడవవాండ్రు పడవ నొడ్డునకుఁ జేర్చి యారోహీకుల నచ్చటదింపిరి. వారందఱును స్నానాదిప్రాతఃకాలకృత్యములను దీర్చుకొనుటకు సన్నద్ధులగుచుండిరి.

స్నానాదులైనతరువాత భోజనార్థము వంటచేసికొనఁ దలచిరి. కాని దానికొక క్రొత్తయాతంకము తటస్థించెను. వంటచేసికొనుటకుఁ గావలసిన కట్టెలు పడవయందు లేవు. వ్యాఘ్రాదిక్రూరజంతుభయ ముచేఁ బుల్లలను సంగ్రహించుటకై యెవ్వరునుగూడ నా విజనారణ్య భాగమునకుఁ బోవుటకు సాహసింపఁజాలకుండిరి. తుట్టతుద కందఱు నుపవాసముచేయుటకే సిద్ధపడి యుండుటం గాంచి వృద్ధుఁ డిదివఱకుఁ జాలసేపటినుండియు సంభాషించుచున్న పరిచితుఁడగు యువకునిం గాంచి "బాబూ! నవకుమారా! దీనికేదియోయుపాయము నీవాలోచింప కున్నచో నీదినమున వీరందఱును దిండిలేక మాడిపోవుదురు. ఏదో యొకవిధముగా వీరు పట్టెఁడన్నము దినుటకుఁ దగినయేర్పాటు చేయవా?" అని హెచ్చరించెను.

నవకుమారుఁడు చాలసేపాలోచించి "మంచిది. నేను పోయి ప్రయత్నించెదను. ఒక గొడ్డలిని నాకీయవలయును. వంటకట్టెలను మోచికొని తెచ్చుట కెవ్వరై న నావెంట రండు!" అని చెప్పెను.

నవకుమారునివెంటఁ బోవుట కాయాత్రికులలో నొక్కరునుగూడ సాహసింపఁజాలకపోయిరి.

ఇట్లూరక చూచుచుండుటవలన భోజనవేళకూడ నతిక్రమించిపోవు నని యెంచి నవకుమారుఁ డొంటిగనే గొడ్డలి భుజమునవైచుకొని కాష్ఠసంగ్రహార్థమై సమీప వనంబునకు వెడలిపోయెను.

నవకుమారుఁ డాతీరము నధిరోహించి నలువంకలను దిలకించెను. ఆతనిదృష్టులు ప్రసరించినంతమేర నెచ్చటనుగూడ మానవనివాస మేది యైన నున్నట్లాతని కగపడలేదు. అంతయు నరణ్యమయమైయుండెను. కాని యావనమునందు గొప్పగొప్పవృక్షములు లేవు. అందుచే దట్టముగా దుర్గమమై యుండలేదు. కేవలము పొదలు, తుప్పలు మొద లగువానితోమాత్రమే వ్యాపించి యుండెను. అచ్చటచ్చట నిసుక తిప్పలు కొండలవలెఁ బెరిగియుండెను.

నవకుమారుఁ డాప్రదేశమునఁ బడి వంట కుపయోగించు కట్టెలను సంపాదించుటకై యన్వేషించుచుండెను. కావలసినవంట చెఱుకును గొని తెచ్చుటకై యాతడానదీతీరమునుండి చాలదూరమువఱకును బోవలసి వచ్చెను. తుట్టతుదకాతఁడు ఛేదనయోగ్యంబగు నొకవృక్షమును గను పెట్టి యటకుఁబోయి దానినుండి కావలసిన యెండుకట్టెలను గొడ్డలితోఁ దునిమి ప్రోగుచేసి యొకమోపుగాఁ గట్టెను. కాని యాపుల్లలను మోసి తీసికొనివచ్చుటమాత్ర మాతనికెంతయో కష్టముగాఁ దోచెను.

నవకుమారుఁడు సాధారణకుటుంబమున జన్మించినవాఁడు గాఁడు. ఆతఁడు చాల భాగ్యవంతుఁడు. దాసదాసీజనపరివారము గలవాఁడు. అందుచేత నాతఁ డెన్నఁడు నిట్టికష్టపుబనులు చేయుట కలవాటుపడి యుండలేదు. ఉపకారబుద్ధిచేత నాతఁడు స్వశక్తింగూర్చి యాలో చింపకుండఁగనే యిట్టి యశక్యపుఁబనికి సిద్ధపడి వచ్చియుండెను. కాని యిప్పుడా కష్టులను మోయుట యాతని కెంతయోకష్టముగా నుండెను. ఎట్లయిన నేమి? — తానుపూనుకొన్నపనిని సాధారణాభ్యంతరముల వలన విడిచిపెట్టుస్వభావము నవకుమారున కెంతమాత్రమును లేదు. అందుచేతనే యాతఁడెట్లో కాష్ఠభారమును వహించి యాయాసపడుచు మెల్లమెల్లగాఁ దీసికొని వచ్చుచుండెను. అట్లు కొంతదూరమునడచుచు నచ్చటమోపును దింపి యలయిక దీర్చుకొనుచు మరలనెత్తుకొనుచు

మరల దించుకొనుచు నీవిధముగా బట్టువిడువక యతికష్టముతో నడచి వచ్చుచుండెను.

ఇట్లు శ్రమపడి పయనము సాగించుటచేతనే నవకుమారుఁడు తిరిగి యథాస్థానమును జేరుకొనుటకుఁ జాల నాలస్యమగుచుండెను. ఇచ్చట యాత్రికు లందఱును గూడి నవకుమారునిరాక కెదురుచూచుచు నాఁత డెంతకును దిరిగి రాకుండుటచేఁ దహతహపడుచుండిరి. పాపమా యడవిలో నేక్రూరవ్యాఘ్రమైన నవకుమారుని గబళించి వైచిన దేమో యనికూడ వారికి సంశయముగలుగుచుండెను. రాఁదగినవేళ యతిక్ర మించి పోవుటచేఁ జూచి చూచి వారందఱును దా మనుమానించిన విషయము నిశ్చయమే కావచ్చునని సిద్ధాంతము చేసికొనిరి. అంతేకాని కొంచెము శ్రమపడి తీరమునుజేరి కొంచెముదూరము ముందఱికిఁ బోయి యాతఁడేమయ్యెనో చూచిరావలయునని వారిలో నొక్కని కైనను దోచనేలేదు. అట్లుచేయుట కందొక్కరును సాహసింపలేదు.

యాత్రికులందఱు నీవిషయముంగూర్చి యెవరికిఁ దోఁచినట్లు వారు మాట్లాడుచుండిరి. ఇంతలో నాజలరాశిమధ్యమునందు మహాభయంకర మగు కల్లోలము బయలుదేఱెను. సముద్రము పొంగుచున్నదని నావి కులు గ్రహించిరి. క్రమముగాఁ బోటుసీరు వర్ధిల్లి యాతీరమునంతను ముంచివేయు ననియు, నప్పుడు తమపడవ తీరమునందే నిలిచియున్నచో ఘనతరంగాఘాతములచేఁ బగిలి ముక్కలుముక్కలుగ నై పోవుననియుఁ బడవవాఁడు చాలభయపడిరి. అందుచేత వారు మిగులతొందరతోఁ దీరమున బంధించియుంచిన పడవమోకులను విప్పివైచి పడవను నదీ మధ్యమునకు మరలించుచుండిరి. అంతలోనే యాసమీపమునందలి యిసుకపట్టయంతయును జలప్లావితమైపోయెను. యాత్రికులందఱును హడాహుడిగా నెట్లోపడవనధిరోహింపఁగలిగిరి. అంతేకాని వారు వంటచేసుకొనుటకై యొడ్డునఁబెట్టుకొనియున్న బియ్యము, పప్పు, ఉప్పు,

మొదలగుపదార్థము లన్నియు నానీటిలోఁ గలసియేపోయెను. దుర దృష్టవశమునఁ నావికులుకూడ నంతటిసమర్థులు గాకపోవుటచేఁ బడ వను జాగ్రత్తగాఁ బట్టఁజాలకపోయిరి. ఆప్రబలజలప్రవాహమునం బడి యప్పు డానౌక యొక్కవిసరున రసూల్‌పురనదీమధ్యమునఁబడి పోయెను.

అప్పుడు ప్రయాణికులలో నొకఁడు "పాపము మనమిప్పుడు నవ కుమారుని విడిచిపెట్టి పోవుటయేనా?" అనెను.

ఆమాట విని విసుఁగుతో నొకనావికుఁడు "ఇంకను మీ నవకుమారుఁ డెక్కడ నున్నాఁడు? ఆతఁడీపాటి కేపులికడుపునందో పడి జీర్ణితుడేఁ యైయుండును!" అనెను.

ప్రవాహవేగముచేఁ బడవ నదీమధ్యమునకుఁబోవుచుండెను. అది యింకను నట్లే పోయినచో దానిని మరలించుట కెంతయో శ్రమపడ వలసియుండును. అందుచేత నావికులు ప్రాణపణముగాఁ దమ సర్వశక్తు లను వినియోగించి పడవనెట్లుయిన నీటివడినుండి తప్పించుటకుఁ బ్రయ త్నము చేయుచుండిరి. ఏమనిచెప్పుదుము! చలికాలమగునామాఘ మాసపు దినములలోఁగూడ వారిశరీరములును, మొగములును ముచ్చె మటలతో దడసిపోయెను. నావికులందఱు నీవిధముగా శ్రమపడి నౌకను రసూల్‌పురనదీముఖమునుండి తప్పించిరి. కాని, యాపడవ యట్లు బయట బడినంతనే యాప్రవాహము మఱింతతీవ్రమై యుత్తరాభిముఖ ముగా శరవేగమునఁ బ్రవహింపఁదొడంగెను. నావికు లీక నానౌక నెంతమాత్రమును మరలింపఁజాలకపోయిరి.

ఆనీటివడి తగ్గినతరువాత నౌకాగమన మించుక మందగించినప్పుడు నావికులు దానిననుకూలపథాభిముఖముగాఁ ద్రిప్పి నడిపింపనారంభించిరి. పడవ యప్పటికప్పుడే రసూల్‌పురనదీతటమును విడిచి చాలదూరము వఱకును బోయి యుండెను. అప్పటికందఱిమనసులును గుదుటఁబడినవి.

అప్పుడు నవకుమారునికొఱకు నౌకను వెనుకకుఁద్రిప్పి తీసికొనిపోవుటా మానుటయా యను విషయముంగూర్చి యందఱును బరామర్శింపఁ దొడంగిరి. ఇప్పుడు చెప్పవలసిన దేమనగా నవకుమారునితో వచ్చిన యాత్రికు లందఱు నాతని యిరుగుపొరుగులయింటివారలే కాని యం దొక్కరునుగూడ నాతనికాత్మబంధువులుగారు. అందుచేత వారందఱు నాలోచించి మరల నవకుమారునికొఱకు పడవ త్రిప్పుకొనిపోవుటగాని, యాతనియాగమనమునకొఱకు నిరీక్షించుటగాని కేవలము మూర్ఖత్వమని యేకవాక్యముగా నందఱును నిశ్చయించుకొనిరి. ఆతనికొఱకుఁగని పెట్టుకొనియున్నచోఁ బ్రొద్దుపోవుననియు, రాత్రిచీఁకటిలోఁ బడవనడిపించుట కవకాశముండదనియు, మరలఁ బ్రొద్దుపొడుచువఱకును వేచియుండవలయుననియు, నేఁటిదినమంతయు నుపవాసముతో మూడవలసియున్న మనకు రేపుగూడఁ బస్తుండవలసివచ్చుననియు, నందువలన నందఱిప్రాణములును గంతగతములు గాక మానవనియు ననేకవిధముల నాలోచించి యాత్రికులందఱును బ్రయాణము నొకనిమిషమైన నాపఁకుండుటయే యుక్తమని సిద్ధాంతము చేసికొనిరి. విశేషించి పడవను వెనుకకుఁ ద్రిప్పుటకుఁగాని, యట గొంతసేపాపుటకుఁగాని నావికు లంగీకరించుటలేదు. వారు సహజముగాఁ దమకుఁ దోఁచినట్లు చేయువారే కాని యొకరుచెప్పినమాటలను వినుస్వభావము గలవారు కారు. అందుచే నావికులు పడవలోనివారి నుద్దేశించి "నవకుమారుఁడు పులినోటిలోఁ బడిపోయియే యుండును. ఆతఁడు మరలివచ్చుననునాశ యెంతమాత్రమును లేదు. ఇట్టి సందర్భములో మనమందఱమును నిప్రయోజనముగా శ్రమపడుట యెందుకు?" అనిచెప్పిరి.

ఈవిధముగాఁ దర్కవితర్కములు జరిగినతరువాత యాత్రికు లందఱును నవకుమారుని యాశవదలుకొని తమదారినిపోవుటయే కర్తవ్యమని యేకగ్రీవముగ నంగీకరించిరి. పాపము, నవకుమారుఁ డాయపార

పారావారతీరమునందు ఆదుర్గమ నిర్జన విపినస్థానమునందుఁ దోడివారిచే విసర్జితుఁడై పోయెను.

ఇట్టి దుస్సంఘటనముంగూర్చి చదివినవారిలో నెవ్వరైన "ఒక యపరిచితస్థలమునం దుపవాసాయాసమునఁబడి వంటచేసికొనుటకుఁ బుల్లలులేక తల్లడిల్లిపోవుచున్నపరాయివారి కిఁక నెన్నఁడును గష్టులు కొట్టి తెచ్చియిచ్చుటకై యెవ్వరును సాయపడఁగూడదు" అని ప్రతిజ్ఞ చేసికొని పరోపకారవిముఖులైనచో నట్టివారు తప్పక పరిహాసాస్పదులు కాకమానరు. తన కుపకారముగావించిన మహనీయుని వనమధ్యమునందొంటిగాఁ ద్యజించిపోవు క్రూరస్వభావు లెల్లప్పుడును దమపరమోపకారికి వనవాసక్లేశమును గల్పించుచునే యుందురుగాక! - ఎన్ని సారులు ఘోరారణ్యవాసాయాసము ననుభవింపవలసివచ్చుచున్ననుఁ బరోపకారమే పరమధర్మముగనిర్వహించు స్వభావముగల వాఁడెట్టి కష్టములనైనను సహించి పరహితాచరణమును గావించుచునే యుందురు. నీవు నీచుఁడవైన నగుదువుగాక; అట్టని నే నుత్తముడ నేల కాకుండవలయును?

మూఁడవ ప్రకరణము

నిర్జనస్థానము

"—Like a veil,
Which if withdrawn, would but disclose the frown
Of one who hates us, so the night was shown
And grimly darkled o'er their faces pale
And hopeless eyes."

— *Don Juan.*

యాత్రికులందఱును నవకుమారు నెచ్చట విడిచిపెట్టిపోయిరో యాప్రదేశమందిప్పుడు డౌలతుపురము, దరియాపురము నను రెండు గ్రామములు నిర్మింపఁబడియున్నవి. మన కథాకాలమునాటి కచ్చట

నొక మానవనివాసచిహ్నమైనను గానవచ్చుట లేదు. అంతయుఁ జిట్టడవిగా నలముకొని యుండెను. బంగాళాదేశమునందుఁగూడ నచ్చటచ్చట సస్యానుకూలముగ లేని నిర్జలభూఖండము లున్నవిగాని యవికూడ నింతటినిష్ప్రయోజకములుగా నుండవు. కసూల్ పురనదీముఖద్వారమునుండి సువర్ణరేఖాపర్యంతమును నించుమించుగాఁ గొన్నియోజనములవఱకును వ్యాపించిన భూఖండమంతయును జాలవఱకు స్తూపాకృతులుగా నేర్పడిన వాలుకారాసులచే నిండియుండెను. ఆయిసుకతిప్పలు మఱికొంత పెద్దవియైనచో వానిని నిశ్చయముగా నిసుకకొండలనియే చెప్పవచ్చును. కాని యప్పటివాసు వాని నిసుకదిబ్బలని వాడుచుండిరి. ఆ యిసుకతిప్పలన్నియును దెల్లనిశిఖరమాలికలతో మధ్యాహ్నసూర్యకిరణములలోఁ బ్రకాశించుచు దూరమునుండి తేజోమయములై గోచరించుచుండును.

ఆ యిసుకతిన్నెలపై నెట్టి పెద్దవృక్షములును మొలకలెత్తఁజాలవు. స్తూపప్రదేశములందుమాత్రము చిన్నచిన్నతుప్పలు మొలచి చిట్టడవిగా నలముకొనియుండును. కాని వాని మధ్యప్రదేశమునందును, శిఖరభాగములందును నెట్టినీడయునులేక కేవలము తెల్లగనే కానవచ్చుచుండును. వానిక్రిందిభాగమునందు మాత్ర మలంకారప్రాయముగా నడవిపూలపొదలు విశేషముగ నలమికొనియుండును.

ఎట్టివికాసమును లేని యట్టి నిర్జనవనస్థానమునందు తోడివారందఱును నవకుమారు నేకాకిగాఁజేసి పరిత్యజించిపోయిరి. నవకుమారుఁడు కష్టులమోపును మోయలేక మోయలేక తీసికొనివచ్చుచు గ్రమముగా నదీతీరమునకు వచ్చి చూచెను. అచ్చట నాతనికిఁ బడవ యగపడలేదు. అప్పుడాకస్మికముగా నాతని హృదయమునందు భయము తోఁచెను. కాని, తోడివారందఱును దన్ను బరిత్యజించిపోయిరనుసంశయ మాతనికి గలుగనేలేదు. సముద్రపు పోటునీటిచే నిసుకభూమియంతయును మునిఁగి

పోవుటచే నాకనుమఱియొక చోటికి మరలించుకొని పోయియుందు రనియు, వారెచ్చటనుండిరో వేగముగఁబోయి వెదకిచూడవలయు ననియు నవకుమారుఁ డాలోచించుకొనియెను.

ఆయుద్దేశముతోడనే యాతఁడచ్చటఁగూర్చుండి యలయికఁ దీర్చు కొనుచు నలుదెసల నన్వేషించుచుండెను. కాని యెందైనను బడవ యున్నజాడ యగుపడుటలేదు. తనతో వచ్చియున్న యాత్రికులలో నెవ్వరైనను నగపడుటలేదు. అప్పుడు నవకుమారుఁడు మిగుల నాకలిచేఁ బీడితుఁ డగుచుండెను. ఇఁక నాతఁడు వేచియుండఁ జాలక పడవ యెందున్నదో వెదకి కనుగొనుటకై నదీతీరమునందంతటను దిరుగాడ నారంభించెను. కాని యాతనికెచ్చటను బడవ కానరాలేదు. అందుచే నాతఁడటనుండి మరలి యథాస్థానమునకుఁ జేరి ప్రతీక్షించుచుండెను. ఎంతసేపటికిని బడవవచ్చుజాడ తోపకుండుటచే నాతఁడు తనలో "సముద్రపుబోటువేగముచేఁ బడవ తేలిపోయి యేవైపుననో చేరుకొని యుండును. ఆప్రతికూల ప్రవాహమును దప్పించుకొని మరలి నాకొఱకు వచ్చుట కందుచేతనే యాలస్యమై యుండును" అని భావించుకొను చుండెను. కొంతసేపటికి నీటిపోటు తగ్గిపోయెను. అప్పు డాతఁడు "వరదపొంగు చల్లారినది. ఇఁక మనపడవ నాకొఱ కీవైపునకు రావచ్చును" అనుకొనెను. ఇట్లుభావించుకొని చూచుచుండఁగనే క్రమముగా సాయంకాల మయ్యెను. సూర్యుఁడు కూడ నస్తమించెను. "పడవను నాకొఱకు మరలించి తీసికొని రాదలంచినచో నీపాటికి రావలసినదే. ఏకారణముచేత రాలేదో తెలియుట లేదు" అని నవకుమారుఁడు శంకించెను. కాని పడవ రాలేదు!

"సముద్రజల మతితీవ్రముగఁ బొంగి పొరలుచుఁ దీరమునాక్రమించుసమయమునం దొకవేళ నానావికతరంగభంగితమై జలరాశియందు మునిఁగిపోయినదేమో? కాకున్నచో, నాతోడియాత్రికులు

నన్నీయరణ్యమున విడిచి పడవతరలించుకొని పోవుదురా?" అని నవ కుమారుఁ డనేకవిధములఁ నాలోచించుకొనుచుండెను.

ఆసమీపమం దొకగ్రామమైన నగపడుట లేదు. నిలువనీడలేదు; మానవసంచారములేదు; తినుటకేమియును లేదు; గ్రాగుటకు నీరై నను లేదు. అచ్చటనదీజలమంతయు నుప్పగా నసహ్యముగా నుండెను. ఆకలిచేతను, దాహముచేతను నవకుమారుఁడు మిగులఁ బీడితుఁడై యుండెను. చలిబాధనడంచుకొనుటకుఁ దగినయాశ్రయమైనఁ గాన వచ్చుటలేదు. కప్పుకొనుట కుపవస్త్రముకూడ లేకుండెను. ఆమంచు తుంపరలతో వీతెంచుచున్న చలిగాలిలో హిమాధికశీతలంబులగు జల ములతో నిండి ప్రవహించుచున్న నదియొడ్డున - శిశిరసిక్తంబగు బట్టబయట - నిరావరణప్రదేశమున నిరాశ్రయుఁడై నవకుమారుఁ డొక్కఁడు నారాత్రి చలియిసుకలో శయనింపవలసి యుండెను. ఆరాత్రి యేసమయమందో, ఏపులియో, ఏయెలుగుగొడ్డో సాక్షాత్కరించి యాతని నాత్మార్పణముగఁ జేసికొనవచ్చును - ఇట్టి దురవస్థలో నాతఁడు జీవించియుండు ననుట కవకాశ మేమున్నది?

వికలహృదయుఁడగు నవకుమారున కప్పు డేమియును దోఁచుట లేదు. నాలుగునిమిషము లాతఁడొకచోట నిలువఁజాలక యటునిటుఁ దిరుగనారంభించెను. క్రమముగా నాతఁ డాయేటియొడ్డును వదలి యిసుకతిన్నెలపైకిఁ బోయి యిటునటుఁ బరిభ్రమించుచుండెను.

అప్పటికి గాఢాంధకారము నలుదెసల నలముకొనియెను. ఆశిశి రాకాశమండలమునందు నక్షత్రములు నిశ్శబ్దముగ నస్పష్టముగఁ దోచు చుండెను. ఆచిమ్మచీకటిలో నంతటను జనశూన్యమైయుండెను. - ఆయాకాశము, ఆయిసుకబయలు, ఆవిశాలజలరాశి — అంతయు నంధ కారబంధురము! కేవలము నెడతెగకుండఁ బొంగిపొరలుచుండు సముద్రతరంగముల గభీరగర్జన మేకతానమునఁ గర్ణభీషణ మగు

చుండెను. అప్పుడప్పుడు వన్యములగు క్రూరజంతువుల భీకరారవము లా యేక ఘోషమునందు సదృశ్యవిలీనములగుచుండెను.

అట్టి ఘోరాంధకారమునందు, మంచుచే దడిసియున్న యిసుక బయలునందు, గుట్టలుగుట్టలుగ వ్యాపించియున్న వాలుకాస్తూపముల నడుమనుండి నవకుమారుఁడు కాలుగాలినపిల్లివలెఁ దోచినశ్రోవనుబట్టి తిరుగాడుచుండెను. ఒకసారి యాయిసుకకొండల సమీపప్రదేశములం దును, ఒకసారి యాగుట్టలమీదిభాగములందును, ఒకసారివానిశిఖరముల యందును, జేరి యటునటు చూచుకొనుచు నెక్కడకుఁ బోవలయునో తోఁచక నవకుమారుఁడు దిగ్భ్రాంతుఁడై తిరుగుచుండెను. అట్లు తిరు గాడుచు నాతఁ డడుగడుగునకు నపాయమును శంకించుకొనుచుండెను. ఎచ్చట నాఁగిన నేమిముప్పు వచ్చునో, యని యెప్పు డేక్రూరజంతువు వచ్చి పైఁబడి తన్నుఁ గబళించిపోవునో యాతఁడు దద్దరిల్లిపోవుచుండెను.

అపరిచితప్రదేశమునం దట్లు కాలునిలుపక పరిభ్రమించుచుండుటచే నవకుమారునకుఁ జాల నాయాసము పుట్టెను. నేఁటిదినమంతయు నాతనికిఁ దిండిలేదు. అందుచేత నాతఁడు మిగుల నవసన్నుఁడై పోయెను. అప్పు డాతఁ డొక యిసుకతిన్నెపైఁ గూలఁబడిపోయెను. ఆతనికాసమ యమునఁ దనమందిరమునందలి సుఖకరం బగు వెచ్చనిపర్యంకము స్మృతికి వచ్చెను. ఎప్పుడు శారీరికములును, మానసికములు నగుక్లేశ ములు సంభవించి విచారము వర్ధిల్లుచుండునో యట్టి సమయములం దొకానొకప్పు డాచింతతోఁగూడ నిద్రకూడవచ్చి యావేశించుచుం డును. నవకుమారుఁ డప్పుడు తనదురవస్థంగూర్చి యాలోచించు కొనుచు గ్రమముగా నిద్రాభిభూతుఁడై పోయెను. ఇట్టి స్వాభావిక నియమమే లేక యున్నచో మానవులు తమతమయనివార్యములగు సాంసారికక్లేశముల నన్నిటి నన్ని సమయములయందును సహించి జీవింపఁగలుగుట యసాధ్యమే యైపోవును.

నాలుగవ ప్రకరణము

ఐసుకకొండకొన

"... ... ..."

"ఆకస్మికంబుగా ననతి దూరమున"

"అనఘ్రిగోచరుండయ్యె నత్యగ్రమూర్తి"

—అనువాదము: మేఘనాదవధ.

నవకుమారునకుఁ మెలఁకువ వచ్చునప్పటికింకను రాత్రి గభీరముగనే యుండెను. ఇంతవఱ కాతని నేప్రులియును నోటఁబెట్టుకొని పోకుండుట నవకుమారున కాశ్చర్యముగనేయుండెను. ఏవైపునుండియైనఁ గ్రూర జంతువులు వచ్చుచున్నవేమో యని యాతఁడు నలుదెసలను బరీక్షించుచుండెను. అప్పు డాకస్మికముగా నాతనియెట్టయెదుట సమీపమునందే యొకవెలుఁగు గానవచ్చెను. అది భ్రాంతియేమో యని నవకుమారుఁడు మొట్టమొదట ననుకొనెను. తాను జాగ్రదవస్థయందే యున్నట్లనేకలక్షణములను బట్టి నిశ్చయించుకొని యాతఁడాప్రకాశమువంకఁ దదేకదృష్టితో వీక్షించుచుండెను. ఆవెలుఁగు క్రమముగా విస్తరించి, విశేషప్రదేశవ్యాప్తమై సమున్జ్వలమగుచుండెను. అది దీపకాంతిమాత్రమే కాదనియు, నగ్నిజ్వాలాప్రకాశమనియుఁ దోఁచుచుండెను. ఆతేజముం గాంచుటచే నవకుమారునకు మరలజీవితాశ యతిశయించెను. "అచ్చట మనుష్యులెవ్వరైన లేకయున్నచో నావిధముగా నగ్నిజ్వాల ప్రజ్వరిల్లుట కవకాశములేదు. ఒకవేళ నది దావానలమై యుండఁగూడదా? అట్లయిన నది యడవులను మండించుగ్రీష్మకాలముకాదే! కేవలము జగముల గడగడ వడఁకించు చలికాలముగదా! తప్పకయామంట నెవ్వరో మనుష్యులే

చేసి యుండవలయును." అని నిశ్చయించుకొని నవకుమారుఁడు లేచి యామంట కభిముఖముగాఁ బోవుచుండెను.

అంతలో నాతనికి మఱల నొక సంశయము తోచెను. "ఒకవేళ నది కొఅవిదయ్యపువెలుగేమో?" అని — ఇట్లనుమానములతోనే యూరకకాలక్షేపము చేయుట నిష్ప్రయోజనమని యుద్దేశించి యాతఁడు మనసు బిగియఁబట్టుకొని నిర్భయముగా నావెలుఁగగపడు చున్నవైపును లక్ష్యముచేసికొని యగ్రసరుఁడు కాఁజొచ్చెను. చిన్న చిన్నపొదలును, తీఁగలును, ముండ్లకంపలును, నిసుకగుట్టలును నాతని గమనమునకు నిరోధకము లగుచుండెను. అతఁ డాపొదలను లతలను భేదించుకొనుచు గుట్టల నెక్కిదిగుచుఁ బట్టువిడువక పయనము నతికష్ట ముతో సాగించుచుండెను.

క్రమముగా నాతఁడు కొంతసేపటి కావెలుతురును సమీపించి పరిశీలించెను. చాలనెత్తుగనున్న యొకయిసుకకొండకొమ్మయం దామంట మండుచుండెను. ఆకాంతిలో నానాలుకాగిరిశిఖరమునం దాసీనుఁడైయున్న యొకమానవమూర్తి యాకాశపటంబునఁ జిత్రించిన ప్రతిమవలెఁ గానవచ్చుచుండెను. నవకుమారుఁ డాశిఖరవర్తియగు పురుషుని సమీపింపవలయునను సంకల్పముతోఁ దనశక్తినంతను వినియోగించి యతిత్వరితముగ నావాలుకాస్తూపము నతికష్టముతో నధిరోహించుట కారంభించెను. ఆసమయమునం దాతని హృదయమం దొక విధమగు విపత్సంశయము బాధించుచుండెనుగాని యంతమాత్రమునఁ జలింపక యాతఁడు ధైర్యముతో నెక్కుచునేయుండెను. తుట్టతుద కాతఁ డావ్యక్తిని సమీపించి చూచిన విశేషమునుబట్టిగడగడ వడకిపోయెను. భయముచే నాతని యొడలంతయును గంటకితమైపోయెను. అచ్చట నిలిచి యుండవలయునో, కాక యటనుండి యతిత్వరితముగ వెడలి పోవలయునో యాతఁడు నిశ్చయించుకొనఁజాలక పోయెను.

ఆయిసుకదిబ్బమీఁద నట్లాసీనుఁడై యున్న పురుషుఁడు నయనములను మూసికొని యేదియో ధ్యానము చేయుచుండుటచే మొట్ట మొదట నవకుమారుని జూచియుండలేదు. నవకుమారుఁ డాతని బాగుగఁ బరిశీలించిచూచెను. ఆతఁ డేఁబదిసంవత్సరములవయసువాఁడై యున్నట్లగపడుచుండెను. ఆతనియొడలిపై నెచ్చటను నెట్టినూలుబట్టయైన నాచ్ఛాదితమైయున్నట్లు కాననచ్చుట లేదు. ఆతని కటిప్రదేశము మొదలు జానువులవఱకును పులిచర్మముచే నావృతమై యుండెను. కంఠమునందు రుద్రాక్షమాలిక ప్రవేలాడుచుండెను. విశాలమగుముఖ మండలమున మీసములును, గడ్డమును బెరిగి జడలు గట్టియుండెను. ఆతని సమ్ముఖమునందు సమిధలలో నగ్నిప్రజ్వరిల్లు చుండెను – ఆ యనలజ్వాలవలనంగలిగిన ప్రకాశము నానవాలుగాఁ జేసికొనియే నవకుమారుఁ డాస్థలమునకుఁ జేరుకొన గలిగెను.

అప్పుడొకవిధమగు వికృతదుర్గంధము నవకుమారుని ఘ్రాణేంద్రియమున కసహ్యముగా ననుభూతము కాఁజొచ్చెను. అందుచేనాతఁడావ్యక్తికూర్చుండియుండిన యాసనమువంకకుఁ దనదృష్టిని మరలించెను. అప్పుడు నవకుమారునకాదుర్వాసన యెందుకుఁ గలుచున్నదో స్పష్టముగాఁ దెలిసిపోయెను. జటాధారియగునాపురుషుఁడు ఛిన్నమస్తకమగు నొకశవకళేబరముపై నుపవిష్టుఁడై యుండెను!

నవకుమారుఁడు భయభ్రాంతుఁడై యింకను బరీక్షించిచూచెను. ఆపురుషునియెట్టయెదుట నొక నరకపాలము – దానినిండ రక్తవర్ణమగు నొకద్రవపదార్థము నింపఁబడి యుండెను. ఆతని నలువంకలను నచ్చటచ్చట నెముకలు పడియుండెను. అదియేమోకాని యాపురుషుఁడు దాల్చినరుద్రాక్షమాలికయందుఁగూడ నందందుఁ జిన్నచిన్న యెముకముక్కలుకూడఁ గూర్పఁబడి యుండెను. అంతయును జూచి నవకుమారుఁడు మంత్రముగ్ధునివలె నిలువఁబడిపోయెను. ముందఱికే పోవలెనో

యాస్థలము విడిచి వెనుకకే పాఱిపోవలెనో యాతని కేమియును దోఁచుట లేదు. నవకుమారుఁ డిదివఱకుఁ గాపాలికుల యాచారవ్యవహారములంగూర్చి విశేషముగా వినియుండెను. అందుచే నీవ్యక్తి కాపాలికుఁడే యై యుండవచ్చు నని నవకుమారుఁ డనుకొనెను.

నవకుమారుఁ డచ్చటికి వచ్చునప్పటి కాపురుషుఁడు మంత్రసాధనమునందో, జపమునందో, ధ్యానమునందో నిమగ్నుఁడై యుండెను. అందుచే నాతఁడు నవకుమారుని జూచియుండలేదు. చాలసేపైన తరువాత నాతఁడు కన్నులు విచ్చి నవకుమారునింగాంచి "ఎవరునీవు?" అని ప్రశ్నించెను.

నవ — నేను బ్రాహ్మణుఁడను.

కాపా — కూర్చుండుము!

అని చెప్పి కాపాలికుఁడు మరలఁ దన విధాయకకృత్యములయందు నియుక్తుఁడై యుండెను. నవకుమారుఁ డట్లే నిలువఁబడియుండెను.

ఈరీతిగా రెండుమూఁడుగంటలసేపు గడచిపోయెను. కాపాలికుఁడు యథోచితకృత్యములను నిర్వహించుకొని లేచి నవకుమారునింగాంచి "నీవు నాతోఁగూడ రమ్ము!" అని యాదేశించెను.

ఏమాత్ర మవకాశ మున్నను నవకుమారుఁ డెన్నఁడు నట్టివాని యాహ్వానము నంగీకరించి పోవువాఁడు గాఁడని నిశ్చయముగాఁ జెప్పఁగలము! కాని, పాపమిప్పు డాతనికి దాహముచేతను, నాకలిచేతను ప్రాణములు కొట్టికొనిపోవుచున్నవి. అందుచేతనే నవకుమారుఁ డెంతమాత్రమును శంకింపక "స్వామీ తమయాజ్ఞానుసారమే పని చేసెదను. కాని నేనిప్పు డాకలిదప్పులచే నటమటించి పోవుచున్నాను. ఎచ్చటికిఁ బోయిన నాకించుక యాహారపానీయములు లభించునో యానతీయఁగోరెదను!" అని విన్నవించెను.

కాపా — నీవిప్పుడు భైరవదేవి యనుగ్రహముచే నిచ్చటికిఁ జేర్ప బడితివి. నాతోఁగూడ రమ్ము! నీకెల్లవిధములఁ బరమసుఖము లభింప గలదు.

ఆమాటవిని నవకుమారుఁడు కాపాలికు ననుసరించి పోయెను. అట్లా యిరువురును జాలదూఅమునఅకును నడచి పోవుచుండిరి - మార్గమధ్య మునందెవ్వరు నొకరితోనొక రెట్టిప్రస్తావమును గావించియుండలేదు. తుట్టతుదకు వారిరువురు నొకపర్ణకుటీరప్రాంతమునకుఁ జేరుకొనిరి — కాపాలికుఁడు ముందుగా నాకుటీరమునందుఁ బ్రవేశించి నవకుమారునిఁ గూడలోనికి రమ్మని సెలవిచ్చెను; మఱియు నవకుమారునకు మార్గ దర్శకముగా నొకకప్పుల్లను వెలిగించి చూపెను. నవకుమారుఁ డావెలుఁగులోఁ గుటీరమును బాగుగఁ బరిశీలించి చూచెను. ఆపర్ణశాల కేవలము మొగలియాకులచే నిర్మింపఁబడి యుండెను. లోపల నొక వ్యాఘ్రాజినము పరుపఁబడి యుండెను — ఆసమీపమం దొకకలశము నిండ జలమును, గొన్నిఫలములును, దుంపలును జేర్పఁబడియుండెను.

కాపాలికుఁడు కప్పులను వెలిగించుచు"ఈఫలమూలములనునీయిష్టము వచ్చినట్లుగా భుజింపుము. ఈయాకుతో దొన్నెకుట్టుకొని యీపాత్ర యందలి జలమునుగైకొని త్రాపుము! ఇదిగో! ఇచ్చటనే పులి చర్మమున్నది. నిదుర వచ్చుచున్నచో దీనిపై శయనింపుము. నీవెట్టి సంశయమును బడవలదు. ఇచ్చట నెంతమాత్రమును వ్యాఘ్ర భయము లేదు. నేనిప్పుడు పోవుచున్నాను. మరలనీకు నాదర్శనము లభింపగలదు. నేను తిరిగి యిచ్చటికి వచ్చువఅకును నీవీకుటీరము నందే యుండుము. ఎక్కడకును బోవలదు." అని యాదేశించి యాపురుషుఁడు వెడలిపోయెను.

నవకుమారుఁ డప్పట్లే యని చెప్పి యటఁ గొలదిగనున్న ఫలములను, కందమూలములను నారగించి పరమపరితోషమునందెను. తరువాత

నాకలశమునందలి జలము కొంచె ముప్పగా నున్నను దొన్నెతోఁ దీసికొని త్రాగి దాహమును దీర్చుకొనెను. పిమ్మట నవకుమారుఁ డా వ్యాఘ్రాజినముపై హాయిగ శయనించి నాటిదినమంతయు మిగుల శ్రమపడియుండుటచే నత్యల్పకాలములోనే నిద్రాభిభూతుఁడై పోయెను.

స ము ద్ర తీ ర ము

ఐ ద వ ప్ర క ర ణ ము

" ..... యోగప్రభావోనచలక్ష్యతే తే।
బిభర్షి చాకారమనిర్వృతానాం మృణాలినీహైమమివోపరాగమ్ "

—రఘువంశము.

నవకుమారుఁడు ప్రాతఃకాలమునందే నిద్రనుండి లేచి సులభముగాఁ దనయింటికిఁ బోవుటకుఁ దగినయుపాయముల నాలోచించుటయందు వికలహృదయుఁడై పోయెను. ఎన్నివిధముల నాలోచించినను క్రూర స్వభావుఁడగు కాపాలికుని సన్నిధిని దానొక్కనినిమిషమైన నుండుట శ్రేయస్కరము కాదని మనసునకుఁ దట్టుచునేయుండెను. కాని యెన్నఁడు నెఱుఁగనిదియు, మానవసంచార మార్గమైన లేనట్టిదియు నగు నయ్యరణ్యమధ్యమునుండి తప్పించుకొని యేవిధముగా బయటఁ బడవలయునో యాతని కెంతమాత్రమును దోఁచుట లేదు.

నేనిప్పుడు మాయూరు చేరుట కేదిక్కుగాఁ బోయిన ననుకూల మగుమార్గము లభించును? ఆకాపాలికున కీ వనమార్గము లన్నియును దెలిసియే యుండును గాని నేనడిగినచోఁ జెప్పునో, జెప్పడోకాని యింతవఱ కాతఁడు నావిషయమున నెట్టి దురభిప్రాయమును సూచించుటలేదు. ఆతని మనసునందేదియో దుస్సంకల్పమున్నదని యనుమానించుటకుఁగూడ నెట్టికారణము నగపడుట లేదు. ఇట్టిచో నేనాతనిం

గూర్చి యేల భయపడవలయును? తాను మరల వచ్చువఱకును నన్నీ పర్ణశాలయందే వసించియుండమనట్లాజ్ఞాపించి యాతఁడు పోయి యుండెను. ఇప్పుడు నేనాతనియాజ్ఞనుల్లంఘించిపోయినచో నాతనికిఁ గ్రోధము కలుగకుండునా? తాంత్రికుఁడగునాతఁడప్పుడు నాకెట్టివిపత్తును సంఘటిల్లఁజేయునో యెవ్వరు చెప్పగలరు?" అని నవకుమారుఁడాలోచించుకొనఁదొడంగెను.

ఆకాపాలికుఁడు తనమంత్రబలముచే నసాధ్యకార్యములను సాధింపఁగలసమర్థుఁడై యుండు నని నవకుమారుఁ డూహించియుండెను. ఆకారణముచేతనే యాతనియాజ్ఞనుల్లంఘించి చెప్పకుండఁ బాఱిపోవుట తనకు శ్రేయస్కరముకాదని యనుకొనెను. ఇన్నిరీతుల నాలోచించుకొని నవకుమారుఁడు తుట్టతుద కేమైనను దప్పక యాపర్ణకుటీరమునందే కాపాలికుఁడు వచ్చువఱకు నుండితీరవలయు నని నిశ్చయించుకొనెను.

క్రమక్రమముగా రెండవజాము తిరిగిపోవుచుండెను. కాని యింతవఱకును గాపాలికుఁడు మరలి రానేలేదు. నిన్నటిదినమంతయు నుపవాసముగుటచేతను, నేఁడింతవఱకు నెట్టియాహారమును భుజింపకుండుటచేతను నవకుమారునకు క్షుత్పీడ యతిమస్సహ మగుచుండెను. ఆకుటీరమునందున్న యల్పమాత్రములగు ఫలాహారముల నాతఁడు రాత్రియే యారగించివైచెను. ఇఁక నచ్చట నేమియును లేవు. బయటికిఁ బోయి వెదకి యేకాయలో, పండ్లో, దుఁపలో నోటవైచుకొన్న గాని యాతనిప్రాణములు నిలుచున ట్లగపడుటలేదు. అందుచేత నవకుమారుఁడు కుటీరమును వదలి ఫలాన్వేషణార్థము వనమధ్యమునకుఁబోయెను.

ఆతఁడాసమీపమునందు గుట్టలు గుట్టలుగనున్న యిసుకతిప్పల చుట్టును దిరిగితిరిగి యాహారమునకు వెదకుకొనుచుండెను. అందొక యిసుకకొండపై నొకటిరెండు చిన్నచెట్లు మొలచి యుండెను. నవకుమారుఁడు దానిపై కెక్కి యాచెట్లపండ్లను గోసికొని భుజించెను.

అవి బాధముపప్పావలె నతిరుచ్యములై యుండెను. ఆ ఫలములతో నాతనియాకలి చాలవఱకు శమించెను.

ఆయిసుకదిబ్బలవరుసలు చాలదూరమువఱకును వ్యాపించి యుండ లేదు. అందుచేతనే నవకుమారుఁడు స్వల్పకాలములోనే వానినన్ని టిని దాఁటిపోయెను. తరువాత నాతఁడు వాలుకావిహీనంబగు చిట్ట డవిలోపలఁ బ్రవేశించెను. ఎవ్వరైన నెన్నఁడైన, నేకొంతసేపైనను బూర్వపరిచితముగాని వనమధ్యమునఁ బరిభ్రమించినవారున్న చో – దారితెన్ను లెంతమాత్రమును లేని యరణ్యప్రదేశమునం దడుగడుగు నకును దిక్కు తెలియక పథభ్రాంతియే కలుగుచుండు ననువిషయమును వారుమాత్రమే సులభముగా గ్రహింపఁగలిగి యుందురు.

నవకుమారున కిప్పు డట్టియవస్థయే తటస్థించెను. ఆశ్రమమును విడిచి తానెంతదూరముగ వచ్చియుండెనో, యాపర్ణశాల యేదిక్కుగా నున్నదో యిప్పు డాతనికెంతమాత్రమును దోఁచుటలేదు. ఎట్లు మరల యథాస్థానమునకుఁ జేరుకొనవలయునో యాతఁడు నిశ్చయించుకొనఁ జాలకుండెను. అప్పు డాతని కాకస్మికముగా నతిగభీరంబగు మహాజల కల్లోలనినాదము కర్ణగోచర మయ్యెను – అది సాగరఘోషమైయుండు నని యాతఁడు సహజముగనే తెలిసికొన గలిగెను.

ఆతఁ డింకను గొంతదూరము ముందఱకిఁ బోయి చూచెను. ఎట్ట యెదుటనే సమీపమునందే మహాసముద్రము! అనంతపథవ్యాప్తమై యింద్రనీలమణికుట్టిమముంబోలి విరాజిల్లుచున్న యాయపారపారావార మును దర్శించి నవకుమారుఁడు పరమానందరసపరిప్లుతహృదయుఁడై పోయెను.

నవకుమారుఁ డప్పుడు ప్రహర్షచిత్తముతో నాజలరాశితీరమునకుఁ బోయి యొక మెత్తనియిసుకతిన్నెపై నాసీనుఁడై చూచుచుండెను. తెల్లని నురుగులతోడను, నల్లని సలిలములతోడను ననంతమగు సము

ద్రము! ఉభయపార్శ్వములందును దృష్టు లెంతవఱకు లక్షింపఁగలు
గునో యంతమేరవఱకును గల జలతరంగములపైయంచులు విరియించు
చుండుక్షీరధవళములగు ఫేనరేఖలు చెలువుగులుకుచుండెను. గుచ్ఛములు
గుచ్ఛములుగాఁ గూర్పబడిన విమలప్రసూన మాలికంబోలి యతి
విశదంబులగు నానురుగుతరగలు హేమకాంతుల విలసిల్లుచుండు సైకత
వేదికలపైఁ బ్రసరించుచు, కాననలతాతరుకుంతలయగు ధాత్రీదేవి
కనురూపములగు నలకాభరణములవలె నలరారుచుండెను.

కమనీయకాంతులఁ జెలువందు నయ్యపారజలమండల మధ్యమున
ధవళఫేనసహితంబులగు సహస్రసహస్రతరంగములు నిరంతరమును బొంగి
పొరలుచుండెను. ఎప్పుడైన నతిభయంకరమగు ప్రళ్రప్రభంజనము విజృం
భించి వీచినప్పుడు — ఆదారుణ మరుద్వేగముచే సహస్రకోటి నక్షత్ర
మాలికలును స్థానచ్యుతములై నీలాంబరమునం దెల్లయెడల నాందోళిత
ములై యటునిటు నల్లాడుచుండుటను మనము గాంచఁగలుగుదుమేని
సరిగా నాస్వరూపమునకును సఫేనతరంగోక్షిప్తమగు సాగరస్వరూపము
నకును సామ్యమును గ్రహింపఁగలుగుదుము — సరిగ నాసమయమునం
దస్తమించుచున్న దినమణిమృదులారుణ కిరణకాంతులలో నానీలవారి
రాశియం దొక భాగము కరగిపోసిన విశుద్ధసువర్ణద్రవమువలెఁ దేజ
రిల్లుచుండెను. దానికిఁ జాలదూరమునం దైరోపాఖండ వాస్తవ్యుల
వాణిజ్యనౌకయొకటి శ్వేతపక్షములను విరియించుకొనుచు దీర్ఘకాయ
మగువిహంగమును బోలి యాసాగరమధ్యమునఁ బ్రయాణము సాగించు
చుండెను.

అట్లు కొంతసేపటివఱకును నవకుమారుఁడు తీరసికతాతలంబున నాసీ
నుఁడై యేకాగ్రచిత్తముతో నాసాగరసౌందర్యమును గనులారఁ గను
గొనుచుండెను. అప్పుడాతని కితరచింత యించుకంతయును లేకుండఁ
బోయెను. పిమ్మటనొక్కసారిగా సంధ్యాసమయతిమిరము గ్రమ్మికొని

యానీలజలమండలము నాక్రమించుకొనెను. అప్పటికి నవకుమారున కాత్మస్మృతి కలిగెను; తాను విడిచివచ్చిన యాశ్రమ మేవైపున నుండెనో ప్రయత్నించి తెలిసికొనవలె నని తోచెను.

అందుచే నాతఁ డొక్కదీర్ఘ శ్వాసమును విడిచి యటనుండి లేచెను. అప్పు డాతఁ డట్లు నిట్టూర్పుచ్చుటకుఁ గారణ మేమో మేము చెప్పఁజాలము—ఆసమయమం దాతనిహృదయాంతరాళమునం దెన్నఁడు నెఱుంగని యెట్టి సుఖానుభవ మగుచుండెనో యెవ్వరు చెప్పఁగలరు? ఆతఁడులేచి సముద్రమునకు వెనుదిరిగి పోవఁదొడంగెను.

ఆతఁడు మొగముత్రిప్పినంతమాత్రమునఁ యపూర్వశోభావిరాజిత మగు నొకసుందరీమూర్తి యాతనికన్నులఁబడియెను. ఆగభీరవీచీభంగ ఘోషితమగు నాసముద్రతీరమునందు — ఆస్వైకతభూమండలమునందు — అస్పష్టమగు నాసంధ్యాలోకమునందు సజీవప్రతిమవలె నిలిచియున్న యొకరమణీయమూర్తి! నిడుదపెన్నెరులు ముడువఁబడి యుండక విడివడి గుచ్ఛగుచ్ఛములై చీలమండలవఱకును ప్రవేలాడుచుండెను. ఆకుటిల కుంతలదామమధ్యమునందు రతనపుబొమ్మవలెఁ దేజరిల్లుచున్న యా మోహనవిగ్రహము నీలఫలకమునందుఁ జిత్రించిన చిత్రమువలె దర్శనీయమైయుండెను. నీలంపుముంగురు లందందలమికొనియుండుటచే వదన మండలము సంపూర్ణముగఁ గానవచ్చుట లేదు — అయినను నీలమేఘ శకలములనడుమనుండి నయనగోచరమగు చంద్రబింబమువలె శోభిల్లు చునే యుండెను. ఆకర్ణాంతములగు నావిశాలాయతలోచనములయందలి సుస్థిరకటాక్షములు సుస్నిగ్ధములై యతిగంభీరములై జ్యోతిర్మయము లై యుండెను. ఆక్రీగంటిచూపులు సాగరహృదయమునందు మిలమిల మెఱయుచుఁ దొలకాడుచుండు చంద్రకిరణరేఖలవలె స్నిగ్ధోజ్జ్వల దీప్తిమంతములై మనోజ్ఞములై యుండెను. ఆ యసంస్కృతశిరోజ గుచ్ఛములు స్కంధప్రదేశములందును, బాహుయుగళములందును

నలముకొని యపూరూపమగు సౌందర్యమును గల్పించుచుండెను. ఆచికురజాలాచ్ఛాదితములగు భుజశిఖరములు దృష్టిగోచరములగుటయే లేదు — మృదుమృణాలసన్నిభంబులగు బాహువుల కమనీయకాంతులు మాత్ర మస్పష్టముగా నయనపర్వము లగుచుండెను. ఆకామినీమూర్తి సకలాంగకములునుగూడ నిరలంకృతములై యుండెను. ఆమూర్తియం దేదియో యపూర్వదృష్టంబగు జగన్మోహినీశక్తి విరాజమానమగు చుండెను. ఆ తేజమును యథారూపమున వర్ణించి లిఖించుటకు మాకే కాదు — ఎంతటి కవిలేఖికులకైనను నసాధ్యమే యని చెప్పవచ్చును. ఆమనోజ్ఞకోమలశరీరచ్ఛాయ శుక్లాష్టమీసుధాకరకౌముదీకాంతిసదృశ మైనది. ఆకుంతలదామరామణీయకవర్ణము, సజలనీలనీరదోపమాన మైనది. ఆచక్కనినెమ్మోనిమెఱుంగును, ఆచిక్కని నెఱికురులరంగును బర స్పరసన్నిహితములై యుండి దేనికేది వన్నెలుదిద్ది సౌందర్యమును వికసింపఁజేయుచుండెనో ఆసముత్తుంగతరంగభంగఘోషితంబగు సాగరతీరం బున నిలువఁబడి యీసంధ్యాలోకమునం దామోహనమూర్తిని గన్నులారఁ గాంచఁగలిగిన వారుమాత్రమే తెలిసికొనఁగలరుగాని యితరులెవ్వరు నాసుందరీమూర్తిని మనసునందు భావించి గ్రహింపజాలరు.

నవకుమారుఁ డాదుర్గమవనప్రదేశమునం దాకస్మికము నట్టిదేవీ మూర్తిని దర్శించి నిష్పందసకలావయవుఁడై నిలువఁబడిపోయెను. అప్పుడాతఁ డేమియు మాటాడఁజాలకపోయెను. అత్యాశ్చర్యముతో నిశ్చేష్టుఁడై యూరక చూచుచుండెను. ఆరమణీమణియును జలించుట లేదు; తనవిశాలాయతనయనములను వికసింపజేసి సుస్థిరకటాక్షము లను నవకుమారుని వదనకమలమునఁ బ్రసరింపఁజేయుచు నెప్పవాల్పక యదేరీతిగఁ గాంచుచుండెను. ఆయిరువురిదృష్టులకునుగల భేద మేమ సిన — నవకుమారుని చూపులు కేవలము నబ్బురపాటుతో నదరిపడి వీక్షించువారిదృష్టులం బోలియుండెను. ఆసుందరీమణికటాక్షములం

దట్టిలక్షణము లేవియును లేవు. కాని యీయీలోకనములందుఁగూడ హృదయోద్వేగము ప్రకాశిత మగుచునే యుండెను.

మానవసంచార శూన్యంబగు నామహాసముద్రతీరమునం దాయిరువురు నీవిధముగాఁ జూలసేపటివఱకును బరస్పరావలోకనములఁ గావించుకొనుచునేయుండిరి. కొన్ని నిమిషములకుఁ దరువాత మొట్ట మొదట నాసుందరీమణి మృదులకంఠస్వరము కర్ణగోచరమయ్యెను. ఆయువతి యతికోమలస్వరముతో "ఓపాంథుఁడా! నీవు దారితప్పి యీప్రదేశమును జేరితివా?" అని ప్రశ్నించెను.

ఆకలకంఠస్వరముతో నవకుమారుని హృదయవీణయును మ్రోగుట కారంభించెను. అతివిచిత్రములగు హృదయవిపంచికలయందలి తంత్రులన్నియు నొకప్పుడు విషమశ్రుతులై లయవిహీనములై యెన్నివిధములఁబ్రయత్నించినను బరస్పరసమశ్రుతిసమ్మిళితములు గాకుండఁబోవును. కాని యొకమనోహరనిస్వనమువలన — ఒకరమణీరమణీయగళరవమువలన నాకస్మికముగా నవి సుసజ్జితము లగుచుండును. అది మొదలుగా సంసారయాత్ర సుఖమయసంగీతసుధారసప్రవాహముగా ననుభూత మగుచుండును. నవకుమారున కిప్పు డట్టిమనోహర మధురారావమే శ్రుతిగోచర మయ్యెను.

"ఓపాంథుఁడా! నీవు దారితప్పి యీప్రదేశమును జేరితివా?" అని — ఈమధురమోహనాలాపము నవకుమారునిచెవులఁబడెను. ఎంతటి యర్థవంతమైనప్రశ్న? ఏమని బదులు చెప్పవలయునో నవకుమారున కెంతమాత్రమును స్ఫురించుటలేదు. ఆమధురధ్వని హర్షవికంపితమగుచు దశదిశలను మాఱుమ్రోగుచున్నట్లనుభవమగుచుండెను. ఆమనోజ్ఞనిస్వనము వాయుతరంగములయందు నర్తనము చేయుచుఁ దరులతాపల్లవములతో మంతనములాడుచు సాగరఘోషమునందు విలీనమగుచున్నట్లు తోఁచుచుండెను.

సాగరవసనాలంకృత యగు ధాత్రీదేవి సుందరి — ఆరమణీమణియు సుందరియే — ఆయువతికోమలకంఠనిస్రుతంబగు కలస్వనము మఱియును సుందరమైనది — అప్పుడు నవకుమారుని హృదయవీణాతంత్రులలో సౌందర్యశ్రుతి సమ్మేళనము కాఁదొడంగెను.

ఆయువతి యెట్టిప్రత్యుత్తరమును గానక మరల "నావెంటరమ్మ్మ!" అని చెప్పి గిరుక్కున వెనుకకు మరలి పోవుచుండెను. కాని యామె యడుగుల కదలిక కానవచ్చుటలేదు. వసంతకాలమునందలి మంద మలయపవనములచేఁ దరలింపఁబడు ధవళమేఘమువలె మెల్లమెల్లగా నడుగులు వైచుచుఁ జనుచుండెను. నవకుమారుఁడును జంత్రపుబొమ్మ వలె నామెవెనువెంటనే నడవ నారంభించెను. పోవుచుండఁగాఁ ద్రోవలో నొకచోటఁ జిట్టడవి వలయాకారముగ నావరించుకొని యుండెను. ఆతఁ డాయడవిలోఁ బ్రవేశించి చూచెను. కాని తనకంటె ముందు పోయిన సుందరి యేవైపుగాఁదిరిగిపోయెనో యాతఁడు కనుపెట్టఁ జాలకపోయెను. నవకుమారున కాయడవి దాటినంతనే దృగ్గోచర మైనది పర్ణకుటీరముమాత్రమే!

ఆఱవ ప్రకరణము

కాపాలిక పునర్దర్శనము

"కథంనిగళసంయతాసి ద్రుతమ్
నయామి భవతీమితః ....."

—రత్నావళి.

నవకుమారుఁడు పర్ణకుటీరమునందుఁ బ్రవేశించి తలుపు చేరవైచుకొని కరతలమునందు మస్తకముం జేర్చుకొని కూర్చుండియుండెను. ఆతఁడట్లే యుపవిష్టుఁడై చాలసేపటివఱకును దలయెత్తనేలేదు.

"అదియేమి దేవీమూ ర్తియా – కాక! మానవియే యగునా–కాక యిది యంతయు నా కాపాలికుని మాయామాత్ర మేనా?" ఈవితర్క మే యప్పు డానవకుమారుని నిష్పందహృదయాంతరాళమునం దాందోళిత మగుచుండెను. కాని యాతఁడుమాత్ర మేమియును నిశ్చయించుకొనఁ జాలకపోయెను.

నవకుమారుఁ డట్లు పరధ్యానమునందు నిమగ్నుఁడై యుండుటచేతనే యప్పు డాయింటియందలి యేవిషయముంగూర్చియు గ్రహింపఁజాల కుండెను. ఆతఁడటకు వచ్చిప్రవేశించుటకుఁ బూర్వమునుండియే యాపర్ణకుటీరమునం దొకచోట నెండుకట్టెలు మండుచు నుండెను. క్రమముగాఁ గొంతరాత్రియైనతరువాత నాతనికి సాయాహ్న కృత్యముల నెఱవేర్చుకొనలేదనుసంగతి తలఁపునకు వచ్చెను. అప్పుడు జలమెచ్చట లభించునో తెలిసికొనుటకుఁ గాని యాహారపదార్థముల నన్వేషించి తెచ్చికొనుటకుఁగాని యెట్టియవకాశమును లేదనికూడ నాతఁడు తెలిసికొనఁగలిగెను.

కాని యప్పు డాయింటిలోఁ గట్టెలు మండుచున్న వెలుఁగు మాత్రమే కాదు – వంటచేసికొనుటకుఁ గావలసినబియ్యము, శుద్ధజలము మున్నగునవన్నియు నాయాస్థానములందు సమకూర్పఁబడి యుండెను. నవకుమారుఁడు వాని నాకస్మికముగఁ జూచినను నించుకంతయు నాశ్చర్యపడలేదు. వానిననన్నిటి నా కాపాలికుఁడే సిద్ధపఱచి పోయి యుండునని యాతఁ డూహించుకొనియెను. ఇంతమాత్రమున విస్మయ పడుటకుఁ గారణ మేమున్నది?

నవకుమారుఁడు సాయంసంధ్యావందనాదులను ముగించుకొని యా బియ్యమును మృత్పాత్రయందుఁ జేర్చి వంటచేసికొని భుజించెను. తరువాత నావ్యాఘ్రాజినమునందే యెప్పటియట్లు శయనించెను.

మఱునాఁటిప్రాతఃకాలమునందు నవకుమారుఁడు శయ్యానుండి లేచిన తోడనే సముద్రతీరాభిముఖుఁడై బయలుదేఱి పోయెను. నిన్నటి దినపు రాకపోకల యభ్యాసమునుబట్టి యాతని కించుమించుగా నాయడవి త్రోవలగుర్తు బోధ యగుచుండెను. ఆతఁడు జలధితీరమునకుఁ బోయి ప్రాతఃకాలకృత్యములను నిర్వర్తించుకొని దిక్కులు ప్రతీక్షించుచుఁ గూర్చుండి యుండెను. నవకుమారుఁ డిప్పు డెవ్వరికొఱకుఁ బ్రతీక్షించు చున్నాఁడు! తాను నిన్నటిదినమునఁ గాంచిన మాయావిని మరల నచ్చటికి వచ్చునని — ఆతనిహృదయ మప్పు డట్టియూహచే నెంత తహ తహపడుచుండెనో యనుభవమునుబట్టి గ్రహింపవలసినదే కాని వ్రాసి తెలుపఁజాలము. అందుచేతనే యాతఁ డాస్థలమును వదలి పోఁజాల కుండెను. ప్రొద్దెక్కుచుండెను; వేళ మించిపోవుచుండెను; కాని యెంతసేపు వేచియున్నను నచ్చటికెవ్వరును వచ్చుట లేదు.

అప్పుడు నవకుమారుఁ డటనుండి లేచి నలువంకలకును బోయి యన్వే షింప నారంభించెను. కాని యాతనిప్రయత్నము ఫలవంతమగుటలేదు. ఆమెరాక యగపడలేదు. సరిగదా — మఱియెట్టి మానవసంచారమును గూడ నాతనికంటఁ బడలేదు. అందుచే నాతఁడు మరల వెనుదిరిగి వచ్చి పూర్వస్థానమునందే యాసీనుఁడై చూచుచుండెను.

క్రమముగా సూర్యుఁడస్తంగతుఁడయ్యెను; నలుదెసలఁ జీకటు లలముకొనుచుండెను. ఇంకను నామె వచ్చుననునాశ నవకుమారునకు వదలిపోయెను. ఆతఁడప్పుడు నిరాశతో సముద్రతీరమును వదలి జాడ లనుగుర్తించుచు మరలఁ బర్ణకుటీరముచెంత కరుగుదెంచెను. ఆతఁడు లోపలఁ బ్రవేశించిచూడఁగాఁ గాపాలికుఁడప్పుడు కుటీరమధ్యమునందు ధరాతలాసీనుఁడై మౌనమును వహించి యుండెను. వచ్చినవెంటనే నవకుమారుఁ డాతనికుశలసమాచారము ప్రశ్నించెను; కాని కాపాలి కుఁడు మౌనవ్రతుఁడై యెట్టిప్రత్యుత్తరమును జెప్పలేదు.

కొంతసేపటికిఁ గాపాలికుఁడు కన్నులు విచ్చి చూచెను. అప్పుడు నవకుమారుఁ డాతనిం గాంచి "దేవరవారిదర్శన మింతవఱకును నాకు లభింపక పోవుటకుఁ గారణ మేమి?" అని ప్రశ్నించెను.

కాపా — నేను నాయనుష్ఠానమునందు నియుక్తుఁడనై యుంటిని.

నవ — నేనిప్పుడు స్వగ్రామమునకుఁ బోఁదలఁచియుంటిని. స్వామి సెలవొసంగి యంపవలయును. ఏత్రోవను బోయిన మాయూరు చేరుదునో నేనెఱుంగను. పోవుటకు దారిబత్తెముగ నాచెంతఁ జిల్లిగవ్వ యైనను లేదు. ఎట్టిపాథేయమును లేదు. ఎట్లుచేసిన బాగుగనుండునో మీరు వచ్చినవెంటనే మీకు విన్నవించి తెలిసికొని మీయాదేశాను సారము స్వదేశమునకుఁ బయనము గావింపవలె నను ధైర్యముతో నున్నాను.

కాపాలికుఁ డామాటల కేమియును బ్రత్యుత్తరము చెప్పలేదు. ఆతఁడు కేవలమును "నాతోఁగూడ రమ్ము" అనిమాత్రము చెప్పి యుదాసీనభావముతో లేచి నిలువఁబడి ముందటికి నడచుట కారంభించెను. తానింటికిఁ బోవుట కేదియైన నుపాయమును సూచించునేమో యను నాశచే నవకుమారుఁడుకూడ నాకాపాలికుని వెంబడించి చనఁదొడంగెను.

అప్పటికింకను సంజవెలుఁగు చీకటిలోఁ బూర్ణముగ మునిఁగియుండ లేదు. కాపాలికుఁడు ముందును, నవకుమారుఁ డాతనివెనుకను నడచి పోవుచుండిరి. అట్టిసమయమునం దాకస్మికముగా నెవ్వరో వచ్చి నవకుమారుని వీపుపైఁ దట్టినట్లయ్యెను. ఆకరస్పర్శ మతిమృదులముగ నుండెను. నవకుమారుఁడు చటాలున వెనుకకుఁ దిరిగిచూచి నివ్వెఱపడి పోయెను. ఆతనికన్నులలో మడిమలవఱకును దిగజారుచున్న మెత్తని, నల్లని యొత్తుకురులు వెన్నునవిరిసియున్న యావనదేవతామూర్తి! ఆమె పూర్వమువలెనే నిశ్చలముగ నిశ్శబ్దముగఁ జిత్రప్రతిమవలె నిలిచి

యుండెను. ఆసుందరీమూర్తి యాకస్మికముగ నెచ్చటినుండి యాతని వెంబడించి వచ్చినది! ఆరమణీమణి తనకోమలకరాంగుళులనోష్ఠాధర ముల చెంత జేర్చికొనియున్నట్లు నవకుమారుఁడు కనుఁగొనియెను. మాట్లాడవలదని యామె తనకు సూచించుచుండె నని యాతఁడు గ్రహింపఁగలిగెను. అట్లామె నిషేధింపనక్కఱలేదు. ఎదుటఁ గాపాలికుడు సమీపమందుండఁగా నవకుమారుఁడుమాత్ర మామెతో నేమని మాటలాడును? ఆతఁడు విస్మితుఁడై యచ్చటనే నిలువఁబడిపోయెను.

కాపాలికుఁ డీసంగతుల నెంతమాత్రమును గనుపెట్టకయే పోవుచుండెను. మెల్లనిమాట వినఁబడనంతటిదూర మాతఁడు ముందటికిఁ బోయినతరువాత నాయువతీమణి మృదులస్వరముతో నేమేమియో చెప్పెను. ఆపలుకులు చల్లఁగా నవకుమారుని కర్ణకుహరములయందుఁ బ్రవేశింపఁగలిగెను. అమాట లివి –

"ఎక్కడకుఁ బోయెదవు? పోవలదు! తిరిగిపొమ్ము – పాతిపొమ్ము!" అని – ఈమాటలు పూర్తి యైనంతనే యాసుందరీరత్నము గిరుక్కున మరలి యెచ్చటనో మటుమాయమైపోయెను. నవకుమారుని ప్రత్యుత్తరమును వినుటకు నిరీక్షింపనే లేదు. నవకుమారుఁడు కొంతసేపటివఱకును నేమియుందోఁచక నిలువఁబడిపోయెను. తరువాత నాతఁ డామెను వెంబడించిపోవుటకుఁ దొందరపడియెను గాని యాదేవీమూర్తి యేదిక్కుగా నేత్రోవను బోయినదో యాతఁడు కొంచెమైనను గ్రహింపఁజాలకపోయెను.

అప్పుడాతడు తనమనసునందు "ఇది యెవ్వరిదైన నింద్రజాలమైయుండునా? – కాక, నేనే భ్రాంతిపడుచుంటినా? నాకిప్పుడు వినఁబడిన మాటలు కేవలమాపత్సూచకములై యున్నవి. ఎవ్వనిమూలమున నట్టి యాపత్సంఘటనమగును? ఎవ్వరో యనుకొనుటేమి? తాంత్రికులు దురాచారపరులై యేమిచేసినను జేయఁగలరు. ఆమె మాటలను

బట్టి నేనిప్పుడు పాతిపోవలసినదేనా? ఈకాపాలికుని దప్పించుకొని పలాయితుఁడనగుట కుపాయమేమున్నది? నాతోడివారందఱు నన్ను విడిచి పోయినను దైవానుగ్రహముచే నీనిరాశ్రయస్థానమునందుఁగూడ నేను బ్రతికియుండఁగలిగితినిగదా — ఇప్పుడుమాత్రము భయపడు టెందుకు? కాపాలికుఁడుమాత్రము నావంటిమానవుఁడే కాఁడా? ఆతఁడు నన్నేమిచేయఁగలఁడు?" అని యనేకవిధముల వితర్కించుకొనెను.

నవకుమారుఁ డిట్లాలోచించుకొనుచు దనవెంట రాకుండుటం గాంచి కాపాలికుఁడు వెనుకకుఁ దిరిగి యాతనిచెంతకు వచ్చుచుండెను. ఆతనిం గాంచి నవకుమారుఁడు కదలుట కుపక్రమించెను. కాపాలికుఁ డాతనిం గాంచి "ఇంతయాలస్యముచేయుటకుఁ గారణమేమి?" అనిప్రశ్నించెను.

నవకుమారుఁడు మారుమాటచెప్పక మఱియొకసారియాతనిచేఁ బిలిపించుకొనక వెంటనే యాతని వెంబడించి పోవఁదొడంగెను.

అట్లువారు కొంతదూరము పోవునప్పటి కచ్చట మట్టిగోడలతో నిర్మింపఁబడిన యొకపర్ణకుటీరము గానవచ్చెను. అదియొకపర్ణశాల యని యైనను జెప్పవచ్చును. కాదా యొకవసతిగృహమనియైనను జెప్ప వచ్చును. ఏమైననేమి — దానితో మన కెట్టిప్రయోజనమును లేదు.

దాని వెనుకవైపుననే వాలుకామయంబగు విశాలసముద్రతీర మున్నది. అప్పుడు కాపాలికుఁ డాయాకుటింటిపార్శ్వమునుండియే నవకుమారుని వెంటఁబెట్టుకొని యాయిసుకపట్టి ననుసరించి పోవు చుండెను. ఆసమయమునకు సరిగా నింతకుముందగపడినయువతి శరవేగ ముతో నవకుమారుని ప్రక్కనుండియే పరుగెత్తుకొని పోయెను. అట్లామె పోవుచున్నప్పుడు మెల్లగా నవకుమారునకు శ్రుతిగోచర మగునట్లు "ఇప్పుడైనను బలాయితుఁడ వగుము! తాంత్రికుల కాళీపూజ నరమాం సము లేనిదే సంపూర్ణము గాఁజాలదని నీకుఁ దెలియదా?" అని బోధించెను.

నవకుమారునికణతలనుండి ముచ్చెమటలును గారఁ దొడంగెను. దురదృష్టవశమున నానారీమణి చెప్పినమాటలు కాపాలికునకుఁగూడ వినవచ్చెను. అప్పుడాతఁడు క్రోధతీవ్రస్వరముతో "కపాలకుండలా!" అని కేకవె చెను.

ఆకంఠస్వరము సరిగా నశనిపాత ఘోషణమువలె నవకుమారుని చెవులలోఁ బ్రతిధ్వనించెను. కాని కపాలకుండలమాత్ర మెట్టిప్రతి భాషణమును గావింపలేదు.

అప్పుడాకాపాలికుఁడు బలవంతముగా నవకుమారుని చేయిపట్టుకొని నడపించుకొని పోవఁదొడంగెను. నరహంతకుఁ డగు నాతాంత్రికుని కర సంస్పర్శమువలన నవకుమారునిర క్తనాళములనుండి శోణితప్రవాహము శతగుణాధికవేగముతోఁ బ్రవహింప నారంభించెను. అప్పు డాతనికి లోపించిన సాహసము మరల నుదయించి విజృంభించెను. అందుచే నాతఁడు దృఢస్వరముతో "నాచేతిని వదలుము!" అని యదలించెను.

కాపాలికుఁ డేమియు మాటాడలేదు. చేయి వదలలేదు. నవ కుమారుఁడు మరల "చేయి వదలవేమి? ఇట్లు నీవు నన్నెచ్చటికిఁ దీసి కొనిపోఁదలఁచితివి?" అని ప్రశ్నించెను.

కాపా — ఎక్కడకా? పూజాస్థానమునకు.

నవ — నన్నెందుకుఁ దీసికొని పోయెదవు?

కాపా — దేవికి బలిసమర్పణము గావించుటకు.

నవకుమారుఁ డతిప్రబలవేగముతోఁ దనహస్తము నొక్కసారిగ నుబికించి లాగుకొనెను. ఆతఁడు తనశక్తినంతయు నుపయోగించి హస్తా కర్షణము గావించిన యదటునకు మఱియే సామాన్యమానవుఁడో యైనచో చేయివదలిపై చుటయేకాక దుబుక్కున నేలపై బోరగిలఁ బడియే యుండును.

కాని కాపాలికుఁ డావేగమున కెంతమాత్రమును జలింపనే లేదు. అప్పటికిని నవకుమారుని ముంజేయి యాతాంత్రికుని పిడికిలియందే బంధితమై యుండెను. నవకుమారుని యస్థిగ్రంథులన్నియును భగ్నము లైపోయినట్లయ్యెను. ఇఁక నీతనివిషయమున బలము నుపయోగించుట వలన లాభము లేదని నవకుమారుఁడు తెలిసికొనెను. "ఎట్లయిన నేర్పుతో నీతని దప్పించుకొని పోవలెను. దేవునిపై భారము వైచి యుచితసమయమునకు వేచియుండవలయును." అని యాలోచించి స్థిరపరుచుకొని నవకుమారుఁ డాతనితోఁగూడఁ బోవఁదొడంగెను.

కాపాలికుఁ డప్పటికి నవకుమారు నాయిసుకబయటినడుమకుఁ దీసి కొనిపోనెను. పూర్వమువలెనే యచ్చట నొకపెద్దయెండుకట్టె ప్రజ్వ రిల్లుచుండుటను నవకుమారుఁడు కనుఁగొనెను. ఆయగ్నికి నాలుగు వైపులను దాంత్రికపూజకు నావశ్యకములగు వస్తువు లన్నియును సమ కూర్పఁబడి యుండెను. ఆయన్నిటినడుమ నొకనరకపాలము చేర్పఁబడి యుండెను. దానినిండ మద్యము! శవకళేబర మట నెచ్చటను గాన వచ్చుటలేదు. కాపాలికుఁడు తన్నే శవముగాఁ గల్పింపనుద్దేశించి యుండు నని నవకుమారుఁడు సులభముగనే గ్రహించుకొనెను.

అంతకుముందుగనే యాప్రదేశమునందుఁ గొన్ని యెండినవియుఁ, గొన్ని పచ్చివియునగు గట్టితీగలు పోగుచేయఁబడి యుండెను. కాపా లికుఁ డాలతాపాశములచే నవకుమారుని కాలుచేతులను దృఢముగా బంధించుట కుద్యుక్తు డయ్యెను. నవకుమారుఁడు సాధ్యమైనంతవరకు సర్వశక్తులను వినియోగించి యాతనిచేతులనుండి విడిపించుకొనుటకుఁ బ్రయత్నము గావించెను. కాని యాతని బలప్రయోగము ఫలవంత మగుటలేదు. ఇంతటి వయసుగడిపినవాడయ్యును గాపాలికుఁడు మద మత్తగజసమానమగు బలముగలిగి యుండెను.

నవకుమారుఁడు తనకులొంగక బలవంతముగఁ దన్నుకొనుచుండుటం గాంచి కాపాలికుఁడు "ఓరి మూర్ఖుఁడా? ఈ బలప్రకాశమువలనఁ బ్రయోజనము లేదు. నేఁటికి నీజన్మము సార్థక మగుచున్నది. భైరవీ దేవిపూజయందుఁ బరమోపయోగంబగు నీమాంసపిండము సమర్పి తముకాఁగలదు. ఇంతకంటె నీకీలోకమునందుఁ గోరవలసిన మహా సౌభాగ్య మేమున్నది? ఇంతటి పరమపుణ్యసంపాదనమునకు నీవేల వెనుదీసెదవు?" అని బోధించెను.

కాపాలికుఁడు నవకుమారుని బలవంతముగా బంధించి యొక యిసుకదిబ్బపైఁ బడవైచి యుంచి బలిప్రదానమునకు ముందుగాఁ గావలసినపూజాదులను హోమాదిసత్క్రియాకలాపమును నిర్వర్తించు కొనుచుండెను. కాపాలికుఁడు కర్మనిష్ఠుఁడై యున్నంతసేపును నవ కుమారుఁడు తనబంధములను వదలించుకొనుటకు శక్తికొలఁదిని ప్రయ త్నము చేయుచునేయుండెను. కాని యాతీగలు చాలదృఢమైనవి. కాపాలికుఁడుకూడ వానితో గట్టిగాబిగించి కట్టియుండెను. అందుచే నవకుమారుని ప్రయత్నమంతయు విఫలమైపోయెను.

ఇఁక నాతనికి మృత్యువు సమీపించియున్నట్లు స్పష్టముగాఁ దోచు చుండెను. అందుచేత నవకుమారుఁడు తనయిష్టదైవతమును స్మరించు కొనుచు దదేకధ్యాన నిష్ఠుఁడై యుండెను. అప్పు డాతని కొకసారి తనజన్మస్థానము తలఁపునకు వచ్చెను; సుఖసౌభాగ్యసంపన్నమగు నాత్మమందిరము మనసునఁ దోఁచెను. ఒకసారి చాలదినములై విడిచి వచ్చిన తల్లిదండ్రులమాట జ్ఞప్తికి వచ్చెను. అప్పు డాతనికన్నులనుండి యొకటిరెండశ్రుబిందువులు జారి యాయిసుకనేలయందుఁబడి యింకి పోయెను.

కాపాలికుఁడు నరబలికిఁ బూర్వతాంత్రికకృత్యముల నన్నిటిని ముగించుకొని బలిపశువధార్థమై ఖడ్గమును గైకొనవలయునని యెంచి

చటాలున లేచి నిలువఁబడి చూచెను. కాని యథాస్థానమునందుఁ దానుంచిన కరవాల మచ్చట నాతనిఁకగపడలేదు! "ఏమిది?" అని కాపాలికుఁడు కొంచెము తొట్రుపడెను. ఆతఁడపరాహ్ణసమయమునందే ఖడ్గమునుదీసికొని వచ్చి యచ్చట నుంచెను. దానిని మరల నెచ్చటి కైనను దీసికొనిపోలేదు. ఇది యంతయు నాతనికి స్పష్టముగనే జ్ఞప్తి యందున్నది. ఇట్టిస్థితిలో నాకత్తి యేమైపోయియుండును?

కాపాలికుఁ డాచుట్టుప్రక్కల నంతటను బాగుగ నన్వేషించి చూచెను. ఎంతవెదకిననూ నెచ్చటను గత్తి యగపడుటలేదు. అప్పు డాతఁడు పూర్వము చెప్పఁబడిన పర్ణకుటీరాభిముఖుఁడై "కపాల కుండలా!" అని పిలిచెను. మరలమరల నెన్నియోసారులు గొంతెత్తి పిలిచెను. కాని, కపాలకుండలమాత్రము "ఓ" యని పలుకలేదు.

ఎంతపిలిచినను ప్రతివచనములేకుండుటచేఁ గాపాలికుడు క్రోధో ద్దీప్తుఁడై పోయెను. ఆతనికన్నులు నెత్తురుకండలవలె నెఱ్ఱనై పోయెను. భ్రూయుగళ మాకుంచితమై పోయెను. కోపవేగముచే సకలాంగకము లును గంపించిపోవుచుండెను. అప్పుడాతఁడు ద్రుతపదవిక్షేపముతోఁ బర్ణకుటీరాభిముఖుఁడై పోయెను.

ఆయువకాశము చూచుకొని నవకుమారుఁడు తనబంధనలతారజ్జువు లను ద్రెంచుకొనుటకై మరల నొకసారి ప్రయత్నించెను. కాని సఫల మనోరథుఁడు కాఁజాలకపోయెను.

ఇట్టి సమయమునం దాయిసుకనేలపైఁ బ్రసరించుచున్నట్లున్న యొక కోమలపదధ్వని యాతనిచెవులఁబడెను — ఆయడుగులసవ్వడి క్రోధో ద్ధతుఁడగు కాపాలికునిదిమాత్రము గాదు! నవకుమారుఁడు కన్నుల మరలించి చూచెను. ఆవచ్చుచున్నది యామోహినీమూర్తి! — ఆమెయే కపాలకుండల — ఆమె కోమలకరకంజమునం దొక నిశితకరవా లము తళతళ మెఱయుచుండెను.

కపాలకుండల యతిత్వరితముగ నవకుమారుని సమీపించి "ఊఁ కుండుము! మాటాడకుము! ఈభీకరకరవాలము నాయొద్ద నేయున్నది! నేను దీనిని దొంగిలించి తీసికొనిపోయితిని" అని చెప్పెను.

ఆవెంటనే కపాలకుండల యతిత్వరితముగఁ దనహస్తస్థితకృపాణముచే నవకుమారుని బంధనలతల నన్నింటిని ఖండించివైచుట కారంభించెను. ఒక్కనిమిషములో నవకుమారుఁడు ఘోరబంధవిముక్తుఁడయ్యెను. అప్పుడు కపాలకుండల యాతని నుద్దేశించి "ఇఁక నీ విట నుండి యతిశీఘ్రముగఁ బాఱిపొమ్ము! నేనును గొంతదూరమువఱకు నిన్ననుసరించి వచ్చెదను. నీకుఁ ద్రోవ చూపించెదను. లెమ్ము! ఆలస్యము చేయకుము!" అని తొందరపెట్టెను.

ఇట్లు చెప్పుచు గపాలకుండల యొకమార్గమును బట్టి శరవేగమునఁ బరుగెత్తి పోవఁదొడంగెను. నవకుమారుఁడుకూడ నొక్కయుదుటున లేచి యామె పోవుచున్న త్రోవనే యనుసరించి పోయెను.

ఏడవ ప్రకరణము

అన్వేషణము

"And the great lord of Luna
Fell at that deadly stroke;
As falls on mount Alvernus
A thunder-smitten oak."

—*Lays of Ancient Rome.*

ఇఁక గాపాలికుఁడు తిన్నగాఁ గుటీరమునకుఁ బోయి యందుఁ బ్రవేశించి కత్తికొఱకన్నివైపులను బరిశీలించి చూచెను. ఎంతవెదకినను ఖడ్గముగాని, కపాలకుండల గాని యాతని కగపడనేలేదు. ఇది యేమని యాతఁడేదో మోసగింపఁబడినట్లనుమానించి యటనుండి మరలి మరల నాసముద్రతీరసికతాతలమునకే యతిత్వరితముగ వచ్చిచూచెను.

ఏమున్నది? అచ్చట నాతనికి నవకుమారుఁడుగూడ నగపడకుండఁ బోయెను. అప్పుడాతనికిఁ గలిగిన యాశ్చర్యమునకుఁ బరిమితిలేదు. కొంతసేపటికాతఁ డానవకుమారునిబంధించిన తీగలన్నియును భిన్న భిన్నములై పడియుండుటను గాంచెను. అప్పటి కాతనికి సర్వమును స్పష్టముగాఁ దెలిసిపోయెను. తన ప్రయత్నమంతయు నిష్ఫలమైపోయిన దని యాతఁడు విచారించెను. ఒక్కనిమిషమైన నాలస్యముచేయక యాకాపాలికుఁడు ద్రుతగమనముతో నవకుమారునిపోఁబడి తెలిసి కొనుటకై బయలుదేఱెను.

దారితెన్నులు లేని యా నిర్జనప్రదేశమునందుఁ దెలియకుండఁ బలాయితు లైనవా రేదిక్కుగా నేమార్గము ననుసరించిపోయిరో నిశ్చయించుకొనుట కాధార మేముండును? వారొకవైపు పోయి నప్పుడు తాను మఱియొకవైపున బోయిన నేమిలాభము? ఇంతేకాక యాసమయమునందు గాఢాంధకారము నలుదెసల నావరించియుండెను. త్రోవ తెలియుటలేదు. ఏవస్తువును స్పష్టముగా దృగ్గోచర మగుటలేదు. అందుచేతఁ గాపాలికుఁడేదిక్కునన్నైన నడుగులచప్పుడగుచున్న దేమో యని చెవియొగ్గి యాలకించెను. ఏమాటలైన వినబడునేమో యని యిటు నటు పరిభ్రమించి పరిశీలించెను. కాని యెచ్చటనుగూడఁ బద చలనశబ్దముగాని, మానవగళస్వనముగాని యెంతమాత్రము నాతనికి వినఁబడలేదు.

అయినను నాతడు పట్టువిడువక యెత్తుప్రదేశమును జేరి చతుర్దిశ లను బరిశీలింపవలయునను నుద్దేశముతో నొకయున్నతమగు వాలుకా స్తూపశిఖరము నధిరోహించెను. కాపాలికుఁ డాయిసుకమెట్ట నొక వైపునుండి యధిష్ఠించెను. కాని దాని యవ్వలిభాగమున మూల స్థాన మంతయు వర్షజలప్రవాహముచే దొలుచుకొనిపోయి డొల్లయై యుండెను. పాపమాసంగతి కాపాలికునకుఁ దెలియలేదు. ఆతఁడా

వాలుకాశైలశిఖరారోహణము గావించినంతమాత్రమునఁనే యాతని బరువున కదివఱకే పతనోన్ముఖమైయున్న యాశిఖరము భీషణధ్వనితో విరిగి కూలి పడిపోయెను. అట్లాయిసుకకొండ కూలిపోవుచుండఁగా దానితోఁగూడఁ గాఱుదున్న పోతువలెఁ గాపాలికుఁడును జారి పడి పోయెను.

ఎనిమిదవ ప్రకరణము

ఆశ్రయము

"And that very night-
Shal Romeo bear thee to Mantua"

—*Romeo and Juliet.*

ఆయమావాస్యనాఁటిరాత్రి ఘోరాంధకారమునం దాయిరువురును రోజుకొనుచుఁ బరుగెత్తుకొని పోయి యా వనమధ్యమును జేరుకొనిరి. నవకుమారున కాయడవిత్రోవ లేమియును దెలియవు. కేవలమును దనకు సహచారిణి యగు పదునాఱేండ్లవయసుగల యాసుందరినే లక్ష్యముగఁ జేసికొని యామెపోవుచున్నమార్గము ననుసరించి పోవుట కంఱె నవకుమారున కన్యోపాయము లేకయుండెను.

ఆతఁడప్పుడు తనలో "ఎంతగతి పట్టినది! విధివిధాన మిట్లున్నది కాఁబోలును!" అని యనుకొనెను. బంగాళాదేశస్థులందఱునుగూడ నవస్థలకు లోఁబడిపోవువాఁడే గాని యవస్థలను వశపఱచుకొననంతటి సమరులు కారనుసంగతి నవకుమారుఁడు తెలిసికొనియుండలేదు. ఆసత్యమే గ్రహించినవాఁడైనచో నాతఁడింతగా విచారించియుండఁడు.

క్రమముగా నాతనిపాదవిన్యాసము మందమంద మగుచుండెను. ఆగాఢాంధకారమునం దాతని కేమియు సరిగా నగపడుట లేదు. అప్పుడప్పుడచ్చటచ్చట నక్షత్రములవెలుగులోఁ గేవల మిసుకమెట్టల శృంగములు మాత్రము కొంచె మస్పష్టముగాఁ గానవచ్చుచుండెను.

ఒక్కొక్కచోట మిణుగురుపురుగులచే మిలమిల మెఱయు వెలుగులో దరుశాఖాదులు దృష్టిగోచరము లగుచుండెను.

కపాలకుండల ప్రమముగా నవకుమారుని దనవెంటఁ బెట్టుకొని యతినిబీడంబగు కాననమధ్యమునకుఁ దీసికొనిపోయెను. అప్పటికి రాత్రి రెండవజాము జరగుచుండెను. ఎట్టయెదుటఁ జీకటిలో నాయరణ్య మధ్యమునం దత్యున్నతమగు నొక దేవాలయశిఖరము గానవచ్చు చుండెను. దానికి సమీపమునందే యిటుకలతోనిర్మింపఁబడిన విశాల ప్రాకారముగల యొకమందిరముగూడ దృష్టిగోచర మగుచుండెను.

కపాలకుండల యప్పు డాప్రాకారద్వారమును సమీపించి తలుపు లను మెల్లమెల్లగాఁ దట్టఁదొడంగెను. అట్లు చాలసేపు ద్వారము తట్టిన వెనుక లోపలినుండి యెవ్వరో యొకవ్యక్తి "ఎవరువారు? కపాల కుండలయా?" అని పలుకరించెను. అందుపైఁ గపాలకుండల "ఔను. తలుపు తీయుఁడు!" అనెను.

అంత నావ్యక్తి ద్వారమును దెఱచివై చెను. అట్లుతలుపులు తెర చిన యాతఁ డాదేవాలయమునకు సేవకుఁడు! దానికధికారికూడ నాతఁడే. ఆతనివయసేబది సంవత్సరములకుఁ గొంచెము మించియే యుండును. కపాలకుండల యప్పుడు పలితకేశయుతంబగు నాతని యుత్తమాంగమును దనచేతులతో వంచి యాతనిశ్రవణేంద్రియమును దన యధరసమీపమునకుఁ జేర్చుకొని మెల్లమెల్లగా నొకటిరెండుమాట లతోఁ దానువెంటఁ బెట్టుకొనివచ్చిన నవకుమారుని యవస్థయంతయు నెఱింగించెను.

ఆమాట లాలకించి యాదేవాలయాధికారి చాలసేపటివఱకును గరతలమునందు మస్తకమును జేర్చుకొని యాలోచింప దొడంగెను. అనంతరమం దాతఁడు కపాలకుండల నుద్దేశించి "అమ్మా! ఇది చాల విషమసంకటమగు విషయము! ఆమహాపురుషుఁడు తలఁచు

కొన్నచో నెట్టిదారుణకృత్యమునైనను జేయఁగలఁడు. ఏమైన నగుఁ గాక! మహాదేవి యనుగ్రహముచే నీకెట్టియమంగళమును గలుగకుండుఁ గాక! నీవు వెంటబెట్టుకొనివచ్చినయాతఁ డెచ్చటనున్నాఁడు?" అని యడిగెను.

కపాలకుండలయప్పుడు "అయ్యా! లోనికి దయచేయుము!" అని నవకుమారు నాహ్వానించెను. అంతవఱకును నవకుమారుఁడు వెలుపలనే నిలువఁబడియుండెను. కపాలకుండలపిలుపు విని యావెంటనే యాతఁడు లోపలఁబ్రవేశించెను.

అధికారి యాతనిం గాంచి "అయ్యా! ఈనాటికి నీవీస్థలమునందే ప్రచ్ఛన్నముగా నుండుము. రేపటి ప్రాతఃకాలమునందు నేను నిన్ను మేదినీపురమునకుఁ బోవుమార్గమునందు విడిచివచ్చెదను" అని చెప్పెను.

ఇంతవఱకును నవకుమారుఁ డెట్టియాహారమును భుజించుటలేదని మాటలసందర్భమునుబట్టి దేవాలయాధికారి గ్రహింపఁగలిగెను. అందు వలన నాతఁడు నవకుమారుని కాహారమును సిద్ధముచేయు ప్రయత్నమును గావింపఁదొడంగెను.

అప్పుడు నవకుమారుఁడు "మహాశయా! నాకిప్పుడు భోజనమక్కఱలేదు. విశ్రమించుటకుఁ దగిన స్థలమును దయచేసినచోఁ జాలును" అని ప్రార్థించెను.

అధికారి యప్పుడు తన వంటయింటియందే నవకుమారుఁడు శయనించుటకు దగినయేర్పాటు గావించెను. అచ్చట నవకుమారుఁడు శయనించినంతనే కపాలకుండల మరల సముద్రతీరాభిముఖముగ వెడలిపోవుట కుద్యుక్తురాలయ్యెను.

అది చూచి యధికారి ప్రేమరసపరిపూర్ణవీక్షణములతోఁ గపాలకుండలను దిలకించుచు "అమ్మా! నీవు మరల నచ్చటికిఁ బోవలదు.

ఒక్కనిమిషమాగుము! నేను నిన్నొకవిషయమునఁ బ్రార్థింపవలసి యున్నది" అని యామెను నిలువరించెను.

కపా – ఏమది?

అధి – నేను నిన్నెప్పుడు చూచితినో యప్పటినుండియు నిన్నమ్మా యనిపిలుచుచుంటిని. మహాదేవి చరణకమలములను స్మరించి ప్రమాణముచేసిచెప్పుచున్నాను. నాతల్లికంటెను నధికముగా నేను నిన్నుఁ బ్రేమించుచున్నాను. ఇట్టి నాకోరికను నీవు తిరస్కరింతువా?

కపా – ఎన్నఁటికిని దిరస్కరింపను.

అధి – అట్లయిన వినుము. నీవుమాత్ర మింక నాతనికుటీరమునకుఁ బోవలదు. ఇదియే నాకోరిక!

కపా – పోయిన నేమి?

అధి – అచ్చట నీకెంతమాత్రమును రక్షణము లేదు.

కపా – ఔను. నాకాసంగతి తెలియును.

అధి – అట్లు నీకుఁ దెలిసియే యున్నచో "పోయిన నేమి?" అని నన్నేలప్రశ్నించితివి?

కపా – గత్యంతరము తోచఁక – ఏది యెట్లు జరిగినను నేనచ్చటికే పోవలయును గాని మఱి యెక్కడకుఁ బోయియుందును?

అధి – అట్లయిన-చో నుపాయము చెప్పెదను వినుము. ఇప్పుడు నీవీపథికునితోఁ గలసి దేశాంతరమునకు వెడలిపొమ్ము!

కపాలకుండల యామాట కెట్టిప్రత్యుత్తరమును జెప్పక మౌనము వహించి యుండెను.

అధి – అమ్మా! ఏమి యాలోచించుచున్నావు?

కపా – ఒకప్పుడు మీదర్శనార్థమై మీశిష్యుఁడు వచ్చియుండెను. అప్పుడు నేనాతనితోఁ గూడఁ గలసిపోవుచుండఁగా మీరు నన్ను నిషేధించుచు "అమ్మా! నీవంటియువతి తరుణవయస్కుఁడగు నిట్టియపరి

చితపురుషునివెంట బోవుట యుచితముగాదు " అని యుప దేశించితిరి. అట్టిమీరిప్పుడు నన్నీతనితో గలసిపొమ్మని యెట్లు చెప్పుచున్నారు ?

అధి – అందుకా యింతయాలోచించుచున్నావు ? అప్పుడు నీజీవిత విషయమున నెట్టిసంశయమును గలుగుట లేదు. ఆనాడు నీవు నా శిష్యునితో బోవుటవలన నీకెట్టి ప్రయోజనమైన నుండునట్లును నగపడ లేదు. అందుచేతనే యప్పు డట్లు చెప్పితిని. ఇప్పుడో – నేడు నీకట్టి ప్రాణోపద్రవము తటస్థింపనై యున్నది. ఆప్రాతికూల్యమును దప్పించు కొనుటకు దగినయవకాశముకూడ నీసమయమున లభించియున్నది. రమ్మ ! జగదీశ్వరియగుమహాదేవిని సందర్శించి యీవిషయమున నామెయనుమతికూడ నెట్లుండునో తెలిసికొనివత్తము రమ్మ !

ఇట్లుచెప్పి యాపూజారి దీపమును జేత బట్టుకొని దేవాలయ ద్వారముచెంతకు జేరి కవాటములను దెఱచెను. కపాలకుండలకూడ నాతనివెనువెంటనే పోయెను. ఆమందిరమధ్యమునందు మానవాకార పరిమితయగు కరాళకాళికామూర్తి ప్రతిష్ఠింపబడి యుండెను. ఆ విశ్వ జననిని సమీపించి యిరువురును సాష్టాంగప్రణామము గావించిరి.

అనంతర మాయధికారి యాచమనము గావించి పూవులసజ్జనుండి రేకులు చెదరని త్రిదళబిల్వమును గైకొని మంత్రపూతము గావించి దాని నాలోకమాత పాదపీఠమున సమర్పించి తదేకదృష్టితో నాబిల్వ పత్రమువంక దిలకించుచుఁ గూర్చుండెను. అట్లుకొంతసేపటివఱకును బరీక్షించి యాపూజారి కపాలకుండల నుద్దేశించి "తల్లీ ! చూచితివా ? ఈజగన్మాత యీయర్ఘ్యప్రదానము నంగీకరించినది ! పరమేశ్వరిపాద కమలములం దర్పించిన యీబిల్వపత్రము యథారీతినే యున్నది. నేనేమనియుద్దేశించి దీనిని సమర్పించితినో, దీనివలన నీకవశ్యమును శుభప్రాప్తి కాఁగలదు. నీవు నిర్భయముగా నీబాటసారితో గలసి పోవచ్చును. కాని యొక్కసంశయమువూత్రము నన్ను బాధించు

చున్నది. ఇంద్రియలంపటులగు లోకుల స్వభావప్రవర్తనములంగూర్చి నాకు బాగుగాఁ దెలియును. ఒక వేళ నీవీ బాటసారితో గలసిపోయెద వను కొందము. అప్పుడీపురుషుఁడపరిచితురాలవును, తరుణవయస్కురాలవు నగునిన్ను వెంటఁ బెట్టుకొని మానవలోకమునఁ బ్రవేశించుట కెంతయో సిగ్గుపడక మానఁడు. ఆతనిచెంతనున్న నిన్నుఁ జూచికూడ లోకులు నిందింపక మానరు. కాని యీవ్యక్తి బ్రాహ్మణవంశములోనివాఁడే యని నీవుచెప్పితివి. ఆతనిమెడయందుఁ యజ్ఞోపవీతముకూడ నందుకు నిదర్శనముగనే యున్నది. ఇప్పు డీతఁడు నిన్నుఁ బెండ్లిచేసికొని తీసికొనిపోవుటకు సమ్మతించినచో నంతయును శుభసంపన్నముగనే యుండును. అట్లు జరుగకున్నచో నిన్నీతనివెంటఁ బంపించుటకు నాకెంత మాత్రము నిష్టము లేదు. ఆతనికిని నీకును వివాహమైనచో నీవాత నితో నెక్కడకుఁ బోయినను నిబ్బందిలేదు" అని చెప్పెను.

"వి – వా – హ – ము" అని కపాలకుండల యొక్కొక్క యక్షరమునే యుచ్చారణ గావించెను! అనంతరమం దామె మెల్లగా "వివాహము అనుమాట యిప్పుడే మీనోటినుండియే వినియున్నాను. కాని యది యెటువంటిదో సంపూర్ణముగా నాకుఁ దెలియదు. వివాహమున కేమి చేయవలసియుండును?" అనిప్రశ్నించెను.

అధికారి యామెముగ్ధత్వముంగూర్చి మందహాసము గావించుచు "వివాహమనునది స్త్రీలోకమునకు ధర్మపదారోహణసాధనమగు నేక మాత్రసోపానమై యున్నది. అందుచేతనే సతీమణికి సహధర్మిణియను నామము సార్థక మగుచున్నది. ఈజగన్మాతకూడ విశ్వేశ్వరుని వివాహమాడిన దేవియే –" అని బోధించెను.

అధికారి యప్పుడు వివాహముంగూర్చి చెప్పవలసినవిషయమంతయు స్పష్టముగా, సవిశేషముగా నామెకుఁ దెలియఁజేసితి ననియే యను కొనెను. కపాలకుండలకూడ నంతయుఁ దెలిసికొన్నట్లే సంతృప్తిపడెను.

అనంతరము కపాలకుండల పూజారిం గాంచి "అట్లయినచో మీాయిష్టము వచ్చినట్లు చేయవచ్చును. కాని యీకాపాలికుని విడిచి పెట్టి పోవుటకుమాత్రము నాహృదయ మంగీకరించుటలేదు. ఆతఁడు నన్నింతకాలమువఱకును బెంచి యింతటిదానిని జేసెనుగదా!" అనెను.

అధి – ఎందుకొఱకు నిన్నాతఁ డీవిధముగాఁ బ్రతిపాలించుచుండెనో యీసంగతి నీకెంతమాత్రమును దెలియనే తెలియదు.

అనిచెప్పి యీతఁడు తాంత్రికులమంత్రసాధనమునకు స్త్రీలసంబంధ మెంతవఱకావశ్యకమైయుండునో యశ్లీలముపొరయకుండ నస్పష్టముగఁ గపాలకుండలకుఁ దెలియపఱచుట కెన్ని యోవిధములఁ బ్రయత్నించెను. కపాలకుండల కామాటలభావ మించుకంతయును బోధపడలేదు. కాని యెందుచేతనో యీమె భయప్రకంపిత యగుచు "కానిమ్మ! నాకు వివాహమే యగునుగాక!" అనెను.

పిమ్మట వారిరువురును దేవతాభవనమునుండి యీవలికి వచ్చిరి. అప్పు డాయధికారి కపాలకుండల నొకగదిలోఁ గూర్చుండఁబెట్టి తానొక్కఁడును నవకుమారుఁడు పరుండియున్న చోటికిఁ బోయి యీతని సమీపమున గూర్చుండి "మహాశయా! ఇంకను మెలఁకువగలుగ లేదా?" అనిపలుకరించెను.

నవకుమారుఁడప్పుడు నిద్రావస్థలో లేఁడు. ఆతఁడు తనదురవస్థం గూర్చి యీలోచించుకొనుచుండెను. పూజారిమాటవిని నవకుమా రుఁడు "అయ్యా! నేను మెలఁకువగనే యున్నాను" అనెను.

అధి – అయ్యా! మీాపరిచయమును దెలిసికొనవలయునను నుద్దేశ ముతో నిచ్చటికి వచ్చియున్నాను. మీరు బ్రాహ్మణులా?

నవ – చిత్తము.

అధి – మంచిది. బ్రాహ్మణులలో నేతెగవారు?

నవ – రాటీయ బ్రాహ్మణులము.

అధి – మేముకూడ రాటీయబ్రాహ్మణులమే – ఉత్కళబ్రాహ్మణులమని భావింపవలదు. కులాచార్యకుటుంబములోనివాఁడను. అందుచేతనే యిప్పుడీమహాదేవిపాదముల నాశ్రయించి యున్నాను – మహాశయా! మీయభిధానమేమి?

నవ – నవకుమారశర్మ.

అధి – మీ నివాసస్థానము?

నవ – సప్తగ్రామమునందు.

అధి – మీరే సాంప్రదాయములోనివారు?

నవ – మాది వంద్యసాంప్రదాయము.

అధి – మీకింతవఱ కెన్నివివాహము లైనవి? మీసంసారమునందిప్పుడెందఱు గృహిణులున్నారు?

నవ – ఒకవివాహమే – ఒకగృహిణిమాత్రమే.

నవకుమారుఁడు స్వీయచరిత్రమునంతను సరిగాఁ జెప్పుట లేదు. ప్రకృతసమయమునం దాతనికొకభార్యయును లేదు. ఆతఁడొకప్పుడు రామగోవింద ఘోషాలుని తనూజయగు పద్మావతి యను యువతిని బెండ్లిచేసికొని యుండెను. వివాహమ్మైనతరువాతఁ గొన్నిదినముల వఱకును బద్మావతి పితృభవనమునందే యుండెను. అప్పుడప్పుడు మాత్ర మామె యత్తవారింటికి వచ్చుచుఁ బోవుచుండెను. ఆమెకుఁ బదుమూఁడేండ్ల వయసు వచ్చిన సమయమునం దామె తండ్రియగు రామగోవింద ఘోషాలుఁడు పురుషోత్తమదేవుని సందర్శించుటకై సకుటుంబపరివారముగఁ బోయియుండెను. ఆసమయమునందు పఠానులు మొగలుపాదుషాయగు నక్బరుచక్రవర్తి బలములచేఁ దరుమఁబడి వంగదేశమునుండి పలాయితులై పోయి యోడ్రదేశమును జేరుకొని యందు సస్సైన్యముగ నివసించి యుండిరి. వారినెట్లయిన నిర్జింపవలయునని యక్బరు సార్వభౌముఁడు సమయోచితములగు ననేకప్రయత్నములను

గావించుచుండెను. రామగోవిందుఁడు పురుషోత్తమ స్థానమునకుఁ బోయి మరల నింటికిఁ బోవలయునని బయలుదేఱివచ్చుచున్న సమయమునకు సరిగా మొగలాయీలకును, బఠానులకును మహాఘోర మగుసంగ్రామము జరగుచుండెను. రామగోవిందుఁడు కుటుంబసహితుఁడై ప్రత్యాగమనము చేయుచు మార్గమధ్యమునందు పఠానుసైనికుల చేతులలోఁ బడిపోయెను. ఆకాలమునందలిపఠానులకు యుక్తాయుక్త వివేకము లేకుండెను. వారు కేవలమును రక్కసులవలె ముష్కరులై నిరపరాధులగు పథికుల నాక్రమించి బలవంతముగ వారిఁచెంతనున్న ధనవిభూషణాదులను దోఁచుకొనుచుండిరి. అట్టివారి బారిబడి రామగోవిందుఁ డుగ్రస్వభావుఁడుగావున ధైర్యముతోఁ గ్రోధమవలంబించి కటుభాషణములతో నాపఠానుల నెదిరించెను. ఆయెగసిపాటునకు ఫలముగా నాతఁడప్పుడు సకుటుంబపరివారముగా బంధితుఁడు కావలసి వచ్చెను — తుట్టతుదకాతఁడు జాతిధర్మములను బరిత్యజించి సకుటుంబముగ ముసల్మానుమతము నవలంబించి యావిధముగా నిష్కృతినంద వలసినవాఁ డయ్యెను. అంతవరకు వచ్చినగాని యాకుటుంబమునకు మానప్రాణములు దక్కినవికావు.

అప్పుడు రామగోనింద ఘోషాళుఁడు సపరివారముగా బ్రదికి బయటఁ బడి మరల స్వగృహము నెట్లో చేరుకొనఁగలిగెను. కాని యాతఁడు ముసల్మానుమతము నవలంబించెనని చెప్పి బంధుమిత్రాదులగు నాత్మీయులును, గులమువారునుగూడ నొక్కసారిగా నాతనిని బహిష్కరించి వైచిరి. ఆసమయమున కింకను నవకుమారునిజనకుఁడు జీవించియే యుండెను. ఆతఁడు తనవియ్యంకుడు మతాంతరుఁడగుటచే నాతని తనయయగు తనకోడలు జాతిభ్రష్టురాలయ్యెనని గర్హించి పరిత్యజించి వైచెను. అప్పటినుండియుఁ బద్మావతీనవకుమారులకుఁ బరస్పరదర్శన మైననులేకుండఁబోయెను.

ఆత్మీయులచే విడువఁబడి, సంఘముచే నిషేధింపఁబడి, లోకులచేఁ బరాభవింపఁబడుచున్న రామగోవింద ఘోషాలుఁడు కొన్నిదినములై నను స్వదేశమునందు నిలిచియుండఁజాలకపోయెను. ఆకారణముచే నైననేమి, రాజాస్థానమునందు గొప్పయుద్యోగము సంపాదింపవలయు నను నాశచేనైననేమి యాతఁడు స్వగ్రామమును వదలి రాజధానీనగర మగు రాజమహలునకు సకుటుంబముగఁ బోయి యందు వాసము చేయుచుండెను.

మతాంతరమును స్వీకరించినకారణముచే, నాతఁడును, భార్యా సహితముగనాతని సంతానమునుగూడ మహమ్మదీయజాతిగనే వ్యవహరింపఁబడుచుండిరి. వారు రాజమహలునకుఁ బోయినతరువాత తన యత్తమామలసంగతిగాని, తనయిల్లాలిసంగతిగాని యెట్లుండె ననితెలిసికొనుటకు నవకుమారున కెట్టియవకాశమును లేకుండఁబోయెను. ఇప్పటివఱకునుగూడ నాతనికి వారియోగక్షేమము లెంతమాత్రమును దెలియనే తెలియవు. అప్పటినుండి యిప్పటివఱకును నవకుమారుఁడు వైరాగ్యమునవలంబించి మరలఁ వివాహము చేసికొనకయే యుండెను. అందుచేత నవకుమారుని కిప్పుడు స్వగృహమునం దొకఁ భార్యయైనను లేదనియే మేము చెప్పవలసి యున్నది.

ఆపూజారి కీవృత్తాంత మంతయు నెట్లు తెలియును? అందుచేత నాతఁడు బాగుగ నాలోచించి "కులీనబ్రాహ్మణకుటుంబములోనివాఁడగు నీతనికి రెండుపెండ్లిండ్లు చేసికొనుటగాని, యిరువురుగృహిణులతోఁ గాపురము చేయుట గాని యాచారనిషిద్ధముగాదు" అని నిశ్చయించుకొని నవకుమారునుద్దేశించి "నేనిప్పుడు మీతో నొకవిషయమును మనవిచేయవలయు నని వచ్చియుంటిని. ఈ సుందరీమణియగు కన్య మీకుఁ బ్రాణరక్షణము గావించినది – ఈమె పరోపకారమునకై తన జీవితమును ధారవోసినది. ఇంతవఱకు నేమహాపురుషుఁ డీమె

కాశ్రయమును బ్రబసాదించి యుండెనో యాతఁడు కేవలమును బ్రగూర స్వభావుఁడు! ఈమె మరల నిప్పు డాతనియొద్దకే పోయినచో నిది వఱకు నీకుఁ దటస్థించినయవస్థయే యీమెకును సంభవింపఁగలదు. ఈమె నట్టిమహావిపత్తునుండి యుద్ధరించుటకు నీవేదియైన నుపాయము నాలోచింపఁజాలవా?" అని బ్రశ్నించెను.

ఇంతవఱకును గూర్చుండియున్న నవకుమారుఁడు చటాలున లేచి నిలువఁబడి "నాకుఁగూడ నిట్టిసంశయమే కలిగి యాలోచించు చున్నాను. ఈమె మరల నచ్చటికిఁ జేరుట యపాయమే - సర్వజ్ఞులగు మీరేయీమె కెట్టియిబ్బందియుఁ గలుగకుండునట్టి యుపాయము నాలో చించి సెలవీయవలయును. నేను బలిపశుత్వమునకంగీకరించి యాక్రూర కాపాలికునిచెంత కెప్పటివలెఁ బోవుటవలన నీమెకుఁ బ్రాణరక్షణము కాఁగలదని తోచినచో మనఃపూర్వకముగా నట్లు చేయుటకు నేను సిద్ధముగనే యున్నాను" అని బ్రతిజ్ఞగావించెను.

ఆమాటకు పూజారి నవ్వుచు "అమాయకుఁడవై నీవిట్లాలోచించు చున్నావు. అట్లు చేయుటవలన నేమిప్రయోజనముండును? వెఱ్ఱివాని వలె నీవాతనికి స్వయముగా లోఁబడిపోయినచో నీప్రాణములును బోవును - క్రోధజ్వలితుఁడగు నాతాంత్రికుని దారుణకృత్యములవలన నీమెకును బ్రాణరక్షణము లేకుండఁబోవును. ఇప్పుడు బాగుగ నాలో చించిచూడఁగా మీయుభయుల క్షేమమునకును గేవల మొక్కయుపా యముమాత్రమే యగపడుచున్నది" అనెను.

నవ - ఉభయతారకమగు నట్టియుపాయ మేదియైనఁ దమకుఁ దోచి నచో ననుగ్రహింపుఁడు!

అధి - ఎట్లయిన నీమె నీతోఁగూడఁ బాఱిపోవుటకంటె ననోన్యోపాయ మేదియును లేదు. కాని యదిమాత్రము కేవలమసంభవముగాఁ దోఁచుచున్నది. పాఱిపోక యిచ్చటనే యున్నచో నీమె తప్పక

యొకటి రెండుదినములలోఁ బట్టువడిపోవును. ఏమనిన ఆ మహాపురుషుఁ డెప్పుడు నీదేవాలయమునకు వచ్చుచుఁ బోవుచునే యుండును. ఆతని కన్నులఁ బడకుండ నేనీమె నెంతకాలమిచ్చట దాఁచి యుంచఁగలను? ఎట్లయిన నెప్పటికైన నీకపాలకుండలకుఁ బ్రమాదముసంఘటిల్లక మానదు.

నవకుమారుఁ డామాటవిని తల్లడపాటుతో "అట్లయినచో నీమెను నావెంటఁ దీసికొనిపోవువిషయమున మీకు సంశయము గలుగుటకుఁ గారణ మేమి?" అని యడిగెను.

అధి – ఈమె యెవ్వరితనయయో, యేజాతియందు జన్మించినదో యాసంగతి నీకెంతమాత్రమును దెలియదు. ఎవ్వని బెండ్లియాడినదో యేమో, యెటువంటి ప్రవర్తనముగలదోకూడ నీకుఁ దెలియదు. అట్టి నీవీమె నేవిధముగా వెంటఁబెట్టుకొని పోఁగలుగుదువు? జాలిపడి యేదోవిధముగా మనసు సమాధానముగఁ జేసికొని నీవీమెను గూడఁ దీసికొనిపోయెదవుగాక! నీగృహమునం దీమెకుఁ దగినస్థానము నిచ్చి యాదరింపఁగలవా? అట్లు నీవు చేయఁదలంచినను నీకుటుంబమువారి వలనను, నీసంఘమువలనను నీకెన్నియభ్యంతరములు తటస్థించునో నీవుకొంచెమైన నాలోచించితివా? అట్టిస్థితిలో ననాథయగు నీబాలిక యెక్కడ నుండఁగలదు? ఎక్కడకుఁ బోఁగలదు?

నవకుమారుఁడు కొంచెముసే పాలోచించి "నాప్రాణములను గాపాడిన యీమెకొఱ కెట్టిత్యాగము గావించుటయైనను నాకసాధ్యకార్యము గానేరదు. ఈమెను నేను దీసికొనిపోయి నాకుటుంబమునందే చేర్చుకొనియాదరించెదను" అని వాక్కుచ్చెను.

అధి – అట్లు చేసినచో యుక్తముగనే యుండును. కాని నీబంధువులలో నెవ్వరైన సంశయించి "ఈయువతి యెవ్వరియిల్లాలు?" అనిప్రశ్నించినచో నీవేమని ప్రత్యుత్తరము చెప్పఁగలవు?

నవకుమారుఁడు మరల బాగుగ నాలోచించుకొని "మీరే యీమెచరిత్రమునంతను నాకు సంపూర్ణముగఁ దెలియఁజేయుఁడు! ఆపరిచయమునే నేను మీవారి కందజేకిని గలిగించెదను" అని చెప్పెను.

అధి – మంచిది! అయినను నింకొకసంశయము బాధించుచునే యున్నది. తరుణవయస్కులగు స్త్రీపురుషులు వెంట మఱియొక రెవ్వారును లేకుండఁ బ్రయాణము గావించుట యెట్లు? లోకమువా రెవ్వరైనఁ జూచి యేమనుకొందురు? లోకులమాట యటుండనిమ్ము! ఈవిషయమున దోషస్పర్శయేమియు లేదని యాత్మబంధువులకైనను నచ్చఁజెప్పుట యెట్లు? నేనీబాలికను జిన్నతనమునుండియు నమ్మా యని పిలుచుచు నెల్లవిధముల నుపలాలించుచున్నాను. అట్టినేను కేవలము నజ్ఞాతచరిత్రుఁడగు పరాయిపురుషునివెంట నొంటిగా నీమె నెట్లు పంపించుట కంగీకరింపఁగలను?

సంఘటనకారియగు నయ్యధికారి కూర్పరితనమునందలినేర్పు సర్వ సామాన్యమైనది గాదు. ఆయిరువురకు నెట్లయినఁ బెండ్లి చేయవలయు ననుదృఢసంకల్పము కలవాఁడు గావుననే యాతడట్లు సమయోచిత ముగ సంభాషించుచుండెను.

ఆమాట విని నవకుమారుఁడు "అట్లైవ్వరికిని సంశయము గలుగ కుండ మీరుకూడ మావెంట రండు" అనెను.

అధి – సరిసరి! నన్నే రమ్మనుచుంటివా? ఈదేవళమును విడిచి నేను వచ్చినచో నీమహాదేవి నిత్యపూజారాధనములు గావించువా రిచ్చట మఱియెవ్వరున్నారు?

నవకుమారున కేమార్గమును దోఁచుట లేదు. అన్నిటికన్నియు నభ్యంతరములే యగపడుచుండెను. తుదకువిరక్తభావముతో "అట్లయినచో నీవిషయమునందిక నెట్టిసదుపాయమును లేనే లేదా?" అనెను.

అధి – లేకేమి ? ఒక్క-టేయుపాయ మగపడుచున్నది. అది నీయుదారస్వభావమునం దాధారపడి యున్నది.

నవ – మీకాసంశయ మెందుకు ! ఆయుపాయమేమో సెలవిండు ! నేను మీమాట వినినివాఁడ నని యనుకొనవలదు. ఆజ్ఞాపింపుఁడు !

అధి – అట్లయినచో వినుము ! ఈబాలికారత్నము బ్రాహ్మణ కన్య ! ఈమెవృత్తాంత మంతయు నాకు బాగుగాఁ దెలియును. చిన్న తనమునం దీబిడ్డను దురాత్మ్మలగు కొందఱుక్రైస్తవతస్కరు లెత్తికొని పోయిరి. వారుప్రయాణము చేయుచున్న యోడ ద్దైవవశమునఁ బగలి పోవుటచే నందఱును జెల్లాచెదరై యెవ్వరేమైరో తెలియకుండఁ బోయిరి. ఈబాలికమాత్ర మీసముద్రతీరమును జేరుకొనఁగలిగెను. ఆవృత్తాంత మంతయుఁ దరువాత నీవీమెవలన సవిశేషముగఁ దెలిసి కొనవచ్చును – ఒడ్డునకుఁజేరిన యీబాలికను జూచి తంత్రసాధకుఁడగు నాకాపాలికుఁడు తనయోగసాధనమున కుపయోగపడునను నుద్దేశము తోఁ దనకుటీరమునకుఁ జేర్చుకొనిప్రతిపాలించుచుండెను. ఇఁక నాతఁడు కొలఁదికాలములోనే తనప్రయోజనమును సిద్ధింపఁజేసికొనఁగలఁడు. ఈబాలిక యింతకాలమువఱకు నవివాహితగనే యున్నది. ఇక్కన్య కామణిచరిత్రము పరమపవిత్రమైనది. కావున నీవీమెను బెండ్లిచేసి కొని యాత్మ్మమందిరమునకుఁ దీసికొనిపొమ్ము ! అట్లు చేసినచో నీవిష యమున నిఁక నెవ్వరు నేమనుకొనుటకు నెట్టియవకాశము నుండదు. నేనే యీ దివ్యస్థలమునందు మీయిరువురికిని యథాశాస్త్రముగ వివాహమును గావించెదను.

ఆమాటలు విని నవకుమారుఁడు చటాలున నటనుండి కదలిద్రుత పదవిక్షేపముతో నవ్వలికిఁ బోయి యేమియుం దోఁచక యటునిటు పరిభ్రమింపఁదొడంగెను. అధికారి కొంతసేపటివఱకు నాతనికై నిరీక్షించి రాకం గానక తానేయాతనిచెంతకుఁ బోయి "నీవిప్పు డేమియు

నాలోచింపవలదు. హాయిగాఁ బోయి నీపడకపైఁ బరుండి నిద్రిం పుము. సరిగాఁ బ్రాతఃకాలమునకు నేను వచ్చి నిన్ను మేలుకొలిపెదను. నాయుపదేశము నీకు నచ్చకున్నచో నీ యిష్టప్రకారము నీవొకఁడవే రేపు నీయింటికి బయలుదేఱి పోవచ్చును. నేను నీతో స్వయముగా వచ్చి మేదినీపురమునకుఁ బోవు మార్గమును నీకుఁ జూపించెదను" అని చెప్పెను.

ఇట్లు చెప్పి యధికారి నవకుమారునియొద్ద సెలవు గైకొని పోవుచుఁ దనహృదయమునందు "రాటదేశీయమగు పెండ్లికూర్పునందలి నేర్పరి తనమును నేను మఱచిపోయితినా యేమి?" అని యనుకొనెను.

తొమ్మిదవ ప్రకరణము

దేవతానికేతనము

"కణ్వ – అలంరుదితేన; స్థిరాభవ!
ఇతః పంథానమవలోకయ"

— శాకుంతలము.

తెల్లవాఱకమునుపే యధికారిలేచి నవకుమారునిసమీపమునకు విచ్చేసెను. వచ్చిచూడఁగా నవకుమారుఁ డింకను శయనింపనేలేదు. అధికారి యాతని నుద్దేశించి "సఖే! ఇప్పుడు చేయఁదగినపని యేమి?" అని యడిగెను.

నవ – ఈదినమునుండియే కపాలకుండల నాకు ధర్మపత్నియైనది. ఈమెకొఱకు నేను సంసారమును ద్యజింపవలసివచ్చినను మనఃపూర్వ కముగనట్లు చేయుటకు సిద్ధపడి యున్నాఁడను. ఇప్పుడు నాకుఁ గన్యా దానమును జేయువా రెవ్వరు?

ఆమాట విన్నంతనే ఘటకచూడామణి యగునయ్యధికారి వదన మించుక వికసించెను. ఆతఁడప్పుడు తనలో "ఇంతకాలమునకు జగదంబ

యనుగ్రహమువలన మాకపాలకుండలకు బ్రదుకుదెఱువు లభించినది" అని సంతోషించుచు, నవకుమారునితో "నేను కన్యాదానము చేయుదును" అని చెప్పి యాతఁడు తనపడకగదిలోనికిఁ బోయెను. అందొక గూటిలోఁ గొన్ని ప్రాతప్రాటియాకులుండెను. ఆపత్రములలో నాతఁడు తిథివారనక్షత్రాదులనుగూర్చి గుణించి వ్రాసికొనియుండెను. అధికారి వానిని జదివి కొని మంచిచెడ్డలను బాగ విమర్శించి నిశ్చయించుకొని మరల నవకుమారునియొద్దకు వచ్చి "నేఁడు నిశ్చితమగువివాహముహూర్తము లేకపోయినను – పెండ్లి చేసికొనుటకెట్టిప్రాతికూల్యమును లేదు. గోధూళిలగ్నమునందు యథావిధిగ నేనే కన్యాసంప్రదానము గావించెదను. నేఁడుమాత్రము నీవుపవసించియుండవలయును. కులాచారపద్ధతుల ననుసరించి చేసికొనఁదగిన కళ్యాణానంతరకృత్యములను నీవింటికి జేరినతరువాత నిర్వర్తించుకొనవచ్చును. ఒకవేళ నాకాపాలికుఁడు నేఁడిచ్చటికి వచ్చినను మీరిందున్నట్లు తెలిసికొనఁజాలఁడు. ఏదోయొకవిధముగా నీదినమునకుమాత్రము నేను మిమ్ము రహస్యముగా దాఁచియుంచఁగలను. అందుకు దగినచోటు కూడ నేర్పాటు చేసితిని. అచ్చటమీవివాహావిధులు సంపన్నములైనంతనే డింపతులిరువురును గలసి రేపటిప్రభాతవేళ బయలుదేరి స్వదేశమునకుఁ బోవచ్చును" అని చెప్పెను.

అట్లు చేయుటకు నవకుమారుఁడు సమ్మతించెను. అట్టియవస్థలో నెంతవఱకు సాధ్యమగునో యంతవఱకును శాస్త్రోక్తప్రకారము వివాహవిధు లన్నియును నెఱవేర్పఁబడెను. గోధూళిలగ్నమునందు నవకుమారునకును గాపాలికప్రతిపాలితయగు సన్యాసిని కపాలకుండలకును బెండ్లి గావింపఁబడెను.

ఇంతవఱకు నాకాపాలికునిసమాచార మేమియును దెలియవచ్చుట లేదు. మరునాఁటిప్రాతఃకాలమునుండియు మువ్వురును గలసి ప్రయాణ

సన్నాహములను గావింప దొడంగిరి. అధికారికూడ మేదినీపుర రాజ మార్గమువఱకు నాదంపతులతోఁ గలసి పోవలసియుండెను.

బయలు దేఱినప్పుడు కపాలకుండల మహాకాళికిఁ బ్రణామము గావించుటకుఁ దేవళములోనికిఁ బోయెను. అప్పుడామె భక్తిపూర్వకముగా దేవికి వందనము గావించి పూలసజ్జనుండి యొక బిల్వదళమును దీసి దానిని జగన్మాతపాదపీఠమునందు సమర్పించి తదేకదృష్టితో నాపత్రమును దిలకించుచుండెను. కొంతసేపటికాబిల్వపత్రము దేవ పీఠమునుండి జారి పడిపోయెను.

కపాలకుండల యావిశ్వజననియెడల మిగులభక్తివిశ్వాసములుగల యువతి. ఆప్రతిమాచరణతలమునుండి యప్పు డాబిల్వదళము విచ్యుత మగుటం గాంచి యామె భయప్రకంపితయైపోయెను – ఆమె తక్షణము నందే లేచి పోయి యీసంగతి నధికారికి విన్నవించెను. అధికారి యీమాటవిని యతినిషణ్ణభావముతో నప్రసన్నవదనుఁడై పోయెను.

ఆతఁడు కొంతసేపటివఱకును జింతానిమగ్నుఁడై యుండి యనంతరము కపాలకుండల నుద్దేశించి "అమ్మా! విచారింపకుము! ఈశ్వరోద్దేశమునకు మనము ప్రతిక్రియ చేయుటకు శక్తిగలవారముగామము. ఏది యెట్లు జరుగనున్నను నింతటినుండి నీకుఁ బతియేగతి! పతిసేవ గావించుటయే సతీమణి కేకమాత్రధర్మముగదా! నీనాథుఁడు శ్మశానమునకుఁ బోయినను నీవాతనితోఁ బోవలసియే యుండును. కావున నీవిప్పు డింతమాత్రమును మాఱుమాట చెప్పక నిస్సందేహముగాఁ బ్రయాణము గావింపుము" అని ధైర్యము చెప్పెను.

అనంతర మామువ్వురును నిశ్శబ్దముగాఁ బ్రయాణము గావించిరి. చాలఁపొద్దెక్కఁసప్పటికి వారు మేదినీపురమునకుఁబోవు రాజమార్గమును జేరుకొనఁగలిగిరి. అప్పు డధికారి "ఈత్రోవనే మీరు పోవచ్చును. నేనికఁ బోయివచ్చెదను" అని తెలిపెను. ఆమాట విని కపాలకుండల

యేడువఁదొడంగెను. ఈప్రపంచమునం దింతవఱకు నెవ్వఁ డామె కేకమాత్ర బాంధవుఁడో, కేవలమెవ్వఁడామెకు శుభాకాంక్షి యో యట్టియాత్మీయుఁడు మఱి యీజన్మమునం దెన్నఁడు నగపడకుండ సెలవు గైకొని పోవుచున్నాఁడు!

అధికారికూడ దుఃఖముతోఁ గన్నుల నీరు పెట్టుకొనెను. కొంత సేపటి కాతఁడు కన్నీరు తుడుచుకొని కపాలకుండలఁ జెవిలో "అమ్మా! నీకుజగన్మాతయనుగ్రహాముచలన సంతానమునకుఁగాని సంపదలకుఁగాని యెట్టిలోపమును గలుగదని విశ్వసించియుండుము. ఆదేశమునందుఁ గూడ మహాదేవి నాబాలగోపాలము నారాధించుచునే యుందురు. నేను నీచెంగునమాటగట్టినదానిని నీస్వామిచేతి కిచ్చి నీప్రయాణమున కొకపల్లకి నేర్పాటుచేయునట్లు తెలుపును. నీకుమారుఁడ నైన నన్ను మఱచిపోవలదు" అని చెప్పి యధికారి యేడ్చుచు, నేడ్చుచు వెడలి పోయెను. కపాలకుండలకూడ దుఃఖించుచునే యాతనికడ సెలవు గైకొనెను.

౬౨

కపాలకుండల

ద్వితీయ ఖండము

మొదటి ప్రకరణము

రాజమార్గము

"There – now lean on me:
Place your foot here —"

— *Manfred.*

నవకుమారుఁడు మేదినీపురమును జేరుకొని యచ్చట నధికారి యిచ్చినధనముతోఁ గపాలకుండలప్రయాణమున కొకపల్లకిని, నొక పరిచారికను, నొకసేవకుని, బల్లకిభోయలను గుదుర్చుకొని కపాల కుండలను బల్లకి నెక్కించి పంపించెను. సరిపడినంతధనము లేకపోవుటచేఁ దానుమాత్రము పాదచారిగనే ప్రయాణము చేయుచుండెను. నిన్నటి దినమంతయుఁ గావించినపరిశ్రమవలన నవకుమారుఁడు మిగుల నలసి యుండెను. అందుచే నాతఁడు వడిగా నడవఁజాలకుండెను. మధ్యాహ్న భోజనమైనతరువాత వాహకులు శిబికను మోచుకొని యతివేగముగఁ బోవుచుండిరి. వారికి నవకుమారుఁడు చాల వెనుకఁ బడిపోయెను.

క్రమముగా సాయంకాలమయ్యెను. ఆశీతకాలమునందలి పలుచని మేఘములు గగనమండలము నలముకొని యుండెను. సంజవేళకూడ నతిక్రమించిపోయెను. జగమంతయు నంధకారబంధురమైయుండెను. కొంచెముకొంచెముగఁ జినుకులుకూడఁ బడుట కారంభమయ్యెను. నవకుమారుఁడెట్లయినఁ గపాలకుండలపల్లకిని గలిసికొనవలయునని సాధ్యమైనంతవఱకుఁ ద్వరితగమనమును గావించుచుండెను.

మొదటిమజిలీలోనే యామెను గలిసికొనవలె నని యాతఁడు చాల శ్రమపడి నడచెనుగాని సఫలమనోరథుఁడు కాఁజాలకపోయెను. అప్పటికి నాలుగైదుగడియలరాత్రికూడ నయ్యెను. నవకుమారుఁడు మఱింత

వేగముగా నడచుచుఁ బోవుచుండెను. అప్పుడకస్మికముగా నాయంధ కారమునం దొకకఠినపదార్థ మాతనికాలికి దగిలెను. కాలితాకుడు వలన నావస్తువు పటపట పెళపెళ యనిధ్వనించుచు ముక్కలై పోయెను.

నవకుమారుఁడు ముందడుగు వేయక యచ్చటనే నిలువఁబడిపోయెను. మరల నొకయడుగువైచి చూచెను. మరల నదియే చప్పుడు! అప్పుడాతఁడు తనచరణములకుఁ దాకుచున్నపదార్థ మేమైయుండు నని చేతితోఁ దాని పరిశీలించెను. అది విరిగిపడిపోయిన పల్లకిబల్లవలెనగ పడియెను.

ఆకాశమండల మంతయు మేఘాచ్ఛన్నమైయున్నను చెట్లు మొదలగు నవిలేని బయటిభాగమునందుఁ బడియున్న వస్తువులను బోల్పఁజాలనంతటి కాఢాంధకారము గాలేదు. ఆతనియెట్టయెదుట నేదియో యొకపెద్ద వస్తువు పడియున్నట్లు నవకుమారుఁడు గ్రహింపగలిగెను. అనుభవమును బట్టి యావస్తువు పగిలిపడిపోయినపల్లకి యైయుండు నని తెలిసికొనెను. ఆవెంటనే యాతనిహృదయమునందు కపాలకుండల కేదియో విపత్తు సంభవించి యుండు ననుసంశయ ముదయించెను.

ఆతఁడు శిబికవైపునకుఁ బోవుచుండఁగా మఱియొకవిధమగు పదార్థ మేదియో యాతనికాలికిఁ దగిలెను. అది మానవశరీరస్పర్శనమువలె మెత్తనై యున్నట్లాతనియనుభవమునకుఁ దోఁచెను. నవకుమారుఁడట గూరుచుండి చేతులతోఁ దడవిచూచెను. నిజముగా నది మనుష్య దేహమే – కాని చాలచల్లగా నుండెను; అంతేకాక స్పృశించి చూడగా నాకళేబరము ద్రవపదార్థ సంకలితమై యున్నట్లు తెలియ వచ్చెను. అప్పుడు నవకుమారుఁడు పడియున్న వ్యక్తిహస్తమును బట్టుకొని నాడిని బరీక్షించి చూచెను. కదలిక లేదు. ప్రాణము పోయినట్లుండెను. ఊపిరియాడుచున్న యెట్టిశబ్దమైన వినవచ్చుచున్న దేమో

యని జాగ్రత్తగాఁ బరిశీలించెను. కొంచెముకొంచెముగా శ్వాసకదలు చున్నట్లగపడెను. "ఊపిరితిరుగుచుండఁగా నాడీచలనము లేకుండు టకుఁ గారణ మేమి? ఏదియైన జబ్బు చేసి యుండునా?" అనిసంశ యించి నవకుమారుఁడు నాసికయొద్దఁ జేయుంచి పరీక్షించెను. ఊపిరి తిరుగుచున్నట్లులేదు. "మఱియేదియో చప్పుడగుచున్నది యేమి? ఇచ్చటమఱియెవ్వరైన జీవితవ్యక్తి యుండియుండునా?" అని యను మానించి నవకుమారుఁడు "ఇచ్చట నెవ్వరైన జీవించి యున్నారా?" అని బిగ్గఱగాఁ బ్రశ్నించెను.

అతి మృదుస్వరముతో "నేనున్నాను!" అని ప్రత్యుత్తరము వచ్చెను.

నవ – నీవెవ్వరు?

ఆప్రశ్నకు బదులుగా "నీవెవ్వరు?" అనుప్రత్యుత్తరము స్త్రీ కంఠస్వరముతో నవకుమారునిచెవులఁబడెను. అప్పుడాతఁడు వికల హృదయముతో "నీవు కపాలకుండలవా?" అని ప్రశ్నించెను.

వ్యక్తి – కపాలకుండల యెవ్వరో నేనెఱుంగను – నేనొకమార్గస్థు రాలను. బందిపోటుదొంగలచేతులలోఁబడి వారిచే సర్వధనభూషణా దులను బోఁగొట్టుకొని యిప్పుడు నేను నిష్కుండల నైయున్నాను.

ఆమాటయందలి భావచమత్కృతిం గాంచి నవకుమారునిహృదయ మున కించుకప్రసన్నత గలిగెను. ఆతఁడు మెల్లగా "నీకిప్పుడు తటస్థిం చిన యవస్థయేమి?" అని ప్రశ్నించెను.

వ్యక్తి – దారిదొంగలు చుట్టఁబెట్టుకొని నాపల్లకిని భగ్నము గావించివైచిరి. వాహకులలో నొకనిని గొట్టి చంపివైచిరి. అదిచూచి తక్కినవారందఱును భయపడి తోఁచినత్రోవలనుబట్టి పలాయితులై పోయిరి. అప్పుడాచోరులు నాకడనున్నయలంకారములనన్నిటిని దోచు కొని నన్ను బంధించి యీభగ్నశిబిక యందుబడవైచి పోయిరి.

నవకుమారుఁ డామాటలు విని యాచీకటిలో నాశిథిలయానము చెంతకుఁ బోయి చూచెను. నిజముగ నాపల్లకియందొకయువతి వస్త్రములతో బంధింపఁబడి యుండెను. నవకుమారుఁ డాబంధనముల నతి త్వరితముగ వదలించివై చి "నీవు మెల్లగా లేచి నడవఁగలవా?" అని ప్రశ్నించెను.

స్త్రీ – నాకుఁగూడ నొకకట్టిదెబ్బ తగిలినది. అందుచేత నాకాలిపైఁ జాల బాధగానున్నది. అయినను గొంచెము సహాయపడినచో లేచి కూర్చుండఁగలను!

నవకుమారుఁ డామెకుఁ దనహస్తముల నందించెను. వానిసాయముచే నామె మెల్లగ లేచి కూర్చుండెను. నవకుమారుఁ డామెంగాంచి "నీవు నడవజాలవా?" అనెను.

ఆయువతి యామాటకు బదులు చెప్పక "మీవెనుక నెవ్వరైనఁ బ్రయాణికులు వచ్చుచున్నారా?" అని ప్రశ్నించెను.

నవ – ఎవ్వరును లేరు.

స్త్రీ – పాంథశాల యిక్కడ కెంతదూరమం దున్నది?

నవ – ఏమో నాకుఁ దెలియదు. ఈసమీపమందే యుండవచ్చును.

స్త్రీ – అంధకారమునం దీరాత్రివేళ నీమార్గమధ్యమందు నేనొంటిగా నెట్లుండఁ గలుగుదును? మీతోఁగూడ సత్రమువఱకు నెట్లో చేరుకొనుటయే యుచితముగాఁ దోఁచుచున్నది. ఏదియైన నించుక యాధారము లభించినచో దానిపై బరువుమోపికొని యెట్లో నెమ్మదిగా నడవఁగలుగుదునని తోఁచుచున్నది.

నవ – అట్లయినచో నిఁక నేమి? ఆపత్కాలమునందు నిరర్థక

సంశయములు గల్గించుకొనుట మూర్ఖులపని – నీవిప్పుడు నాభుజముపై బరువుంచి మెల్లమెల్లగా నన్ననుసరించి రావచ్చును.

ఆయువతి మూఢకృత్యమును గావింపలేదు. నవకుమారుని భుజముపై జేతులుంచి తదవలంబనముచే మెల్లమెల్లగ బదక్షేపము గావించుచు గదలిపోయెను.

నవకుమారుఁ డూహించినట్లు పాంథశాల సమీపమందే యుండెను. ఆకాలమునందు సత్రముల సమీపములందుఁగూడ దుష్కృత్యములను గావించుటకు దుర్మదులగుదస్యులు సంశయించుట లేదు. నిర్భయులై విజృంభించి కొల్లగొట్టుచుండిరి. నవకుమారుఁడా యువతిని మెల్లగ నడపించుకొనుచుఁ దీసికొనిపోయి శీఘ్రకాలమునందే యాసత్రమును జేర్చెను.

అప్పుడు కపాలకుండల సపరివారముగ నాసత్రమునందే విడిసియుండుటను నవకుమారుఁడు గాంచి మనసు కుదురుపఱచుకొనెను. అంతకుముందే దాసదాసీజన మాసత్రాధికారినడిగి కపాలకుండల యుండుట కొకగది నేర్పాటు చేయించిరి.

నవకుమారుఁడు తనవెంటఁ దీసికొనివచ్చిన స్త్రీకిగూడ నాగది ప్రక్కనే యింకొకగదిని దీసికొని యామె నందుఁ బ్రవేశపెట్టెను. అప్పుడు నవకుమారుని ప్రార్థనమువలన సత్రాధికారిభార్య యొకదీపమును వెలిఁగించితెచ్చియాగదియం దుంచెను. తాను వెంటఁబెట్టుకొని వచ్చిన యాకాంతతనువల్లిపై నాదీపకాంతులు ప్రసరించినంతనే నవకుమారుఁడు కాంచి "ఈమె యసామాన్యరమణీ శిరోమణియై యున్నదే!" అని యాశ్చర్యపడిపోయెను. ఆసుందరి రూపకాంతి తరంగములయం దామెమనోహరతారుణ్యశోభ శ్రావణవాహినివలెఁ బొంగిపొరలిపోవుచుండెను!

రెండవ ప్రకరణము

సత్రపు

"కైపాయోషిత్ ప్రకృతిచపలా"

—ఊద్ధవదూత.

నిజముగా నాయువతి నిష్కలంకమగుసౌందర్యముకలదియే యైనచో మేము మాపురుషపాఠకులంగూర్చి "ఈరమణీమణి మీమనోహారిణి యైన యిల్లాలివంటి సుందరియే?" అనియు, స్త్రీపాఠకురాండ్ర నుద్దేశించి "మీరు మీయాత్మరామణీయకముంగూర్చి యానందించుచు నిలువుటద్దమునం జూచుకొనుచుండు మీప్రతిబింబమువంటి ప్రియమూర్తియే!" అనియు నొకటిరెండు మాటలతో నామె సౌందర్య వర్ణమును బూర్తిగావించియే యుందుము. కాని దురదృష్టవశమున నామెసర్వాంగసుందరి కాకుండుటచే మేమామెరూపమును స్పష్టముగాఁ దెలియునట్లు వర్ణింపక తప్పుట లేదు.

ఆమె రూపరామణీయక మంతనిర్దుష్టమైనది కాదని చెప్పుటకు గారణ మేమనఁగా నాయింతి సాధారణకాంతల మధ్యమాకృతికంటె నించుకపొడుగరి. ఇంతేగాక యామెయధరోష్ఠము పక్వబింబమువలె వర్తులముగ లేక యించుక యొత్తుకొనియుండెను. ఇఁకమూఁడవపక్షమున నామె యంతటిశ్యామాంగి కాకపోయినను, గౌరాంగిమాత్రముగాదు.

ఆమెశరీరము కొంచెమున్నతమైనదనుట నిజమే. కాని కరచరణాద్యంగకములు సుగోళములై సంపూర్ణీకృతములై యుండెను. వర్షాకాలమునందలిజాతివల్లి మెల్లెడలనలముకొనియున్న యసంఖ్యదళములచే నెట్లుదట్టమై యాత్మసౌభాగ్యముచే నెట్లు కన్నులపండువు చేయుచుండెనో యట్లే యామెతనూవల్లియును దనసంపూర్ణవికాసముచే నాలోక

రమణీయమై యుండెను. మొత్తముమీఁద నామె యించుక పొడవుగ నున్నను సర్వాంగకములునుగూడఁ దత్తదుచితరీతిని సమసంపూర్ణతం గాంచియుండుటచే నసాధారణశోభాదాయకము లగుచుండెను. ఎవ్వరిను జూచి మనము గౌరాంగియని నిర్ధారణ సేయుదుమో యట్టివారిలోఁ గొందఱు రాకాచంద్రచంద్రికాసమప్రభలై యుందురు; మఱికొందఱి దేహకాంతి యీషదారక్తవదనయగు నుషస్సుం బోలియుండును. కాని యామెతనుద్యుతిమాత్ర మూరెండువర్ణములకును భిన్నమైనదే. కేవలమామె గౌరాంగి యని చెప్పి యొప్పించుటకు మేముపూనుకొన లేదు. కాని యామె శరీరకాంతి మనోమోహనము గావించుటయం దెంతమాత్రమును దీసిపోవునది గాదు. ఆమె చామనచాయగల రమణీ రత్నము. తల్లి యగుకాళియు శ్యామలయే. జగన్మోహనుఁడగుకృష్ణుఁ డును శ్యామసుందరుఁడే. కాని యామె దేహచ్ఛాయ యట్టిశ్యామల వర్ణముతోఁ బోల్పదగినది గాదు. తప్తకాంచనమెట్టిశ్యామలకాంతి విలసితమైయుండునో యామెశరీరకాంతి యట్టివన్నెచేఁ దులకించుచుం డును. పూర్ణచంద్రకిరణప్రసారితమైనట్టిగాని, హేమాంబుదకిరీటినిభమై నట్టిగానియుషస్సు గౌరాంగులతనుచ్ఛాయ కుపమింపఁదగినది యైనచో, వసంతకాలమున నూతనముగ నుదయించిన లేఁదీయమావిచిగురుగుబు రుల మిసిమివన్నె యామెకోమలశ్యామలవర్ణమున కుదాహరణముగా నుండఁగలదు. మాపాఠకమహాశయులలోఁ జాలమంది గౌరాంగులగు రమణీమణులం గాంచి వారు చాలనందకత్తెలని సిద్ధాంతీకరించికొని యుందురు. అట్టివారీశ్యామసుందరి మోహనమంత్రమున కొకవేళ ముగ్ధులే యైనను నట్టివారిని కేవలము వర్ణజ్ఞానశూన్యులని మాత్రము మేమనఁజాలము.

మేమిన్నివిధముల వర్ణించి చెప్పుట యెవ్వరికైన విసుఁగుగఁ దోచి నచో నామె యథారూపజ్ఞానము సిద్ధించుటకై యొకసారి తమమనము

నందు నవనవసహకారపల్లవములపై గునిసియాడుచున్న యెలదేటి
మొత్తముల ననుకరించు నాసముజ్జ్వలశ్యామసుందరలలాటస్థలంబునఁ
దూగాడుముంగురులను దలఁపునకుఁ దెచ్చుకొనుఁడు. మఱియు నాసప్త
మీచంద్రమండలమును బురుడించునళికతలము నలమికొనియున్న
యలకదామమును సంస్కృశించుచూ ననంగకార్ముకసదృశములై
సొగసుగులుకు కనుబొమల నొకసారి భావింపుఁడు! వానికి మధ్య
వర్తిత్వముఁ గాంచి, చిగురులవలెఁ, బగడములలీలఁ గెంపువన్నెలఁ
దులకించుచుండు చిన్ని పెదవులను మనసునహత్తించుకొనుఁడు! అట్లు
గావింపఁగలిగినచో నపరిచితురాలగు నారమణీమణి వదనమండల
మెంతరమణీయమైనదో, యాసుందరి యెంతటియందకత్తెయుండునో
మీరు సులభముగా ననుభవమునకుఁ దెచ్చుకొనఁగలరు. ఆకాంత కను
దోయి యంతవిశాలమైనది కాదుగానిఁ యతిమనోజ్ఞమై, సుందరరేఖా
సంకలితములగు పక్ష్మలపల్లవములతో ముద్దులొలుకుచుండును. ఆనేత్ర
ములయందలి కటాక్షములు స్థిరములయ్యును మర్మభేదకములై
యుండును. ఆచూపులొకసారి మీవంకఁ బ్రసరించినచో నప్పుడీసుందరి
మనహృదయమునుగూడ భేదించి పరీక్షించుచున్నదే యని మీకా
క్షణమునందే యనుభవమునకుఁ దోఁచును. అట్లు వీక్షించుచుండఁగనే
హృదయవిదారకంబులగు నాదృష్టులు భావాంతరములం గాంచు
చుండును. అనయనకమలములు స్నేహమయములై ప్రేమరసపరిప్లుత
ములై యలరారుచుండును. ఒకప్పుడాచూపులు సుఖావేశముచేఁ
గలిగిన పారవశ్యమును ప్రకాశింపఁజేయుచు నీయరమోడ్పుగన్నులు
కుసుమశరుని స్వప్నశయ్యలా యనుభావమును బుట్టించుచుండును.
మఱియొకప్పుడాకటాక్షములు ప్రణయలాలసత్వముచే విస్ఫారితములై
యానందరసతరంగితములై యుండును. అంతలోనే యావీక్షణములు
భావాంతరముం గాంచి విలోలములును, దరళములును, నిశితములును,

గ్రూరములునై నీలమేఘుమధ్యమునందలి విద్యున్మాలికలవలె దులకించు చుండును. ఆసౌందర్యమూర్తి యాననచంద్రకాంతియం దనిర్వచనీయములగు రెండు విశిష్టలక్షణములుఁ గానవచ్చుచుండును. ఒకటి సర్వజ్ఞతాసూచకమగు నసాధారణ మేధాకాశలము — రెండవది యద్వితీయమగు నాత్మగౌరవము! అందుచేతనే యామోహినీమూర్తి యెయ్యారముగ మరాళగ్రీవయై యెట్టయెదుట సాక్షాత్కరించినప్పుడీసుందరి రమణీకులమునకు రాజ్ఞీమణియే యనుభావ మెల్లవారికిని సహజముగా ననుభూత మగుచుండును.

ఆసుందరిశిరోమణి వయసిరువదియేడు వత్సరములకు మించినది గాదు — భాద్రపదమాసమునఁ బరిపూర్ణముగ నిండిప్రవహించునది! వర్షాసమయవాహినీజలమువలె నామెరూపరాశి నిండి తొలుకాడుచుండును; పొంగిపొరలుచుండును! ఆమె సర్వశరీరమును, సకలాంగకములును సంపూర్ణయౌవనవికాసముచే నిత్యము నించుకచంచలత్వమును ప్రబదర్శించుచునేయుండును. ఎట్టి పవనసంచాలనమును లేకుండ శరత్కాలమునందుఁ జేతినినది యెట్లు చలించుచుండునో యట్టిసంచలనము! ఆచాంచల్యము మాటిమాటికిని నూతనగతుల నలరారుచు నామె సౌందర్యతేజోవికాసమునకు హేతుభూతమగుచుండును. ఆమె మనోహరతను కాంతికంచెను, తరళనయనకటాక్షములకంచెను, వేయేలు-అన్నిటికంచెను, నామె సంపూర్ణసౌందర్యసాక్షాత్కారము జగన్మోహనకరమైనది. నవకుమారుఁడు రెప్పవాల్పనికనుదోయితో నాశిల్ప నూతనసౌందర్యశోభావికాసమును దనివిదీరక కనుగొనుచుండెను.

అట్లు వెట్టివై వీక్షించుచున్న నవకుమారుం గాంచి యాసుందరి మధురస్వరముతో "మీరేమిచూచుచున్నారు! నాచక్కదనమునా!" అని ప్రశ్నించెను.

నవకుమారుఁడు మరియాదగల పెద్దమనుష్యుఁడు. ఆమాట. విన్నం తనే తెల్లపోయి తలవంచుకొనెను. మారుమాట చెప్పజాలకఁ యట్లూర కున్న యానవకుమారునింగాంచి యాయువతి మందహాసము చేయుచు "మీరిదివఱకెప్పుడు నాఁడువారిని దర్శింపలేదా? కాక నేనెంతయో యందకత్తెనని భావించి నన్నిట్లు చూచుచున్నారా?" అని పరిహాస ముగాఁ బలికెను.

స్వాభావికముగనే యామె యట్లు మాటాడినను నదితిరస్కారముగా నగపడుచుండెను. కాని యామె నవ్వుచు నట్లు ప్రశ్నించుటచేత నవకుమారునకుఁ బరిహాసముగనే తోఁచెను. దానినిబట్టి నవకుమారుఁ డీమె చతురభాషిణి యగునెఱజాణ యని గ్రహించెను.

ఆమెకు సరియగు సమాధానము చెప్పకుండుట లోకువ యనితలంచి యాతఁడు "నేను చాలమంది యువతులను గాంచియుంటిని. కాని యిటువంటి సుందరినిమాత్రము చూచియుండలేదు" అనెను.

ఆరమణి మిగుల గర్వముతో "నావంటి యందకత్తె నొక్కతెను గూడ మీరు చూడలేదా?" అని మరలఁ బ్రశ్నించెను.

అంతలో నవకుమారునకుఁ గపాలకుండల సౌందర్యము తలఁపునకు వచ్చెను. అందుచే నాతఁడును సగర్వముగా "ఒక్కతెనై నను నీవంటి చక్కనిదానిని జూడలేదని చెప్పఁజాలను!" అని యుత్తరమిచ్చెను.

సుంద — ఆలాగా? అట్లయినచో నొకదానిని జూచియుందురు! ఆమె యెవ్వరు? మీగృహిణియా?

నవ — అంతయందకత్తె నాగృహిణియే యైయుండు నని నీవెట్లూహించి యడిగితివి?

సుంద — బంగాళాదేశస్థులందఱును దమభార్యలే యితరయువతులందఱికంటెను సౌందర్యవతు లని యనుకొనుచుందురు.

నవ — నేను బంగాళావాఁడను. నీవును వంగదేశకాంతవలెనే మాట లాడుచున్నావు. కాని నీవే దేశస్థురాలవు?

అప్పుడా సుందరి తనదుస్తులవంక దృష్టిని బరగించి "ఈనిర్భాగ్యు రాలు బంగాళాకాంతగాదు. పశ్చిమదేశస్థురాలు! ముసల్మాను యువతి!" అనెను.

నవకుమారుఁడు బాగుగఁ బరిశీలించి చూచెను. ఆమె తొడిగిన యుడుపులు పశ్చిమదేశీయములే—మహమ్మదీయకాంతల దుస్తులవలెనే యుండెను. కాని భాషమాత్రము బంగాళాదేశమునందుఁ బుట్టినవారినే పోలియుండెను.

కొంతసేపై నతరువాత నాయువతి "మహాశయా! సంభాషణవశం బున నేను నాపరిచయమును దెలిపికొంటిని; మీరుకూడ మీపరి చయము నెఱింగించి నన్నుఁ గృతార్థురాలిగా జేయఁగోరెదను. ఆయద్వితీయరూపలావణ్యవతి యగు మీయిల్లా లుండు గృహా మేగ్రామమునందుండెనో సెలవిండు!" అని కోరెను.

నవ — మానివాసము సప్తగ్రామమునందు.

ఆమాటవిని విదేశిని యగునక్కాంత యెట్టిమారుమాటయు నన లేదు. ఆకస్మికముగా నామె యవనతవదనయై వెలుఁగుచున్న దీపము నెగసన ద్రోయుచుండెను.

అట్లొకక్షణమువఱకు మౌనముతో నుండి యామె వంచినతల యెత్తకుండగనే "అయ్యా! ఈదాసి నామధేయము మతి — మహా శయుని నామమేమో యాకర్ణింపఁగోరుచున్నాను!" అనెను.

నవ — నవకుమారశర్మ.

ఎగయుచున్నదీపము చటాలున దిగఁబడి యారిపోయెను.

మూడవ ప్రకరణము

సుందరీసందర్శనము

" దేవి నీలోక మోహనదివ్యమూర్తిఁ
దాలిచిఁ యనుగ్రహింపు నీదర్శనంబు :
ఆజ్ఞయిమ్ము ! నేనే సీవరాంగకముల
లలితమణిభూషణముల నలంకరింతు "

— మేఘనాదవధ (తెలుగుసేత)

నవకుమారుఁడు సత్రాధికారిని బిలిచి దీపము వెలిఁగించి తీసికొని రమ్మని చెప్పెను. ఆతఁడు మఱియొకదీపమును దెచ్చులోపలనే నవకుమారున కొకనిట్టూర్పువిడిచినశబ్దము వినవచ్చెను. దీపము వచ్చిన యొకనిమిషములోపలనే సేవకవేషధారి యగు నొకమహమ్మదీయుఁడచ్చటికే తెంచెను. ఆతనింగాంచి యాయువతి " ఏమి జరగినది. నీవింత యాలస్యముగా వచ్చుటకుఁ గారణమేమి ? తక్కినవారందఱు నెచ్చటనున్నారు ? " అని ప్రశ్నించెను.

సేవ — మజిలీమార్చుటకు వేఱుగాఁ దీసికొనివచ్చుచున్న బోయలందఱును దాగి మత్తెక్కి యెవరికిఁ దోఁచినట్లువారు పోవఁదొడంగిరి. వారినందఱిని గూడఁగట్టుకొని రావలసివచ్చుటచే మేము మీపల్లకికి వెనుకఁబడిపోయితిమి. తరువాత మేము వచ్చిచూచునప్పటికిఁ ద్రోవలో శిబికభగ్నమై పడియుండెను. అచ్చటమీరుకూడ నగపడక పోవుటచే మేమందఱమును దల్లడిల్లిపోయితిమి. ఆచుట్టుప్రక్కల మన బోయలొకరిద్దఱగపడినారు. కొందఱు నలువంకలకును బోయి మిమ్ము వెదకుచున్నారు. నేనునట్లే మీజాడనరయుచు నిచ్చటికి వచ్చితిని. ఇప్పటికి నాగుండె కుదుటఁ బడినది.

మతి — సరే. నీవు పోయి వారి నందఱిని వెంటఁబెట్టుకొని రమ్ము. సేవకుఁడుసలాము చేసి వెడలిపోయెను. మతి కొంతసేపటివఱకును మౌనముతోఁ గరతలకపోలయై యాలోచించుచుఁ గూర్చుండి యుండెను.

నవకుమారుఁడు 'నేను పోయివచ్చెద' నని సెలవడిగెను. అప్పుడు మతి స్వప్నోత్థితవలె నులికిపడి లేచి మునుపటివలెనే "మీరిప్పుడెచ్చట నివసించి యున్నారు?" అని ప్రశ్నించెను.

నవ —. ఈయింటికిఁ బ్రక్కనున్న గదిలోనే.

మతి — ఆలాగా? ఆయింటియొద్ద నొకపల్లకి యగపడినదే, మీరు మీతోఁగూడ నెవ్వరినైనఁ దీసికొని వచ్చితిరా?

నవ — ఔను! నాభార్యను వెంటఁబెట్టుకొని వచ్చితిని.

మతిబీబీకిప్పుడు పరిహాసభాషణముల కవకాశము లభించెను. అప్పుడామె నవ్వుచు "ఆమెయేనా యద్వితీయ సౌందర్యవతి?" అని ప్రశ్నించెను.

నవ — ఆసంగతి నేనెట్లు చెప్పుదును. పరీక్షించి చూచినచో మీకే తెలియఁగలదు.

మతి — చూచుట కవకాశమున్నదా?

నవకుమారుఁడు కొంచెముసే పాలోచించి "అందువలన నష్టమేమున్నది? చూడవచ్చును!" అని చెప్పెను.

మతి — సంతోషము. నాది యొకమనవి యున్నది. మీరు దానిని జెల్లింపవలయును. అంతటిచక్కనియువతిని దర్శింపవలయు ననినేను చాలఁగుతూహలపడుచున్నాను. నావిన్నపముసంగతి తరువాతఁ జెప్పెదను. ఇప్పుడు గాదు. ఇప్పటికి మీరు దయచేయవచ్చును. కొలఁది సేపటిలోనే మరల నేను మీకుఁ గబురుపంపెదను.

ఆమాట విని నవకుమారుఁ డటనుండి వెడలిపోయెను. ఆతఁడుచనిన నిమిషములోపలనే చాలమంది జనులును, సేవకులును, బరిచారికలును, పెట్టెలు మొదలగుసామగ్రితో నచ్చటికిఁ జేరుకొనిరి. వారితోనొకపల్లకి కూడ వచ్చియుండెను. ఆపల్లకి నధికోహించి యొకదాసియునే తెంచెను. అనంతరము మతిబీబీ నవకుమారునకు రమ్మని వర్తమాన మంపించెను.

"నామాట జ్ఞప్తి యందున్నది. మఱచిపోలేదు!" అని భావించు కొని నవకుమారుఁడు మతిబీబీచెంతకు మరల విచ్చేసెను. చూడఁగా నామె యిప్పుడు మఱియొక క్రొత్తవేషమును దాల్చి యుండెను. మతి బీబీ యిప్పుడు పూర్వపుదుస్తుల నన్నింటిని బరిత్యజించి కాంచనరత్న శోభితములును, జిత్రవిచిత్రములు నగువేషభూషణములను ధరించి యుండెను. ఇంతవఱకును నిరలంకృతమైయున్న యామెశరీరమంతయు నిప్పుడు వివిధాలంకారభూషితమై యుండెను. ఎచ్చట నేభూషణములు తగియుండునో యచ్చట నవియన్నియు ధరించి యుండెను — కుటిల కుంతలములయందు, కబరీభరమునందు, కపాలమునందు, విశాలనయన పార్శ్వములందు, కర్ణయుగళమునందు, గళప్రదేశమునందు, వక్షో భాగమునందు, బాహుయుగ్మమునందు, సర్వాంగకములయందును వసుర్ణస్థగితములగు నమూల్యరత్న కాంతులు మిలమిల మెఱయుచుండెను.

వానింగాంచినంతనే నవకుమారునికన్నులు చెదరిపోయెను. అసంఖ్య తారకామాలికలచే నలంకరింపఁబడిన యాకాశమండలముంబోలి మనో హరమును, నీషచ్చాయతము నగు నాసుందరి విగ్రహ మలంకార బాహు ళ్యముచే నెంతయో రమణీయమై యామోహనమూర్తికి మఱింత మధుర తేజమును వర్ధిల్లఁజేయుచుండెను.

అప్పుడు మతిబీబీ నవకుమారునిం గాంచి "మహాశయా! రండు! నేనిప్పుడు మీ వెంటనే వచ్చి మీపత్నీరత్నమునకుఁ బరిచితురాలనై వచ్చెదను" అని పిలిచెను.

నవ – ఆమెను దర్శించుటకు మీరింతగా శ్రమపడి యలంకరించు కొనిబయలు దేఱనక్కరలేదు. మాకుటుంబమునం దెవ్వరికినిగూడ నిట్టి యలంకారములు లేవు.

మతి – నగలు లేవుగనుకనే మీయిల్లాలికిఁ జూపింపవలయునని నేసీ భూషణముల నన్నిటిని ధరించితిని. స్త్రీజాతికి ముఖ్యముగా నగలే వాంఛనీయములు. అవి లేకున్నచో నెంతమాత్రమును వారు బ్రదుకఁ జాలరు. రండు. పోవుదము.

నవకుమారుఁ డప్పుడు మతిబీబీని వెంటఁబెట్టుకొని బయలు దేఱెను. ఇంతకుముం దామెపరివారముతోఁ బల్లకి నెక్కి యొకదాసి వచ్చిన దని చెప్పియుంటిమే – ఆదాసికూడ మతిబీబీతో బయలు దేఱెను. ఆదాసి పేరు పేష్మను.

ఆమువ్వురు నట్లు పోయి చూచునప్పటికి కపాలకుండల తానున్న గదిలో నొకచోటఁ జెమ్మనేలపైఁ గూర్చుండి యుండెను. ఆగదియం దొకసన్ని చముకుదీపము మసకమసకగా వెలుఁగుచుండెను – కాని కపాలకుండల వెన్ను నఁజీరాడుచున్న కుంతలదామమునకు వెనుక నంతయు నంధకారముగనే యుండెను. మతిబీబీ కపాలకుండలను దర్శించినప్రప్రథ మమునందామె మధురాధరమునందును, దరళనయనాంచలములయందు నించుక చిఱునవ్వు వెడనవ్వువలెఁ గానవచ్చెను – ఇంకను బాగుగ వీక్షింపవలయునను సంకల్పముతో మతిబీబీ యాదీపమును జేతఁబట్టు కొని కపాలకుండల వదనమండలము చెంతకుఁ దీసికొనివచ్చెను. అప్పుడు మతిబీబీ హాసమునందలి విలక్షణభావము దూరీభూతమైపోయెను. ఆమె వదనము గంభీరభావముం దాల్చెను – అనిమేషనయనములతో నామె యట్లు వీక్షింపఁదొడంగెను. ఎవ్వరు నెట్టిమాటయు నాడుట లేదు ; – మతిబీబీ కేవలముముగ్ధురాలై పోయెను – కపాలకుండల యించుక విస్మిత యయ్యెను.

అట్లుకొంత సేపై నతరువాత మతిబీబీ తనయొడలినుండి యలంకార ముల నొక్కటొక్కటిగాఁ దీసివై చుటకారంభించెను. ఆమె యట్లు తొలఁగించిననగల నొక్కొక్కటిగఁ దీసి కపాలకుండల కోమలాంగక ముల నలంకరించుచుండెను. కపాలకుండల యేమియు మాటాడలేదు.

అది చూచి నవకుమారుఁడు "అదియేమి యట్లు చేయుచున్నారు?" అని వారించెను. కాని మతిబీబీ యామాట వినిపించుకొనక తనపనిని నిర్వర్తించుచుండెను.

అట్లలంకారములన్నియును దీసి వానితోఁ గపాలకుండల సర్వాంగక ములను భూషించుటసమాప్తమైనంతనే మతిబీబీ నవకుమారు నుద్దేశించి "మహాశయా! మీరు సత్యమునే చెప్పియుంటిరి. ఇటువంటి పువ్వు రాజ మందిరోద్యానమునందుఁగూడఁ బుష్పించి యుండదు. రాజాంతఃపురము నందుఁగూడ నేనింతటి యద్వితీయసౌందర్యవతిని గాంచఁజాలకున్నందుకు విచారపడుచున్నాను. ఇటువంటి కాంచనమయరత్న భూషణములీమె చక్కనియంగకములకే యర్హములై యున్నవి — అందుచేతనే నేనీనగల నీమెకుఁ దొడిగితిని. అప్పుడప్పుడు మీరుగూడ నీనగలతో నీమె నలంకరించుచు వాచాలయగు నీవిదేశస్థురాలిని జ్ఞప్తికిఁ దెచ్చుకొను చుండుఁడు! మఱచిపోవలదు!" అని వేఁడుకొనెను.

ఆమాట విని నవకుమారుఁడు చమత్కృతుఁడై "అదేమి యట్లు చెప్పుచున్నావు! ఈనగలేమి సాధారణమూల్యములా? ఇట్టియమూల్య భూషణముల నన్నిటిని నేను దీసికొనుట యెట్లు? ఎందుకు మీరీయ వలయును? మేమెందుకుఁ దీసికొనవలెను?" అని నిషేధించెను.

మతి — దేవునిదయవలన నాకింకను నిట్టియలంకారము లెన్నియో యున్నవి. వీనిని మీకిచ్చి నేను నిరలంకృతనై యుండనక్కఱలేదు. ఈమె నీవిధముగా నగలతో నలంకరించుట నాకెంతయో యానం

దముగా నున్నది. ఇట్టి నాసుఖానుభవమునకు మీ రెంతమాత్రము నంతరాయమును గల్పింపవలదు.

ఇట్లు ప్రార్థించి మతిబీబీ యాతనియనుగ్రహముంగాంచి నవ కుమారునికడ సెలవు గైకొని తనదాసితోఁగూడ నటనుండి బయలు దేఱెను. ఆమె వెలుపలికి వచ్చినతరువాత దాసియగు పేష్మను మతి బీబీని గాంచి "బీబీజాన్! ఆయువతి యెవ్వరు?" అని ప్రశ్నించెను.

ఆప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగా యవనయువతియగు మతిబీబీ మృదు స్వరముతో "నాసోదరి!" అనెను.

నాలుగవ ప్రకరణము

ప్రయాణసమయము

సరిగలంటులుఁదీఁగలు చౌకటులును
మురుగులుంగరములు మేలిముంగరలును
బన్నసరములుగడియాలుపట్టెడలును
రవలబేరులు, సోబీలు, రాగిడీలు
నాణిముత్యాలపేరు లొడ్డాణములును
సందిదండలుజుమికీలుసరిపెణలును
బోటి! వేయేలనీకొక్కభూషయైన
నుంచికొనకుండ వేవేగ మొలిచియిమ్ము!

— మేఘనాదవధ (తెలుఁగు సేత)

బహుమూల్యములగు నయ్యలంకారములగతి యేమయ్యెనో చెప్పె దము వినుఁడు! ఆనగలను దాచియుంచుకొనుటకై మతిబీబీ యొక దంతపుబరణిని, వెండినగిషీచేయఁబడినదానిని నవకుమారునికిఁ బంపిం చెను. దారిదొంగ లామొయొద్దనున్నవస్తువుల నన్నిటిని దొంగిలించు

కొనిపోయియుండలేదు. వారికెదుట నగపడినవానినిమాత్రమే యెత్తు కొనిపోయిరి. నగలనుగాని, నగలపేటికను గాని వారుచూడనేలేదు.

నవకుమారుఁ డొకటిరెండలంకారములనుమాత్రము కపాలకుండల యొడలిపైనుంచి తక్కినవాని నన్నిటినిగూడ నాదంతపేటికలోనుంచి పదిలపఱిచెను. తెల్లవారినంతనే మతిబీబీ తనపరిజనముతోఁగూడ వర్ధమాననగరాభిముఖియై వెడలిపోయెను. నవకుమారుఁడును గృహిణితో గూడ సప్తగ్రామమునకుఁ బోవుటకుఁ బ్రయాణ మయ్యెను.

అప్పుడు నవకుమారుఁడు కపాలకుండలను బల్లకియందుఁ గూర్చుండఁ జేసి యామెయొద్దనే యానగలపేటికనుగూడ నుంచెను. శిబికావాహకులెప్పటివలె నవకుమారునికంటెముందుగనే పల్లకి మోచికొనుచుఁ బోవుచుండిరి. కపాలకుండల పల్లకితలుపులను దెఱచుకొని యిరుదెసలను జూచుకొనుచుఁ బోవుచుండెను.

అప్పుడొకబిచ్చగాఁడామెను గాంచి భిక్షము నడిగికొనుచు నాశిబికను వెంటనంటి వచ్చుచుండెను. కపాలకుండల యాతనింజూచి "నాయొద్ద ధనమేమియును లేదు. నీకేమి యీయఁగలను?" అనెను.

భిక్షుకుఁడామెయొద్దనుండినయలంకారములపై దృష్టిని ప్రసరించుచు "ఏమమ్మా! ఇంతటివిలువగలనగలను దాల్చియున్న నీయొద్ద నేమియును లేకపోవుట యేమి?" అనెను.

కపా — ఈనగలను నీకిచ్చినచో నీవు సంతోషించెదవా?

భిక్షుకుఁడామాటవిని నివ్వెఱపడిపోయెను. అప్పుడాతని యాశకుఁ బరిమితియే లేకుండెను. ఆతఁడించుకసేపు మాటాడఁజాలకయుండెను. రము మెల్లగా "అటువంటిభూషణములు మావంటివారి కెట్లు వచ్చునమ్మా!" అనెను.

కపాలకుండల నిష్కపటహృదయముతో బల్లకియందున్న దంతపు బరణితోఁగూడ నగల నన్నిటి నాభిక్షుకునకిచ్చివేసెను. అంతేకాక

V.R. NARLA MEMORIAL
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

మిగిలిన తనయొడలిమీాదినగలనుగూాడఁ దీసి యాతనిచేతిలోఁ బడ వై చెను.

భిక్షుకుఁ డొకనిమిషమువఱకును భయసంశయములచే విహ్వలహృద యుఁడై పోయెను. — ఆభావమాతని కొకక్షణమాత్రమే యధైర్యమును దోపించెను. కాని తరువాత నాతఁ డటునిటు వీక్షించి చటాలున వెను దిరిగి దీర్ఘ శ్వాసములు విడుచుచు ద్రుతపదవిక్షేపముతోఁ బలాయితుఁడై పోవుచుండెను. కపాలకుండల యాతనింగాంచి "ఈభిక్షుకుఁ డిట్లు పాఱిపోవుచున్నాఁడేమి?" అని తనలోఁ దాననుకొనెను.

ఐదవ ప్రకరణము

స్వదేశము

"శబ్దాఖ్యేయం యదపికిల తేయః సఖీనాం పురస్తాత్
కర్ణేలోలఃకథయితుమభూదాన స్పర్శలోభాత్"

— మేఘసందేశము

కపాలకుండలనువెంటఁబెట్టుకొని నవకుమారుఁడు స్వదేశాభిముఖుఁడై పోయి స్వగ్రామమును జేరుకొని యాత్మమందిరమునఁ బ్రవేశించెను. నవకుమారునకు జనకుఁడులేఁడు. విధవ యగుజననిమాత్రమే మందిరము నందుండెను. ఇంకను నాతని కిరువురు భగినులున్నారు. అందుఁ బెద్ద సహోదరి విధవయై యుండెను. ఈనవలాపాతకుల కామెపరిచయ మెఱిఁగింపవలసిన యావశ్యక మేమియును లేదు. ఇఁక రెండవసోదరి — ఆమెపేరు శ్యామసుందరి. ఆమె సధవయే యైయుండినను విధవవలెనే యుండెను. ఏమనిన — ఆమెను బెండ్లియాడినయాతఁడు కులీన బ్రాహ్మ ణుఁడు. కులీనులకు బహువివాహము లాచారప్రసిద్ధములుగదా! ఏయొకరిద్దఱోతప్ప తక్కినయాతనిగృహిణులందఱును దరచుగాఁ బుట్టి సిండ్లయండే యుందురు. నవకుమారునిసోదరి శ్యామసుందరికూడ

న ట్లే యుండెను. ఒకటిరెండుసారులుమా(తము మాపాఠకులకామె పరి చయము గలిగింపవలసి యుండును.

ఇంటివారందఱు నెన్ని యోయలజడులు, దుఃఖములు, నిరాశలుపడి సరిపెట్టుకొన్నతరువాత నవకుమారుఁడు సుఖముగా నింటికి వచ్చెను. ఆసంతోషములోఁ గుటుంబమంతయు నిమగ్నమైపోయెను. అందుచేత నాతఁ డజ్ఞాతకులశీలవతియగుక పాలకుండలను బెండ్లియాడి వెంటఁబెట్టు కొని వచ్చినందు కెట్టియభ్యంతరమును గలిగింపక యందఱు నెంతగా నానందించిరో స్పష్టముగా మేము (వాసి (ప్రకటింపఁజాలము. ఆవిష యమునం దెవ్వరికినిగూడ నెట్టిమనఃక్లేశమును గలుగలేదు. ఈశ్వరాను (గహమువలన నాతఁడు మరల నిల్లు చేరుకొనఁగలుగుటయే వారికి మహాభాగ్యముగా నుండెను.

నవకుమారునితోఁ గలసి తీర్థయా(త్రకుఁ బోయి వచ్చిన యూరివా రందఱును నవకుమారుని మహారణ్యములోఁ బెద్దపులి యెత్తికొనిపోయిన దని స్పష్టముగాఁ జెప్పివై చిరి. ఆసత్యవాదులందఱునుదామట్లు విశ్వ సించుటచేతనే యావిధముగాఁ జెప్పియుందురని మాపాఠకు లూహించి యుండవచ్చును. కాని యట్లే పాఠకు లంగీకరించినచో వారికల్పనా సామర్థ్యము నించుక యవమానింపవలసియుండును.

అట్లు తిరిగిస్వ(గామున కేతెంచినయా(త్రికులలోఁ గొందఱు నవ కుమారుఁడు వ్యా(ఘముఖమునఁబడియుండఁగా మేము కన్నులారఁ జూచితిమని నిశ్చయముగాఁ జెప్పి యుండిరి. కొందఱుకొందఱు (ప్రత్య క్షముగా జూచినట్లే యాపులి యెన్నియడుగులుండెనో, ఎంతటిపెద్ద కోరలు గలిగియుండెనో యెంతభీకరముగ నుండెనో వర్ణించి చెప్పి యుండిరి. అది యెనిమిదడుగుల నిడివిగలిగియుండెనని కొందఱును, కాదుపం(డ్రెండడుగులుండు నని కొందఱును బంతములాడుచు భిన్నాభి (ప్రాయములను (బకటించి యుండిరి. నవకుమారునితోసంభాషణము

వలనఁ బాఠకులకు సుపరిచితుఁడై యున్న యావృద్ధయాత్రికుఁడు "అమ్మ యో! వీరెట్లు చెప్పిననేమి? ఎట్లోమాప్రాణములను దక్కించుకొని వచ్చితిమి. అప్పు డాక్రూరవ్యాఘ్రము భీకరాకారముతో మమ్మందఱి నెదురుకొని యడ్డగించినది! అఱచేతఁ బ్రాణములుంచుకొని యెల్లర మును దోఁచినత్రోవను బట్టి పాఱిపోయితిమి. పాపము నవకుమారుఁడు మాత్రము మావలె సాహసింపలేకపోయెను. అందుచేతనే పులినోటఁ బడిపోయెను" అని యూరంతటను ప్రవాదము పుట్టించెను.

ఈవార్తలన్నియును గ్రామమునందు వ్యాపించి నవకుమారుని యాత్మీయుల కందఱికిను దెలిసిపోయెను. అప్పుడు వారిముఖమునకు మేర లేకుండెను. చాలదినములవఱకు నాగ్రామమునం దీఘోరవార్తయే యెందుఁజూచినను వినవచ్చుచుండెను. ఏకపుత్రుఁడగు నవకుమారుని మరణవార్త నాకర్ణించి యాతనితల్లి దుఃఖావేశముచే మృతప్రాయురా లయ్యెను. అట్టిదుర్భరసమయమునందు నవకుమారుఁడు భార్యాసహితుఁడై స్వగృహామునకు విచ్చేసెను. అట్టి మహానందావస్థయందు "ఈనీభార్య యెవ్వరు? ఏజాతికిఁజెందినది? ఎవ్వరితనయ?" అని నవకుమారు నెవ్వరు ప్రశ్నింతురు? ఇంటివారందఱునుగూడఁ బరమాహ్లాదమున మునిఁగి యుండిరి. నవకుమారునితల్లి యెంతయో యాదరముతో నానందముతోఁ గోడలిని గౌఁగిలించుకొని యింటిలోనికిఁ దీసికొనిపోయెను.

తనజననియు నాత్మీయులునుగూడఁ గపాలకుండల నావిధముగాఁగౌరవించి గృహప్రవేశము గావించుటంగాంచి నవకుమారుఁడు పరమానంద సాగరనిమగ్నుఁడై పోయెను. ఇంటివా రెంతయనాదరింతురో, యేవిధముగా నిషేధింతురో యనుసంశయముతో నవకుమారుఁ డింతవఱకును గపాలకుండలనుబెడ్లియాడియు నామెతో నెట్టిప్రణయసంభాషణము గాని, ప్రేమప్రకటనమును గాని గావించి యుండలేదు;— అయినను

నాతని హృదయాంతరాళమునందుఁ గపాలకుండల మనోమోహన మూర్తియే సంపూర్ణముగ నిండి విరాజిల్లుచుండెను. అయినను నాతఁ డిట్టిసంశయముచేతనే మొట్టమొదటఁ గపాలకుండలవివాహప్రస్తావము వచ్చినప్పుడు తత్క్షణమునందే తనయంగీకారమును ప్రకటింపఁజాలక పోయెను. ఈసందేహముచేతనే యాతఁ డామెను వివాహము చేసికొని యును స్వమందిరమునకుఁ జేరుకొనువఱకు నొక్కసారియైనను గపాల కుండల నుద్దేశించి ప్రణయాలాపములను గావించి యుండలేదు. ఆతని హృదయమునందుఁ బొంగిపొరలుచున్న యనురాగసాగరమునుండి యొకయల్పవీచికనైనను వెలువడనీయలేదు. కాని యిప్పు డాసంశ యము లన్నియును వదలిపోయినవి. కావుననే యిప్పుడు జలప్రవా హమునందలివాహినీముఖమున వేగనిరోధకముగాఁ బాషాణఫలకమును బడవైచినచో నెంతటిదుర్దాంతస్రోతోవేగము విజృంభించునో యావిధ ముగా, నట్టిమహాసముద్వేగముతో నవకుమారుని హృదయమునందలి ప్రణయజలధి యుల్లోలకల్లోలము కాఁదొడఁగెను.

ఇట్టిప్రేమరసోదయ మెల్ల వేళలందును మాటలచే వెల్లడింపఁదగినదిగా నుండదు. కాని నవకుమారుఁడు సజలనయనములతో రెప్పవాల్పకుండ నాత్మవిస్మృతుఁడై కపాలకుండల నదేపనిగఁ జూచుచున్నప్పుడును — ఎట్టియావశ్యకమును లేకుండఁగనే యేదియో యొకపనిని గల్పించుకొని యాతఁడుతఱచుగాఁ గపాలకుండల చెంతకుఁబోయినిలుచుచున్నప్పుడును- ఎట్టిప్రసంగముగాని, యెట్టిప్రయోజనముగాని లేకుండఁగనే తఱచుగ నామె యెదుటఁ బడుచున్నప్పుడును—మాటలసందర్భము నెట్లోమరలించి యాత్మీయులచే నామెప్రస్తావము నెత్తించి మాటలాడించునప్పుడును — రాత్రిందినములు నిరంతరమును గపాలకుండలసుఖాహార విహారములకుఁ దగుసదుపాయములను సంపూర్ణముగ సమకూర్చుచున్నప్పుడును— నిరం తరము నామనోహరమూర్తినే ధ్యానించుచున్నట్లన్యమనస్కుఁడై కాన

వచ్చుచున్నప్పుడును — ఆతనిహృదయమునందునిండి తొలకాడుచున్న ప్రేమరసప్రవాహము ప్రత్యక్షగోచర మగుచుండెను.

ఆయసంత్రప్రేమభావమువలన నాతనిసహజస్వభావముగూడ సంపూర్ణముగఁ బరివర్తనముం గాంచుచుండెను. ఆతనికేవిషయమునఁ జాపల్యము గలుగవలసియుండెనో యావిషయమున గాంభీర్యము జనించుచుండెను; అప్రసన్నత గలుగవలసినపట్టునఁ బ్రసన్నభావ ముదయించుచుండెను; ఆతనిహృదయము కేవలమును ప్రేమమయమై యుండుటచే నన్నిటియందును ప్రణయభావమే జనించుచుండెను; విరక్తిజనకములగు విషయములందుగూడ నంతగా విరాగము గలుగుటలేదు; మానవ మాత్రులందఱును ప్రేమపాత్రులుగనే యగపడుచుండిరి; ఈపిశ్వమంతయు సత్ప్రేమానిర్వహణముకొఱకుమాత్రమే సృష్టింపఁబడిన ట్లనుభవ మగుచుండెను; ఈప్రపంచమునం దగపడుచున్నప్రతిపదార్థమునుగూడ సౌందర్యవిశిష్టమైనదిగనే తోచుచుండెను — ఔను నిజమే — ప్రణయమే యిట్టి స్వభావముగలది: ఆప్రణయము కఠినక్రూరపదార్థములనుగూడ మధురములుగాఁ జేయఁగలదు! అసద్వస్తువును సద్వస్తువుగను, అపుణ్యుని బుణ్యాత్మునిగను, అంధకారము నాలోకమయముగను జేయఁ గలుగు సామర్థ్యమొకప్రణయమునకే యున్నది!

ఇఁక గపాలకుండల మాట యేమయ్యెను? ఇప్పుడామెభావ మేవిధముగా నున్నది? రండు పాఠకులారా! ఆమె నొకసారి దర్శించి వత్తము రండు!

ఆఱవ ప్రకరణము

అంతఃపురము

"కిమిత్యపాస్యాభరణానియావనే
ధృతంత్వయావార్ధకశోభివల్కలం
వదప్రదోషేస్ఫుటచంద్రతారకా
విభావరీయద్యరుణాయకల్పతే"

— కుమారసంభవము

పూర్వకాలమునందు సప్తగ్రామము సర్వవస్తుసమృద్ధమై, సర్వసంపద్విశిష్టమై యెట్టిమహానగరముగా నుండెడిదో యీవిషయము వంగదేశస్థులందఱికిని దెలిసిన సంగతియే — యవద్వీపము మొదలుకొని రోమకరాజ్యపర్యంతమునుగల సకలదేశములయందలి సమస్తవ్యాపారస్థులునుగూడ సప్తగ్రామమునకు వర్తకార్థమైవచ్చి యేకకాలమునందే పరస్పరమును గలిసికొనుచుండెడివారు. అప్పుడు వాణిజ్యమున కాపట్టణరాజము లోకవిఖ్యాతమైయుండెను.

కాని వంగశకము పదిపదునొకండుశతాబ్దులమధ్యమునం దాసప్తగ్రామమునకుఁ గలప్రాచీనగౌరవము కొంచెము లోపించి యుండెను. అట్లగుటకుఁ బ్రధానకారణ మేమనిన — ఆపట్టణసమీపమునుండి నిరంతరప్రవాహిత యగుచుండునదీమతల్లి క్రమక్రమముగా క్షీణవాహినియై వైశాల్యమును గోలుపోవఁదొడంగెను. అందుచేఁ బెద్దపెద్దవాణిజ్యనౌకలు నగరపర్యంతమును జేరవచ్చుటకవకాశము లేకుండెను. అప్పటినుండియు నానగరమునందు వర్తకవ్యాపారబాహుళ్యమునకు లోపమారంభమయ్యెను. వర్తకస్థానమగుపట్టణమున వాణిజ్యలోపము తటస్థించినచో సర్వగౌరవములును నశించి పోవును. అట్టియవస్థయే యిప్పుడు సప్తగ్రామమునకు సంభవించినది.

వంగశకము పదునొకండవశతాబ్దియందు క్రొత్తగా సర్వసదుపాయములచేతను హుగ్లీనది సప్తగ్రామపరిసరనదికిఁ బోటుగా నేర్పడియుండెను. ఆనదినాశ్రయించి పోర్చుగీసువారు తమ వర్తకవ్యాపారములను సాగించుచుండుటచే వారిమూలమునసప్తగ్రామసంపదయంతయుఁ గ్రమక్రమముగా నాకర్షితమైపోవుచుండెను. అయినను నొక్కసారిగా నప్పుడాసప్తగ్రామము కేవలశ్రీహీనమై పోయియుండలేదు. ఆపురమునందిప్పటికి ఫౌజుదారు మొదలగు రాజోద్యోగులు నివసించియే యుండిరి. కాని పట్టణమునందు చాలభాగము శోభావిహీనమై, తగినభవనములు లేక యొకపల్లెటూరువలెఁ బరిణమించి యున్నది.

ఆసప్తగ్రామమునకుఁజేరి యెక్కఁడు జనసమ్మర్దము లేకయుండు నొక యుపనరభాగమునందు నవకుమారుఁడు నివసించుచుండెను. ఆసమయమందు సప్తగ్రామప్రాముఖ్యము తగ్గిపోయినందువలనఁ దఱచుగానచ్చటికేదేశస్థులును వచ్చిపూఁగుట లేదు. రాజవీథులన్నియు లతాగుల్మాదులచేఁ బరిపూరితములై యుండెను.

నవకుమారుఁ డున్నయింటికి వెనుకభాగమునందే యతివిశాలమై దట్టమైన యొకయడవి దూరపర్యంతమును వ్యాపించి యుండెను. ఆయింటియెదుట నించుమించుగా నొకమైలుదూరమునం దొకచిన్న కాలువ ప్రవహించుచుండెను. ఆకాలువ యొకచిన్నసస్యక్షేత్రమును బరివేష్టించి క్రమముగా నది యాగృహపశ్చాద్భాగమునంజలి వనమధ్యమునం బ్రవేశించి ప్రవహించి పోవుచుండెను. నవకుమారునిమందిర మిటికలతో నిర్మింపఁబడినదే -- దేశకాలపరిస్థితులనుబట్టి యాలోచింపగా నాభవనము కేవలమును సాధారణగృహమాత్రమని చెప్పుట కవకాశము లేదు. అది రెండంతస్తులయిల్లే – కాని యంతభయంకరమగు నెత్తుగలది కాదు. ఈకాలమునం దొకయంతస్తుమాత్రమే యంతటి యున్నతముగా నుండు భవనము లనేకములు గానవచ్చుచున్నవి.

ఆయింటిడాబామీఁద నిలువఁబడి తరుణవయస్కులగునిరువురుయువతులు నలుదెసలను దిలకించుచుండిరి. అప్పుడే సాయంసమయ మాసన్నమగుచుండెను. అప్పు డేదిక్కున నేవస్తువుం గాంచినను కన్నులపండువునే గావించుచుండెను. సమీపమునం దొకభాగమున సాంద్రారణ్యము! ఆ విపినమధ్యమునుండి వివిధములగు ననేకవిహంగముల కలకలాలాపములుకర్ణపేయము లగుచు వినవచ్చుచుండెను. మఱియొకభాగమునఁ జూడఁగావెండితీగవలె సన్నని యొకకాలువఁ ప్రవహించి పోవుచుండెను. దూరమునకుఁ జూడఁగా నామహానగరమునందలి యనేకసౌధమాలికలు నవవసంతమలయ పవనసేవనాసక్తులగు నాగరకజనసమాజముచేఁ బరి

పూర్ణముతై శోభాయమానము లగుచుండెను. మరియొకవైపునఁ జాలదూరమునందు నౌకామాలికాలంకృత యగు భాగీరథీస్రవంతి విశాలవక్షమునందు సంధ్యాసమయాంధకారము క్షణక్షణమునకును బ్రగాఢమగుచుఁ జూపుల కంతరాయమును గల్పించుచుండెను.

ఆప్రాసాదోపరిభాగమునందు నిలువఁబడి నలుదెసలను వీక్షించుచున్న యువతులలో నొకతరుణి విమలకౌముదీసమప్రభ - ఆమె యవిన్యస్త కుంతలదామమధ్యమునం దాతనూవల్లి సగమువఱకు నావృతమై యుండెను. ఇఁక రెండవవరమణి శ్యామాంగి; ఆమెవదనమండలము సుప్రసన్నమైవికచకమలకుసుమశోభననుకరించుచుండెను. ఆబాలిక పదునాఱేండ్ల పడుచు! ఆమెతనూవల్లి సన్ననిది; చిన్ని మొగము; ఆననోపరిభాగమంతయుఁ గుటిలములు, నాకుంచితములు నగు నీలంపుముంగురులచే నావరింపఁబడియుండెను; నీలోత్పలదళములు వికచేందీవరమధ్యమునందు ప్రవాలితూలుచున్నట్లు-ఆయువతికన్నులు విస్ఫారితములై కోమల శ్వేతకాంతులతో బేడిసమొలతోఁ దులతూగుచుండెను. ఆమె కోమల కరాంగుళులు తనతోఁ గవగూడి నిలిచియున్న యువతీమణి చికురతరంగ మధ్యమునందు సవిలాసముగ నటించుచుండెను. అట్లు చంద్రచంద్రికా సమానవర్ణయైయున్న సుందరి మన కపాలకుండలనియు, నామెతోఁగలసి కృష్ణాంగియగుకాంత యామె యాఁడుపడుచగు శ్యామసుందరి యనియు మాపాఠకులు తెలిసికొందురుగాత!

ఆశ్యామసుందరి తనయన్న భార్య యగు కపాలకుండల నొకప్పుడు "వదినె!" అనియు, మఱియొకప్పుడు "అడవీ!" అనియు, నొక్కొకప్పుడు "మృణ్మో!" అనియు సంబోధించుచుండును. కపాలకుండల యనుపేరు వికటమై బాగుగ లేదని యెంచి యాయింటివారందఱు నామెకు "మృణ్మయి" అని పేరుపెట్టి యట్లే పిలుచుచుండిరి. అందుచేతనే శ్యామసుందరి యామెను "మృణ్మో!" అని పిలుచుటకుఁ గార

ణము! ఇఁక మేముఁగూడ నప్పుడప్పు డామెను "మృణ్మయి" అనియే వ్యవహరించుచుందుము.

అప్పుడు శ్యామసుందరి తాను చిన్నతనమునందు జదువుకొన్న యొక గీతము నీక్రిందివిధముగాఁ బఠింపఁదొడంగెను—

కమలము ముడుంగ రేయెల్లఁగళవళించి
వేగి వికసింప నళి తూరి విభునిఁ జేరు;
వనలతాతన్వి కరపల్లవములు చాచి
కఠినకంటకశాఖలఁ గలయఁబాకు;
నేరు క్రిందికి దిగజారి సార మెడలి
నీరనిధిఁ బేరు లేకుండఁ జేరిపోవుఁ;
జలువ లొలయించి కుముదంబు లలరుచుండ
వెన్నెలలతోడ జాబిల్లి కన్ను మొయిగు;
పరిణయపువార్త తనచెవిఁ బడినయంత
బోఁటి మదిఁ గుంది శయనించుఁ బూలసెజ్జ;
నెందు కీహర్షమున శోక మెందుకొఅకు?
ఎందు కీకష్టమున సుఖమెందుకొఅకు?
ఇట్టిసుఖదుఃఖపరిణతు లెందుకొఅకు?
ఏటికీజ్వాల? విధి కిది యేటిలీల?"

ఇట్లు పాడి శ్యామ తనగీతమును ముగించి మృణ్మయింగాంచి "అడవీ! నీవింకను నిట్లే యేకాకినివై తపస్వినివలెనే యుండెదవా?" అని ప్రశ్నించెను.

మృ — ఏమి? నేనెట్టి తపస్సు చేయుచున్నాను?

శ్యామసుందరి తనరెండుచేతులతోడను జెదరివిరిసియున్న మృణ్మయి కుంతలములను గూర్చి పట్టుకొని "నీ వీశిరోరుహదామము నింకను ముచ్చటగా ముడుచుకొనఁ దలఁచుకొనలేదా?" అని హెచ్చరించెను

మృణ్మయి కేవల మొక చిఱునవ్వుమాత్రము నవ్వి శ్యామచేతులలోని తనశిరోజములను లాగికొనెను.

శ్యామసుందరి మరల "వదినే! నామాట వినుము! ఒక్క-సారి నాకోరికను దీర్పుము! గృహిణివై కాపురము చేయుచుండు నందఱు యువతులవలెనే నిన్నొక్క-సారి యలంకరించి చూచెదను. ఇంకను నెంతకాలము నీవీ యోగినీవేషమును ధాల్చియుండెదవు?" అనియెను.

మృ — ఆబ్రాహ్మణకుమారుఁ డగుమీాయన్నను నేను దర్శింప కున్నంతపర్యంతమును నిజముగా యోగినినే యైయుంటిని.

శ్యా — ఆమాట నిజమే — కాని యింతటినుండి నీవారూపముతో నుండుట యుచితము గాదు.

మృ — ఎందుచేత నుండఁగూడదు?

శ్యా — ఎందుచేతనా? చెప్పెదను వినుము! యోగమును వదలి పెట్టుము. పరుసవేది యను వస్తువుంగూర్చి నీవెప్పుడైన వినియుంటివా?

మృ — అది యేమో నాకుఁ దెలియదు.

శ్యా — పరుసవేది యనఁగా దానిస్పర్శమువలన రాగికూడ బంగార ముగాఁ మాఱిపోవును.

మృ — ఐన నేమి?

శ్యా — ఏమియా? ఆఁడువారినిఁగూడ నట్లు మార్చివేయఁగలిగిన పరుసవేది యొకటి యున్నది.

మృ — అది యెటువంటిది?

శ్యా — ఆఁడుదానికిఁ బరుసవేది పురుషుఁడే — అట్టిపురుషునిగాలి తలిగినంతమాత్రమునఁనే యెట్టియోగినియైనను నిమిషములోఁ గృహిణి యైపోవును. నీవట్టివరుసవేదిని స్పృశింపవలయును — వదినే! ఒక్క-సారి నాముచ్చటఁ దీర్పవా? —

"పరిమళత్తైలము పూయుదునా? — నెఱి
కురులకుగీల్జెడవేయుదునా?
"పాపటచేరులు చుట్టుదునా? — జడ
బంగరుకుచ్చులు గట్టుదునా?
కమ్మలుజుమికీల్ పెట్టుదునా? — మొల
గజ్జెలపటకా చుట్టుదునా?
మురుగులు చేతులఁగూరుతునా? రవ
ముంగర ముక్కుఁనఁ జేరుతునా?
సందిటిదండల నుంచుదునా? మెడ
సరిపణులను సవరించుదునా?
మణిహారంబులు వేయుదునా? నవ
మణిభూషలఁ గయిసేయుదునా?",

మృ — మంచిది. ఇప్పటికి బోధపడినది. పరుసవేదినిదాఁకి బంగార మగుట యెట్లో తెలిసినది. తలదువ్వుకొని జట వైచుకొందును. పాపట చేరులు చుట్టుకొందును. కర్ణభూషణముల నలంకరించుకొందును. మురుగులుపెట్టుకొందును. నానాభరణములు దాల్చుదును. సందిదండలు దొడుగుకొందును. బంగారుగొలుసులును మణిహారములను వైచు కొందును. సకలకనకరత్నాలంకారములచేతను నలంకరించుకొందును. బంగారుబొమ్మవలె కలకలలాడుచుంటి ననుకొనుము. కాని యంత మాత్రమున లభించుసుఖ మేమున్నది?

శ్యా — నన్నడిగెదవేమి? నీవే చెప్పుము. పూవునకుఁ బుష్పించుట సుఖము గాదా?

మృ — కుసుమము వికసించిన-చో దానిని గనుఁగొనువారికి సుఖముగా నుండునుగాని పువ్వునకేమి సుఖము?

శ్యామసుందరివదనమండలము గభీరభావముం దాల్చెను. ప్రభాత పవనవీచికలచేఁ గదలి నెఱవిచ్చిన నీలోత్పలములవలె నామెనయనములు విస్ఫారితములయ్యెను. ఆమె తరళకటాక్షములతో మృణ్మయి దిల కించుచుఁ "బువ్వున కేమిసుఖమా? అది యేమో నేను చెప్పఁజాలను. నేనెప్పుడును బువ్వునై పుట్టనూలేదు; వికసింపనూలేదు — కాని నీవలెనే మొగ్గనై యుండినచోఁ బుష్పించి సుఖపడఁగలుగుదును" అనెను.

మృణ్మయి యేమియు మాటాడలేదు.

ఆమెమౌనమునుం గాంచి శ్యామసుందరి మరల "సరే — పువ్వున కట్టిసుఖమే లేదనుకొందము — ఏమిచేసిన నీకు సుఖముగ నుండునో నీవే చెప్పుము చూతము!" అనెను.

మృణ్మయి కొంచెముసేపాలోచించి "ఏమో! నేను చెప్పఁజాలను — అసముద్రతీరమునందు — ఆయిసుకకొండలలో — ఆచిట్టడవినడుమ నిచ్చ వచ్చినట్లుగాఁ దిరుగుచున్నచో నాకించుక సుఖముగా నుండు ననుకొను చున్నాను."

శ్యామసుందరి యామాట విని యించుక నివ్వెఱపడిపోయెను. ఆమె యెంతప్రయత్నము చేసినను మృణ్మయి నొకమార్గమునకుఁ దీసి కొనిరాఁజాలకుండెను. అందువలన నామె హృదయమించుక సంక్షుభిత మగుచుండెను. ఇంతేకాదు — ఆమెకించుక కోపముకూడఁ గలుగు చుండెను. అట్టిభావముతోనే యామె "సరే — ఆవిధముగ నున్న నీకు సుఖము గలుగవచ్చును. కాని మరల నీవచ్చటికిఁ బోవుట కుపాయ మేమున్నది?" అనెను.

మృ — ఉపాయము లేదు.

శ్యా — లేదుసరిగదా! ఇట్టిస్థితిలో నీవిప్పుడు చేయుదగిన పనియేమి? ఏమైన నిశ్చయించుకొంటివా?

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
V.R.I.
Acc. No.

మృ – నన్ను బంధునప్పుడాయధికారి యేవిధముగా నియోగించెనో యావిధముగనే చేయుదును.

శ్యామసుందరి పైటచెరగుతో బెదవులు గప్పుకొని మందహాసము చేయుచు "ఆహా! భట్టాచార్యమహాశయుని యాజ్ఞయా? ఆతడేమని యుపదేశించెను?" అని ప్రశ్నించెను.

మృణ్మయి దీర్ఘశ్వాసమును విడుచుచు "పరమేశ్వరుడు నాచే నేమి చేయింపదలచెనో యదియే చేసెదను. ఆతడు నాఫాలతలమున నేమి లిఖించెనో యదియే జరుగగలదు!" అనెను.

శ్యా – ఏమి? నీనుదుట వ్రాతయం దేమిలోపమున్నది? నీకు గావలసినంతసుఖమున్నది. నీవిట్లు నిట్టూర్పులు పుచ్చుకొందుకు?

మృ – వినుము! ఏనాడు నేను నాభర్తతో బ్రయాణమైతినో యాదినమునందు నేనొక త్రిదళబిల్వగుచ్ఛమును భవానీపాదపీఠము నందు సమర్పించి యుంటిని. నేనెన్నడును జగన్మాతచరణములయందు బిల్వదళమును నివేదింపకుండ నెట్టికార్యమును జేసినదానను గాను. నేను గావింపబోవుకార్యము శుభదాయకమగునేని బిల్వపత్రము దేవి తన పాదములయందు దాల్చియే యుండును. అది యమంగళప్రదమగుకర్మ మైనయెడల దేవి యాబిల్వమును ద్యజించివైచును. అపరిచితుడగు నొకపురుషునితో నెన్నడు నెఱుంగని దేశమునకు బ్రయాణము చేయునప్పుడు నాహృదయమునం దించుకసంశయము గలిగెను. అట్లు నేను పోవుట శుభమా, యశుభమా యని తెలిసికొని నిశ్చయించు కొనుటకై నేనప్పుడు భవానీసాన్నిధ్యమునకు బోయితిని. ఆబిల్వదళము నప్పుడు లోకమాత పరిగ్రహింపలేదు – అందుచేత నానుదుట నేమి లిఖింపబడి యుండెనో యెఱుంగ జాలకున్నాను.

ఇట్లు చెప్పి మృణ్మయి మౌనమును వహించెను. శ్యామసుందరి వడవడ వడకిపోయెను.

కపాలకుండల

తృతీయఖండము

మొదటి ప్రకరణము

"కష్టోయం ఖలు భృత్యభావః"

—రత్నావళి

నవకుమారుఁడు కపాలకుండలను వెంటఁబెట్టుకొని యూపాంధశాల నుండి బయలుదేఱినసమయమునందే మతిబీబీయును సపరివారముగా వర్ధమానపురము ననుసరించి పోయెను. అమె తనగమ్యస్థానమును జేరుకొనునంతవఱకును మన మామె పూర్వవృత్తాంతముంగూర్చి కొంచెము చెప్పుకొందము!

మతిబీబీచరిత్రము మహత్తరములైన దోషములచేఁ బరమదూషితమైనది. అయినను ననితరసాధారణము లగుమహద్గుణములచేఁ బరిశోభితమైనది! ఇటువంటి విచిత్రచరిత్రము గలమతిబీబీనిగూర్చి యించుక విస్తరించి చెప్పుటవలనఁ బాఠకులు విసుఁగుకొనరని మేము విశ్వసించుచున్నాము.

ఈమతిబీబీతండ్రి గత్యంతరము లేక మహమ్మదీయమతమునవలంబింపవలసివచ్చినప్పుఁడతనికుమార్తె యగునీమె తల్లిదండ్రులతోఁగూడ దనహైందవనామమును మార్చుకొనవలసివచ్చెను. అప్పుడీమెకు "లుత్ఫున్నీసా" అనుపేరు గలిగెను. ఈమె కెప్పుడును గూడ మతిబీబీ యనుపేరు లేనేలేదు.

అయినను నీమె యప్పుడప్పుడు మాఱువేషముతో దేశవిదేశములను గూర్చి ప్రయాణములను గావించునప్పుడు మాత్రము తనసంగతి యితరులకుఁ దెలియకుండుటకై మతిబీబీ యనునామముచే వ్యవహరింపఁబడుచుఁదిరుగుచుండును.

ఈమెతండ్రి ఢాకానగరమునకుఁ బోయి యచ్చట నొకరాజోద్యో
గమునందు నియుక్తుఁడై పని చేయుచుండెను. కాని యచ్చటి కప్పు
డప్పుడాతని యూరివారును, దేశమువారు ననేకులు తఱచుగా
వచ్చుచుఁ బోవుచుండిరి. అట్లు వచ్చుచున్న వారికి మత్రభ్రష్టుఁ డైపో
యినతాను మాటిమాటికి నెదుటఁ బడుచుండుట యాతనికిఁ జిన్నతన
ముగా నుండెను.

ఆకారణముచే నాతఁడు కొన్నాళ్ళు సుబాదారు నాశ్రయించి
యాతనియనుగ్రహము సంపాదించుకొని యాతనిమిత్రులగు ఉమ్రావు
లకు జాబులు వ్రాయించి తీసికొని సపరివారముగా నటనుండి కదలి
యాగ్రానగరమునకుఁ బోయి యుండెను.

మంచిశక్తిసామర్థ్యములు గలవారును, గుణవంతులు నగువారిలో
నగ్గరుఫాదుషాకుఁ దెలియనివాఁ డొక్కఁడైనను నాతనిరాజ్యమునందు
లేఁడు. కొలఁదిదినములలోనే యాతని మంచిచెడ్డలు ఫాదుషాకు
సువిదితము లయ్యెను. అందుచే లుత్ఫున్నీసాతండ్రి యతిశీఘ్రముగ
నున్నతపదవులనుగ్రహించి క్రమముగా సార్వభౌముని ఉమ్రావులలో
గణనీయుఁడై పేరు గాంచఁగలిగెను.

లుత్ఫున్నీసా యొకయేటి కొకయేఁడు బాల్యము వదలి యౌవనా
వస్థను సమీపించుచుండెను. ఆమె యాగ్రానగరమునకు వచ్చినతరువాత
పారసీకభాషను, గీర్వాణభాషను జదివి యాసాహిత్యములయందుఁ
బ్రవీణురాలయ్యెను. మఱియు నృత్తగీతాదిలలితకళలయం దసాధారణ
కౌశలమును సంపాదించుకొనఁగలిగెను. అందుచే నామె యారాజధాని
యందున్న యనేకరూపవతులగు యువతులలోపలను, గుణవతులగుసుంద
రులలోపలను నగ్రగణ్యురాలై దేశమంతటను బ్రఖ్యాతి గాంచుచుండెను.

విద్యావిషయమున నామె యెంతయో శ్రద్ధ వహించి ఘనతను

నంపాదించినది గాని దురదృష్టవశమున నామెకు ధర్మాధర్మవివేకమును గల్పించుగురువులప్రబోధమును గ్రహించుభాగ్యమును లభియింపలేదు. క్రమముగా లుత్పఉన్నీ సాకు వయఃపూర్ణమైన సౌందర్యతేజము సర్వతోముఖముగ విరాజిల్లుచున్నదిగాని యుక్తాయుక్తపరిజ్ఞానము లేకపోవుటచే నామెమనోవృత్తులుమాత్రము దుర్దాంతములై విజృంభింపఁ దొడంగెను. ఇంద్రియసంయమనము గావించుకొనుట కామె కించుకంతయును సామర్థ్యములేకుండెను. అట్లునిగ్రహించుకొనవలెననుసద్దేశముకూడ నామెకుఁ గలుగుటలేదు. ఆమెకు మంచిచెడ్డలయందు భేదబుద్ధియే తోఁచుటలేదు. "ఇది సత్కార్యము – ఇదియసత్కార్యము" అని యామె యెన్నఁడు నేకార్యము చేయుటకును గడంగుట లేదు. ఆమె మనసున కేవి యిష్టముగనుండునో యట్టి పనుల నన్నిటినిగూడ నామె నిస్సంశయముగఁ జేసివై చుచుండెను. ఒకప్పుడు మంచిపని ప్రియముగా నున్నచో మంచిపనినే చేయుచుండెను. ఒకవేళ చెడ్డపని యామె యంతఃకరణమునకు దృష్టిగాఁ దోచినచో నది యసత్కార్యమని యామె యెంతమాత్రమును శంకింపక చేయుచునే యుండెను.

అందుచేతఁ దరుణవయస్సునం దింద్రియాలాంపట్యముచేఁ గలుగు మనోవృత్తులు దుర్దమములై కార్యరూపమునఁ బరిణమించుటవలన నెల్లవారికి నెట్టిదోషము లనేకములు గలుగుచుండునో, యట్టిదోషము లన్నియును లుత్పఉన్నీసా జీవితమునందు సంక్రమించుచుండెను.

పూర్వమామెను బెండ్లియాడినభర్త యింకను సజీవుఁడై యుండెను. ఆకారణముచేత ఉమ్రావులలో నెవ్వరునుగూడ నామెను వివాహమాడుటకు సమ్మతింపలేదు. ఆమెకుఁ గూడఁ బెండ్లి యనిన నంతగా నిష్టమును లేకుండెను. "ప్రతిప్రసవమునందును విచ్చలవిడిగ విహరించుచుండు మధుకరిని తెక్కలుగొట్టియొక్కచోటనే కూర్చుండఁబెట్టుట యేటిపని?" అని యామె తనలోఁ దాను భావించుకొనుచుండెను.

మొట్టమొదటఁ జాటుమాటుగా నామెచరిత్రముంగూర్చి ప్రజలు చెప్పుకొనఁదొడంగిరి. క్రమముగా నగర మంతట నదియొక ప్రవాద మయ్యెను. తుదకామెజీవితకళంకము గాఢాంధకారమువలె నంతట నలమికొనిపోయెను. అందుచే నామెతండ్రి యాయవమానమును సహింపఁజాలక యామెను తన గృహమునుండి బహిష్కరించివై చెను.

లుత్ఫున్నీసా యతిరహస్యముగాఁ దనయనుగ్రహమును బ్రసాదించు చున్న వారిలో నక్బరుసార్వభౌమునితనయుఁడగు యువరాజు సలీము కూడ నొకఁడై యుండెను. తమరాజ్యమునందలి యొకఉద్రమాపుకుల మునకుఁ గళంకము నాపాదించుకార్యమును గావించిన-చో నిదివఱకే తన యెడల విరక్తితోనున్న తండ్రియగు పాదుషా తీవ్రక్రోధమునకుఁ గుఱి కావలసియుండునను భయముచే యువరాజు లుత్ఫున్నీసా నింతవఱకును దనయంతఃపురమునందుమాత్రము చేర్చుకొనియుండలేదు.

కొంతకాలమున కాతని కట్టిశుభయోగముకూడఁ దటస్థించినది. ఇప్పుడు రాజపుత్రసేనానాయకుఁ డగురాజామానసింగుసహోదరి యువ రాజగుసలీమునకుఁ బ్రధానమహిషి యయ్యెను. లుత్ఫున్నీసా బహి రంగముగా నిప్పు డామెకుఁ జెలికత్తెగను, రహస్యముగా సలీమున కను గ్రహభాగినిగనునై రాజాంతఃపురమునఁ జేరుకొనఁగలిగెను.

ఇఁక లుత్ఫున్నీసావంటి విద్యావతియు, సౌందర్యవతియు, జతుర మతియు నగుయువతి యవరోధమునఁ బ్రాధాన్యము వహించి యతి సులభముగా నత్యల్పకాలమునందే రాజకుమారునిహృదయాధికారిణి యయ్యెననుటలో నాశ్చర్య మేమున్నది? లుత్ఫున్నీసా క్రమముగా యువరాజు హృదయమునం దెట్టియెదురులేనిప్రభుత్వమును సంపాదించిన దనఁగా—ఎప్పటికైనఁ దగినసమయమునందుఁ దానాతనికిఁ బట్టమహి షిని గాఁగలనని గర్వపడఁ దగినంతటి యౌన్నత్యమును గాంచి యుండెను! తప్పక తానట్లు పట్టమహిషి నయ్యెద నని లుత్ఫున్నీసా

ప్రతిజ్ఞ చేసికొనియెను. ఆమె యట్లు కేవలము ప్రతిజ్ఞ చేసికొనుటయే కాదు – అంతఃపురసుందరులందఱును గూడ నామె యెప్పటికైనఁ బట్ట మహిషి యగునని యనుమానించుచునే యుండిరి.

లుత్ఫున్నీసా యిట్టి యాశాస్వప్నములను గాంచుచుఁ దన జీవ యాత్రను గడపుకొనుచుండెను. అట్టి సమయమం దామె కాకస్మిక ముగాఁ దనసుఖస్వప్నమునకు నిద్రాభంగ మయ్యెను.

అక్బరుషాదుషాకుఁ గోశాధికారియైన ఖాజాఆయాసుని తనయ యగు మెహరున్నీసా సకలయవనయువతులయందును గల సుందరీమణులలో నగ్రగణ్యురాలై యుండెను. ఒకనాఁడు రాజకుమారుఁ డగు సలీమును, నింకను గొప్పగొప్ప ఉమ్రావులను గూడ నాకోశాధ్యక్షుఁడు తన యింటికి విందునకుఁ బిలిచెను. ఆనాఁడు దైవవశమున మెహరున్నీసా యువరాజగు జహంగీరుకన్నులఁ బడెను. ఆప్రథమదర్శన సమయమునందే యువరాజు సలీము తనచిత్తము నామెకే సమర్పించి వెడలిపోయెను.

తరువాత నేమి జరిగినదో యాసంగతు లన్నియు జరిత్రమున జదివిన మా పాఠకులకుమాత్రమే తెలిసి యుండును. షేరాఫ్ఖానను పేరుగల మహాపరాక్రమశాలియగు ఉమ్రావుతో నామెకు సంబంధ మిదివఱకే యేర్పాటుకాఁబడి యుండెను. సలీము కామాంధుఁడై యాసంబంధమును దప్పించి యామెను దనకుఁ బెండ్లిచేయవలయు ననియనేకవిధములఁ దనతండ్రియగు అక్బరుషాదుషాను ప్రార్థించెను. కాని తన తనయుని నడవడింగూర్చి విరక్తుఁడై యున్న షాదుషా యందు కంగీకరింపకుండుటయే కాక సలీమును జీవాట్లుపెట్టి మందలించెను.

ఆకారణముచేత సలీ మాప్రయత్నమును వదలుకొనవలసినవాఁడయ్యెను. అట్లు ప్రయత్నమును మానివైచెను గాని సలీ మాయాశను మాత్రము సంపూర్ణముగాఁ త్యజించుకొనలేదు. ఏమైన నేమి తుదకు షేరాఫ్ఖానే మెహరున్నీసాను బెండ్లియాడెను. కాని సలీముకోరిక

లన్నియు, ననుభవము లన్నియు, ప్రయత్నములన్నియు లుత్ఫుఉన్నీసా కు నఖదర్పణములవలె సంపూర్ణముగ నవగతములైయుండెను. ఇంకఁ బదివేలమంది తమ ప్రాణముల నర్పించి సాయపడినను షేరాఫ్ఖాను నకు రక్షణమనుమాట యుండదని యామె నిశ్చయముగా నెఱుంగును. అక్బరుషాదుషా "హరీ!" అన్నంతనే షేరాఫ్ఖాను ప్రాణములు మహావాయుసముద్రమునఁ గలసిపోక మానవనియు, మెహరున్నీసా తప్పక సలీమునకు రాజమహిషి యగు ననియు నామె సిద్ధాంతము చేసికొనెను. అందుచేత లుత్ఫుఉన్నీసా తాను పట్టమహిషియై సింహాసనము నధిరోహింపవలయు ననువాంఛను వదలుకొనెను.

మహమ్మదీయ చక్రవర్తులలో గణనీయుఁడగు నక్బరుపాదుషాకుఁ గ్రమముగా నాయుశ్శేషము కావచ్చుచుండెను. ఏప్రచండప్రభాకర తేజముచే తురికిస్థానమునుండి బ్రహ్మపుత్రానదిపర్యంతమును బ్రకాశమగుచుండెనో యట్టి సహస్రప్రభాను డస్తగామి యగుచుండెను. ఆ సమయమునందు లుత్ఫుఉన్నీసా తనప్రధానగౌరవమును గాపాడుకొనుటకై యొక మహాసాహసకృత్యము గావించుటకై సంకల్పించుకొనెను.

రాజపుత్రస్థానేశ్వరుఁడగు రాజామానసింహుని సోదరియే సలీమునకుఁ బ్రధానమహిషియై యుండెను. ఆమెకు ఖుస్రూ యనుపేరుగల కుమారుఁ డొకఁ డుండెను. ఒకనాఁడు లుత్ఫుఉన్నీసా పట్టమహిషితోఁ గలసి యక్బరుషాదుషావారి జబ్బునుగురించి సంభాషించుచుండెను. అప్పుడు లుత్ఫుఉన్నీసా బేగముంగాంచి "ఇఁక మారాజపుత్రకన్య మహారాజ్ఞి కాఁగలదు" అని యామె నభినందించెను. ఆమాటకుఁ బ్రత్యుత్తరముగా బేగము "సార్వభౌమునిపత్ని యనిపించుకొనుట యీజన్మమునకు సార్థకమే; కాని చక్రవర్తిజనని నైనప్పుడుగదా యసాధారణమగు జన్మఫలము సిద్ధించుట" అనెను.

ఆప్రత్యుత్తరమును విన్నంతమాత్రముననే లుత్ఫుఉన్నీసా కెన్నఁడు

నూహించియైననుండని యొకభావము హృదయమునం దుదితమయ్యెను. అప్పు డామె మృదుస్వరముతో "అట్లగుట కభ్యంతర మేమున్నది? అదియును నీ యిచ్ఛాధీనమే యైయుండును" అని యుగ్గడించెను.

బేగమ్ – అది యెట్లు సాధ్యమగును?

లుత్ఫు – యువరాజకుమారుఁడు ఖుస్రూ కే సింహాసనము నర్పింపుము!

బేగము మఱి యెట్టిమాటయు ననలేదు. ఇఁక నానాఁటి కాప్రసంగ మెవ్వరు నెత్తుకొనలేదు. కాని యాయిరువురిలో నెవ్వరునుగూడ నా విషయమును మఱచియుండలేదు.

తననాథునకు మాఱుగాఁ దనకుమారుఁడు సింహాసనారోహణము గావించుట బేగమున కిష్టము లేకపోలేదు. యువరా జగుసలీము మెహరున్నీస్సా యెడల నెంతయో యనురాగము కలిగియుండుట లుత్ఫున్నీసా కెంతటి హృదయశల్యముగా నుండెనో రాజ్ఞి బేగమునకుగూడ నంత కష్టముగనే యుండెను. రాజపుతానాప్రభు వగుమానసింహుని సహోదరి యొక సామాన్య మహమ్మదీయకాంత యాజ్ఞల కధీనురాలై యుండుట సహింపఁదగిన సామాన్యవిషయమా? లుత్ఫున్నీసాకుఁ గూడ ఖుస్రూను సింహాసన మెక్కించుటకు దగినసర్వ ప్రయత్నములను గావింపవలయు ననుదృఢసంకల్పము గలిగెను. మఱియొక సమయమునం దీవిషయముంగూర్చి యాయిరువురకును మరల సంభాషణము జరిగెను. అప్పుడా యిద్దఱును ప్రాణపణముగా నీఘనకార్యమును సాధింపవలయు నని నిశ్చయించుకొనిరి.

అక్బరుసింహాసనమునం దాతని పుత్రుఁడగు సలీమును ప్రతిష్ఠించుట మాని సలీము తనయుఁడగుఖుస్రూ నధిరోహింపఁజేయుట యసాధ్యమే మోయని సంశయించుట కెట్టికారణమును లేదు. అట్లు చేయుటకుఁ గలయనుకూలపరిస్థితు లన్నియును లుత్ఫున్నీసాకుఁ గాని, బేగమునకుఁగాని తెలియకపోలేదు.

అందుచేతనే లుత్ఫుఉన్నీసా బేగముం గాంచి "రాజ్ఞీమణీ! మొగలాయీ సామ్రాజ్యమంతయును రాజపుత్రయోధుల బాహుబలము మీఁదనే యాధారపడి యున్నదిగదా! అట్టి రాజపుత్రవంశముల కన్నిటికిని రాజా మానసింహుఁడు మణికిరీటమై విరాజిల్లుచుండెను. అట్టి మహాబలసంపన్నుఁడు మన ఖుస్రూప్రభువునకు మేనమామ! – ఇఁక ముసల్మాను జాతీయులందఱిలోనను మంచిపలుకుఁబడి గలిగి ప్రధాన మంత్రియై యున్న ఖాన్ఆజిము ఖుస్రూమామగారై యుండెను. ఆ యిరువురునుగలసి కృతనిశ్చయులై పనిచేయుచున్నప్పుడిఁక వారి ననుసరింపక యెదిరించి నిలుచువా రీసామ్రాజ్యమునం దెవ్వ రుందురు? రాజామానసింహు నీవిషయమునందుఁ గార్యదీక్షితుని గావించుభారము మీయందే యున్నది. ఇఁక ఖాన్ఆజిమును, తక్కిన మహమ్మదీయ ఉమ్రావులను సమావేశపఱచి వారినందఱినిగూడ నేకాభిప్రాయులుగాఁ జేసి కార్యసిద్ధిఁ గావించుటకు సర్వశక్తులను వినియోగించి నేను పాటు పడఁగలను. కాని నాకొక్క సంశయముమాత్రము బాధించుచున్నది. మన ఖుస్రూ సార్వభౌముఁడైనతరువాత నేనుగావించిన యుపకారము మాటయించుకంతయును దలంపక దుశ్చరిత్రయని నన్ను రాజధానినుండి బహిష్కృతురాలిగాఁ జేయునేమో యని భయపడుచున్నాను!" అని చెప్పెను.

బేగము తన సహచరియగు లుత్ఫుఉన్నీసాభావమును సంపూర్ణముగా గ్రహించెను. ఆమె మందహాసము చేయుచు "అట్లైన్నఁటికిని జరుగనీయను. నీవీయాగ్రానగరమునం దేఉమ్రావునకు భార్యగా నుండఁగోరుకొందువో యాతఁడు నీపాణిగ్రహణము గావించునట్టి యేర్పాటు చేయించితీరెదను. అప్పుడు నీనాథుఁడు పంచహజారీమన్సబుదారు కూడఁ గాఁగలఁడు!" అని యభయము నొసంగెను.

ఆమాటకు లుత్ఫుఉన్నీసా యెంతయో యానందించెను. ఆమె

ముఖ్యోద్దేశముకూడ నప్పు డదియే యైయుండెను. ఇచ్చవచ్చినట్లుగాఁ బ్రతిపుష్పమునందును విహారము గావించుచుండు మదభ్రమరి రెక్కలు గొట్టుకొని యొక్కచోటనే పడియుండునట్లు రాజాంతఃపురమధ్యమునం దొక సామాన్యభోగినీయువతివలె నుండుటలో నేమిసుఖమున్నది? పోనిమ్మ్ము! ఒకవేళ స్వేచ్ఛను విడనాఁడుకొని రాజమందిరవైభవ మంతయు ననుభవింతమనుకొన్నను చిన్నతనమునుండియుఁ దనకు సఖియై యిప్పుడు సలీమునకు రాణికాఁబోవుచున్న మెహరున్నీసాకు దాసీత్వము గావింపవలసి వచ్చునే! అదిమాత్ర మేమంతగౌరవమైనవృత్తి? అంత కంటె నేప్రధానరాజోద్యోగినైనను బెండ్లియాడి యాతని హృదయము నకు, సర్వస్వమునకు సర్వాధికారిణియై యుండుట ప్రశంసనీయ మగు విషయము గాదా?

అట్టి సంకల్పముతోనే, అట్టియాశతోనే లుత్ఫున్నీసా యీయ సాధ్యకార్యమును సాధింపఁబూనుకొనెను. ఇంతే కాక తన్నెల్లవిధములఁ బ్రేమించుచుఁ దాను గీచినగీటు దాఁటకుండ మెలంగుచుండు సలీమిప్పుడు తన్నుఁగణింపక మెహరున్నీసా యనినఁ బడిచచ్చిపోవుచుండెను. అందుచే నాతనికిఁ దగినశాస్తి గావింపవలె ననికూడ లుత్ఫున్నీసా యీపనియందు చేయి చేసికొనియెను.

ఖాన్ఆజిము మొదలగువారే కాక డిల్లీయందును, ఆగ్రాయందును గల గొప్పగొప్ప ఉమ్రావు లందఱునుగూడ లుత్ఫున్నీసాయెడలఁ బ్రేమకు వశులై యామె కనుసన్నల మెలంగుచుండిరి. తన యల్లుని సార్వభౌమసింహాసన మెక్కించుటకై ఖాన్ఆజిము సర్వవిధములఁ బ్రయత్నించుట కుద్యుక్తుఁడగుటలో నాశ్చర్య మేమియును లేదు. ఆతఁడును దక్కిన ఉమ్రావులలోఁ జాలమందియును లుత్ఫున్నీసా మాట మన్నించి సహాయపడుటకు సమ్మతించిరి.

కాని యప్పుడు ఖాన్ఆజిమ్ దూరాలోచనచేసి లుత్ఫున్నీసా నుద్దే

శించి "ఏకారణముచే నైన మనమీ మహాత్కార్యమునందు సఫల మనోరథులము కాకపోయినచో నప్పుడు నీకును, నాకునగూడ నెట్టి ప్రాణసంకటము తటస్థించునో బాగుగ నాలోచించితివా? అందుచేత ముందుగనే మనము మన యాత్మరక్షణమునకుఁ దగినయుపాయము నూహించి జాగ్రత్తపడుట ప్రధానకర్తవ్యముగాదా?" అని ప్రశ్నించెను.

లుత్ఫుఉన్నీసా యదరిపడి "ఔను. అట్టి సదుపాయము మీకేమైనఁ బొడకట్టినదా?" అనెను.

ఖాన్ – ఉరియాపై నాధారపడుటకంటె నన్యోపాయ మేదియు నగపడుట లేదు. కేవల మచ్చటమాత్రమే మొగలాయీ శాసన మంతగా వ్యాపించియుండలేదు. ఆ యురియాసైన్యముమనకుఁ గరగతమై యుండుట ప్రధానవిషయమై యున్నది. ఉరియాకంతకును మన్సబుదారుగా నున్న యాతఁడు నీసహోదరుఁడే గదా! ఆతఁడు యుద్ధరంగము నందు దెబ్బతినియె నని నేను రేపటిదినమునఁ బ్రవాదము పుట్టించెదను. ఆతనిఁజూచి రావలయు ననుమిష పెట్టుకొని నీవు రేపే ఉరియాకు ప్రయాణమై పొమ్ము! అచ్చట నేమి చేయవలసియుండునో యట్టి ముఖ్య కార్యము లన్నియును నెఱవేర్చుకొని నీవతిశీఘ్రముగమరలి రమ్ము.

లుత్ఫుఉన్నీసా యట్లుచేయుటకు సమ్మతించెను. ఆమె యావిధముగా ఉరియాకు వచ్చి తిరిగి యాగ్రాకుఁ బోవుచున్న సమయమునందే మాపాఠకులు మార్గమధ్యమున నామె పరిచయమును గాంచియున్నారు.

రెండవ ప్రకరణము

"కాలు తూలి జారి నేలఁగూలినవాఁడు
నేల నూతగొనియె నిలువఁగలఁడు, ;
ఒక్కపరి నిరాశ యుదయించినంతనే
చచ్చుటకు నెవండు సమ్మతించు?

గాలివాన రేగి కలఁగించుచున్నఁ, జు
కాని విడువఁబోడు కర్ణధారి;
ప్రయత్నమైన నిపుడు నిష్ఫలమైన
నగు సఫలము మఱియొ కప్పుడైన.

— నవీనతపస్విని (తెలుఁగుకేత)

ఏదినమునందు మార్గమునందలిసత్రమునొద్ద నవకుమారునికడనుండి సెలవు దీసికొని మతిబీబీ యనుమాఱుపేరుగల లుత్ఫున్నీసా వర్ధమాన నగరమునకుఁ బయాణమై పోయెనో యానాఁటి కామె వర్ధమానము వఱకును బోఁజాలకయెను. ఆమె యాసాయంకాలమునందు మఱియొక పాంథశాలయం దాఁగిపోయెను. ఆసంధ్యాసమయమునం దామెయును దాసి యగు పేష్మనును నొకచోఁగూర్చుండి యేమేమియో సంభాషించు కొనుచుండిరి. అప్పు డాకస్మికముగా మతిబీబీ యేదియో జ్ఞప్తికి వచ్చి నట్లుగా పేష్మను నుద్దేశించి "పేష్మన్! నామగనిని జూచితివిగదా! ఆతఁ డెట్లున్నాఁడో చెప్పుము?" అని ప్రశ్నించెను.

పేష్మను కొంచెము విస్మితయై "ఆతఁడు నీవెనుకటిమగఁడా? ఎట్లు న్నాడని చెప్పుదును?" అనెను.

మతి — ఆతఁ డందమైనవాఁడేనా? నీచూపున కెట్లున్నాఁడు?

నవకుమారునియెడలఁ బేష్మనునకు మిగులనసహాస్యభావము గలి గెను. మతిబీబీ తనవిలువగల యలంకారముల నన్నిటిని నవకుమారుని గృహిణియగు కపాలకుండల కిచ్చివై చెను. ఆనగలకొఱకుఁ జాలదిన ములనుండి పేష్మను మిగుల నాశపడి యుండెను. ఎప్పుడైన మంచిసమ యమును జూచి యామెను ప్రార్థించి యాభూషణములను సంపాదించు కొనవచ్చు నని పేష్మను నిశ్చయించుకొని యుండెను. ఇప్పు డాయాశ యంతయు నిరూఢమై పోయినది. అందుచేత పేష్మను తన యజ

మానురాలిప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగా "అమ్మా! దరిద్రబ్రాహ్మణుఁడు రూపవంతుఁడైన నేమి; కురూపియైన నేమి?" అనెను.

తన సహచరిమనోభావమును గ్రహించి మతిబీబీ మందహాసము చేయుచు "ఆదరిద్రబ్రాహ్మణుఁడే యొకప్పుడు ఉద్భావు కావచ్చును. నేనామాట యడుగుట లేదు. ఆతఁడందమైనవాఁడా? కాడా"? అనెను.

పే – సుందరుఁడైనంతమాత్రమున నాతఁడు ఉద్భావగుట యెట్లు?

మతి – ఎట్లనుచున్నావా? నీవు వినలేదా? తనకుమారుఁడు చక్రవర్తియైన క్షణమునందే నానాథుని ఉద్భావుగాఁ జేయించెద నని బేగము నాకు వాగ్దానము గావించినది!

పే – ఆమె నీకు మాటయిచ్చినసంగతి నాకును దెలియును. కాని యందువలన నీపూర్వస్వామి ఉద్భావగుట యెట్లు తటస్థించును?

మ – అట్లు కాకపోయినచో నాకిప్పు డింకొకమగఁ డెవ్వఁడున్నాఁడు?

పే – ఇంకొకమగనిని తగినవానిని నీవు పెండ్లి యాడవచ్చును! ఆతఁడే యన్నమాట యేమి?

మతిబీబీ చిఱునవ్వునవ్వుచు "చాలుఁజాలు. నావంటి సతీరత్నమున కిరువురుమగలుకూడనా? ఇఁక జెప్పనక్కఱలేదు. ఎంత మాట!" అని యెదుటికిఁ జూచి "ఎవరాపోవుచున్న వారు?" అని హెచ్చరించెను.

మతిబీబీ యెవ్వరిని జూచి "ఎవరాపోవుచున్న వారు?" అని ప్రశ్నించెనో యాతనిని పేష్మను బాగుగ నెఱిఁగియే యుండెను. ఆతఁ డాగ్రానగరనివాసియే ఖాన్‌ఆజిమునకు నమ్మినబంటు! ఆతనిం గాంచినంతనే యాయిరువురును గూడఁ వికలహృదయులై పోయిరి. పేష్మను వానిని బిలుచుకొనివచ్చెను. ఆతఁడు వచ్చి లుత్ఫుఉన్నీసాకు సలాము చేసి తాను దీసికొనివచ్చిన యొకయుత్తరము నామెచేతి కిచ్చెను. మఱియునాతఁడు "నేనీయుత్తరమును దీసికొని ఉరియాకుఁ బోవుచున్నాను. ఇది చాల ముఖ్యమైన జాబు!" అనెను.

ఆయుత్తరము నందుకొని మతిబీబీ చదువుకొనెను. దానితో నామె యాశలన్నియు నంతర్హితము లై పోయెను. అందిట్లు వ్రాయఁబడియుండెను

"మనముచేయు సర్వప్రయత్నములును నిష్ఫలము లై పోయినవి. అక్బరుషాదుషా తన మరణసమయమునందు తన బుద్ధిబలముచే మమ్ములనందఱినిగూడఁ బరాభూతులనుగాఁ జేసివై చెను. ఆతఁడు పరలోకమునకు దారి చేసికొనిపోయెను. కాని యాసార్వభౌముని యాజ్ఞాబలముచే యువరాజగు సలీము భాగ్యవశమున నిప్పుడు జహాంగీరుషాదుషాయై సింహాసనము నధిరోహించెను. నీవిఁక ఖుస్రూకొఱకు శ్రమపడవలదు. ఇట్టి రాజ్యతంత్రమునందు వ్యతిరేకముగఁ బ్రయత్నము గావింపఁబూనిన మనయెడల నెవ్వరును శత్రుత్వమును సాధింపకుండునట్టి యుపాయముల నిప్పు డాలోచించుకొనవలసియున్నది. నీ వీజాబందిన వెంటనే బయలు దేఱి సత్వరముగా నాగ్రాకు రావలయును" అని—

ఈ దుస్తంత్రముల నన్నిటినిగూడ అక్బరుచక్రవర్తి యేవిధముగా నిర్మూలము గావించి యుండెనో యావిషయము లన్నియు దేశచరిత్రమునందు స్పష్టముగా లిఖింపఁబడియే యున్నవి. వానింగూర్చి యిప్పుడు చెప్పవలసిన యావశ్యకమేమియును లేదు.

ఆదూతకుఁ దగిన బహుమానము నొసంగి సెలవిచ్చి పంపివై చి మతిబీబీ పేష్మనున కాయుత్తరమును జదివి వినిపించెను. అంతయు నాలకించి పేష్మను భయముతో "ఇఁక మన కుపాయ మే మున్నది?" అనెను.

మతి — ఏమియును లేదు.

పే — (ఇంచుక సేపేమియో యాలోచించి) మంచిది! ఇప్పుడు మనకు గలిగిన నష్ట మేమున్నది. ఇది వఱకెట్లుంటిమో యిప్పుడుగూడ నట్లే యుండవచ్చును. ఇతర ప్రభువుల కెవ్వరికై నఁ బట్టమహిషిగా నుండుట కంటె మొగలుషాదుషా భోగినీ కాంతగా నుండుటయే పరమగౌరవము!

మతి — (మందహాసముతో) ఇఁక నెన్నఁడు నట్లు జరుగదు. ఇఁక నే

నెంతమాత్రము నా రాజాంతఃపురమునం దుండఁజాలను. ఘాదుషాయైన జహాంగీ రతిశీఘ్రకాలములోనే మెహరున్నీసాను బెండ్లియాడకమానడు. నేనా మెహరున్నీసాను చిన్నతనమునుండి వయస్సువచ్చు పర్యంతమును భాగుగా నెఱుంగుదును. ఒక్కసారి యామె రాజమందిరమున ప్రవేశించి నచో నప్పుడే యామె పాదుషాయై పోవును. జహాంగీరు నామమాత్ర ప్రభువై యామె చేతిలోని కీలుబొమ్మ వలె మాటిపోవును. ఆతని కీసింహాసనము దక్కకుండఁ జేయవలయు నని నేను గావించుచుండు ప్రయత్నము లన్నియు నాతనికి దెలిసియే యుండును. ఇప్పుడు తెలియ కున్న నెప్పటికైన నీరహస్యము బయలుపడక మానదు. అప్పుడు మన గతి యేమి కావలయును?

పే – (శోకగద్గద కంఠస్వరముతో) ఇంకేమున్నది? మరణదండనమే!

మతి – అక్కఅలేదు. ఒక్కటే యుపాయమున్నది. జహాంగీరు విషయమున మెహరున్నీసా హృదయభావ మేవిధముగా నున్నదో! జహాంగీరుపై నామె కెట్టియనురాగమును లేకయే యున్నచో – నిజముగా నామెకుఁ దన నాథునియందే సంపూర్ణప్రేమ యున్నచో నూర్గురు షేరాఫ్ఖానులను సంహరించినను జహాంగీరు మెహరున్నీసాను బెండ్లి యాడఁజాలఁడు. ఆమె హృదయదార్ఢ్యమును బూర్తిగా నేనెఱుఁగుదును. అట్లుకాక మెహరున్నీసా మనఃపూర్వకముగా జహాంగీరును వాంఛించునే యున్నయెడల నిఁక మన కెట్టి యాధారమును లేదు.

పే – మెహరున్నీసాప్రేమ యెవ్వరియందున్నదో నిశ్చయముగాఁ దెలిసికొనుట కుపాయ మేమున్నది?

మతి – (నవ్వుచు) ఈ లుత్ఫున్నీసాకు సాధ్యముగాని పనియనునది యొకటి యుండునా? మెహరున్నీసా నాకుఁ జిన్ననాఁటి స్నేహితురాలు! రేపు నేను వర్ధమాననగరమునకుఁ బోయి యామెయొద్ద నొకటి రెండు దినములు నివసించి యుండెదను.

పే — ఒకవేళ మెహరున్నీసా జహాంగీరును బ్రేమించియే యుండవచ్చును. అట్టిస్థితిలో నేమి చేయవలయును?

మతి — ఏయెండ కాగొడుగు పట్టవలయు నని నాచిన్నితనమునందు మాతండ్రిగారు నాకు బోధించియున్నారు.

ఇరువురును కొంతసేపటివఱకు మౌనముతోఁ గూర్చుండి యుండిరి. కొంతసేపటి కించుక మందహాసరేఖ దోచి మతిబీబీ యోష్ఠాధరములను గుంచింపఁ దొడంగెను. అదిచూచి పేష్మను "అట్లు నవ్వుచుంటి వెందుకు?" అని ప్రశ్నించెను.

మతి — ఒక క్రొత్తయాలోచన తోఁచినది.

పే — అది యేమో చెప్పవా?

మతిబీబీ యా విషయంగూర్చి పేష్మనుతో నేమియును జెప్పలేదు. మాపాఠకులకు మేముగూడ నిప్పుడు చెప్పదలఁచుకొనలేదు. తరువాత నదియే ప్రకాశితము గాఁగలదు.

మూఁడవ ప్రకరణము

ప్రతియోగినులు

"పరమపురుషుఁడో శ్యామసుందరునికంటె
లేఁడు! ప్రాణేశుఁడీక నాకు లేఁడు! లేఁడు!"

— ఉద్ధవదూత (తెలుగుసేత)

ఈ సమయమునందు షేరాఫ్ఖాను వంగదేశపు సుబేదారునకు లోఁబడియున్న వర్ధమానమునకుఁ గర్మాధ్యక్షుఁడై యుండెను.

మతిబీబీ వర్ధమాననగరమునకు వచ్చి షేరాఫ్ఖాను మందిరమున బ్రవేశించియుండెను. షేరాఫ్ఖాను సపరివారముగఁ బోయి యామెను మిగులగౌరవముతోఁ దనయింటికిఁ దీసికొనివచ్చెను. ఆ షేరాఫ్ఖానును, ఆతని భార్యయగు మెహరున్నీసాయును నాగ్రా నగరమునందు నివసించి

యున్న దినములలో వారికిని లుత్ఫున్నీసాకును విశేషపరిచయము గలిగియుండెను.

అంతేకాక యామెకును మెహరున్నీసాకును జిన్నతనమునుండియు నెంతో స్నేహముకూడ నుండెను. తరువాత గొన్నాళ్ళకు వారిరువురికిని ఢిల్లీసామ్రాజ్యమును సంపాదించు విషయమున బరస్పర ప్రతికూల భావము లుదయించి వా రొండొరులకు బ్రతియోగిను లగుట సంభవించెను.

అట్టిస్థితిలో నిప్పుడు మతిబీబీ తనయింటికివచ్చి తన్ను గలిసికొనుటం గూర్చి సంశయించి మెహరున్నీసా తనలో "భారతవర్ష సామ్రాజ్యమున కధీశ్వరుడగు నదృష్టమును విధాత యెవ్వరికపాలమునందు లిఖియించి యుంచెనో? ఆబ్రహ్మదేవుడే యెఱుంగును! మతియు సలీమ్ యెఱుం గును! ఇంకను నెఱింగినవా రెవ్వరైన నున్నచో నారహస్యమును దెలిసికొనగలిగినదీ లుత్ఫున్నీసా యొక్కతెయే! సరే చూతము! ఈ విషయమై లుత్ఫున్నీసా నాతో నేమైన సంభాషించునో సంభాషింపదో యిప్పుడే తెలిసిపోవును గదా!" అని భావించుకొనెను.

మతిబీబీయును మెహరున్నీసాహృదయ మెట్లున్నదో పరీక్షించి తెలిసికొనవలెననియే జాగరూకతతో నుండెను.

మెహరున్నీసా యాకాలమునందు భారతవర్ష మధ్యమున నిరుప మానసౌందర్యవతి యనియు, ననితరసాధారణగుణవతి యనియుఁ బ్రఖ్యాతిఁ గాంచి యుండెను. వాస్తవముగా నటువంటిరమణీరత్నము లీభూమండలమునం దత్యల్పసంఖ్యగనే యవతరించి యుందురు. భారతేతిహాసమునందు వర్ణింపఁబడిన సుందరనారీమణులలో మెహరున్నీసా యెంతటియందక త్తెయై ప్రధానస్థానము నాక్రమించినదో యీవిషయము చరిత్రమే ఘంటాపథముగఁ గీర్తించుచున్నది.

మతియు నాకాలమునందు మహావిద్వాంసు లని ప్రసిద్ధిగాంచుచున్న

పురుషులలోఁ గూడఁ జాలమంది యావిదుషీమణి నిస్తంద్రప్రతిభావిశే షమునకుఁ దీసిపోవువాఁ డైయుండిరి. నృత్యగీతాదులయందు మెహారు న్నీసా యద్వితీయ మగు ప్రజ్ఞను సంపాదించి యుండెను. కవితారచ నమునందును, చిత్రలేఖనమునందునుగూడ నాయువతీమణి సకలజనమనో మోహినియై విరాజిల్లుచుండెను. మఱియు నామెసరసాలాపము లామె సౌందర్య విలాసములకంటెను మనోహరములై యులరుచుండెను.

మతిబీబీగూడ సౌందర్యమున నేమి, పాండిత్యమున నేమి, లలిత కళాభిజ్ఞతయం దేమి యెల్లవిషయములయందును మెహారున్నీసాతో దీటుసేయఁదగినదిగనే యుండెను. ఇప్పు డీయిరువుర చమత్కారిణు లునుగూడ నొకరిహృదయాభిప్రాయముల నొకరు గ్రహించుటకెంతో యౌత్సుక్యముతో నెదురుచూచుచుండిరి.

మెహారున్నీసా తనవిలాసమందిరమునఁ గూర్చుండి యొకచిత్రమును లిఖించుచుండెను. మతిబీబీ మెహారున్నీసా వెనుకభాగమునఁ గూర్చుండి యామె వ్రాయుచున్న చిత్రపటమును దిలకించుచుఁ దాంబూలచర్వణము గావించుచుండెను.

అప్పుడు మెహారున్నీసా "సఖీ! ఈచిత్ర మెట్లున్నది?" అని ప్రశ్నించెను.

మతి — లలితకళానిపుణమతివగు నీచే లిఖింపఁబడుచున్న యీచిత్ర మెట్లుండవలయునో యట్లేయున్నది. కాని నీవంటి చిత్రలేఖనకౌశలము మఱి యితరుల కెవ్వరికిని లభింపకపోవు టొక్కటియే విచారకరమగు విషయము!

మెహా — నీవిప్పుడు సత్యముగనే యిట్లు చెప్పినచో నీసందర్భము నందు దుఃఖకారణ మేమున్నది?

మతి — నీకుఁగల యీయద్భుతచిత్రరచనా నైపుణ్యము మఱియొకరి కెవ్వరికైన లభించియే యున్నచో నీమనోహరవదనబింబమునకుఁ బ్రతి బింబరచన గావింపఁగలిగియే యుందురుగదా!

మెహ — ఈపాడు మొగమునకుఁ బ్రతిమూర్తిని సిద్ధపఱుపవలసి వచ్చినచో దానికి వల్లకాటిమట్టి కావలసి యుండును.

మెహరున్నీసా యీమాటను వచియించునప్పు డామెవదనకమల మించుక గంభీరభావమును వహించియుండెను.

మతి — అదేమిసోదరీ! మనోదార్ఢ్యము గలిగిన ట్లింతబేల వై పోయితివేమి?

మెహ — బేలనై పోవుట యెందుకా? ఇంతకాలమునకుఁ జూడవచ్చిన బాల్యమిత్రురాల వగు నీవు రేపటి ప్రాతఃకాలమునందే నన్ను విడిచి పోయెద వనుమాట నేనెట్లు మఱచి యుండగలను? మఱియేవిధముగ నైన నీవు నాయొద్ద నొకటి రెండుదినము లుండి నన్నుఁ గృతార్థురాలి నిగాఁ జేయఁగూడదా?

మతి — సుఖముగా నట్లుండుట కెవ్వరి కిష్టము లేకుండును? కాని నేను పరాధీనురాల ననుసంగతి నీకుఁ దెలియనిది గాదు. ఇట్టి స్థితిలో నే నెట్లుండగలను?

మెహ — ఈమాటల కేమిలే! నీకు నిజముగా నాయందు ప్రేమలేదు. ఉన్నచో నీవేలాగునన్నై నను సుఖముగా నాతోఁ గలసియే యుందువు. వచ్చినదానవు రెండు మూఁడు నా ల్గైన నుండకపోవుట యేమి?

మతి — నాకుఁగల యనవకాశముంగూర్చి స్పష్టముగాఁ జెప్పియే యుంటినిగదా! ఇచ్చటి మొగలాయి సైన్యమునకు నాసహోదరుఁడు మన్సబుదారుఁడై యున్నాఁడు. ఆతఁడురియాయందలి పఠానులతో యుద్ధము చేయుచు దెబ్బ తిని చాల కష్టపరిస్థితి యం దున్నట్లు విని యుంటిని. ఆవిపద్వార్త నాకర్ణించినంతనే నేను బేగమునొద్ద సెలవు గైకొని యాతని నొక్కసారి చూడవలయు నని యీదేశమునకు వచ్చి యుంటిని. ఉరియాయందే నాకు చాలకాలహరణ మైపోయినది. ఇప్పు డింకను నాలస్యము చేయుట యుచితమైనపని గాదు. నిన్నుఁ గలిసికొని

చాలకాల మైపోవుటచే నొకసారి నిన్నుఁ జూచి మతిపోవలెనను కుతూహలముతో నిట్లు వచ్చి యీరెండు దినములును సంతోషముతోఁ గాలము గడపితిని.

మెహా – సీవు బేగమునొద్ద సెలవు తీసికొనునప్పుడు మరల నేదినము నకు వచ్చెద నని చెప్పి యొప్పించుకొంటివి ?

మెహారున్నీసా భావగర్భితముగా మాటాడుచుండె నని మతిబీబీ తెలిసికొనెను. చీవురుతోఁ దుడిచివై చినట్లు – మర్మభేదన మగునట్లు భావగర్భభాషణములను వచించుటయందు మెహారున్నీసా కడు నిపుణ మతి. అట్టి కౌశలము మతిబీబీకిఁగూడ లేదు. కాని మతిబీబీ యంత మాత్రమున దెల్లపోవునంతటి సామాన్యురాలుమాత్రము గాదు – అందు చేతనే యామెగంభీరముగా “రాకపోకలకుఁ గనీసము మూఁడుమాసము లైనఁ బట్టదగినప్రయాణము గావించుచు మరలివచ్చుదినమును నిశ్చయ ముగాఁ జెప్పుట కెవ్వరికి సాధ్యమగును? చెప్పినను సరిగా నానాఁటికిఁ జేరుకొనుట యెట్లు? కాని యిప్పటికే చాలదినములు గడచిపోయినవి. ఇంకను నాలస్యము గావించినచో నసంతుష్టికిఁ గారణము గాక మానదు.”

మెహారున్నీసా సహజమగు తనభువనమోహన మధురహాసమును ప్రబదర్శించుచు “సోదరీ! నీవిప్పు డెవ్వరి కసంతుష్టి యుదయించునని సంశయపడుచున్నావు? యువరాజు సలీమునకా? కాక యాతని దేవేరికా?” అని ప్రశ్నించెను.

ఆమాట విని మతిబీబీ యించుక యప్రతిభురాలై “ఈ లజ్జావిహీను రాలికి సిగ్గును గల్పించుటకై యేల కుతూహలపడితివదవు? చెప్పెదను వినుము. నేనుపోవుట కాలస్యమైనచో నీవుగ్గడించిన యిరువురికినిగూడ నసంతుష్టి కలుగవచ్చును” అనెను.

మెహా – సరేకాని, నేను నిన్నిప్పు డొకమాట యడుగుచున్నాను. చెప్పుము! – నీవు స్వయముగా బేగమునామమును వహింపకుండుటకుఁ

గారణమేమి? యువరాజు సలీము నిన్నుఁ బెండ్లియాడి ప్రియరాజ్ఞిగాఁ జేసికొనదలఁచియుండె నని వినియుంటిని. అది యెంతవఱకు సత్యము?

మతి — నేను సహజముగనే పరాధీనురాల నై పోయితినిగదా! ఇఁక నాకు మిగిలియున్న కొలఁదిపాటి స్వాతంత్ర్యమునుగూడ నిష్కారణముగా నెందుకు నష్టపఱచుకొనవలయును? నేనిప్పుడు బేగమునకు సహచారిణిని మాత్రమే యైయుండుటవలన నిట్లువలీలగా ఉరియాకుఁ బయనమై రాఁగలిగితిని. అట్లుకాక సలీమునకు బేగమునే యైయున్నచో ఆగ్రారాజమందిరమునుదాఁటి యొక్కయడుగైన నీవలఁ బెట్టుట నాకు శక్యమగునా?

మెహ — ఢిల్లీఫాదుషాకుఁ బ్రధానమహిషియే యగుట తటస్థించినప్పుడింకను ఉరియా మొదలగు దేశములకుఁ దిరుగవలసిన యావశ్యకమేమియుండును?

మతి — యువరాజుసలీమునకుఁ బ్రధానమహిషిని గావలయునన్నంతటిదురాశ నాహృదయమునం దెన్నఁడు నుదయించియుండలేదు. ఈ హిందూస్థానమునందు — ఈభారతవర్షమునందుఁ గేవలము ఢిల్లీశ్వరునకుఁ బ్రాణవల్లభగా నుండఁదగిన సుందరియగు భాగ్యవతి యొక్కతెహారుస్నీసామాత్రమే!

మెహారుస్నీసా చటూలునఁ బలవంచుకొనెను. కొంతసేపటివఱకు నేమియు మాటాడ కూఱకుండి "సోదరీ! నీవు నాహృదయమును బాధించుటకై యీసంభాషణము నెత్తెద వని యెంతమాత్రము ననుకొనియుండలేదు. నామనసు తెలిసికొనుటకై యిట్లు మాటాడితివి కాఁబోలును! సఖీ! నిన్ను నేనొక భిక్షము నర్థించుచున్నాను. నేను షేరాఫ్ఖానునియిల్లాలి ననియు, మనోవాక్కాయములచే నేనాతనిపాదదాసినై యుంటి ననియు మఱచిపోయి యెన్నఁడును మాటాడవలదు!"

లజ్జావిహీనురాలగు మతిబీబీ యీతిరస్కారమున కెంతమాత్రమును సంచలింపలేదు. అంతే కాక యీమాటవలన నామె కింకను బ్రసం

గించుటకు మంచియవకాశము లభించెను. అప్పుడు మతిబీబీ సహజకంత స్వరముతో "సోదరీ! నీవట్లు పతిగతప్రాణవై సతీత్వమును బాలించు చున్నసంగతి సంపూర్ణముగా నాకుఁ దెలియకపోలేదు. అందుచేతనే ఛలోక్తిగా నీయెడుట నిట్టిప్రసంగము గావించుటకు సాహసించితిని. సలీమువూత్ర మింతవఱకును నీసౌందర్యమోహావివశుఁడై సర్వదా నీనామమునుస్మరించుచునే యున్నాఁడు. ఈమాట నీకుఁ దెలియఁజేయ వలయుననిమాత్రమే నాయుద్దేశము. కావున నీవుమాత్రము జాగ్రత్తగా నుండుము. లేకున్న చోఁ బ్రమాదము సంభవింపఁగలదు" అని చెప్పెను.

మెహ — మంచిది. అంతయును దెలిసినది. కాని యెట్టిప్రమాదము తటస్థించునని నీసందేహము?

మతిబీబీ కొంచెము చెప్పుటకు వెనుదీయుచున్నట్లు నటించి "వైధవ్యదుఃఖము తటస్థించు నేమో యని భయపడుచున్నాను" అనెను.

ఎట్లో యీమాట చెప్పి వైచి మతిబీబీ మెహరున్నీసా ముఖము వంకఁ దదేకదృష్టితోఁ దిలకించుచుండెను. కాని మెహరున్నీసా ముఖ మండలమునందు భయావేశచిహ్నముగాని, ప్రమాదరేఖగాని యించు కంతయు నామెకుఁ గానవచ్చుట లేదు.

అప్పుడు మెహరున్నీసా దర్పోజ్జ్వలభావముతో "వైధవ్యదుఃఖ శంకయా? నాస్వామియగు షేరాఫ్ఖానుఁ డాత్మరక్షణమునకుఁగూడ సామర్థ్యము లేనివాఁడు గాఁడు! ఇంతేకాక అక్బరుషాదుషా సామ్రాజ్య పాలనమునందు నిజముగా నెట్టియపరాధమును లేకుండు నేప్రాణికైనను నష్టము గలిగించినచో నెంతటి రాజపుత్త్రుఁడై నను శిక్షావిధినుండి తప్పించు కొని బ్రదుకఁగలఁడా!" అని గంభీరముగా వచించెను.

మతి — ఆమాట సత్యమే — కాని యిప్పు డాగ్రానుండి వచ్చిన వార్తనుబట్టి చూడఁగా నట్టిధర్మశాసనకర్తయగు నక్బరుసార్వభౌముఁడు పరమపదించినట్లును, యువరాజగు సలీము భారతసామ్రాజ్యసింహాసనము

నధిరోహించినట్లును దెలియుచున్నది. అట్టి ఢిల్లీశ్వరుఁడే యసత్కార్యము గావించిన నెవ్వ రడ్డుకొనఁగలరు?

మెహరున్నీసా యిఁక నేమియును వినఁజాలకపోయెను. ఆమె సర్వాంగకములును గంటకితములై కంపించి పోవుచుండెను. మరల నామె తల వంచుకొనియెను. ఆమె విశాలాయత నయనములనుండి యశ్రుధారలు జాలువార దొడంగెను. అదిచూచి మతిబీబీ "సోదరీ! ఎందుకట్లు దుఃఖించెదవు?" అనెను.

మెహరున్నీసాయొక్క దీర్ఘశ్వాసమునువిడిచి "ఇప్పుడు సలీముభారత సింహాసనము నధిరోహించి యుండెనా? ఇఁక నే నెక్కడ?"అనెను.

మతిబీబీమనోరథము సంపూర్ణముగ సిద్ధించెను. ఆమె విస్మయమును నటించుచు "ఏమి? నీ వింతవఱకును యువరాజగు సలీమును మఱవఁ జాలకయే యున్నావా?" అనెను.

మెహరున్నీసా గద్గదస్వరముతో "ఎవ్వరిని మఱచిపోవుట? నా సర్వస్వమును, దుదకు నాజీవితమునుగూడ మఱచిపోగలను గాని సార్వభౌమనందనుఁడగు సలీమునుమాత్రము విస్మరింపఁజాలను. కాని — వినుముసోదరీ! సంభాషణవశమున నాకస్మికముగా నాహృదయకవాటమును దెఱచివైచితిని. ఇప్పటి నామాటవలన నాహృదయము నీకుఁ దెలిసిపోయినది. కాని యీమాట రెండవచెవిని బడనీయగూడ దని నేను శపథము చేసికొని యున్నాను. ఇఁక నేమన్న నేమిలాభము?"

మతి — మంచిది. ఇప్పుడు గలిగిన ప్రమాద మేమున్నది. నేను నీనెచ్చెలిని గానా? ఈమాట రహస్యముగనే యుండును! కాని నేను వర్థమానమునకు వచ్చినసంగతి యొకవేళ సలీమునకుఁ దెలియుటయే తటస్థించినచో నప్పుడాతఁడు "మెహరున్నీసా ననుఁగూర్చి యేమైన సంభాషించినదా?" అని నన్నడుగవచ్చును. ఆతఁడట్లు ప్రశ్నించినచో నేనప్పుడేమని ప్రత్యుత్తర మీయవలయును?

మెహరున్నీసా యించుకసేపు బాగుగానాలోచించి "సోదరీ! ఈవిధముగాఁ జెప్పుము — 'మెహరున్నీసా నిరంతరమునుఁ దన హృదయమధ్యమున నిలుపుకొని నిన్నే ధ్యానించుకొనుచున్నది. ఏమైనఁ బ్రయోజనపడునని తోచినచో నామె నీకొఱకుఁ దనప్రాణములనైన నర్పించుటకు సంసిద్ధురాలై యున్నది. కాని యెప్పటికినిగూడ నామె తనకులగౌరవములను మాత్రము నీకు సమర్పింపఁజాలదు! దాసి యగుమెహరున్నీసా తన భర్త జీవించి యుండఁగా నెన్నఁడును ఢిల్లీశ్వరుఁడ వగునీమొగమువంకఁ గన్నెత్తి చూడఁబోదు, ఎప్పుడైన, నేవిధముగనైన భారతరాజేశ్వరుఁడవగు నీచేఁ దనభర్తకుఁ బ్రాణాపాయము గలుగుట తటస్థించునేని నిశ్చయముగా నట్టిభర్తృహంతకునితో నామె కీయిహజన్మమునం దెన్నటికిని సమ్మేళనము గుదురఁబోదు!' ఇదియే నాసందేశము —"

ఇట్లుచెప్పి మెహరున్నీసా చివాలున లేచి యటనుండి వెడలిపోయెను. మతిబీబీ విస్మయావిష్టహృదయయైపోయెను. కాని యీప్రతియోగిను లిరువురిలోనను విజయము మతిబీబీకే సంప్రాప్తించెను. మెహరున్నీసా మనసులోని యుద్దేశ్యమును మతిబీబీ సంపూర్ణముగఁ దెలిసికొనఁగలిగెను. హృదయాకాంక్షితమునుగాని, యామె ప్రయత్నమునుగాని మెహరున్నీసా యించుకంతయును గ్రహింపఁజాలకయే పోయెను.

ఏభువనమోహిని యిఁకముందు తన యసాధారణమేధా ప్రభావముచే ఢిల్లీశ్వరునకుఁగూడ జీవితేశ్వరియగుటకు సమర్థురాలై యుండెనో యట్టి మెహరున్నీసా కూడ నిప్పుడు మతిబీబీ మతిప్రతిభచెంతఁ బరాజితురాలై పోయెను!

దీనికిఁగారణమేమనిన — మెహరున్నీసా కేవలమును బ్రణయశాలిని — ఈవిషయమునందు మతిబీబీ ముఖ్యముగా స్వార్థపరురాలు మాత్రమే!

మానవహృదయములందలి భిన్నభిన్నములగు విచిత్రగతుల నన్నిటిని మతిబీబీ సంపూర్ణముగ నెఱుంగఁజాలిన నెఱజాణ! ఆమె మెహరున్నీసా

సానుగూర్చి బాగుగ నాలోచించి యెట్లుసిద్ధాంతము చేసికొనియుండెనో యిప్పుడది యంతయు యథార్థమే యైపోయినది. మెహరున్నీసా జహాంగీరునెడల సంపూర్ణానురాగముతో నుండె ననియు, నది మనఃపూర్వక మైనదే యనియు మతిబీబీకిఁ దార్కాణ యయ్యెను. ఆమె యెంతటి గర్వముతో భాషించిననేమి ప్రేమపరతంత్రురాలై యుండుటచేతనే మెహరున్నీసా తన మనసులోనిమాటను దాచికొనఁజాలకపోయినది! విడివడిపోవుచున్న హృదయకవాటములను నిరోధింపనేరక పోయినది! ఇఁక జహాంగీరుపాదుషామనోరథము తప్పక సిద్ధింపఁగల దని మతిబీబీ నిశ్చయించుకొనెను.

ఈ సిద్ధాంతమువలన మతిబీబీ యాశాధారము లన్నియు నొక్కసారిగా నిరాశ్రయములు లై పోయెను. కాని యంతమాత్రముచే మతిబీబీ యేమైన నధైర్యపడిపోయినదా? లేదు. ఆమె యట్టి సాధారణ నారీమణి కాదు. విచారపడలేదు సరికదా మతిబీబీ యించుక సంతోషమునే యనుభవించెను. అసంభవమగు నిట్టి మనోవికాస మేకారణముచేఁ గలిగినదో మతిబీబీ యప్పు డెంతమాత్రమును గ్రహింపఁజాలకపోయెను. ఆమె యాగ్రాభిముఖముగఁ బయనమైపోయెను. మార్గమధ్యమునఁ గొన్ని దినములు గడచిపోయెను. ఆ ప్రయాణదినములలోనే బాగుగ నాలోచించుకొని యామె తన మనోభావమును స్పష్టముగాఁ దెలిసికొనగల్గెను!

నాలుగవ ప్రకరణము

రాజమందిరము

"మమతచే మనసిచ్చి మన్నింతుగాక
పత్నిగా నన్నింక భావింపఁబోకు"

— వీరాంగన (తెలుఁగుసేత)

మతిబీబీ కొన్నాళ్ళకు మరల నాగ్రానగరమును జేరుకొనియెను. ఇఁక నామెను మతిబీబీ యని చెప్పవలసిన యావశ్యక మేమియును లేదు.

ఈనడుమ నామె మనోవృత్తు లన్నియు నొక్కసారిగా భిన్నరూపమునఁ బరిణమించిపోయెను.

ఆగ్రా వచ్చిసంతనే యామె చక్రవర్తి యగుజహాంగీరు దర్శనము గావించెను. ఎప్పటివలెనే జహాంగీ రామెను మిగుల నాదరించి యామె సహోదరుని క్షేమసమాచారమును గూర్చియు, నామె సుఖప్రయాణమునుగూర్చియుఁ గుశలప్రశ్నము గావించెను. ఇంతకు ముందే లుత్ఫ్ ఉన్నీసా మెహరున్నీసాతో నెట్లు చెప్పి వచ్చెనో యిప్పుడు సరిగా నట్లే జరిగెను. సంభాషణవశంబున వర్థమాన నగరప్రస్తావము వచ్చుటయు జహాంగీ రాత్రముతో "నీవు మెహరున్నీసాయొద్ద నొకటిరెండు దినములుంటి నని చెప్పితివే! ఆమె యేమైన నావిషయమై సంభాషించినదా?" అని యడిగెను.

లుత్ఫుఉన్నీసా యావెంటనే నిష్కపటహృదయముతో నాతనియెడల మెహరున్నీసా యెంతటి యనురాగము గలిగి యుండెనో స్పష్టముగాఁ దెలియఁజేసెను. ఆమాటల నాకర్ణించి జహాంగీరు మాఱుమాటాడక యూరకుండెను. ఆతని విస్ఫారితనయనములనుండి యొక్కొక్క యశ్రుబిందువు వెలువడియెను.

అది చూచి లుత్ఫుఉన్నీసా మృదుస్వరముతో "మహారాజా! ఈనీదాసి యిప్పుడు మీకు శుభవర్తమానమును గొనితెచ్చినదిగదా! ఈవిధముగా నుపకరించినదాసికిఁ దగినబహుమానము గావించుటకై యింకను నెట్టియాజ్ఞయు దయచేయింపలే దేమి?"

ఫాదుషా మందహాసము చేయుచు "బీబీ! నీమనోరథములకు బరిమితి యనుమాట లేదు."

మతి – జహాపనా! ఈదాసి చేసిన తప్పేమున్నది?

ఫా – నీవు ఢిల్లీశ్వరుఁడగు ఫాదుషానే బానిసగాఁ జేసికొని యున్నావు? ఇంకను నీవేమిబహుమానము గోరుకొనియెదవు?

లుత్ఫుఉన్నీసా నవ్వుచు "ప్రభూ! ఆఁడువాండ్ర కెన్ని యో కోరిక లుండును" అనెను.

ఫా — మరల నీకిప్పు డేమి కావలసివచ్చినది.

లు — ఈదాసివిన్నపమును మన్నించెద నని ఫాదుషావారు ముందు గనే యభయదానము నాజ్ఞ చేయవలెను.

ఫా — నీవు వాంఛించుకార్యము రాజకార్యముల కంతరాయమును గల్పించునది కాకయున్నచో నట్లేచేయుదును.

లు — (నవ్వుచు) ఒక్కయబల ముచ్చట తీర్చుటకై యాజ్ఞ దయచే యించినంతమాత్రమున రాజకార్యములకుఁ బ్రమాదము కలుగదు.

ఫా — అట్లే యైనచో నంగీకరించితిని — నీమనోరథ మేమియో తెలుపుము!

లు — మహారాజా! నేనొకవివాహము చేసికొనవలయునని కుతూహలపడుచున్నాను.

జహాంగీరుఫాదుషా పెద్దపెట్టున నవ్వుచు "ఈనీకోరిక చాల వింత గను, నూతనముగను బయలుదేఱిన దే! అట్లయినచో సంబంధ మేది యైన స్థిరపఱచుకొన్నావా?"

లు — ఇదివఱకే నిశ్చయించుకొన్నాను. ఏలినవారియనుజ్ఞ యే తరు వాయిగా నున్నది. మహారాజేశ్వరుని యంగీకారము ప్రకటితము గాక యున్నచో నెట్టిసంబంధమైనను స్థిరపడుట కవకాశము లేదు.

ఫా — ఈవిషయమునందు నాయంగీకారమువలన నేమిప్రయోజన మున్నది? నీవిప్పు డే భాగ్యవంతునిఁ బరమానందపారావారమున నిమగ్ను నిగఁ జేయవలయు నని సంకల్పించుకొన్నావు?

లు — మహాప్రభూ! ఈదాసి డిల్లీశ్వరుని సేవ గావించుచున్నంత మాత్రమున నెన్నఁటికిని బరగృహిణియై యుండుటకుమాత్ర మిచ్చగించి యుండుట లేదు. ఈసేవకురా లిప్పు డాత్మస్వామినే పెండ్లియాడుటకుఁ బ్రభువువారి యనుమతిని వాంఛించుచున్నది.

ఫా — ఆలాగా? అట్లయినచో జిరకాలమునుండియు నీప్రేమదా
సుఁడై సుఖించుచున్న యీదీనుని కేగతి చూపింపఁదలచితివి?

లు — డిల్లీసామ్రాజ్యపాలకు లగు దేవరవారు డిల్లీశ్వరి యగు మెహా
రున్నీసాను గైకొని మహానందముతోఁ గాలక్షేపము చేయవచ్చును.

ఫా — ఢిల్లీశ్వరి యగుమెహరున్నీసా యెవ్వరు?

లు — ఇప్పుడుగాకున్న మఱి యెప్పటికై నను మీమెహరున్నీసా
డిల్లీసామ్రాజ్యేశ్వరి కావచ్చును!

మెహరున్నీసా ఢిల్లీశ్వరునిహృదయేశ్వరి కాని యున్నట్లు లుత్ఫ
ఉన్నీసా నిశ్చయించుకొని యుండె ననియు, నాకారణముచేఁ దనకోరిక
లన్నియును నిష్ఫలము లైపోయెఁనని తలంచి రాజాంతఃపురమునందును,
రాజేశ్వరుఁ డగుతనయందునుగూడ వైరాగ్యము కలిగి యీవిధముగా
సెలవుగోరుకొనుచున్న దనియును జహాంగీరు గ్రహించెను.

అట్టిభావముతోఁచినంతనే యాతనిహృదయమునందు భావియోగ
దుఃఖ ముదయించి కలఁచివైవఁ దొడంగెను. అందుచే నాతఁ డేమియు
మాటాడఁజాలక యూరకుండెను. జహాంగీరు మౌనము వహించి
యుండుటం గాంచి లుత్ఫున్నీసా "మహారాజా! నేను నిశ్చయించు
కొన్న సంబంధము తమ కిష్టముగ లేదా?" అని ప్రశ్నించెను.

ఫా — నాకావిషయమున నెట్టి యనంగీకారమును లేదు. కాని యిది
వఱకే నీకాతఁడు భర్తయై యుండెను. ఇప్పుడు మరలఁ బెండ్లి చేసి
కొనవలసిన యావశ్యక మేమి వచ్చినది?

లు — దురదృష్టవశమున మా యిరువురికిని జరగినప్రథమ వివాహము
వలన మేము భార్యాభర్తలుగా వ్యవహరింపఁబడి యుండలేదు. ఇప్పుడు
మరలఁ బెండ్లి చేసికొన్నచో నేలినవారి సేవకురాలి నీకనాతఁడు పరిత్య
జింపఁజాలఁడు.

జహాంగీరు మనసులోపలనే నవ్వుకొనుచు గంభీర స్వరముతో "ప్రేయసీ! నీకు నేనీయఁదగనికోరిక యేదియును లేదు. నీకు నిజముగా నట్టి కుతూహలమే యున్నచో నట్లే పెండ్లిచేసికొనుము! కాని నిష్కారణముగా నన్నేల పరిత్యజింపవలయును? ఒక్క యాకాశమండలము నందుఁ జంద్రసూర్య లిరువురునుగూడఁ గాలాంతరములయందుఁ దేజరిల్లుచుండుటలేదా? ఒక్కపుష్పవల్లియందొక్క వృంతమునందే రెండు పువ్వు లేకకాలమున వికసించి యుండుటలేదా?"

లుత్ఫున్నీసా వికచనయనములతో ఫాదుషా మొగమువంకఁ దిలకించుచు "సామాన్యము లగుచిన్నచిన్నపూవు లొకవృంతమునందే జోడుగా బుష్పించును గాక — ఒక్క మృణాల నాళమునందు మాత్రము రెండు తామరపువ్వులు పుష్పింపవు! — నేనింకను ప్రభువువారి సువర్ణమణి సింహాసనాంతికమునఁ గఠినకంటకమనై యుండుట వలన నేమి ప్రయోజనము?"

ఇట్లు నివేదించి లుత్ఫున్నీసా యటనుండి యాత్మభవనమునకు నెడలిపోయెను. ఆమె కిటువంటి యభిలాష యెందుకు కలిగినదో యా విషయముంగూర్చి లుత్ఫున్నీసా జహాంగీరు సన్నిధి నెంతమాత్రమును ప్రకటించి యుండలేదు. అనుభవమునుబట్టి, యూహానుబట్టి యెంతవరకు బోధపడినదో యంతమాత్రమే గ్రహించి జహాంగీరుసరిపెట్టుకొనెను. అతి నిగూఢమగు నామెమనస్తత్వ మాతని కించు కంతయు దెలియనేలేదు!

లుత్ఫున్నీసా హృదయము కేవలము పాషాణ మనియే చెప్పవచ్చును. రమణీకులమోహనం బగుసలీము రాకొమరుని రాజతేజము కూడ నెన్నఁడు నామెహృదయము నాకర్షింపఁజాలకపోయెను. కాని యీసారిమాత్ర మాకఠినపాషాణమధ్యమున నేదియో యొక విధమగు వింతకీటకము ప్రవేశించినది!

ఐదవ ప్రకరణము

ఆత్మభవనము

"బ్రదికిననాళ్ళు రూపలోభమున మరగి
తరలదింతకునైన నా తరళదృష్టి ;
ఆమధురభాషణంబుల నాలకించి
యైనహర్షావశతనంద వయ్యె శ్రుతులు ;
చనినవెన్నెవసంతయామినులు ; కాని
యేవి యెటులయ్యెనో సుంత యెఱుగఁనైతి ;
లక్షకోటియుగాల లీలలనుగాంచఁ
గలిగితినిగాని, కనసైతిఁ గామితంబు
తనువుఁదనిపితి రసికు లెందఱోనొ గలసి ;
కానిప్రేమింపనైతి నొక్కరునిఁగూడ ;
లలితకవిత విద్యాపతి దెలిపినట్లు
వేలపైఁగాదు, మనసొక్క విభునియందె.

— విద్యాపతి (అనువాదము)

లుత్ఫుఉన్నీసా తనయింటికి వచ్చి ప్రసన్నహృదయముతో సహచరి యగు పేష్మనును బిలిచి యామెయెదుటనే తనయొడలియందలి సకలా లంకారములను దీసివైచి విలువగలదుస్తులనుగూడఁ బరిత్యజించివైచెను. అనంతరము పేష్మను నుద్దేశించి "ఓసీ! సువర్ణమణిమయంబు లగు నీనగలను, దుస్తులను గూడ నీవు తీసికొనుము!" అని చెప్పెను.

ఆమాటయు, నామెసేతలును గాంచి పేష్మనున కెంతయో యాశ్చర్య మును భయమును గలిగెను. అవి యన్నియును వేలకొలఁది మూల్యము గలవస్తువులై యుండెను. పేష్మను మృదుస్వరముతో "ఇవి యన్నియు

నాకెందుకు? నీవిప్పు డిట్లున్నా వేమి? నీవుపోయినకార్య మేమైనది?" అని ప్రశ్నించెను.

లుత్ఫుఉన్నీసా నవ్వుచు "నే నేయుద్దేశముతో మహారాజునుదర్శింపఁ బోయితినో యాయుద్దేశ్యము సంపూర్ణముగా సఫలమైనది" అనెను.

ఫే – అట్లయినచో నీఁక నేమీ! మనకిఁక మెహరున్నీసావలన నెట్టి ప్రమాదమును గలుగకుండఁ జేసికొని వచ్చితివా?

లు – అంతయును వదలిపోయినది. ఇప్పు డామెవిషయమున నాకెట్టి విచారమును లేదు.

పేష్మను మహానందమును బ్రకటించుచు "అట్లయినచో నేనింతటి నుండి ఫాదుషావారిప్రియబేగమునకు సేవకురాలిని కాఁగలను" అనెను.

లు – బేగమునకు దాసిగా నుండుట, నీకంత్రపియముగానున్నచో నేనూ మెహరున్నీసాతో మాటలాడి నీయభిమతమును దీర్పించెదను.

పే – అది యేమీ? జహాంగీరుఫాదుషావారిసి మెహరున్నీసా బేగమై యుండుట కెట్టియవకాశమును లేకుండఁ జేసికొని వచ్చితి నని నీవిప్పుడే చెప్పియుంటివి గాదా?

లు – నే నావిధముగాఁ జెప్పియుండలేదు. ఇఁక నామెంగూర్చి నాకెట్టివిచారమును లేదనిమాత్రమే చెప్పితిని.

పే – విచారము లేకపోవుట యేమి? నీవీయాగ్రానగరమున కంతకు నేకమాత్రాధీశ్వరివే కాకయున్నచో నీఁక నీజీవితమునకుఁ బ్రయోజన మేమున్నది?

లు – ఈయాగ్రానగరవైభవములతో నెట్టి సంబంధమును లేకుండఁ బోవుటవలననే నేను సుఖపడఁగలుగుదును.

పే – అదేమి? నీయుద్దేశమేమో నాకించుకంతయును బోధపడుట లేదు. నేఁ డేదియో నీకార్యము సఫలముగఁ జేసికొని వచితి నని చెప్పితివే! ఆశుభసమాచార మేమియో చెప్పుము!

లు – ఆ శుభవార్త యేమనగా – నేను నా జీవిత-కాలమునందు మరల నీయాగ్రానగరమును దర్శింపకుండఁ బోవుటకుఁ దగినయేర్పాటు గావించుకొని వచ్చియుంటిని.

పే – ఆగ్రాను బరిత్యజించి పోవుటవలన నేమిలాభ మున్నది? ఇట నుండి యెక్కడికిఁ బోవలయు ననినీయుద్దేశ్యము?

లు – నాకిఁక బంగాళాదేశమునకుఁ బోయి యచ్చట నివసించి యుండవలయు ననియున్నది. ఒకవేళ సాధ్యమైనచో నచ్చట నేపెద్ద మనుష్యునినైనఁ బెండ్లియాడి యిల్లాలనై సుఖింపవలెననికూడఁ గోరిక యున్నది.

పే – చాలు చాలు! ఇటువంటి 'ఛలోక్తులు నీకుఁ గ్రొత్తలు గావు; కాని, యిప్పటి నీమాటలు విని నా ప్రాణములు తల్లడిల్లిపోవుచున్నవి.

లు – నేనిప్పుడు పరిహాసముగ వచించుట లేదు. నేను నిశ్చయముగనే యీయాగ్రానగరమును బరిత్యజించి పోవలయు ననియనుకొనుచున్నాను. జహాంగీరుషాదుషావారియొద్ద సెలవు గోరి యాతని యనుమతి నందుకొనియే వచ్చియున్నాను.

పే – అయ్యయ్యో! నీకిటువంటి దుర్బుద్ధి పుట్టినదేమి?

లు – ఇది దుర్బుద్ధి కాదు. ఇంతకాలమునుండి నే నీ యాగ్రానగరమునందు విచ్చలవిడిగ సంచరించుచుంటిని గదా! ఇందువలన నాకుఁ గలిగిన ఫలలాభ మేమున్నది? అతి ప్రబలమగు సుఖాశనాకుఁ జిన్నతనమునుండియు నొక్కతీరుననే యున్నది. ఆ సుఖతృష్ణ నెట్లయిన జల్లార్చుకొని పరితృప్తి నందవలయునను నుద్దేశ్యముతోనే నేను వంగదేశమును ద్యజించి యింతదూరమువఱకును వచ్చియుంటిని. ఈ యమూల్యరత్నమును గ్రహించుటకై యెంతలేసివారెంతెంత ధనమును నిర్లక్ష్యముగ ధార పోయలేదు? ఎవ్వరెవ్వరెంతలేసి క్రూరకృత్యములను గావింపలేదు? మఱియు నే నేయే కోరికలను

సిద్ధింపఁజేసికొనుటకై యింతవఱకును వచ్చియుంటినో యుందేకోరిక నాకు లభింపకుండఁ బోయినది? ఐశ్వర్యము, సంపద, ధనము, గౌరవము, ప్రతిష్ఠ వీనిలో నాకేది లేకుండఁబోయినది? కావలసినంత వైభవమును, సుఖమునుగూడ ననుభవించితిని. యథేచ్ఛముగా నింతచేసినను నేమి ప్రయోజనము గలిగినది? ఇప్పు డిచ్చటఁ గూరుచుండి యాలోచించి జరగిపోయిన యాదిసముల నన్నిటిని లెక్కించి చూచుకొని యనుభవించిన యనుభవముల నన్నిటిని దలంచుకొని చెప్పవలసివచ్చిన-చో నేక దినమాత్రమైనను సుఖవతిని గాఁజాలకపోయితి ననియు, నెన్నఁడైన నొక్కక్షణమైన నెట్టి సుఖానుభవమును గాంచనేరకుంటిననియు స్పష్టముగాఁ జెప్పగలను! ఎప్పటికిని 'నాకుఁ దృప్తి యనుమాటయే లేకపోయెను. కేవలము తృష్ణ మాత్రమే యనునిమిషమును వర్ధిల్లిపోవుచుండెను. నేను తలఁచుకొని ప్రయత్నము గావించిన-చో నింకను మహత్తరమగు సంపదను, గావలసినంత యైశ్వర్యమునుగూడ సంపాదింపఁగలను – కాని యీయైశ్వర్య సంపత్తులకో నాకు నిమిత్త మేమున్నది? వానియం దేమాత్రమైనను సుఖమనునదియే యున్న-చో నిన్నిదినము లలో నొక్కనాఁడైనను నేను సుఖవతినై యుండవలసినదే. కాని యట్లుగా సుఖలేశమైన ననుభవింపలేకపోయితినే! ఈ సుఖాభిలాష యనునది పర్వతశిఖరమునుండి ప్రవహించు నిర్ఝరిణివంటిది – మొట్ట మొదట నది నిష్కలుషితమై, యల్ప వాహినియై, నిర్జనప్రదేశమునుండి బయలుదేఱును. అప్పు డది దానిగర్భమునం దదియే దాగికొనియుండును. అంతవఱ కది యెవ్వరికంటను బడియుండదు. ఆసమయమునం దది కలకలస్వరముతోఁ దనలోఁ దానే పాడుకొనుచుఁ బోవుచుండును. ఆపాటలప్పు డెవ్వరికిని వినఁబడకయే వాయుసముద్రమున సమ్మిళితమునై పోవును. క్రమక్రమముగా నది యెంతదూరముపోవునో దానిశరీరము గూడ నంత వర్ధిల్లుచుండును; అంతకల్మషముగూడ దానిలోఁ గలుగు

చుడును. అంతమాత్రముతో నాఁగునా? ఒకొక్కప్పు డది మహా వాయుతాడితమై యుత్తుంగతరంగములతో నెగసిపడుచుండును. దాని గర్భమునందుఁ గుంభీరాదిజలజంతువులు చేరి నివసించుట కారంభించును. అది యింకను దనశరీరమును వర్ధిల్లజేసికొనుచున్నకొలఁది నందలిజలము కలుషకర్దమభూయిష్ఠ మగుచుండును; క్షారమయ మగుచుండును. లెక్కలేనన్ని యిసుకతిప్పలును, ఊషర ప్రదేశములునుగూడ దాని హృదయమం దంతట నావరించుకొని యుండును. క్రమముగా దాని గమనవేగము మందీభూత మగుచుండును. అప్పటికి సంపూర్ణముగఁ గర్దమదూషితం బగు నానదీశరీరము కేవల మనంతమగు పారావారము నందెచ్చటఁ గలసి పేరులేకుండ బోవునో యెవ్వరు చెప్పఁగలరు?

పే — ఏమి యీయపూర్వవచోధోరణి! ఈమాటల తాత్పర్యము నేనించుకంతయును గ్రహింపఁజాలకున్నాను. ఇంతవైభవము, ఇంత యైశ్వర్యము, ఇంతయధికారము — ఇన్ని లభించి యున్నను నీకించు కంతయును సుఖము గలుగకుండుటకు గారణ మేమి?

లు అట్టిసుఖానుభవము నా కేకారణముచే లభింపకపోయినదో నేనింతకాలమున కిప్పుడు గ్రహింపఁగలిగితిని. మూఁడుసంవత్సరములు మహారాజప్రాసాదమునందు చల్లనినీడను గూర్చుండి సర్వవైభవములఁ గాంచుచుండియు ననుభవింపఁజాలని సౌఖ్యమును, నే నూరియందుండి బయలుదేఱి వచ్చుచు మార్గమధ్యమునం దాపాంధసత్రములో నొకరాత్రియం దనుభవించితిని. ఆగ్రామందలివత్సరత్రయవైభవమునకును, ఆపాంధశాలయం దారాత్రి లభించినసుఖమునకును, పోలిక యేమున్నది? ఇప్పటికి నాకు సుఖస్వరూపము బోధపడినది.

పే — ఏమి బోధపడినది?

లు — నేనింతకాలమువఱకును హిందూప్రజల దేవతామూర్తివలెఁ బైపైని సువర్ణమణిమయాభరణాదులచే నలంకరింపఁబడియున్నను

లోలోపలఁ గేవలపాషాణస్వరూపమునే వహించి యున్నాను. ఇంద్రియ సుఖలాభముం గోరి దారుణానలజ్వాలలలోఁ బడి యట్టిసుఖముకొఱకు వెదకికొనుచుఁ నిత్యమును బరిభ్రమించుచుంటిని. ఇక నీపాషాణమధ్య ప్రదేశమునందు బాగుగ నన్వేషణము గావించి యిందెచ్చటనైన రత్న నాళములతోఁ గూడియున్న యొకయంతఃకరణ మనునది యేదియైన నున్న దేమో యొకసారి పరీక్షింపవలసియున్నది.

పే — ఏమో! ఇప్పుడు నీవు చెప్పుచున్న యీమాటల యర్థము గూడ నాకేమియు బోధపడుటలేదు.

లు — సరే. దానికేమి? నిన్నొకమాట యడిగెదను చెప్పుము! నేనీ యాగ్రానగరమునం దెప్పుడైన నేయొక్కనినై ననుఁ బ్రేమించియుంటినా?

పే — (మనసులోనే తడఁబడిపోవుచు) ఎవ్వరినిగూడ నీవు నిజముగాఁ బ్రేమించినట్లు నాకగపడలేదు.

లు — ఔనా? ఇట్టిచో నేను పాషాణవిగ్రహమునుగాక మఱి యేమయియుందును?

పే — ఇప్పుడు నీ వెవ్వరినైన ప్రేమింపఁ దలఁచుకొన్నచో నెందుకుఁ బ్రేమింపఁగూడదు? నిన్నడ్డగలవా రెవ్వరున్నారు?

లు — నామనసులోమాత్ర మట్టి యభిలాష యున్నమాటసత్యమే— అందుకొఱకే నేనీయాగ్రానగరమును బరిత్యజించి పోవుటకు నిశ్చయము చేసికొనియున్నాను.

పే — అట్లుపోవుటవలనమాత్రము విశేషప్రయోజన మేమున్నది? ప్రేమించి యుండుటకు నీకీ యాగ్రానగరమునందు మానవులే లేక పోయిరా? ఇట్టిస్థితిలో గొండలను, గుట్టలను బట్టి పోవుట యెందుకు? చక్కనిరూపుసఁగాని చాలినంతధనమునఁ గాని, సంపూర్ణమగు నైశ్వర్యమున గాని, సర్వోత్కృష్టమగు నధికారమునగాని యెట్టి లోపమును లేని మన ఫాదుషావారికంటెను గొప్పవాఁ డీభూమండలమునందు మఱి యొకఁ డెవ్వఁ డున్నాఁడు?

లు — ఆలాగా? ఆకాశమండలమునందుఁ దేజోమూర్తులై చంద్రుఁడును, సూర్యుఁడు నుండఁగా జలము కేవల మధోగమనముతో భూమండలమును జేరుట కేమి కారణము?

వే — కారణ మేమో నీవే చెప్పుము!

లు — దానినుదుటివ్రాఁత యట్లున్నది.

లుత్పఉన్నీసా తన మనసులోని యభిప్రాయముల నన్నిటిని స్పష్టముగాఁ దన సహచారిణియొద్ద వెల్లడించి యుండలేదు. ఇప్పు డా పాషాణవిగ్రహగర్భమునం దగ్నిజ్వాల ప్రవేశించినది. క్రమముగా నా కఠినశిల ద్రవీభూత మగుచుండెను.

ఆఱవ ప్రకరణము

చరణశరణము

"స్వామి! త్రికరణశుద్ధి నీ చరణపీఠిఁ
జేరి యాత్మార్పణంబు నేఁ జేసికొంటి;
గావలసినట్టిరాజభోగంబులెల్ల
ననుభవింపు మీదాసి హర్షమందు.

— వీరాంగన (అనువాదము)

సుక్షేత్రమునందు బీజమును నాఁటినచో నది తనంతనే యంకురించును. అది యెప్పుడు మొలకలెత్తునో సరిగా నెవ్వరును దెలిసికొనఁజాలరు — ఆసమయము నెవ్వరును గనుపెట్టి చూడఁజాలరు. కాని యొకసారి బీజావాపము గావించి యట్లు చేసినయాతఁ డెచ్చట నెట్లున్నను క్రమముగా నంకురించి యెదిగి తలయెత్తుట కారంభించును. అప్పటి కామొక్క యొకటిరెండంగుళములుమాత్రము పరిణామము గలిగియుండును. అప్పుడైనను దానివంక నెవ్వరును జూడరు. ఆమొలక

యట్లే కొంచెము కొంచెముగా నెదుగుట కారంభించును. కొన్నాళ్ళ కది జేనెడై, మూరెడై, బారెడై కొలదిగా విస్తరించును. అయినను దానివలన నెట్టిప్రయోజనము నగపడకపోవుటచే నెవ్వారును దానివంక జూడఁబోరు. ఒకవేళఁజూచినను దానియెడల నుదాసీనులుగనే యుందురు.

కొన్నిదినము లట్లు గడచిపోవును; మాసములు గడచిపోవును; వత్సరము లూడఁ గడచిపోవును. క్రమముగా నప్పుడు దానివంక గన్నులుపడుట యారంభ మగును. ఇక దానివిషయమున నిర్లక్ష్యముగా నుండుట జరుగదు. తుదకది గొప్పవృక్షమై విశాలములగు శాఖోపశాఖలతో వ్యాప్తమై యుండును. దానినీడను జనించిన యితర వృక్షములన్నియును నశించిపోవును. క్రమముగా నాక్షేత్ర మన్యభూరుహవిరహిత మైపోవును.

లుత్ఫున్నీసాప్రేమ యీవిధముగాఁ గ్రమాభివృద్ధి నందినది. ఆమె ప్రణయమునకుఁ బాత్రభూతుఁడై న పురుషుని మొట్టమొదట నే దినమునం దాకస్మికముగా దర్శించి యుండెనో యాసమయమునం దామె తనహృదయమునందలి ప్రేమభావానుభవము నంతవిశేషముగా దెలిసికొని యుండలేదు. కాని యప్పుడే యజ్ఞాతముగా నట్టిప్రేమ యంకురించినది. ఆ తరువాత నది మరల ననుభవమునకు వచ్చియుండలేదు. అయినను దెలియకుండగనే ప్రణయభాజన మగు నాముఖమండలము మాటిమాటికి నామె మనఃఫలకమునఁ బొడసూపుచునే యుండెను; స్మృతిసరసియం దావదశకమలము సంకోచవికాసములఁ గాంచుచునే యుండెను. అట్లు తోఁచుచుండుటవలన నామె కెంతయో సుఖానుభవ మగుచున్నట్లు బోధపడుచునే యుండెను.

ఆప్రణయబీజము యథాసమయమందే యంకురించినది. అప్పుడే యప్రణయమూర్తియం దనురాగమును జనించినది. ఏమానసిక వ్యాపార మెన్నిసారు లెంతయధికముగా నగుచుండునో యా వ్యాపారమునందంత

యధికమైన ప్రవృత్తి యగుచుండును. క్రమక్రమముగా నదియే స్వభావ సిద్ధ మైపోవుచుండెను. సర్వసాధారణమగు మానసికధర్మ మిట్టిదియే.

లుత్ఫుఉన్నీసా యహరహము ననునిమిషమునుగూడఁ దన హృదయమునం దాప్రేమమయమూర్తిని భావించుకొనుచునే యుండెను. అందుచేత నామె కవిలంఘ్యమగు దర్శనాభిలాష యుదయించుచునే యుండెను. ఆకాంక్షతోఁగూడ స్వభావసిద్ధ మగు నామె స్పృహా ప్రవాహముగూడ దుర్నివార మైపోవుచుండెను. దానియెదుట ఢిల్లీ సింహాసనము నధికోహింపవలయుసను వాంఛకూడఁ దృణప్రాయమై యలక్ష్యమగుచుండెను. అందుచేతనే యామెకిప్పుడు సర్వభారతరాజ్య సింహాసనము మదనబాణానలకీలాభీలముగఁ దోచుచుండెను. అందు చేతనే యాలుత్ఫుఉన్నీసా హృదయమిప్పుడు, రాజ్యమును, రాజధాని నగరమును, రాజసింహాసనమును, సర్వమునుగూడఁ బరిత్యజించివై చి ప్రియజనసందర్శనార్థమై శరవేగమునఁ బరుగువారుచున్నది. ఆప్రియుఁ జనుఁ డెవ్వరు? నవకుమారుఁడే!

అందుచేతనే లుత్ఫుఉన్నీసా యిప్పుడు తనయాశల నన్నిటిని సమూలముగాఁ ద్రుంచివైచిన మెహరున్నీసా యుదంతమును సర్వమును దెలిసి యుండియు నెంతమాత్రమును నిరుత్సాహమును జెందుటలేదు అందు చేతనే యామె మరల నాగ్రానగరమునకు వచ్చియుఁ దనవైభవమును గాని, యధికారమునుగాని, యైశ్వర్యమునుగాని కాపాడుకొనుట కెట్టి ప్రయత్నమును గావించుచుండుట లేదు. అందుచేతనే యామె తన జీవితకాలమునం దిఁక నెన్నఁడును దర్శనముగావింపకుండుపద్ధతిని సార్వ భౌముఁ డగు జహాంగీరుపాదుషా యొద్ద నెలవును బడసియుండెను.

ఆగ్రాయందిఁక నెట్టికాలవిలంబనమును గావింపక యతిశీఘ్రముగా లుత్ఫుఉన్నీసా బంగాళా దేశమునందలి సప్తగ్రామమునకుఁబోయియచ్చట నివసించి యుండెను. ఆగ్రామమునందు రాజమార్గమునకు సమీపము

నండే గ్రామమధ్యమునం దొకవిశాలస్థలమును దీసి కొని యందొక రమణీ యమగుసౌధమును గట్టించుకొని సపరివారముగా నామెయందు వాసము చేయుచుండెను. ఆమె యచ్చట సువర్ణమణి ఖచితములగు వసనభూషణాదుల నలంకరించుకొనుచు దాసదాసీజనముతోఁగూడి యొక మహారాజ్ఞివలె మెలంగుచుండెను.

ఆభవనమునందలి ప్రతిగృహమునుగూడ నతిమనోహరముగ నలంకరింపఁబడి, సుగంధద్రవ్యములు, సుగంధజలములు, సుగంధకుసుమదామములు మొదలగువానిచే నెల్లయెడలఁ బరిమళప్రపూర్ణములై యుండెను. బంగారము, వెండి, గజదంతములు మున్నగు వస్తువులచే నిర్మింపఁబడిన యనేకచిత్రవిచిత్రములగు గృహాలంకారసామగ్రియెల్లెడల నిండి యామందిరమునకు రాజభవనసౌభాగ్యము నాపాదించుచుండెను.

ఇట్లు బాగుగ నలంకృతమైన ప్రత్యేక మగునొకగదియందు లుత్ఫ ఉన్నీసా యొకనాఁటిసాయంకాలమున నధోవదనయై కూర్చుండి యుండెను. ఆమె కెదురుగనున్న యొకయుత్తమాసనముపై నవకుమారుఁడుపవిష్టుఁడై యుండెను. ఆసప్తగ్రామమునకు వచ్చినతరువాత నిదివఱకొకటిరెండుపర్యాయములు లుత్ఫఉన్నీసా నవకుమారుని దర్శించి యుండెను. అట్లుచూచుటవలన లుత్ఫఉన్నీసా మనోరథమెంతవఱకు ఫలించినదో వారిరువురను సంభాషించుకొన్న యీక్రిందిమాటలనుబట్టి మాపాఠకులకు స్పష్టముగా బోధపడఁగలదు.

నవకుమారుఁడు కొంతసేపటివఱకు నేమియుమాటాడక యట్లే కూర్చుండి తరువాత నించుక గళము సవరించుకొని "అట్లయినచో నేనిఁక బోయెదను. నీవు నన్నిఁక నెన్నఁడును బిలిపింపవలదు!" అనెను.

లుత్ఫ — వలదు! పోవలదు! మీతో నింకను గొంచెము మాటాడవలసి యున్నది. నేను చెప్పవలసినవిషయ మింకను బూర్తి కాలేదు. ఇంచుకసే పాఁగి విని మఱి పోవచ్చును.

నవకుమారుఁడు మఱియు నొకక్షణముసేపు ప్రతీక్షించి యుండెను. కాని లుత్ఫున్నీసా యేమియును మాటాడలేదు. మఱికొంతసేపైన తరువాత నవకుమారుఁడు "నీవింకను జెప్పవలసినమాట యేమో చెప్పుము!" అనెను.

లుత్ఫున్నీసా యేమియును ప్రత్యుత్తరము చెప్పలేదు. ఆమె మాటాడకుండఁగనే కన్నీరు విడుచుచు దలవంచికొనియుండెను.

నవకుమారుఁ డదియంతయును గాంచి చటాలున లేచి నిలువఁబడెను. లుత్ఫున్నీసా యాతనిపరిధానాంచలమును బట్టుకొని యాతని బోకుండ నాపివై చెను. నవకుమారుఁ డించుక విరక్తభావముతో "ఎందు కీనిర్బంధము? చెప్పవలసినఁ దేమియో చెప్పఁగూడదా?" అనెను.

లు — ఇంకను మీకేమి కావలయునో తెలుపుఁడు! ఈభూమండలమునందు మీకు వాంఛనీయమగునది యేదియును లేనేలేదా? ధనము, సంపద, గౌరవము, ప్రణయము, విలాసము, వైభవము, ఇంకను నీధరాతలమునందు సుఖదాయకములగు నీయేరహస్యకాంక్షితములు గలవోయవి యన్నియును మీకు సమకూర్పఁగలను. నేను మీకట్లు సమర్పించినందు కెట్టిప్రతిఫలమును వాంఛించుట లేదు. కేవలము నేను మీదాసిగా నుండుటకుమాత్ర మంగీకరింపవలయునని వేఁడుకొను చున్నాను. మీయిల్లాలినై యుండఁదగినగౌరవమును దయచేయవలయు నని కోరుకొనుట లేదు. కేవలము దాసినై యుండుటకే!

నవ — నేను కేవలమును బీదబ్రాహ్మణుఁడను! ఈజన్మమునం దిట్లే దరిద్రుఁడనై యుండవలసినదే! కాని నీవిప్పుడు చెప్పిన ధనసంపదా దులను నీవలన సంపాదించుకొని యవనకాంతాలోలుఁడనై జారుఁడనై నలువురిలోనను బరాభవింపఁబడుచు బ్రదుకఁజాలను.

యవనకాంతాలోలుఁడు! యవనీజారుఁడు! — రమణీమణియగు నీలుత్ఫున్నీసా తనభార్యయే యని నవకుమారుని కింతపర్యంతమును

దెలియనే తెలియదు! లుత్ఫున్నీసా యాతనిమాట విని మరల నధోవదనయైపోయెను. అప్పుడు నవకుమారుఁ డామెచేతులయందున్న కుచ్చెళ్ళచెఱఁగును వదలించుకొనియెను. కాని లుత్ఫున్నీసా మరల నావస్త్రాగ్రమును బట్టుకొని యాతని గదలనీయదయ్యెను.

అట్లు కొంతసేపైనతరువాత లుత్ఫున్నీసా "సరే, ఆ మాటలకేమి? పరమేశ్వరోద్దేశముకూడ నట్లే యున్నచో నీఁక నా యాశ లన్నియు నధఃపాతాళజలములలోఁ బడి పేరు లేకుండఁగనే పోవచ్చును. కాని మఱి యొక్కమనవి చేసికొనుచున్నాను. అది యంతగాఁ ద్రోసివేయఁదగినది కాదు—చూడుఁడు! నాయందుఁబరిపూర్ణానుగ్రహముంచి మీరెప్పుడైనఁ దీరక చేసికొని యొక్కసారి యీవీథికి వచ్చుచుండుఁడు! కన్నులార, మనసుదీర దినమున కొక్కసారియైన మీపాదదాసి నగుననున్ను మీ సందర్శనము చేసికొననిండు! కేవలము చక్షురింద్రియ పరితృప్తికొఱకు మాత్రమే యీనాకోరిక!" అని ప్రార్థించెను.

నవ — నీవు మహమ్మదీయ యువతివి — ఇంతేకాక పరకాంతవు — నీతో నీ విధముగా సంభాషించుటయే దోషము! ఇఁక నెన్నఁడును నేను నీకన్నులయెదుటఁ బడఁజాలను.

రెండుమూఁడు నిమిషములవఱకు నిరువురునుగూడ నిశ్శబ్దముగా నుండిరి. లుత్ఫున్నీసా హృదయమునం దప్పుడు తుపాను పుట్టి చెలరేగుచుండెను. ఆమె శిలావిగ్రహమువలె నిశ్చేష్టురాలై యుండెను. కొన్ని నిమిషములకామె నవకుమారుని వసనాంచలమును విడిచిపైచి "సరే! ఇఁక నేనేమి చేయఁగలను? పొండు!" అనెను.

నవకుమారుఁడు వెడలిపోవుచుండెను. అట్లు నాలుగైదడుగులు నవకుమారుఁడు నడచునప్పటి కాకస్మికముగా లుత్ఫున్నీసా ప్రబలమారుతోన్మూలితభూరుహముంబోలి యాతని చరణసాన్నిధ్యమునఁ బడిపోయెను. అప్పు డామె తనకోమలబాహువల్లికలచే నవకుమారునిపాద

కమలములను బంధించి పట్టుకొని దీనహీనగద్గద స్వరముతో "కఠిన హృదయా! నేను కేవలము నీయందలి యాశచేతనే యీగ్రామనగరమహా రాజసింహాసనమునుగూడఁ బరిత్యజించి వచ్చితిని. ఇట్టి త్వదేకశరణ్యనగునన్ను నీవు పరిత్యజించి పోవలదు" అని వేడుకొనెను.

నవ – నీవు మరల నాగ్రామనగరమునకే బయలుదేఱిపొమ్మ్ము! నాయాశవదలుకొనుము!

"నాకంఠమునఁ బ్రాణము లుండఁగనేనా?" అనుచు లుత్ఫుఉన్నీసా చటూలున లేచి నిలువఁబడి దృఢస్వరముతో "ఇఁక నేను నాజీవితమునందు నీ యాశను వదలుకొనుదాననుగాను!" అని తలను బైకెత్తి సవిలాసముగ ఘెడ నించుక వంచి నవకుమారునివదనమండలమువంక ననిమిషనయనములతోఁ దిలకించుచు రాజరాజుమోహిని యగు నారమణీమణి రతనపుబొమ్మవలెఁ జలన మించుకంతయు లేకుండ నిలువఁబడి యుండెను.

ఇంతవఱకు నామె హృదయానలజ్వాలలలోఁ గరగిపోయిన దుర్నివార్యమగు నామె సహజాఖర్వగర్వము మరల నిప్పుడు తన పూర్వతేజస్ఫూర్తితోఁ దలసూపఁ దొడంగెను. అజేయ మగునేమానసికశక్తి నూతనభారతరాజ్యప్రతిష్ఠాపనము గావించునుద్యమమునఁ బ్రవేశించుటకెంతమాత్రమును భయపడలేదో యట్టిదివ్యశక్తి యిప్పుడు మరలఁ బ్రేమముగ్ధమై, దుర్బలమైయున్న లుత్ఫుఉన్నీసా శరీరమునందలిప్రతిరక్తాణువునందును బదీప్తమగుచుండెను. ఆమె సుస్నిగ్ధలలాట ప్రదేశమునందలి ధమనులన్ని యునుఁవికసించిమనోహరరేఖారూపమున నలరారుచుండెను; జ్యోతిర్మ్మయంబులగు నామె తరళనయనములు దినకరకిరణసముజ్జ్వలంబులగు సముద్రజలంబులంబోలి మిలమిల మెఱయుచుండెను; ఆమె నాసారంధ్రములు తీవ్రశ్వాసములచే వికసితములై కంపించుచుండెను; నదీతరంగవిహారిణియగు రాజహంసి తనగమనమునకు నిరోధకం బగు వస్తువుం గాంచి యెట్టిగ్రీవాభంగముతో నిలువఁబడిపోవునో, పాదతాడి

తంబగు ఫణిని యేరీతిగా రోజుచుఁ బడగవిప్పుకొని యెదిరించి నిలుచునో యాపిధముగనే యున్మాదినియగునాయవనకామిని నిలువఁబడియుండెను. ఆమె యట్లే చూచుచు సగర్వముగా "నేనిఁక నా జీవితకాలమునం దట్టిపని చేయను! నీవు తప్పక నావాఁడవే యైతీరవలయును!" అని దృఢస్వరముతో నుగ్గడించెను.

అట్లు కుపితకుండలినీమూర్తిం దాల్చియున్న లుత్ఫుఉన్నీసాను జూచుచు జూచుచు నవకుమారుఁడు భయవిహ్వలుఁ డై పోయెను. ఆ సమయమునందు లుత్ఫుఉన్నీసా మోహనమూర్తియందు దీపించుచున్న యనిర్వచనీయ ప్రతిభామయ దివ్యశక్తి యావిధముగా నెన్నఁడును బ్రకాశితమై యుండలేదు — ఆశోభాసౌభాగ్య మశనిపాతసూచకమగు విద్యుత్సారముంబోలి మనోమోహనకరమైనది! కాని చూచుటకు భయంకరమైనది!

నవకుమారుఁడు వెడలిపోవుచుండఁగాఁ నాతనిహృదయమునం దాక స్మికముగా నొక తేజోమయదివ్యసుందరమూర్తి గోచరించెను. ఒకనాఁడు నవకుమారుఁడు తన ప్రథమభార్యయగు పద్మావతియెడల విరక్తుఁడై యామెను దనశయనమందిరమునుండి గెంటివై చుటకుఁ బ్రయత్నము గావించెను. అప్పుడు పండ్రెండేండ్లబాలిక యగునాపద్మావతి దరోన్మీల్ల లయై నవకుమారుని యెట్టయెదుట నిలువఁబడినది! అప్పు డాసుందరి విశాలదీర్ఘనయనము లీవిధముగనే ప్రదీప్తములై యుండెను; ఈవిధముగనే యప్పుఁ డామె లలాటరేఖలు వికాసముం గాంచి యుండెను. ఈ విధముగనే నాసారంధ్రములు ప్రకంపితములై వెఱపు గొలిపియుండెను; ఈ విధముగనే యుత్తమాంగము నెత్తి యెదిరించి నిలిచి యుండెను. చాలకాల మైనది — ఇంతవఱకు నామూర్తి తలఁపునకు దోచుటయే లేదు! ఇప్పు డామూర్తి నవకుమారుని మనఃఫలకమునం దాకస్మికముగా ముద్రిత మయ్యెను? ఆనిమిషమందే యామూర్తికి, నీమూర్తికిని సాదృశ్యమనుభవమునకు వచ్చెను.

నవకుమారుఁ డప్పుడు సంశయాధీనహృదయుఁడై లుత్ఫున్నీసా వంకఁ జూచి సంకుచితస్వరముతో మెల్లమెల్లగా "నీ వెవ్వరు?" అని ప్రశ్నించెను.

యవనసుందరీ వేషముతో నున్న లుత్ఫున్నీసా నయనతారకలను విస్ఫారితములుగాఁ జేసి "నేను పద్మావతిని!" అని బదులు చెప్పెను.

ఇట్లు చెప్పివైచి ప్రత్యుత్తరముకొఱకు నిరీక్షించకుండఁగనే లుత్ఫున్నీసా యటనుండి స్థానాంతరమునకు వెడలిపోయెను. నవకుమారుఁడును విమనస్కుఁడై యించుక చింతాసంశయాధీనుఁడై తనయింటికిఁ బోయెను.

ఏడవ ప్రకరణము

ఉపనగరప్రాంతము

"..... I am setted, and bend up
Each corporal agent to this terrible feat."
— *Macbeth.*

లుత్ఫున్నీసా మఱియొక గదిలోనికిఁ బోయి తలుపులు మూసివైచుకొనియెను. రెండుదినములవఱకు నామె యాగృహమునుండి వెలుపలికి రానేలేదు. ఈ దినద్వయమునందే యామె తన కర్తవ్యాకర్తవ్య విషయములంగూర్చి యాలోచించుకొని యొక నిశ్చయమునకు రాఁగలిగెను. అట్లామె యొకసిద్ధాంతము చేసికొని యట్లు చేయుటకు దృఢప్రతిజ్ఞను వహించెను.

సూర్యుఁడస్తంగతుఁడయ్యెను. అప్పుడు లుత్ఫున్నీసా తన సహచారిణి యగుపేష్మనఁ సహాయముచే నలంకరించుకొనుచుండెను. అప్పటి యావేషభూషణము లత్యాశ్చర్యకరములై పొడకట్టుచుండెను. ఆవేషమునందు రమణీరమణీయాకారమును సూచించుచిహ్నములు లేశమైనను గానవచ్చుట లేదు. లుత్ఫున్నీసా యట్టిరూపమును ధరించి నిలువుటద్దమునొద్దకుఁ బోయి ప్రతిబింబమును జూచుకొనుచు పేష్మను

ను ద్దేశించి "చెలీ! నేనిప్పు డెట్లున్నాను? నన్నిఁక నెవ్వరైన నానవాలు పట్టగలరా?" అని ప్రశ్నించెను.

పే – అట్లు గుర్తించుట యెవరితరము?

లు – సరే! ఇఁక నేను పోయెదను. నా వెంట నేపరిచారికయైనను, బరిచారకుఁ డైనను దోడుగా రావలసినయావశ్యక మేమియును లేదు. నేనొక్కదానినే పోయివచ్చెదను.

పేష్మను కొంచెము సంకుచితచిత్తముతో "ఈదాసియపరాధమును మన్నించినచో నొక్కమాట మనవి చేసికొనఁదలఁచి యున్నది" అనెను.

లు – అదియేమో చెప్పుము!

పే – ఇప్పుడు నీవొంటిగా నెందుకుఁ బోవుచుంటివో యావిషయ మును దెలుపఁగోరెదను.

లు – సర్వవిధములఁ బ్రయత్నము గావించి యా కపాలకుండలకు నాస్వామితోడి చిరవియోగమును సంఘటిల్ల జేయుటకొరకు – అట్లుగావించినతరువాత నాభర్తను నాయధీనము చేసికొనుట కవకాశము లభించును.

పే – బీబీ! ఈ విషయముంగూర్చి బాగుగ నాలోచింపవలసి యున్నది – అదిగాక యిప్పుడు నీవుపోవుమార్గము సాంద్రారణ్యమధ్యము నుండి – సమయము సంధ్యాతీతకాలము – నీవో – ఒంటికత్తెవు!

లుత్పఉన్నీసా పేష్మనుమాటల కెట్టి ప్రత్యుత్తరమును జెప్పలేదు. ఆమె యాత్మభవనమును విడిచి బయలుదేఱిపోయెను. సప్తగ్రామమునం దెట్టి జనసమ్మర్దమును లేనిమహారణ్యామయం బగునుపనగరప్రాంతము నందు నవకుమారుని మందిర ముండెను. లుత్పఉన్నీసా యిప్పు డా గృహమున కభిముఖముగనే పోవుచుండెను. ఆమె యచ్చటికిఁ జేరు కొనునప్పటికి గొంతరాత్రికూడఁ గాఁగలదు. నవకుమారునియింటి కనతిదూరమునందే యగమ్యమగు నిబిడకాననము వ్యాపించి యుండె నని పాఠకులకు జ్ఞప్తి యుండవచ్చును. ఆయరణ్యాసమీపమునకే పోయి

లుత్పఉన్నీసా యొకవటవృక్షముక్రిందఁ గూర్చుండి యుండెను. అట్లామె కొంతసేపటివరకు నాసీనయై యుండి తాను చేయనుద్దేశించుకొన్న మహా సాహసకార్యముంగూర్చి యనేకవిధములు నాలోచించుకొనుచుండెను. అప్పుడు దైవవిధిచే నామె యిదివఱ కూహించుకొనినట్టియు, సాధారణముగా నసంభవమైనట్టియు నొకయపూర్వసాహాయ్యమామెకులభించెను.

లుత్పఉన్నీసా యెచ్చటఁ గూర్చుండి యుండెనో యాప్రదేశమునకు సమీపమునుండియే యెడతెగకుండ మానవకంఠమునుండి సమస్వరో చ్చారితంబును, సమగతినిశిష్టంబు నగునొకశబ్దము వినవచ్చుచుండెను. ఆకంఠధ్వని నాకర్ణించి యామె చటాలున లేచి నిలువఁబడి నలుదెసల నవలోకించెను. అప్పు డావిపినమధ్యమునం దొకవెలుఁగామెకన్నులఁ బడెను. ఎంతటిధీరులుగు పురుషులకైనను దుర్లభమగు సాహసము లుత్పఉన్నీసాకు సహజముగనే యున్నది.

ఆకారణముచేతనే యామె యాకాంతి యగపడుచున్నప్రదేశమున కభిముఖియై నిర్భయముగాఁ బోయి సమీపించి యొకచెట్టుచాటునుండి యావెలుఁగేమియో పరీక్షించుచుండెను. అచ్చట నెవ్వరో యొక వ్యక్తి సమిధలతో హోమకుండమును ప్రజ్వలింపఁజేసి యం దాజ్యాదు లతో హోమము గావించుచుండెను. అదియే యావెలుఁగు – ఆమెకు వినవచ్చినశబ్దఁమాత్రనిమంత్రపఠనావసమే – ఆమంత్రమధ్యమునం దొక శబ్దమునూడ వినవచ్చుచుండెను. ఆశబ్ద మొకవ్యక్తినామధేయము ఆపేరు విన్నంతమాత్రమునసే లుత్పఉన్నీసా యట్టి హోమముచేయు చున్న వ్యక్తిసమీపమునకుఁ బోయి యచ్చటఁ గూర్చుండెను.

ఇప్పుడు లుత్పఉన్నీసా నచ్చటఁ గూర్చుండి యుండఁడనింకా! పోకు లారా! చాలకాలమునుండి మనకుఁ గపాలకుండలవృత్తాంత మేమియును దెలియుట లేదు. ఇప్పు డామెసమాచారమును మనము తెలిసికొన వలసియున్నది!

LIBRARY V.R.NARLA D.P.R.I. ACC No.

కపాలకుండల

చతుర్థఖండము

మొదటి ప్రకరణము

శయనాగారము

"ధనమువై భవమును దనువును మనసుఁ
బ్రాణంబు నాత్మసర్వస్వంబుఁగూడ
నా త్మేశ్వరునకు నీకర్పించినట్టి
జలజాక్షి రాధకీసంకెలలేల ? —
బహిరంతరంగనిర్బంధంబు లెల్ల
నిఁకనె నసడలింపవేమి ? నా సామి ! "

— వ్రజాంగన (తెలుగుసేత)

ఆనాఁడాగ్రాకుఁ బోవుచు లుత్ఫున్నీసా కపాలకుండలను గాంచినది. తరువాత నామె యాగ్రానగరమును విడిచి సప్తగ్రామమునకు వచ్చి యించుమించుగా నొక యేఁడాది కావచ్చినది. కపాలకుండల యొక సంవత్సరముకంటె నధికకాలముక్రిందటనే నవకుమారునికి గృహిణియై యుండెను.

ఏదినమునఁ బ్రదోషకాలమునందు లుత్ఫున్నీసా విపినమధ్యమున హోమము చేయుచున్న వ్యక్తి చెంతఁ గూర్చుండి యుండెనో యాదిన మునం దాసమయమునసే కపాలకుండల పరధ్యానముతోఁ దనశయనా గారమునందుఁ గూర్చుండి యుండెను.

మాపాఠకులు సముద్రతీరమునం దొకసారి యాగుల్భలంబితకుంతల దామయు, సువర్ణమణిమయాలంకారవిహీనయు నగు కపాలకుండలను దిలకించియున్నారు. ఇప్పటి కపాలకుండల యా తీరునలేదు ! శ్యామ

సుందరివచియించినభవిష్యద్వాణియథార్థమైనది. పరుసవేది సంపర్కము వలన నినుముకూడ బంగార మైనట్లు నవకుసూనసంయోగమునలన నిస్సా డాయోగిని గృహిణియై యుండెను. నీలభూజంగసన్నిభములై, యొత్తును నిడుపును గలిగి కాలిమడమలవఱకును వ్రేలాడుచుండు నామె నిద్దంపుగురు లిప్పుడు వేణీబద్ధములై విరాజిల్లుచుండెను. ఆ నెఱివేణి యతిమనోహరమగు శిల్పరచనాకౌశలముచే సవరింపఁబడినట్లు ద్యోతక మగుచుండెను. ఆ కుంతలవిన్యాసమునందలి సూక్ష్మములగు జిలుఁగు బంగరునగల యమరిక శ్యామసుందరికిఁ గలయలంకార రచనానైపుణ్య మును బ్రకటించుచుండెను. ఆవేణియందలి కుసుమదామము నతువంక లను బరివేష్టించి కిరీటమండలాకారమున శోభాయమాన మగుచుండెను. అందందు వేణీవిన్యస్తములుగాకయున్న కుంతలములు శిరోభాగమునం దంతటను సమోన్నతములై వ్యాపించియున్నట్లు లేవు. వరుసలు వరుస లుగ నాకుంచితములై నీలమేఘతరంగమాలికలవలె విరాజిల్లుచుండెను. ఇప్పు డాముఖమండలము చికురభారముచే నర్ధావృతమై యుండలేదు. తేజోమయమై వికచకమలమువలె విలసిల్లుచుండెను. అందుఁ గేవల మచ్చటచ్చట విశీర్ణములగు చికురగుచ్ఛములు వదనసౌందర్యమును వర్ధిల్ల జేయుచుండెను. ఆముంగురులు చిఱుచెమ్మటలచేఁ గణతలనంటి చిత్రముగఁ జిత్రించినట్లుండెను. ఆ శరీరకాంతి యర్ధపూర్ణశశాంకకిరణ దీధితులఁ దులకించుచుండెను. ఇప్పు డామె వీనులు రెండును మణికన కాభరణభూషితములై యలరారుచుండెను. ఆమె కంఠప్రదేశమున, ముక్తాకాంచనహారములు విలంబితములై యుండెను. ఆ శరీరకాంతిలో నాభరణమాత్రమును మ్లానములై యుండుటలేదు. అర్ధ చంద్రకౌముదీవసనయగు ధరణీదేవివక్షమునందు విరాజిల్లుచుండు నై శ ప్రసూనములవలె శోభిల్లుచుండెను. ఆమె యిప్పుడు తెల్లని చలువ దువ్వలువను ధరించి యుండెను. ఆశ్వేతవసనముకూడ నామె శరీరమునం

దర్ధచంద్రచంద్రికాప్రదీపిత మగు నాకాశమండలమునందలి పలుచని తెల్లమబ్బు తెఱవలె శోభాయమాన మగుచుండెను.

ఆమెనెమ్మోనివన్నె పూర్వమువలె సర్ధచంద్రచంద్రికాసన్నిభమై యున్నమాట నిజమే — కాని యిప్పుడావర్ణము గగనమండలప్రాంత మునం దెచ్చటనో యొకచోట గాలనీరదశకలము గానవచ్చుచున్న ట్లించుక న్యూనమైయుండెను.

ఇప్పుడు కపాలకుండల తనగదిలో నొంటిగాఁ గూర్చుండి యుండ లేదు. ఆడుబిడ్డ యగు శ్యామసుందరికూడ నామెచెంగటనే యుపవిష్ట యై యున్నది. వా రుభయులును పరస్పరము నేదోవిషయముంగూర్చి సంభాషించుకొనుచుండిరి. ఆసంభాషణమునందలి కొంతభాగము నిప్పుడు మాపాఠకమహాశయులు వినియెదరుగాక!

కపా — వదినే! మాయన్నగా రింకను నిచ్చట నెన్నిదినము లుండె దరో నీవు చెప్పఁగలవా?

శ్యా — రేపటిప్రాతఃకాలమునకే లేచి స్వగ్రామమునకుఁ బోయెద నని చెప్పియున్నారు. ఏమి చేయుదును? ఈరాత్రి యాయోషధి నెట్లు యిన సంపాదించి తేఁగలిగితినేని నిశ్చయముగా దానిప్రభావముచే నాస్వామిని స్వవశముగాఁ జేసికొని నాయీ నారీజన్మమును సార్థకముగఁ జేసికొని యుందును. నిన్నటిరాత్రి బయటికిఁ బోయినందుకే చీవాట్లు తినవలసి వచ్చినది. ఇఁక నేఁడుపోవుటకుమాత్ర మవకాశ మేమున్నది?

కపా — ఆలాగా? ఆవనస్పతిని బగటివేళనే పోయి తెచ్చుకొని యెందుకు జాగ్రత్తపెట్టుకొనఁగూడదు?

శ్యా — దానిని బగటిపూటఁ గోసి తెచ్చుకొన్నచో నెట్టి ప్రయో జనము నుండదు. సరిగా రాత్రి రెండుజాముల వేళఁ బోయి జుట్టువిరియఁ బోసికొని కోసి తేవలయును. ఏమిచేయుదును వదినే! మనసులోనియాశ మనసులోనే జీర్ణమైపోవుచున్నది!

కపా – మంచిది. నే నీదినమునఁ బగటిపూటనేపోయి యీమొక్క యేవనమునందున్నదో చూచి వచ్చితిని. దాని నానవాలుపట్టి నేనే రాత్రివేళ నొంటిగా నావనమునకుఁ బోయి యీయోషధిని తీసికొని వచ్చి నీకిచ్చెదను.

శ్యా – వలదు. నాయదృష్ట మెట్లున్నదో యట్లు జరగును. ఇప్పుడు గాకున్న మఱియొకప్పుడైన నాప్రయత్నము ఫలింపఁగలదు. నీవు మాత్రము రాత్రులయం దొంటికత్తివై యెప్పుడును బయటికిఁబోవలదు.

కపా – నావిషయమై నీకంతవిచార మెందుకు? రాత్రులయం దెట్టి వనప్రదేశమండైనను నిశ్చయముగా సంచరించుట నాకుఁ జిన్నతనము నుండియు నలవాటే యన్న సంగతి నీవు వినియుండలేదా? బాగుగ నాలోచించి చూడుము! నాకటువంటియభ్యాసమే లేకయున్నచో నేను మీ యింటికోడలి నగుటయు, నీకుసహచారిణినై యీవిధముగా నుండుటయుఁ దటస్థింపకయేయుండును.

శ్యా – వనసంచారమునకు రాత్రివేళ నీవు భయపడెద వేమోయను సంశయముతో నేనిట్లు చెప్పుట లేదు. కాని యొకగొప్ప యింటియిల్లాలికి రాత్రివేళ నొంటిగా నరణ్యసంచారము గావించుట యుచితమైనపని గాదు. నిన్న రాత్రి మనమిరువురమును గలసి పోయినందుకే నాకు ధిక్కారములు తప్పినవి కావు. ఇట్టిస్థితిలో నీవొక్కదానవే యట్లుపోయినచో నెవ్వరేమనుకొందురో? అప్పుడు నీగౌరవము దక్కించుకొనఁగలవా?

కపా – అట్లుపోయిన నేమియపచార మగును? నేనొక్కరాత్రి యిల్లువదలి బయటికిఁ బోయినంతమాత్రమున దుశ్చరిత్రనై పోవుదు నేమో యని నీవుకూడ ననుమానించుచుంటివా?

శ్యా – నే నావిధముగా నెంతమాత్రమును సంశయించుట లేదు. కాని తెలివిమాలినలోకులు పలువిధముల భావించుకొనుచుందురు. అట్లూడుకొనుటకు నవకాశము గల్పించుట మనవంటివారికిఁ దగదు.

కపా – ఎవ్వ రేమనుకొన్నను సరే! అంతమాత్రమున నేను నిజముగా గళంకచరిత్ర నై పోవుదునా?

శ్యా – నీవట్టిదానవు కానిమాట వాస్తవమే – కాని నిన్ను గూర్చి గాని, నీనడవడినిగూర్చిగాని యే తెలివితక్కువవారో ప్రతికూలముగ జెప్పుకొనుట తటస్థించినచో నది మాకెంతయో హృదయవిదారకముగా నుండును.

కపా – లోకు లేమనుకొన్న నీకేమి? అంతమాత్రమున నీవు లేని పోని విచారమును దెచ్చిపెట్టుకొనవలదు.

శ్యా – నేనట్లే యుండగలను. కాని యట్టిమాటలువిని మా యన్న గారెంతయో విచారింపకమానరు. ఆయన నెందుకుఁ గష్టపెట్టవలయును?

కపాలకుండల శ్యామసుందరివంక స్వభావసిద్ధములగు తన నిద్దంపుఁ దరళాపాంగవీక్షణములను ప్రసరింపఁ జేయుచు "ఇంతమాత్రమునకే యీయనమనసునకుఁ గష్టము తోఁచినచో నేనేమి చేయఁగలను? ఆఁడు దానికి వివాహ మగుట దాసీత్వమునకే యని మొట్టమొదటనే నాకుఁ దెలిసి యున్నచో నేనెన్నఁటికిని బెండ్లిచేసికొనక యావజ్జీవమును గన్యాత్వమునే యవలంబించి కాలక్షేపము చేసికొని యుందును!" అనెను.

ఆమాటకుఁ దరువాత శ్యామసుందరి యిఁక నేమిచెప్పినను యుక్తముగా నుండదని గ్రహించుకొనెను. అందుచేత నామె నిరుత్తరయై తన పనిమీఁదఁ బోయెను.

కపాలకుండలయును దత్కాలోచితములగు గృహకృత్యములను నిర్వహించుకొనుటకై లోపలికిఁ బోయెను. తరువాత నామె తనపనులను ముగించుకొని యావనస్పతిని వెదకి తీసికొని వచ్చుటకై యిల్లు విడిచి బయటికి వచ్చెను. అప్పటికి రాత్రి తొమ్మిదిగంటలు దాఁటిపోయెను. అయినను వెన్నెల యెల్లయెడల వ్యాపించి యుండెను.

అప్పుడు నవకుమారుఁడు వెలుపలిగదిలోఁ గూర్చుండి యుండెను.

కపాలకుండల యొంటిగా గృహము నెలువడి పోవుచుండుట నాతఁడు గవాక్షద్వారమునుండి కనుఁగొనెను. ఆవెంటనే యాతఁడును గదిలోనుండి వెడలివచ్చి కపాలకుండలచేయి పట్టుకొనెను. అప్పుడు మృణ్మయి నాథు నుద్దేశించి "ఇది యేమి?" అనెను.

నవ – ఎక్కడకుఁ బోవుచున్నావు?

నవకుమారుని యాకంఠస్వరమునం దప్పుడు తిరస్కారసూచకము లేశమాత్రమైనను గానవచ్చుట లేదు.

కపా – మనశ్యామసుందరి తనయెడల నాత్మేశ్వరుని కెట్లయిన ననురాగము గల్పించుకొని యాతని వశపఱచుకొనుటకై యొకయోషధిని సంపాదింపఁ గోరియున్నది. ఆమె కావనస్పతి నన్వేషించి తీసికొనివచ్చి యిచ్చుటకై పోవుచున్నాను.

నవకుమారుఁడు మొదట మాటాడినట్లే కోమలస్వరముతో "ఆలాగా? నిన్న రాత్రి యొకసారి మీరిరువురునుబోయి యుంటిరిగాదా? ఈ రాత్రి మరల నెందుకుఁ బోవలయును?" అనెను.

కపా – నిన్నటిరాత్రి పన మంతటను వెదకి చూచితిమి గాని, యాయోషధి యగపడలేదు. అందుచే నేఁడు మరలఁ బోవలసివచ్చినది.

నవకుమారుఁ డతిమృదులభావముతో "అట్లయినచోఁ బగటివేళఁ బోయి వెదకి తెచ్చుకొనఁగూడదా?" అనెను. ఆతని కంఠస్వర మప్పుడు ప్రేమపూర్ణముగనే యుండెను.

కపా – ఆయోషధిని బగటివేళ వెదకి సంపాదించి తెచ్చినను దాని వలన నెట్టిప్రయోజనమును గలుగదు. రాత్రివేళఁ దెచ్చుకొనుటచేతనే దానిప్రభావము చెడకయుండును.

నవ – ఈమాత్రపుదానికి నీవు స్వయముగాఁ బోయి వెదకి తేవలయునా? ఆవనస్పతినామ మేమో నాకుఁ దెలుపుము. నేను వనమునకుఁ బోయి యన్వేషించి తీసికొనివచ్చి యిచ్చెదను.

కపా — ఆయోషధిని నేనొకసారి చూచి యానవాలుపట్టియుంటిని. అంతే కాని నాకు దానిపేరు తెలియదు. ఒకవేళ బేరు తెలిసి చెప్పఁగలిగినను, దానినిమీరు తీసికొనివచ్చుటవలన నేమియును లాభము లేదు. ఆఁడుదియే పోయి విశీర్ణకుంతలయై దానిని దీసికొని రావలయును. నేను పరోపకారముగా నిట్టిపనికిఁ బూనుకొని పోవుచున్నాను. మీరు దీని కెట్టి యంతరాయమును గల్పింపవలదు.

కపాలకుండల యీమాటలు మిగుల నప్రసన్నభావముతోనే వచియించెను. నవకుమారుఁ డిఁక నెట్టిప్రతికూలవచనమును జెప్పఁజాలక పోయెను. అప్పు డాతఁడు "అట్లయినచోఁ బద! నేనుగూడ నీకుఁ దోడుగా వచ్చెదను?" అనెను.

కపాలకుండల యభిమానసూచకస్వరముతో "రండు! నేనవిశ్వాస స్వభావ నగుదునో కానో సొంతకన్నులతోఁ జూచి వత్తురుగాని!" అని పలికెను.

నవకుమారుఁ డిఁక నేమియు మాటాడఁజాలకపోయెను. ఒక్కదీర్ఘ నిశ్వాసముతోఁ గపాలకుండలహస్తమును వదలివైచి గిరుక్కున మరలి యెప్పటివలె తనగదిలోనికిఁ బోయెను. కపాలకుండల యొక్కతెయును బోయి వనమధ్యమునఁ బ్రవేశించెను.

రెండవ ప్రకరణము

విపినప్రదేశము

"— Tender is the night,
And haply the Queen moon is on her throne.
Clustered around by all her starry fays;
But here there is no Light."

— *Keats.*

సప్తగ్రామమున కవ్వలిభాగ మంతయు మహారణ్యమయ మైనదని ప్రస్తావవశమున నప్పుడప్పు డిదివఱకే చెప్పియున్నాము. గ్రామసమీ

పమునండే యాసాంద్రకానన మున్నది. కపాలకుండల యేకాకినియై యగమ్యమగు నొకనిబిడవిపినపథము ననుసరించి పోయి యాయోషధి కొఱకు వెదకులాడుచుండెను.

ఆశుక్లపక్షయామిని యతిమనోహరమై నిశ్శబ్దముగా నుండెను. ఆమధుమాసమధుర యామినీ విలసితమగు నాకాశమండలమునం దమృత కిరణప్రభామయుండగు రజనీవల్లభుఁడు నిశ్శబ్దముగాఁ దెల్లమబ్బు తెరల నన్నిటిని దాఁటి తనప్రయాణమును నిరాఘాటముగ సాగించుచుండెను. భూమండలమునంకని వననమ్రీహుహాములును, లతాగుల్మాదులును గూడ నట్లే నిశ్శబ్దముగాఁ జల్లనివెన్నెలలో విశ్రామసుఖము ననుభవించుచుండెను. అట్లే యా తరులతాపత్రము లన్నియునుగూడ నిశ్శబ్దముగ నాసుధాకరకిరణప్రసారమునకు నికోభము నాపాదించుచుండెను పశుపక్ష్యాదు లన్నియును నిశ్శబ్దముగనే యుండెను. కేవల మప్పుడప్పుడుమాత్రము నిదుర మేల్కొనిన యేవిహంగమో పక్షివిక్షేపము గావించు శబ్దము; ఎచ్చటనోయొక చోట నరుముగాఁ బతితములగు శుష్కపత్రములశబ్దము; ఎచ్చటనో భూప్రదేశమునందుఁ బడియున్న యెండుటాకులలో బాములు మొదలగుసరీసృపజీవము లప్పుడప్పుడు ప్రాకుచుండు శబ్దము; అప్పుడప్పుడతిదూరమునందుండి కుక్కలఱచుచుండుశబ్దమును మాత్రమే యరుదుగా శ్రుతిగోచర మగుచుండెను. ఒక్కసారిగాఁ బెద్ద పెట్టునగాలియైనను వీచుటలేదు. ఆ వసంతకాలమునందు చల్లని మలయమారుతమునూత్రమే మందమందముగ వీతెంచుచుండెను. ఆ వాయుగమనము కేవలము నిశ్శబ్దముగనే యుండెను. ఆ పిల్ల వాయువుల ప్రసరముచే వనవృక్షముల సర్వోన్నత శాఖాగ్రములయందలి కోమలపత్రములునూత్రమే యించించుక సంచలించుచుండెను. కేవలము నేల నంటుకొని ప్రాకులాడుచున్న శ్యామలవల్లికలును నూగులాడుచుండెను. నీలాకాశమండలమునం దచ్చటచ్చట నతివిరళములై యున్న తెల్లమబ్బు

తునుకలును మెల్లమెల్లగాఁ గదలిపోవుచుండెను. అట్టి సురభిళమంద మలయమారుతసేవనమువలనఁ బూర్వానుభూతంబులగు సుఖభోగముల యస్పష్టస్మృతులు హృదయములయం దల్పాల్పముగా జాగరితము లగుచుండును.

కపాలకుండల కప్పు డావిధముగనే మనసునందొక పూర్వసుఖస్మృతి యనుభవమునకు వచ్చెను. వాలుకామయంబగు నాచిట్టడవిలో నిసుక గుట్టల యున్న తశిఖరములనుండి సాగరవీచికాతుషారముల చలువలంగొని యే తెంచుచుండు మలయమారుతాంకురములు తన నిటలతటంబునఁ గునిసియాడుచున్న కుటిలాలకగుచ్ఛములతో సవిలాసముగఁ గ్రీడించు చున్నప్పటిసుఖానుభవ మప్పుడు కపాలకుండలకు దలఁపునఁ దోఁచెను. అప్పటి యనంతనీలామలగగనమండల మామె హృదయఫలకమునందుఁ జిత్రితమైనట్లయ్యెను. అట్లే యనంతమును, నీలమును, నిర్మలము నగు నపారపారావార మామె మనోనయనములకు గోచరించెను. అప్పుడు కపాలకుండల యాపూర్వస్మృతింగూర్చి యాలోచించుకొనుచు బర ధ్యానముతో నావిపినమార్గము ననుగమించి పోవుచుండెను.

అట్లు పరాకుగాఁబోవుచుఁ బోవుచుఁ గపాలకుండల తానెందుకొఱ కెచ్చటికిఁ బోవుచుండెనో యాసంగతినే మఱచిపోయెను. ఆమె పోవు చున్న మార్గము క్రమక్రమముగా నగమ్య మగుచుండెను. ఆమెయతి నిబిడంబగు నరణ్యమధ్యమునఁ బడిపోయెను. దట్టములై పెరిగియున్న వనభూరుహముల విశాలశాఖోపశాఖ లెల్లెడల నలమికొని యుండుటచే వెన్నెలవెలుఁగు లాప్రదేశమునఁ బ్రవేశింపఁజాలకయే యుండెను.

క్రమముగాఁ గపాలకుండలకుఁ ద్రోవ యగపడకుండఁ బోవుచుండెను. అట్లు మార్గము తోపకుండుటచేతనే యామె తన చింతావిస్మృతినుండి వెలువడి ప్రకృతిస్థ యయ్యెను. ఆ వెంటనే యామె నలుదెసలను బరీ క్షించి చూచెను. అప్పు డామహారణ్య మధ్యమునం దొక దిక్కునఁ గపాలకుండల కొక వెలుఁగు కానవచ్చెను.

ఇదివఱకు లుత్పఉన్నీ సా యాఁ ప్రకాశమునే కాంచియుండెను. చిన్న తనమునుండియు నడవులలోఁ దిరుగుచు నిట్టి సంఘటనముల నెన్నిటినో కాంచుట కలవాటుపడియున్న కపాలకుండల కిప్పు డామంట వెలుఁగు వలన నెంతమాత్రమును భయము గలుగలేదు. సరిగదా — అదియేమో తెలిసికొనవలెనని కుతూహలముకూడ జనించెను. ఆమె మెల్ల మెల్లగా నామంట దిక్కున కభిముఖముగాఁ బోయెను.

అట్లు పోయి చూడఁగా నామంటచెంగట నామె కెవ్వరు నగపడ లేదు. అచ్చట నతినిబిడముగ వనమహీరుహములు క్రమ్ముకొనియుండు టచే నగపడుటలేదు గాని యాసమీపమునందే భగ్నగృహ మొకటి యున్నది. ఆయిల్లు రాళ్ళతోడను నిటుకలతోడను నిర్మింపఁబడినదియే— కాని యది చాల చిన్నది. సామాన్యమైనది. అందొక గదిమాత్రమే యుండెను. ఆగదిలోనుండి యిరువురు మనుష్యులు సంభాషించుకొను చుండుమాటలు వినవచ్చుచుండెను. ఆమాటలు విని కపాలకుండల మెల్ల మెల్లగా నడుగులు వైచుకొనుచు నాగృహ సన్నిధానమునకుఁ బోయి యచ్చట నిశ్శబ్దముగా నిలిచియుండెను. ఆ యింటిని సమీపించినంతనే యందెవ్వరో యిరువురుసావధానముగ సంభాషించుకొనుచుండిరని కపాల కుండల తెలిసికొనఁగలిగెను. మొట్టమొదట నాసంభాషణ మేమియు స్పష్టముగా గర్ణగోచరముకాలేదు. తరువాతఁ గొంచెము ప్రయత్నము చేసి శ్రవణశక్తిని సునిశితముగఁ జేసికొని యాలకించెను. కపాలకుండల యప్పు డాసంభాషణము నీ క్రిందివిధముగా గ్రహింపఁ గలిగెను.

ఒకరు — నేను దప్పక చంపవలయు ననియే యభిలషించుచున్నాను. ఇందుకు నీవంగీకరింపకున్నచో నేను నీకు సాహాయ్యము చేయఁజాలను. నీవును నాకెట్టి సాహాయ్యమును జేయవలదు.

మఱియొకరు — నేనైనను శుభపర్యవసానమును వాంఛించుట లేదు. కాని వృథాగాఁ జంపుట యెందుకు? యావజ్జీవమునుగూడ నావ్యక్తు

లిరువురికిని సంబంధము లేకుండఁ బోవలయును. అట్లు చేయుటకు నేను సమ్మతింపఁగలను. కాని హత్య గావించుటకై మాత్రము నేనెట్టి ప్రయత్నమును జేయఁజాలను. అట్లు చేయుటకు నీవును బూనుకొనవలదు. పూనుకొన్నచో నేను నీకుఁ బ్రతికూలముగనే పనిచేయుదును.

అమాట విని మొదటివ్యక్తి "నీవు కేవలము మూఢునివలె నగపడుచున్నావు. నీకించుక జ్ఞానోపదేశము గావింపవలసి యున్నది. నేను నీ కొకవిషయముంగూర్చి చెప్పెదను. బాగుగ మనసుంచి వినవలయును. అది కేవల మతిరహస్యమగు వృత్తాంతము. ఈచుట్టుప్రక్కల నెవ్వరైన నున్నా రేమో బయటికిఁ బోయి చూచి రమ్ము! ఏదియో మానవనిశ్వాస శబ్దమువలె వినవచ్చుచున్నది!" అని చెప్పెను.

నిజముగాఁ గపాలకుండల యాసంభాషణ మేమో వినవలయు ననుదేశముతో నాయింటి కతిసమీపముగఁ బోయి నిలువఁబడి చెవియొగ్గి వినుచుండెను. ఆమాటలు వినవలయునను కుతూహలముచేతను, దానెవ్వరికై న నగపడిపోవుదునేమో యను శంకచేతను దత్తరపడుచున్న కపాలకుండల కవ్వాడు నిశ్వాసములు తీవ్రముగనే వెలువడుచుండెను.

అట్లుచెప్పిన వ్యక్తిమాటలు విని గృహామధ్యమునుండి రెండవవ్యక్తి బయటికి వచ్చెను. వచ్చినంతనే కపాలకుండల యావ్యక్తి కన్నులఁబడియెను. ఆవెన్నెల వెలుఁగులో గపాలకుండలయును స్పష్టముగా నయ్యాగంతుకపురుషుని గనుగొనఁగలిగెను. చూచినంతనే యామెకు భయము గలిగెను. ఎట్లు మనసు కుదుటపఱుచుకొనియుండవలయునో యామెకు బోధపడకుండెను.

కపాలకుండల పరీక్షించి చూచెను. ఆ యగపడిన పురుషుఁడు బ్రాహ్మణవేషముతో నుండెను. ఆతఁ డొక సాధారణమగు దోవతిని ధరించియుండెను. ఉత్తరీయముచే నాతనిదేహము బాగుగ నావరింపఁబడి యుండెను. ఆబ్రాహ్మణకుమారుఁడు బాలునివలెనే యగపడుచుం

డెను. ఆతని ముఖమండలమున వయసువచ్చిన చిహ్నములులేశమైనను గానవచ్చుటలేదు. కాని యావదన మతిసుందరముగా నుండెను. పరమ సుందరి యగురమణీమణి వదనసౌందర్యమువంటి సౌందర్యము! కాని యాముఖమునందు రమణీదుర్లభమగు తేజోగర్వము పూర్ణీభవించి యుండెను. ఆతనిశిరోజములు సాధారణముగా నందఱు పురుషులకుంతల ములవలెనే క్షౌరసంస్కారాదులచే సజ్జితములై యుండలేదు. సామాన్య ముగ నాఁడువారిజుట్టువలెనే యచ్ఛిన్న భావముతో నాతని యుత్తరీయ మును గప్పివై చి, వెన్ను నందును, భుజములయందును, బాహుదేశము లందును, గొలఁదికొలదిగా వక్షమునందును గూడఁ జెదరి చెదరి యలము కొని యుండెను. ఆలలాటము సుప్రశస్తమై యించుక వికసితమై తేజో మయమై, విశాలమై, మధ్యప్రదేశమునం దేక రేఖావిలసితమై యుండెను. కన్నులు రెండును విద్యుత్ప్రకాశమును వహించి యలరారుచుండెను. ఆతని హస్తమునం దొక పొడుగుపాటి కరవాలము మెఱయుచుండెను. ఆతని మూర్తిసుందరమైనదేకాని యందొకభయంకరమగుభావము గోచరించు చుండెను. కాంచనప్రభాసదృశం బగు నాతని దేహచ్ఛాయయం దేదో యొకవిధమగు క్రూరాకాంక్షితరేఖ దృశ్యమాన మగుచుండెను. హృదయాంతరములనుగూడఁ బరిశీలించిచూచుటకు సమర్థములగు నాతని కటాక్షవీక్షణములం గాంచి కపాలకుండల భయభ్రాంత యైపోయెను.

ఆయిరువురు నొకరివంక నొకరు చూచుచు నొకక్షణకాల మట్లే యుండిరి. కొంతసే పైనతరువాత మొట్టమొదటఁ గపాలకుండలయే తనదృష్టిని మరలించివై చెను. అప్పుడే యాగంతుకుఁ డగువ్యక్తి కపాల కుండల నుద్దేశించి "ఎవరుసీవు?" అని ప్రశ్నించెను.

ఒకసంవత్సరమునకుఁ బూర్వ మెంతటిమహారణ్యమధ్యమున నెట్టి యవస్థలో నున్నప్పుడైనను గపాలకుండల నెవ్వరైన నీవిధముగాఁ బ్రశ్నించి యున్నచో నామె యాక్షణమునందే తగినప్రత్యుత్తరము

చెప్పఁగలిగి యుండును. కాని యిప్పుడుమాత్రము కపాలకుండల యట్లు మాటాడఁజాలకపోయెను. ఆమె యిప్పుడు చాలవఱకు గృహిణీస్వభావ గుణసంపన్నయై యుండెను. అందుచేతనే యామె చటాలునఁ బ్రత్యుత్తరమిచ్చుటకు సాహసింపఁజాలకపోయెను. అప్పు డాబ్రాహ్మణవేషధారి కపాలకుండల నిరుత్తరయై యుండుటం గాంచి గంభీరకంఠస్వరముతో "కపాలకుండలా! నీవింతటిరాత్రివేళ నొంటిగా నీనిబిడారణ్యమధ్యప్రదేశమున కెందుకొఱకు వచ్చితివి?" అని ప్రశ్నించెను.

అంతటిరాత్రివేళ – ఆ వనమధ్యమునందుఁ దాని దివఱ కెన్నఁడు నెఱుంగనియొకపురుషునినోటినుండి తననామము వెలువడుటను విని కపాలకుండల నివ్వెరపడిపోయెను. ఆమెకుఁ గొంచెము భయముకూడఁ గలిగెను. అందుచేతనే యామెవదనమునుండి సమయోచితముగా శీఘ్రముగా నెట్టిప్రత్యుత్తరమును వెలువడదయ్యెను.

అప్పు డాబ్రాహ్మణవేషధారియగువ్యక్తిమరల "నీవు మేము మాటాడు కొనుచున్న సంభాషణ మంతయును వినియుంటివా?" అని ప్రశ్నించెను.

అంతలోనామాటమీఁదఁ గపాలకుండలకు సంభాషణశక్తిపునఃప్రాప్తమయ్యెను. ఆమె యా బ్రాహ్మణకుమారుని మాట కేమియు బదులు చెప్పక "నేనుగూడ నావిషయమునుగూర్చియే యడుగుచున్నాను. ఈవనప్రదేశమును జేరి యీభగ్నగృహమునందు మీ రిరువురు నింతరాత్రివేళ నెట్టిదుష్కార్యమును గావించుట కాలోచించుచున్నారు?" అని ప్రశ్నించెను.

బ్రాహ్మణకుమారుఁడు కొంతసేపటివఱకు నేమియు మాటాడకుండ నేదియో యాలోచించుకొనుచుండెను. తనయభీష్టమును సిద్ధింపఁజేసి కొనుటకై యేదో యొకనూతన మగు నుపాయ మాతనిహృదయమధ్యమునఁ బొడకట్టుచున్నట్లుండెను. అప్పు డాతఁడు చటాలునఁ బోయి కపాలకుండలచేయి పట్టుకొనెను. అట్టిపట్టిన కరమును విడువకయే యా

వ్యక్తి యామె నాభగ్నగృహమునకుఁ గొంచెము దూరముగాఁ దీసి కొనిపోవుచుండెను. అది చూచి కపాలకుండల తీవ్రక్రోధోద్దీపితయై బలవంతముగఁ దనచేతిని వదలించుకొనెను. అప్పుడు బ్రాహ్మణవేష ధారి కపాలకుండలచెవిచెంత వదనము నుంచి మృదులస్వరముతో "ఇంతసంశయ మెందుకు? నిజముగా నేను పురుషుఁడను గాను!" అనెను.

కపాలకుండల మఱింతయాశ్చర్యపడిపోయెను. ఆమాటయం దామెకుఁ జాలవఱకు విశ్వాసముకలిగినది; కాని సంపూర్ణమైన నమ్మకముమాత్రము గలుగలేదు. అయినను నామె యా బ్రాహ్మణవేషధారి ననుసరించి పోయెను. ఆ భగ్నగృహమునుండి చూచినచో నగపడకుండునంతటి దూరమువఱకును గపాలకుండలను దీసికొనిపోయి యా బ్రాహ్మణ కుమారుఁడు మరల నామెచెవిలో మెల్లమెల్లగా "మే యేదియో దుస్తంత్రముగావించుటకై యాలోచించుచుంటి మని నీ వనియుంటివే — అట్టి మాసంభాషణమును నీవు విన్నావా? ఆప్రయత్నమంతయు నిన్ను గూర్చియే!" అనెను.

కపాలకుండల కావిషయ మంతయు స్పష్టముగా దెలిసికొనవలయు ననువాంఛ యతిశయ మయ్యెను. ఆమె యాత్రముతో "అదియేమో స్పష్టముగాఁ జెప్పుము!" అని యడిగెను.

వ్యక్తి — అట్లయినచో నేను మరల నిచ్చటికి వచ్చుపర్యంతమును నీవు నాకొఱకు నిరీక్షించుచు నీప్రదేశమునందే యుండుము. కొంచె మాలస్యమయినను నెచ్చటికినిఁ బోవలదు.

ఇట్లు చెప్పి యావిప్రవేషధారిణి యాశిథిలమందిరము వైపునకుఁ బోయెను. కపాలకుండల కొన్ని నిమిషములవఱకు నచ్చటనే యెదురు చూచుచు నిలువఁబడి యుండెను. కాని యామె చూచినదానినిబట్టియు వినిన విషయములనుబట్టియుఁ గపాలకుండల కించుక భయముగనే యుండెను. ఇట్టిస్థితిలో నానిర్జనారణ్యమధ్యమునందు నిలిచియున్న

యామెకుఁ క్షణక్షణమును హృదయోద్వేగము వర్ధిల్లుచునే యుండెను. కపటవేషధారిణి యగునామె యేయుద్దేశముతోఁ గపాలకుండల నచ్చట నిలువఁబెట్టి పోయినదో యావిషయము నెవ్వరు చెప్పఁగలరు? అవకాశ మేమాత్రమైన లభియించినచో నామె తనక్రూరవాంఛితమును సిద్ధింపఁ జేసికొనుటకే యట్లు చెప్పి పోయియుండునా?

క్రమక్రమముగా నిమిషములు గడచిపోవుచుండెను. గడియలును గతించుచుండెను. కాని యా మాయాస్వరూపధారిణి యింకను వచ్చుట లేదు. చాలసేపై పోయినది. కపాలకుండల యిఁక నచ్చట నొంటిగా నుండఁజాలకపోయెను. అందుచేత నాతఁడు ద్రుతపదవిక్షేపముతో నాత్మ భవనాభిముఖుఁడై వెడలిపోయెను.

అప్పుఁడాకాశమండలమంతయు సాంద్రనీరదచ్ఛటలచే మషీమయ మగుచుండెను. ఆవనమధ్యమునం దింతవఱకునుండిన కొలఁదివెలుతురు కూడ నంతర్హితమైపోవుచుండెను. కపాలకుండల యొక్కక్షణమైన నిఁక నట నాలస్యము చేయుట కిష్టపడలేదు. అతిశీఘ్రగమనముతోఁ గాననా భ్యంతరమునుండి బయటికిఁ బోవఁదొడంగెను.

అట్లు పోవుచుండఁగా వెనుకనుండి యెవ్వరో తన్ననుసరించి వచ్చు చున్నట్లు పదచలనధ్వని కపాలకుండలకు శ్రవణగోచర మగుచుండెను. ఆమె వెనుకకు మరలి చూచెనుగాని యాగాఢాంధకారములో నేమియుఁ గానవచ్చుట లేదు. ఆబ్రాహ్మణ రూపధారిణియే తన్ను వెంబడించి వచ్చుచుండు ననికపాలకుండల మనసులో ననుమానించెను. ఆమె యతి వేగముగ మహారణ్యమునుండి వెలువడి పూర్వవర్ణితంబగు చిట్టడవి లోపలఁ బ్రవేశించెను. అచ్చట నంతటి చీకటి క్రమ్మికొని యుండలేదు. ఎదుట నెవ్వరైన నున్నచో గ్రహించుట కవకాశముగనే యుండెను. కాని యప్పుడు కపాలకుండల కెవ్వరు నగపడలేదు.

కపాలకుండల పరుగుపరుగునఁ బోవుచుండెను. కాని యాయడుగుల

చప్పుడ్లే వెనుకనుండి స్పష్టముగా వినవచ్చుచునే యుండెను. గగన మండలముకాలకాదంబినీమాలికాచ్ఛన్నమై యతిభీషణముగా నుండెను. కపాలకుండల మరింత వేగముతోఁ బరుగెత్తుట కారంభించెను. ఇల్లిఁక నెంతయోచూరమున లేదు. ఆమె స్వభవనమును జేరియుఁజేరకమునుపే ప్రచండవాయువులతో గూడ వర్షభీషణారావ ముప్పతిల్లెను.

తన మందిరము దృష్టిపథమునకుఁ దోచునంతటి సమీపమును జేరక పూర్వమే కపాలకుండలతలపైఁ జినుకులుపడుట కారంభమయ్యెను. ముసల సన్నిభధారలతో వర్షము గురియుఁ దొడంగెను. కపాలకుండల యెట్లో యాత్మరక్షణమును గాంచుకొని యాత్మమందిరమును జేరుకొనియెను.

కపాలకుండల గృహప్రాంగణప్రదేశమును దాఁటి ప్రకోష్ఠమధ్య మునఁ బ్రవేశించెను. ఆమెరాకకొఱకు ముంగిటిద్వారము తెఱవఁబడియే యుండెను. లోపలికిఁ బోయి కవాటములను మరలబంధించుట కామె వెనుకకుఁ దిరిగి చూచెను. వాకిటిలో నెవ్వఁడో యొక దీర్ఘకాయుఁ డగుపురుషుఁడు నిలువఁబడియున్నట్లామెకు గోచరించెను. ఆసమయము నందే యొక్కసారి మెఱుపు తళుక్కుమనియెను. ఆక్షణప్రభలోనే కపాలకుండల స్పష్టముగాఁ జూచి యానవాలుపట్టఁగలిగెను. ఆపురు షుఁడు సాగరతీరవనవాసియగు నాకాపాలికుఁడే!

మూఁడవ ప్రకరణము

స్వప్నము

"I had a dream which was not all a dream."

— *Byron*

కపాలకుండల మెల్లమెల్లగాఁ దలుపులను మూసివై చెను. మెల్ల మెల్లశయనమందిరమునకు వచ్చెను. మెల్లగాఁ దనపర్యంకమును జేరి శయనించెను. మానవహృదయము సముద్రమువలెనే యపారమైనది.

దానిపై నెప్పుడు వాయువాహనులెదిరించి మహాసమరము గావించునో యాసమయమునం దాసాగరమునుండి యెన్ని తరంగమాలిక లుత్పన్న ములై పొంగి పొరలుచుండెనో వాని నెవ్వరు లెక్కింపఁగలరు? కపాల కుండల యనంతహృదయజలధియం దిప్పు డన్ని తరంగమాలిక లుద్భ వించి గణనాతీతములై యత్యుత్పము లగుచుండెను.

ఆరాత్రి నవకుమారుఁడు హృదయవేదనాపరితప్తుఁడై యంతఃపుర మునకు రానేలేదు. శయనాగారమునందుఁ గపాలకుండల యొక్కతె మాత్రమే పవ్వళించియుండెను. కాని యామెఁ కెంతమాత్రమును నిద్దుర పట్టలేదు. ప్రచండవాయుతాడితములగు వర్షవారిధారలచేఁ దడిసిపోయిన జటాజూటముతోఁ గూడిన యాకాపాలికునిముఖమండల మంధకారమధ్యమునందుఁగూడనలుదెసలఁ గానవచ్చుచుండెను. కపాల కుండల తనపూర్వవృత్తాంతముల నన్నిటిని బాగుగ స్మృతికిఁ దెచ్చు కొని యాలోచించి చూచుకొనుచుండెను.

ఆకాపాలికుని దానెట్లు మోసగించి యేవిధముగా విడనాడి వచ్చెనో యావిషయ మిప్పుడు కపాలకుండలకుఁ దలఁపునఁ దోఁచుచుండెను. మహారణ్యమధ్యమునం దాకాపాలికుఁ డెట్టిక్రూరపై శాచికకృత్యముల గావించుచుండెనో యవి యన్నియు నామెకు స్మృతికి వచ్చుచుండెను. ఆతఁడు నిత్యమును గావించుచుండు భైరవీపూజలును, ఆనాఁడు నవ కుమారుని బంధించి యాభైరవీమూర్తికి బలిసేయుటకై కావించిన ఘోరప్రయత్నమును స్మరణకు వచ్చుచుండెను.

అందుచేఁ గపాలకుండల గడగడ వడఁకిపోయెను. నేటిరాత్రి వన మధ్యమునందు సంఘటిల్లిన సమస్తవిషయములునుగూడ నామెమనో మధ్యమున జాగరితము లగుచుండెను. శ్యామసుందరి యోషధిని సంపా దించుటకుఁ గుతూహలపడుటయు, దానిని దెచ్చెద నని తాను బయలు దేఱుటయు, నవకుమారుఁడు తనపయనమును నిషేధించుటయు,

నందుసై ఁ దాను నవకుమారునిగూర్చి తిరస్కారముగ ఁ బ్రసంగించు టయు, దరువాత ఁ దా నరణ్యమున ఁ బ్రవేశించుటయు, ఆవనమునెందలి వెన్నెలనిగ్గులయందమును, కొంతసేపటి కాయరణ్యమంతట నలముకొన్న యంధకారమును, ఆకాననమధ్యమున ఁ దొకసహచరునిదాను గాంచు టయు, ఆతనిభయంకరరమణీయాకారము – ఇవి యన్నియు నామె మనఃఫలకమున ఁ జిత్రించినట్లు, కన్నుల ఁ గట్టినట్లు కానవచ్చుచుండెను.

క్రమముగా ఁ బూర్వాకాశమున ఁ దుషాదేవి కిరీటకాంతులు కొలఁది కొలఁదిగా ఁ బ్రస్ఫుటములై ప్రకాశింప ఁ దొడంగెను. సరిగా నాసమ యమునందు ఁ గపాలకుండల కించుక కునుకుపట్టెను. అంతగాఢముగా లేని యానిద్రావస్థయం దామె యొకస్వప్నము ం గాంచుచుండెను.

ఆస్వప్నములో నామె తనకు ఁ బూర్వపరిచితమగు సముద్రమధ్య మున నొకనౌక నధిరోహించి పయనము సాగించుచుండెను. ఆదోనె యెంతయో మనోహరముగా నుండెను. ఆయోడకు ఁ గట్ట ఁబడిన వసంత వర్ణముగల ధ్వజపటము గాలికి ఁ గదలియాడుచుండెను. నావికు లంద ఱును దమతమ కంఠసీమలయందు బుష్పమాలికలను ధరించియుండిరి. వారెల్లరును రాధాకృష్ణుల యనంతప్రేమభావములనుబ్రకటించు మనోజ్ఞ గీతములను గానముచేయుచు ఁ బడవనడపుచుండిరి. పశ్చిమాకాశతటము నందు ఁ బతనోన్ముఖు ఁ డగుప్రభాకరుఁడు బంగరునీటిధారలను వర్షించు చుండెను. ఆసువర్ణధారలను సంగ్రహించుకొనుచు సాగరుఁడు హసించు చుండెను. గగనమండలమునందు ఁ గూడ మేఘసంఘములు వడివడిగ ఁ బోయి యాకాంచనధారావర్షమునందు ఁ దోగియాడుచుండెను. అంతలో నాకస్మికముగా రాత్రియయ్యెను. సూర్యదేవు ఁ డెక్కడనో యంతర్ధాతు ఁ డయ్యెను. ఆతనితో స్వర్ణధారలును, స్వర్ణజలదములును గూడ నగపడ కుండ ఁ బోయెను. అప్పుడు సాంద్రనీలమేఘసమూహములు వచ్చి గగన మండలమంతట నావరించుకొనియెను. ఇఁక సముద్రమునందు దిక్కులు

దెలిసికొనుట కవకాశము లేకుండఁబోయెను. అప్పుడు నావికు లాపడవను మరలించిరి. ఏదిక్కుగా దానిని నడపింపవలయునో వారు నిశ్చయించు కొనలేకుండిరి. వారి గీతపఠనోల్లాస మంతరించిపోయెను. వారి కంఠముల యం దలరారుచున్న పూలదండ లన్నియును ఛిన్నభిన్నములై పోయెను. ఆవసంతవర్ణ కేతనము తనంతఁదానే చెదరి సముద్రజలములలోఁ బడి పోయెను. పెద్దగాలికూడ రేఁగఁదొడంగెను. తాళవృక్ష ప్రమాణము లగు తరంగములు పొంగిపొరలుచుండెను. ఆ తరంగమాలికామధ్యము నుండి జటాపటలధారియు, దీర్ఘకాయుఁడు నగు నొకపురుషుఁడు బయలు దేఱి వచ్చి కపాలకుండల కూర్చుండియున్న పడవను దనవామహస్త ముతోఁ బట్టుకొని యాసముద్ర మధ్యమునకుఁ ద్రోసికొనిపోవుటకుఁ బ్రయత్నము గావించుచుండెను. ఆసమయమునందే యాభీకరమనోజ్ఞ మూర్తియగు బ్రాహ్మణవేషధారి వచ్చి మఱియొకవైపునుండి యా నౌకను బట్టుకొనెను. అట్లు గ్రహించి యావేషధారి కపాలకుండల నుద్దేశించి "నిన్నీపడవయందు నిలుపుమందువా? కాక నీతోఁగూడ దీనినిముంచివేయుమందువా?" అని యడిగెను. ఆకస్మికముగా నప్పుడు కపాలకుండల నోటినుండి "ముంచివేయుము!" అను మాట వెలువడి యెను. అంతలో నాబ్రాహ్మణవేషధారి యానౌకను వదలివైచెను. అప్పు డాపడవ యంతయు శబ్దమయమై పోయెను. ఆ శబ్దముతో నాయోడ "నేనిఁక నీభారమును మోయఁజాలను. ఇఁక నేను బాతాళ మునఁ బడిపోయెదను" అని భాషించిన ట్లయ్యెను. ఇట్లు పలుకుచు నౌక కపాలకుండలతోఁ గూడ జలనిమగ్నమై పాతాళమునఁ బ్రవేశించెను.

ఒడ లంతటను ముచ్చెమటలు గ్రమ్మిపోయిన కపాలకుండల యప్పు డాస్వప్నమునుండి మేల్కాంచి కన్నులు తెరచి వీక్షించెను. చూడఁగా నప్పుడే ప్రభాతమైనది – ఆ పడకటింటి గవాక్షములు తెఱవఁబడి యుండెను. వాని నడుమనుండి వసంతవాయువాహినులు లోనికిఁ బ్రవే

శించుచుండెను. మెల్లమెల్లగ నూగులాడుచున్న తరుశాఖలపైనుండి విహంగములు కిలకిలారవములు గావించుచుండెను. ఆ గవాక్షముల నలమికొనియున్న వివిధములగు కుసుమవల్లికలు వికచకుసుమగుచ్ఛము లతోఁగూడ మలయపవనములకుఁ దూఁగియాడుచుండెను.

అప్పుడు కపాలకుండల స్త్రీస్వభావానురూపముగ నట్లు చెదరిపోవు చున్న కుసుమవల్లికలను గుచ్ఛగుచ్ఛములుగా సవరించు చుండఁగా వానిలో నణఁగియున్న యొకయుత్తర మామెకంటఁ బడియెను. కపాల కుండల చిన్నతనమునుండియు నాదేవాలయాధికారియొద్దఁ జదువను వ్రాయను నేర్చుకొని యుండెను. కావున నామె యప్పు డాయుత్తర మును సులభముగాఁ జదువుకొన గలిగెను. అందిట్లున్నది:

"నేటిసాయంకాలమునకుఁ దరువాత నీవు నిన్నరాత్రి చూచిన బ్రాహ్మణకుమారుని జూచుటకు రావలయును. నీకు సంబంధించినదియు, నీకెల్లవిధములఁ బ్రయోజనీయమైనదియు నగు ముఖ్యవిషయమునుగూర్చి వినుటకుఁ నీకుఁ గుతూహలమున్నచోఁ దప్పక నీవు నావలన వినఁగలవు"

—బ్రాహ్మణవేషి.

నాలుగవ ప్రకరణము

సంకేతము

"— I will have grounds
More relative than this."

— *Hamlet*

కపాలకుండల యానాఁడు సంధ్యాసమయపర్యంతము నితరచింత యేమియును లేక కేవల మావిషయమునుగూర్చియే యాలోచించు కొనుచుండెను. ఆబ్రాహ్మణవేషధారిని గలిసికొనుట యుచితమా, కాదా యనియే యామెకు గలసంశయము. పతివ్రతయగునొకయువతి రాత్రికాలమునందొకనిర్జనప్రదేశమున నపరిచితుఁడగుపురుషుని దర్శ

నార్థమై యెంటిగాఁబోవుట యుచితము కాదనుసంగతి కపాలకుండల యెంత యాలోచించుకొన్నను నామెహృదయమునకది యనుచితమను సంశయమైనను జనింపలేదు.

ఆవిషయమై యామె సుస్థిరసిద్ధాంత మేమనగా — అట్లు దర్శింపవల యునను నుద్దేశము దోషసంకలితము గాక యున్నచోఁ గేవలముచూచి నంతమాత్రమున నెట్టిపాపమును సంభవింపదనియే. పురుషులను బురు షులుగాని, కాంతలను గాంతలుగాని దర్శించుట కెట్టి యధికారము గలిగియుండిరో యట్లే స్త్రీలను బురుషులును, బురుషులను స్త్రీలును దర్శించునర్హతగలిగియుండుట యధర్మము కాదనియే యామెబుద్ధికిఁ దోఁచుచుండెను. అంతేకాక యాబ్రాహ్మణవేషధారినిజముగాఁ బురు షుఁడో స్త్రీయో యింకను సంశయముగనే యుండెను. అందుచేనిప్పట్టున సందేహింపవలసిన యావశ్యకమే యగపడుట లేదు. కాని యొక్కటి నిశ్చయించుకొనవలసి : యున్నది. వాని నే నిప్పుడు దర్శించుటవలన శుభమఁగలుగునా యేదైన నమంగళము తటస్థించునా యని తర్కించి తేల్చుకొనవలయును. ఆసంగతి నిశ్చయించుకొనఁజాలకయే కపాల కుండల యింతవఱకును దల్లడిల్లిపోవుచుండుట!

మొట్టమొదట నాబ్రాహ్మణరూపధారిసంభాషణము, తరువాతగాపా లికునిసందర్శనము; ఆపిమ్మటఁ దనకుఁ గలిగినస్వప్నము — ఈయన్నిటి మూలమునను దన కేదియో యమంగళ మచిరకాలమునందే తటస్థింప నున్నదని కపాలకుండల యతిప్రబలముగ శంకించుచుండెను. అట్టి యమంగళము కాపాలికునిపునరాగమనముతో సంబంధించి యుండునా యనుసందేహమునకుఁగూడఁ గారణము లేకపోలేదు. ఆ విప్రవేషధారి యాతనిసహచరుఁడనియే బోధ యగుచుండెను. అందుచేతనే యాతని దర్శించుటవలన నిట్టి యనుమానమునకుఁ గారణమైన యమంగళము సంభవించినను సంభవింపవచ్చును. కపాలకుండల నుద్దేశించియే యిరువు

రును సంభాషించుకొనుచున్న బ్రాహ్మణుడు స్పష్టముగా జెప్పియే యుండెను. అయినను నాతనిమూలమునసే యుపకారము జరగిననుజరుగవచ్చును. ఆ బ్రాహ్మణుఁడు రహస్యముగా నెవ్వరితో మాటాడుచుండెనో యాతఁడు కాపాలికుఁడే యై యుండునని తోఁచుచున్నది. ఆ యిరువురి సంభాషణమును వినవచ్చినంతవఱకుఁ జూడఁగా వారెవ్వరినో హత్య గావించుటకు సంకల్పించియున్న ట్లగపడుచున్నది. అట్లుకాదేని చిర కాలదేశోద్వాసనమైనఁ గావింపఁ దలఁచియుండిరి. అట్లు వారు చంపుట గాని, వెడలగొట్టుటగాని యెవ్వరినై యుండును! కపాలకుండలను గూర్చియే దురాలోచన గావించుచున్నట్లు బ్రాహ్మణ వేషధారి తెలియఁజేసియుండెను గదా! కావున సంహరించుటయో, వెడలనడచు టయో కపాలకుండలనే యైయుండును. ఆపని జరుగక తప్పునా? దాని పైని దుస్స్వప్నము – ఆస్వప్నమునకు ఫల మేమైయుండును? ఆకలలో బ్రాహ్మణకుమారవేషధారి మహోత్తర మగు నాపత్సమయమున వచ్చి కపాలకుండలను రక్షించుటకై ప్రయత్నము గావించెను. స్వప్నఫలము కూడ నట్లే కావచ్చును. ఏమనిన – ఆవిప్రకుమారుఁ డెల్ల వృత్తాంత మును నేను మరల వచ్చి చెప్పెద నని మాటయిచ్చి పోయియుండెను గదా – కపాలకుండలయే స్వప్నమునందు పడవను ముంచివేయుమని చెప్పినది. విధినియోగమునుబట్టియే యట్లు చెప్పియుండెనా? కాదు – కాదు – భక్తవత్సలయగు భవానీదేవి పరిపూర్ణానుగ్రహముతో నాత నికి రక్షణోపాయము నుపదేశించి యుండెను. అందుచేతనే యా విప్ర కుమారమూర్తి స్వప్నమునఁ దోచి యామెను రక్షించుట కుద్యుక్తుఁ డయ్యెను. ఆతని సాహాయ్యమును నిరాకరించుటచేతనే యానౌక సము ద్రమునందు మునిఁగిపోయినది – ఇన్నివిధముల నాలోచించుకొని కపాల కుండల యిప్పు డాతని దర్శించుటయే శ్రేయమని నిశ్చయించుకొనియెను.

కొంచెము జ్ఞానమున్నవాఁ డెవ్వఁడైన నీ విధముగా సిద్ధాంతము

చేసికొని యుండు ననుకొనుట కెట్టియవకాశమును లేదు. కాని యట్టి తెలివిగలవారి సిద్ధాంతమ·తో మన కిప్పు డెట్టిసంబంధమునులేదు. కపాల కుండల యంత తెలిసినది గాదు – ఏమాత్రము తెలివియున్న దానివలె నైనను నామె కార్యనిశ్చయము చేసికొనియుండలేదు. కేవలము ముచ్చటపడి కుతూహలపరవశయైపోయిన రమణివలె స్థిరపఱచుకొని యెను. ఆ భీకరమనోజ్ఞరూపసందర్శనలాలస యగు యువతీమణివలె సిద్ధాంతము చేసికొనెను. చిన్నతనమునుండియుఁ గేవల సన్నాస్యసిచేఁ బెంపబడుచు రేయుంబవ ళ్ళడవుల వెంటఁ దిరుగాడు లోకానుభవవిహీను రాలివలె నిశ్చయించుకొనెను. భవానీభక్తిభావనవిమోహిత యగు మూఢభక్తురాలివలెఁ గార్యాకార్యనిర్దేశము గావించుకొనెను. ప్రజ్వలిత పావకాభీలజ్వాలలయందుఁ బతనోన్ముఖమగు పతంగముంబోలి కార్య నిర్ణయము గావించుకొనెను.

సంధ్యాసమయము దాఁటినతరువాతఁ గపాలకుండల యింటిపనులను జాలవఱకుఁ దీర్చుకొని యెప్పటివలె వనాభిముఖియై బయలుదేఱి పోయెను. కపాలకుండల బయలుదేఱినప్పు డామె పడకటింటియందలి దీపము బాగుగనే ప్రకాశించుచుండెను. ఆమె యాగదిదాఁటి యెప్పుడు వెలుపలికి వచ్చెనో యప్పుడే యాగదిలోని దీప మారిపోయెను.

ప్రయాణసమయమందుఁ గపాలకుండల యొక విషయమును మఱచి పోయెను. ఆ విప్రకుమారుఁడు తన్నెచ్చట దర్శింపవలయు ననియా జాబులో వ్రాసియున్నాఁడు? ఆ సంగతి తెలిసికొనుటకై మరల నా యుత్తరమును జదువవలసివచ్చుట కపాలకుండల కావశ్యక మయ్యెను. అందుచే నామె మరల నింటికి వచ్చి తాను ప్రాతఃకాలమునం దా యుత్తరము నెచ్చట నుంచెనో యచ్చట బాగుగ వెదకి చూచెను. కాని యట నాజాబు కానరాలేదు. కాని తలదువ్వుకొను సమయమునం దాయుత్తరము తనచేతనే యున్నందున దాని దన కబరీబంధమున

దాచియుంచుకొన్న ట్లూమెకు స్మృతికి వచ్చెను. అందుచే నామె తన కరాంగుళులను గొప్పులోనికిఁ జొప్పించి యన్వేషించెను. (వేళుల కా యుత్తరము తగులక పోవుటచే వేణీబంధమును విదల్చివైచి జుట్టుదులుపు కొని చూచెను. అట్లు చేసినను జాబు కంటఁబడలేదు. అప్పు డామె యింటియందలి పలుతావుల నన్వేషించి చూచెను. కాని యాజా బెచ్చట లభింపకపోవుటచే నది మొట్టమొదట నెచ్చట దొరకినదో యచ్చటనే యుండునని సిద్ధాంతము చేసికొని మరలఁ (బయాణోన్ముఖి యయ్యెను. మరలఁ దలమువ్వుకొని కొప్పు ముడిచికొనుట కవకాశము లేకపోవుటచే నిప్పుడు కపాలకుండల పెండ్లి కాకపూర్వ మరణ్యములో నెట్లుండెడిదో యట్లే కుంతలదామమధ్యవర్తినియై నడచి పోవుచుండెను.

ఐదవ ప్రకరణము

గృహద్వారము

"Stand you a while apart
Confine yourself but in a patient list."

—*Othello*

సాయంకాలమునకు ముందుగనే కపాలకుండల తన గృహాకృత్యములఁ గావించుకొనుచుండుసమయమునందు దన కావిప్రవేషధారి (వాసిపంపిం చిన యుత్తరము కబరీబంధమునుండి విడివడి క్రిందఁబడిపోయెను. కాని కపాలకుండల కాసంగతి తెలియలేదు. పిమ్మట నాయుత్తరము యాదృచ్ఛి కముగా నవకుమారుని కన్నులఁబడియెను. అది కపాలకుండల వేణీభరము నుండి జారిపడుట నవకుమారున కెంతయో విస్మయమును గలిగించెను.

కపాలకుండలఁ దన పనులమీఁద నవ్వలికిఁ బోయినసమయమునందు నవకుమారుఁ డా యుత్తరమును దీసి చదువుకొనియెను. ఆ యుత్తరము నెవ్వరు పఠించినను దాని తాత్పర్యము "నీవు నిన్నటిదినమున నేమాట

వినవలయునని కుతూహలపడితివో యా మాటను వినగలవు" అనియే యైయుండు ననిగ్రహింపఁగలుగుదురు. ఆమాట యేమి? ప్రేమసంబంధ మైనదా? ఆబ్రాహ్మణవేషధారి కపాలకుండల కుపపతి యైయుండునా? నిన్నటిరాత్రి జరగిన వృత్తాంత మేమియు నెఱుంగనివాని కా విషయ మును సిద్ధాంతముచేసికొనుట కవకాశ మేమున్నది?

పతివ్రత యగు కాంత భర్తృసహగమనకాలమునందుఁ గాని, మఱి యేదే ననివార్యమగు కారణముచేఁ గాని చితారోహణము గావించి యం దగ్నిని ప్రజ్వలింపఁజేసికొనును. అప్పుడు మొట్టమొదటఁ జితినుండి ధూమము బయలుదేఱి నలువంకలను గ్రమ్ముకొనును; అందువలన నేత్రావరోధము గలుగును; కన్నులగపడక యంతయు నంధకారమయ మగును; తరువాతఁ గ్రమముగాఁ బేర్చిన కట్టె లంటు కొనుట కాకంభ మగును; అట్లు దహించువహ్నినుండి మొట్టమొదటఁ బామునాలుకలవలె నొకటిరెండు చిన్నచిన్నజ్వాలలు వెలువడి యాసతీ మణియొడలియం దచ్చటచ్చటఁ గఱచుటకు మొదలుపెట్టును; పిమ్మటఁ బెళపెళధ్వనులతో ననలజ్వాల లుదయించి నలుదెసలనుండియు వ్యాపించి యామె సర్వాంగకముల నలమికొని మండించుచుండును; అనంతరము ప్రచండారావముతో నా యగ్నికీలలు గగనమండలమును జ్వాలాభీల ముగఁ జేయుచు నామెయాపాదమస్తకము నలముకొని దహించి తుద కామెదేహము నంతను భస్మీభూతముగఁ జేసివైచును.

ఆయుత్తరమును బలించిన నవకుమారుని యవస్థ యిప్పు డాదివిధ ముగనే యుండెను. మొట్టమొదట నాతని కేమియును బోధపడలేదు; తరువాత నించుక సంశయము గలిగెను; పిమ్మట నొక నిశ్చయము తోచెను; అనంతరము హృదయవేదన యగ్నిజ్వాలవలె దహింపఁ దొడఁగెను. మానవ హృదయమునందు సాధారణముగా నధికమగు క్లేశముగాని, యధికమగు సుఖముగాని యొక్కసారిగనే యనుభవము

నకు రానేరదు. అవి క్రమక్రమముగా ననుభూతము లగుచుండును. నవకుమారుని మొట్ట మొదట భూమచ్ఛటలాక్రమించుకొనెను. తరువాత్ భావకశిఖలు హృదయోత్తాపమును గావింప దొడంగెను. తుదకా కరాళానలజ్వాలచే దగ్ధమై హృదయము భస్మీభూత మగుచుండెను.

ఇంతకుం బూర్వమే కపాలకుండల యప్పుడప్పు డొక్కొక్కవిష యమునం దాతఁడు చెప్పినట్లు చేయక తనయిష్టమువచ్చినట్లు మెలంగు చుండెను. విశేషించి నిన్నటిరాత్రి యాతఁడు వలదని నిషేధించు చున్నను గపాలకుండల స్వేచ్ఛానుసారిణియై యేకాకినిగ వనమునకుం బోయియుండెను. అంతేకాక తనయిచ్చవచ్చిన ట్లగపడినవారితో నెల్లఁ గులసతీగౌరవమగు లజ్జ నుజ్జగించి నిస్సంశయముగా సంభాషించి యుండెను; తనమాట నెంతమాత్రమును లక్ష్యము చేయక నేటిరాత్రి కూడ బయలు దేఱి యరణ్యప్రదేశమున కొంటిగాఁబోయెను!

ఇన్నిరీతుల నిర్లక్ష్యముగా యథేచ్ఛముగా సంచరించుచున్న యామె విషయమున నెవ్వరి కనుమానము గలుగదు? కాని నవకుమారుని హృదయమునందుఁ గపాలకుండలవిషయమున నించుక సందేహము గలిగి నచో నది చిరకాలమువఱకును దేలుకుట్టినట్లు బాధించుచునే యుండునని భావించి యాతఁడెంతమాత్రమునట్టిసంశయమునకుఁదనస్వాంతమునందుఁ దావిచ్చియుండలేదు. నేఁడుకూడ నట్లే యుండవలయునని యెన్ని యో విధముల నాతఁడు తనమనసు కుదురుపఱుచుకొనుటకుఁ బ్రయత్నించెను. కాని నేఁడు గలిగినది సందేహము గాదే! ఆయుత్తరమునుబట్టిచూడగా నిశ్చయముగనే యగపడుచుండెను.

అందుచేతనే యిప్పు డాతనిహృదయము తీవ్రవేదనచేఁ బరితపించి పోవుచుండెను. ఆ పరితాపప్రథమవేగ మించుక యుపశమించిన తరువాత నవకుమారుఁడు నిశ్శబ్దముగఁ జాలసేపటివఱకుఁ దనలోఁ దా నేడ్చుచుఁ గూర్చుండెను. ఆదుఃఖమువలన నాతనికిఁ గొంతవఱకుపశాంతి

లభించినది. అప్పు డాతఁ డిఁకముందేమి చేయవలయునో యాలోచించు కొని యట్లుచేయుటకు దృఢనిశ్చయుఁ డయ్యెను.

నేఁటిదినమున నవకుమారుఁడు కపాలకుండలతో నెట్టిసంభాషణమును గావించి యుండలేదు. ఆమె సాయంకాలమునకుఁ దరువాత వనాభిముఖియై పోవునప్పుడు తానుగూడ నామె ననుసరించి పోవలయు ననియు నచ్చటఁ గపాలకుండల గావించు మహాపాతకకృత్యమును బ్రత్యక్షమునఁ గనుఁగొని తదనంతర మామెజీవితమును విసర్జింపవలయు ననియు నాతఁడు శపథము గావించుకొనెను.

కాని నవకుమారుఁ డీవిషయముంగూర్చి కపాలకుండలఁ నేమియును బ్రశ్నించి యుండలేదు! ఇట్టిపని నీకుఁ దగదని చెప్పియుండను లేదు! ఇంతేకాదు తనయనుమానముంగూర్చిగాని, తన కడపటిప్రతిజ్ఞంగూర్చి గాని యామె కెంతమాత్రమును దెలియనీయలేదు. ఆమె కేమియుఁ దెలుపకుండఁగనే యాత్మహత్య చేసికొనవలెనని యాతఁడు నిశ్చయించు కొనెను. అట్లుకాక నవకుమారుఁ డింకేమి చేయఁగలఁడు? దుస్సహమగు నట్టి జీవనభారమును వహించుట కాతఁడు సమర్థుఁ కాఁజాలకుండెను.

ఇట్లు స్థిరపఱచుకొనియే నవకుమారుఁడు కపాలకుండల యెప్పు డిల్లు విడిచి బయలుదేఱునో యని యొకగదిలోఁ గూర్చుండి గవాక్ష ద్వారమునుండి తదేకదృష్టితోఁ బ్రతీక్షించుచుండెను. ఆమె బయటికి వచ్చి కొంతదూరమువఱకును నడచిపోయినతరువాత నవకుమారుఁడును మెల్లగా వెలుపలికి వచ్చెను. సరిగ నాసమయమునకే కపాలకుండల యాయుత్తరముకొఱకు మరల నింటికివచ్చెను. అప్పుడు నవకుమారుఁ డామెకు దృష్టిగోచరుఁడు కాకుండ నొకప్రక్క నోసరిల్లియుండెను. తుదకుఁ గపాలకుండల యింటియుం దాయుత్తరమును గానక మరల వెలుపలికి వచ్చి యథాప్రకారము వనమునకే పోవుచుండెను. ఆమె కొంత దూరము పోయినతరువాత నవకుమారుఁడు కూడ నామెను వెంబడించి

చనుటకు వెలుపలికి వచ్చెను. అట్లు వచ్చుచుఁ జూడఁగా ద్వారమునకు సమీపమునం దొకదీర్ఘకాయుఁడగు పురుషుఁడు నిలువబఁడి యుండెను.

ఆపురుషుఁ డెవ్వఁడో, యాతఁ డెందు కచ్చటికి వచ్చి నిలిచి యుండెనో తెలిసికొనవలయు ననునిచ్ఛ నవకుమారున కించుకంతయును గలుగనే లేదు. అప్పు డాతనిదృష్టియంతయును గపాలకుండలను బరీక్షింప వలయు ననునిశ్చయమునందే నిమగ్నమై యుండెను. అందుచేతనే నవకుమారుఁ డప్పుడు తనకుఁ ద్రోవఁ చేసికొనుటకై యాగంతుక పురుషుని వక్షమునందు దనహస్తము నుంచి యాతని ద్రోసివైవఁ బ్రయత్నించెను; కాని యావ్యక్తి నటనుండి కదల్పఁజాలకపోయెను.

అప్పుడు నవకుమారుఁడు దృఢస్వరముతో "ఎవరవునీవు? పొమ్ము! దూరముగఁ బొమ్ము! దారికడ్డముగా నీవీ ద్వారమునొద్ద నెందుకు?" అనెను.

ఆగంతుకవ్యక్తి గంభీరస్వరముతో "నేనెవ్వఁడనా? నన్ను నీ వాన వాలుపట్టలేదా?" అని మరలఁ బ్రశ్నించెను.

ఆ కంఠస్వరము సముద్రఘోషమువలె నవకుమారుని చెవులఁ బడియెను. నవకుమారుఁడు బాగుగఁ బరిశీలించి చూచెను — చూడఁగా నాతఁడు పూర్వపరిచితజటాజూటధారియగు కాపాలికుఁడే యైయుండెను!

నవకుమారుఁ డాతనిం గాంచి యాశ్చర్యఫులకితుఁ డైపోయెను; కాని యేమాత్రమును భయపడలేదు. అప్పు డాతని వదనమండల మాకస్మిక ముగాఁ బ్రఫుల్ల మయ్యెను. నవకుమారుఁడు ప్రసన్నస్వరముతో "ఇప్పుడు కపాలకుండల వనమునకుఁ బోవుచుండుట నిన్ను దర్శించుట కేనా?" అని ప్రశ్నించెను.

కాపా — కాదు!

ఇంతవఱకును మినుకుమినుకుమనుచున్న యాతని మనసునందలి యాశాజ్యోతి చటాలున నారిపోయెను. అందుచేత మరల నవకుమారుని

ముఖమండలము మునుపటివలెనే కాలనీరదనిబిడంబగు నంధకారముచే నావృతమైపోయెను. అప్పు డాతఁడు కాపాలికునిగాంచి "అట్లయినచో నాకు దారి విడువుము! కొంచెము తప్పుకొనుము!" అనెను.

కాపా – అట్లే చేసెదను. కాని నేనిప్పుడు నీతోఁ గొన్నిమాటలు చెప్పవలసియున్నది. ముందుగా వానిని వినవలయును.

నవ – నీకును నాకును నడుమ సంభాషించుకొనవలసిన విషయము లేమున్నవి? నీవు మరల నన్ను నీయుపాస్యదేవతకు బలిసేయుటకై తీసుకొనిపోవలయునని వచ్చితివా? అట్లయినచో నాప్రాణములను దీసి కొనవచ్చును. నేనిప్పుడు మఱియెట్టి యభ్యంతరమును జెప్పఁదలచుకొన లేదు. కాని నీవు కొన్ని నిమిషములవఱకును నాకొఱకు వేచియుండుము– నేనిప్పుడే తిరిగి వచ్చెదను. దేవతా పరితృప్తికొఱకు నా యీ శరీర మును సమర్పింపక తప్పించుకొని వచ్చినందు కిప్పుడు తగినశాస్తి ననుభవించుచున్నాను. అప్పు డెవ్వతె నా ప్రాణములను గాపాడినదో యామెయే యిప్పుడు నాకుఁ ప్రాణసంకటమైయున్నది. కాపాలిక స్వామీ! ఈసారి మాత్రము నేను నిన్ను మోసగించి పోవువాఁడను గాను నామాటయందు సంపూర్ణమగు విశ్వాసము నుంచుము. నేను కొలఁదిసేపటిలోనే మరలి వచ్చి నీ కాత్మసమర్పణము గావించుకొందును.

కాపా – నేనిప్పుడు నీ ప్రాణములను గైకొనవలయునను నుద్దేశ ముతో నిట్లువచ్చియుండలేదు. నేను చేయఁదలఁచుకొని వచ్చినకార్యము తప్పక నీకును సంగీకారముగనే యుండును. రమ్మా! లోపలికిఁ బోవుదము రమ్మా! అచ్చట నేను చెప్పఁబోవు మాట లన్నియును సావధానచిత్తుఁడవై యాకర్ణింతువుగాని...

నవ – వలదు. నీమాటలు వినుట కిది సమయము గాదు. మఱియొకప్పుడు సావకాశముగా వినఁగలను. మీరిప్పుడు కొంచెము వేచియుండుఁడు. శీఘ్రముగనే వచ్చెదను. నాకిప్పుడు విశేషప్రయోజనము

గల పని యొకటి యున్నది. ఆ కార్యమును సాధించుకొని యింతలో దిరిగివత్తును.

కాపా – ఓతాస్సా! నాకు నీసంగతి యంతయు నవగతమైనది. నీవిప్పుడాపాపాత్మురాలి ననుసరించి పోవఁదలఁచి యుంటివి. ఆమె యెచ్చటికిఁ బోఁబోనో సర్వమును నాకుఁ దెలియనిది గాదు. నిన్ను నావెంటఁ బెట్టుకొనిపోయి నీకాప్రదేశమును జూపించెదను నీవచ్చట నేమి చూడవలయునని కుతూహలపడుచుంటివో యాదృశ్యమును నీకుఁ జూపింపఁగలను. ఇప్పుడు నేను చెప్పఁదలఁచివచ్చినమాటలను వినుము! ఎంతమాత్రమును భయపడవలదు.

నవ – భయమా? మరణ మన్నను భయములేని నాకిప్పుడు మీరనిన భయ మెందుకు? రండు!

ఇట్లు చెప్పి నవకుమారుఁడు కాపాలికుని దనమందిరములోనికిఁ దీసికొనిపోయి యుచితాసనమున నాసీనుంగావించి తానుగూడ నాతని యంతికమునఁ గూర్చుండి "చెప్పుఁడు!" అనెను.

ఆఱవ ప్రకరణము

పునస్సంభాషణము

"తద్గచ్ఛ సిద్ధ్యై కురుదేవకార్యమ్"

— కుమారసంభవము

కాపాలికుఁడు సోఫాపైఁ గూర్చుండి తన బాహుద్వయమును నవకుమారునకుఁ జూపించెను. ఆతనిహస్తములు రెండును శిథిలములై దుర్బలములై యుండెను.

ఏరాతి కపాలకుండలను వెంటఁబెట్టుకొని నవకుమారుఁడు సముద్ర తీరవనప్రదేశమునుండి పలాయితుఁడై పోయెనో యారాత్రివేళనే వారి

నన్వేషించుచుఁ దిరిగితిరిగి కాపాలికుఁడు వాలుకాస్తూపశిఖరము నధిరో
హించి యాకస్మికముగా నటనుండి యావలికి జారిపడిపోయినసంగతి
మాపాఠకమహాశయులకు జ్ఞప్తియందుండవచ్చును.

అట్లు పడిపోవుసమయమునందుఁ గాపాలికుఁడు తనబాహువులు రెంటిని భూమిపై నానుకొని యెట్లో దేహసంరక్షణము గావించుకొను టకుఁ బ్రయత్నము గావించెను. అందుచే నాతనియొడలి కెట్టియాఘా తమును గలుగనిమాట నిజమే. కాని యానుకొన్న యా తనిచేతులు రెండును గ్రుంచుకొనిపోయెను. కాపాలికుఁ డప్పుడు జరగిన సకల విషయములం గూర్చియు నవకుమారునకు విస్పష్టముగా దెలియఁ జేయుచు " ఈహస్తములతో నిత్యకర్మకలాపము నిర్వర్తించుకొనుట కెట్టియాతంకమును లేదు కాని, వీనియందలి బల మంతయును క్షీణించి పోయినది. ఇట్టిదుర్బలకరములతోఁ గాప్న సంగ్రహము గావించుట యెంతో కష్టముగా నున్నది" అని చెప్పెను.

కాపాలికుఁ డింకను జెప్పుట కారంభించెను : " నేనాయిసుక మెట్ట నుండి భూమండలమునఁ బతితుఁడ నై పోవునప్పుడు నాచేతులు రెండును విరిగిపోవుననియు నితరావయవముల కెట్టిభంగమును గలుగ దనియు భావించుకొంటిని. నేను భూపతనమాత్రమునఁ మూర్ఛితుఁడనై పోయితిని. మొట్ట మొదటఁ గొంతసేపటివఱకు నొడలు తెలియకుండఁగనే పడియుంటిని. తరువాతఁ గొంచెముసేపు తెలివి, మఱికొంచెముసేపు మఱపుగ నుండెను. ఇట్టియవస్థలో నే నెన్నిదినములుంటినో సరిగాఁ జెప్పఁజాలను. రెండురాత్రులు నొకపగలు నట్లుంటినని తోఁచుచున్నది.

తరువాతఁ బ్రాతఃకాలమునందు నాకు సంపూర్ణమగు బాహ్యజ్ఞానము మరల నావిర్భూత మయ్యెను. అట్టిస్మృతి లభించుట కించుకముందుగనే నాకొకస్వప్నము గలిగెను. ఆకలలో భవానీదేవి ... (అని చెప్పు చుండఁగనే కాపాలికుని సకలాంగకములును బులకాంకితములై పోయెను)

...ఆకలలో భవానీదేవి నాకు సాక్షాత్కరించినట్లు తోఁచెను. ఆదేవి కోపముతోఁ గుటిలభ్రుకుటియై తనపాదములతో నన్నుఁ దన్నుచు "ఓకోరికురాచారీ! నేను నీచిత్తశుద్ధిని బరిశీలించుటకే నీపూజ కీవిధముగా నంతరాయమును గల్పించితిని. నీవింతపర్యంతము నింద్రియ లాలసత్వముచే బద్ధుఁడవై నీవుపెంచుచున్న యాకుమారికశోణితముతో నన్నుఁ బూజించుట కిచ్చగింపవైతివి. కావున నాకుమారి మూలము ననే నీపూర్వసంపాదితమగు సత్కర్మఫల మంతయు వినష్టమైపోయినది. ఇది మొదలుగా నీక నెన్నఁడును నేను నీవు గావించు పూజారాధనాదులను గ్రహింపఁ దలఁచుకొనలేదు" అని గద్దించి పలికెను.

అప్పుడు నేను రోదనము గావించుచు నావిశ్వజనని చరణకమలములపైఁబడి పొరలాడుచు నాదేవింగూర్చి క్షమాప్రార్థనముగావించితిని. అప్పుడు కరుణామయి యగు దేవి నాయెడలఁ బ్రసన్నయై "వత్సా! నీకిప్పు డొకవిధమైన ప్రాయశ్చిత్తమును విధించుచున్నాను. నీవిప్పు డాకపాలకుండలనుఁ దీసికొనివచ్చి నాకు బలిప్రదానము గావింపుము! నీవెంతకాలమువఱకు నేనాదేశించిన యాజ్ఞను బాలింపజాలకుందువో యంతకాలమువఱకును నాపూజను గావింపవలదు" అని యానతిచ్చెను.

నేనెంతకాలమున కేవిధముగా నారోగ్యలాభమును గాంచఁగలిగితినో యావిషయముంగూర్చి సవిశేషముగ నిప్పుడు తెలియఁజేయుట వలన నెట్టిప్రయోజనమును లేదు. కొంతకాలమున కెట్లో యారోగ్యవంతుడనై భగవతివిధించిన యాజ్ఞను బరిపాలించుటకుఁ బ్రయత్నింప నారంభించితిని. కాని యేమిచేయుటకును నాబాహువుల యందలి బలము క్షీణించిపోయినది. బాహుబలములేకుండ నెట్టిప్రయత్నము గావించుటకు నవకాశము లేదు. అందుచేత నాకార్యసిద్ధికొఱకు మఱియొకరి సాహాయ్యము కావలసివచ్చెను. కాని సాధారణముగా

మానవులందఱును నితరవిషయములం దాసక్తి గలిగియున్నట్లు ధర్మ పద్ధతియం దంతగా నభిరుచిగల వారై యుండరుగదా! - విశేషించి యీకలియుగమునందు బలవంతు లగు యువనరాజుల ధర్మవిరుద్ధ శాసన ముల మూలమున నెవ్వరు పట్టి సత్కార్యములకు సాహాయ్యపడుట లేదు. నేనెంతయో శ్రమపడి ప్రయత్నించి యీ పాపాత్మురాలి నివాసస్థానమును దెలిసికొనఁగలిగితిని. కాని నాకు మునుపటివలె బాహు బలము లేకపోవుటచేత భవాని యానతిప్రకార మీదురాత్మురాలిని బలవంతముగఁ దీసికొనిపోఁజాలకుంటిని. కేవలము మానససంసిద్ధి కొఱకు తాంత్రికవిధానము ననుసరించి క్రియాకలాపములనుమాత్రము నిర్వర్తించుచుంటిని. నిన్నటిరాత్రి యీసమీప వనప్రదేశమునందు హోమము గావించుకొనుచుఁ గపాలకుండల యొకవిప్రకుమారునితోఁ గలసి సంభాషించుచుండుటను నాకన్నులారఁగనుఁ గొంటిని. నేఁడు కూడ నామె యాతని దర్శించుటకే పోవుచున్నది. నీకిష్టమైనచో నావెంట రమ్ము! ఆయిరువురిని నీకుఁ జూపింపఁగలను."

"వత్సా! కపాలకుండల భైరవీపరితృప్తికై బలిసేయుట కర్వారాలై యున్నది. నేనాభవాని యాదేశానుసారముగా నామెను బట్టి వధించెదను. కపాలకుండలు నాయెడల నవిశ్వాసినియై కృతఘ్నురాలై పోయినది – నీవిషయమునఁగూడ నట్లే ప్రవర్తించినది. ఏవిధముగఁ జూచినను నామె వధార్హురాలైనది. కావున నీవు నాకీవిషయమున సాహాయ్యము చేయవలయును. నీ వా దుర్మార్గురాలిని బట్టుకొని యజ్ఞస్థానమునకు నాతోఁగూడఁ దీసికొని రమ్ము. అచ్చట నీవే స్వహస్తములతో కపాలకుండలను జగన్మాతకుఁ బ్రియముగా బలిదాన మును గావింపుము. అట్లు చేయుటవలన నీవు జగదీశ్వరివిషయమునఁ గావించిన యపచారదోషము పరిమార్జితము కాఁగలదు. ఆ పుణ్య కర్మమువలన నీకక్షయమగు పుణ్యసంచయము గాఁగలదు. విశ్వాస

ఘాతిని యగుకపాలకుండలకును దగినశిక్షకాఁగలము; పగదీర్చుకొనుట కిదియే చరమోపాయము!"

కాపాలికుఁ డింతవఱకుఁ జెప్పి ముగించెను. అంతయు నాలకించి నవకుమారుఁ డొట్టి ప్రత్యుత్తరమును జెప్పలేదు. అట్లు మౌనము వహించియున్న నవకుమారునిం గాంచి కాపాలికుఁడు మరల "వత్సా! ఇప్పుడు నేను నీకుఁ జూపించెద నని చెప్పినవిషయమును గన్నులారఁ జూచి వచ్చుటకై నను నానుమోదమ్ము!" అనెను.

నవకుమారుఁడు ఘర్మసిక్త సకలావయవుఁడై మాఁగుమాట చెప్పక కాపాలికునితోఁగూడ వెడలిపోయెను.

ఏడవ ప్రకరణము

సవతుల సంభాషణము

"Be at peace; it is your sister that addresses you. Requite Lucretia's love'"

— *Lucretia.*

కపాలకుండల యింటినుండి బయటికి వచ్చి క్రమముగాఁ బోయి యరణ్యమధ్యమునఁ బ్రవేశించెను. మొట్టమొదట నామె యాభగ్న గృహములోనికే పోయెను. ఆవిప్రకుమారవేషధారి యచ్చటనే యుగ పడియెను. అది పగటివేళయే యైయుండినచో నాతని వదనకాంతి యెంతయో మలినమైయున్నట్లు కనుపెట్టఁగలిగియే యుండును.

అట్లు కపాలకుండల వచ్చుటం గాంచి యాబ్రాహ్మణరూపధారి మృదుస్వరముతో "ఇది మనము మాటాడుకొనుటకుఁ దగినతావు గాదు. ఒకవేళ నిచ్చటి కా కాపాలికుఁడు వచ్చినను రావచ్చును. కావున మఱియొక చోటికిఁ బోవుదము రమ్ము!" అని చెప్పెను.

ఆవిపినమధ్యమునం దొకచోట నించుక తెరపిగా నుండెను. నలు వంకలును వనభూరుహములు వ్యాపించి యుండెను. కొంతప్రదేశము

మాత్రమే యాకలములు లేక యించుక పరిష్కృతమై యుపవేశన యోగ్యమై యుండెను. అచ్చటినుండి బయటికిఁ బోవుట కొకకాలి బాటకూడ నుండెను. ఆబ్రాహ్మణవేషి కపాలకుండల నచ్చటికిఁ దీసి కొనిపోయెను.

ఇరువురు నాప్రదేశమునం దాసీనులై యుండిరి. కొంతసేపై నతరువాత బ్రాహ్మణ వేషధారియే మొట్టమొదట మాటాడుట కారంభించి కపాల కుండలం గాంచి "నేనిప్పుడు నావిషయముంగూర్చి నీకుఁ బరిచయమును గావించెదను. నామాట లెంతవఱకు సత్యములై నవో యెంతవఱకు విశ్వసించుటకు యోగ్యములై నవో నీకే బోధపడఁగలదు. నీవొకనాఁడు నీభర్తతోఁగూడఁ బోవుచు నరణ్యమార్గమధ్యమునం దొకపాఠశాల యందు నివసించి యున్నప్పుడు నిన్ను దర్శించుటకై యొక యవనకన్య నీయొద్దకువచ్చినది. నీకాసంగతి యేమైన జ్ఞప్తియం దున్నదా?" అని ప్రశ్నించెను.

కపా — లేకేమీ? నీవిప్పుడు చెప్పినది నన్నప్పుడు తన విలువగల నగలతో నలంకరించిన యువతి మాటయేనా?

బ్రాహ్మ — ఔను. ఆ యవనకాంతను నేనే.

కపాలకుండల యత్యద్భుతాక్రాంతహృదయయై యూరక చూచు చుండెను. లుత్ఫున్నీసా యామెనివ్వేరపాటు కనుంగొని నవ్వుచు "నీవింకను నాశ్చర్యపడఁదగినవిషయమున్నది - నేను నీసవతిని!" అనెను.

కపాలకుండల యదరిపడి "అది యెట్లు?" అనెను.

లుత్ఫున్నీసా యప్పుడు మొదటినుండియుఁ దనచరిత్రము నంతను దెలుపుట కారంభించెను. క్రమముగా నామె తనచిన్నతనము నందలి వివాహము, జాతిభ్రష్టత్వము, భర్తృపరిత్యాగము, ఢాకానగరవాసము, ఆగ్రాపట్టణనివాసము, జహాంగీరుతోడి సంబంధము, మెహరున్నీసా యుదంతము, జహాంగీరామెను మోహించుట, ఆకారణముచేఁ

దానాగారాజధానిని బరిత్యజించుట, సప్తగ్రామమునకు వచ్చుట, నవకుమారునిసందర్శించి సంభాషించుట, తనవిషయమున నవకుమారుని ప్రవర్తనము, నిన్నటిదినమునఁ దాను మారువేషముతో నవకుమారునియింటికి రావలయు నని సంకల్పించి యరణ్యమార్గమున బయలుదేఱుట, అరణ్యమధ్యమున హోమము చేయుచున్న కాపాలికుని సందర్శించుట మొదలగునన్ని సంగతులను స్పష్టముగాఁ గపాలకుండల కెఱిఁగించెను.

అంతయును విని కపాలకుండల "నీ విట్లు కపటవేషముతో మాయింటికి రాఁదలఁచినట్లు చెప్పితివే – అట్లువచ్చుటలో నీయభిప్రాయమేమి?" అని ప్రశ్నించెను.

లుత్ఫ – నీకును, నీభర్తకును నీజన్మమునం దొండొరు లిఁకఁ గలిసికొనుట కవకాశము లేకుండ శాశ్వతవియోగమును సంఘటిల్లఁజేయవలయు ననుద్దేశముతో రాఁదలంచితిని.

కపాలకుండల యించుకసేపు తనలోఁదానే యాలోచించుకొని "ఆలాగా? నీ వేయుపాయముచే నట్టికార్యమును సాధింపఁ బూనుకొంటివి!" అని యడిగెను.

లుత్ఫ – నీపాతివ్రత్యమును గూర్చి నీస్వామి కెట్లయిన ననుమానము గలిగించి నిన్నుఁ బరిత్యజించునట్లు చేయ నెంచితిని. కాని యిప్పు డందువలన నెట్టిప్రయోజనమును నగునట్లు తోఁచుట లేదు. ఆయుద్దేశమును మార్చుకొంటిని. ఇఁక నొక్కటే నిశ్చయించుకొన్నాను. నేను చెప్పినట్లుచేయుటకు నీవిప్పు డంగీకరించినచోఁ దప్పక నామనోరథము సిద్ధింపఁగలదు. ఇట్టి స్థితిలో నాకార్యసిద్ధికైనను, నీక్షేమమునకైనను నీవే మూలమైయున్నావు.

కపా – ఆహోమము చేయుచున్న కాపాలికుని నోటినుండి యెవ్వరి నామ ముచ్చరింపఁబడుచుండెనో నీవు వింటివా?

లు – సేనాపతే – ఆతఁడట్లు మంత్రోచ్చారణము చేయుచు హోమము చేయుచుండుట నీమేలుకొఱకో కాక కీడుకొఱకో యని తెలిసికొనఁగోరి నేనాతని చెంతకుఁ బోయి వందనముగావించి యొకచోఁ గూర్చుండి యుంటిని. హోమము సంపూర్ణమైనతరువాత నీవేరితోఁ జేయఁబడిన యాహోమమున కుద్దేశమేమని ఛలోక్తిగాఁ బ్రశ్నించితిని. కొంతసేపాతనితో సంభాషించుటవలన నీకమంగళమును గల్పించుటకే కాపాలికుఁ డట్లు హోమము చేయుచుండె నని గ్రహింపఁగలిగితిని. నాయుద్దేశముకూడ నదియే యని యప్పు డాతనికిఁ దెలియఁజేసితిని. ఆక్షణమునందే మేమిరువురము నొకరికొకరు సహాయపడుటకు నిశ్చయించుకొంటిమి. ఇంకను బాగుగా నాయభిప్రాయమును దెలిసికొనుటకై యాతఁడు నన్నాభగ్నభవనమధ్యమునకుఁ దీసికొనిపోయెను. అచ్చట నాతఁడు తనముఖోద్దేశమును నాకుఁ దెలియఁజేసెను. నిన్ను సంహరింపవలయు ననియే యాతని యభీష్టము – అట్లు చేయుటనాకెంత మాత్రము నిష్టము లేకుండెను. నేను నాజీవితకాలమునందింతవఱకును గేవలము పాపకృత్యములనే కావించి యుంటిని. కాని నిరపరాధిని యగు నొకయువతీమణిని నిష్కారణముగా మృత్యుముఖమునఁ బడఁ ద్రోయు క్రూరకృత్యమును సాధించునంతటి నీచాతినీచస్థితి కింకను రాలేదు. పాపపథమునం దింకను నేనంతదూరము పోలేదు. నేనందుకు సమ్మతింపలేదు. మేమిట్లు వాదించుకొనుచున్న సమయమునందే నీవచ్చటికి వచ్చియుంటివి. మామాటలుకూడ నీకు వినఁబడి యుండవచ్చును.

కపా – ఔను. విన్నాను. మీరుభయులు నప్పు డీవిషయమును గూర్చియే తర్కవితర్కములను గావించుకొనుచుంటిరి.

లు – ఆకాపాలికుఁడు నేనేమియు నెఱుంగనిమూఢురాల ననియు, నజ్ఞాని ననియు భావించి నాకేదియో యించుక బోధింపవలయు ననియూహించెను. తుద కాతఁ డేమి స్థిరపఱచుకొనునో తెలిసికొని

యాసంగతి నీకుఁ దెలియఁజేయవలయు ననుఁ నభిప్రాయముతోనే నేను నిన్ను వనమధ్యమునకుఁ దీసికొనిపోయి యట నేవచ్చువఱకు నుండుమని చెప్పిపోయితిని.

కపా — ఆమాట నిజమే - కాని మరల నీవెంతసేపటికిని నేనున్న చోటికి రానేలేదేమి?

లు — ఆతఁ డప్పు డెన్ని యోసంగతులనుగూర్చి చాలవఱకు మాట లాడెను. ఆదీర్ఘసంభాషణము నాలకించుటతోనే యాలస్యమైపోయినది. నీవావ్యక్తిని బాగుగానే యెఱిఁగియుందు వనుకొందును. ఆతఁ డెవ్వఁడో నీవప్పు డానవాలు పట్టఁగలిగితివా?

కపా — గుర్తించితిని. ఆతఁడు నాచిన్నతనమునుండియు నన్ను బెంచిన కాపాలికస్వామియే.

లు — ఔనఁట! ఆతనికి నీవొకప్పుడు సముద్రతీరమునందు దొరకి నట్లును, అప్పటినుండియు నిన్నాతఁడు కుమారివలెఁ బెంచుచున్నట్లును, తరువాత గొంతకాలమునకు నవకుమారుఁ డటకు వచ్చినట్లును, ఆతనితోఁ గూడ నీవు పలాయితవై నట్లును, మీరిరువురును మోసగించిపోయిన తరువాతఁ దానేమేమి చేసెనో, యెట్టికష్టములఁ ననుభవించెనో వాని నన్నిటినిగూర్చియు విస్పష్టముగా విపులముగా నాకుఁ జెప్పియున్నాఁడు. ఆసంగతు లేవియును నీకుఁ దెలియవు. అన్నియు నీకుఁ దెలియుటకే యింతగా విస్తరించి చెప్పవలసివచ్చినది.

ఇట్లు చెప్పి లుత్ఫుఉన్నీసా కాపాలికునివాలుకాస్తూపశిఖరపతన మును గూర్చియు, బాహుభంగముంగూర్చియు, నాతనికిఁ గలిగిన స్వప్నముంగూర్చియు సవిస్తరముగాఁ దెలియఁజేసెను. ఆతని స్వప్న వృత్తాంతమును విని కపాలకుండల భయప్రకంపిత యైపోయెను. ఆమె సర్వాంగకములును గంటకితము లైపోయెను. ఆమెహృదయము విద్యు చ్చంచల మైపోయెను.

అంతయునుఁ జూచి లుోఁపలుఁన్నీసా "ఆకాపాలికుని దృఢనిశ్చయ మేమో నీకుఁ దెలిసినదా? భవానీదేవియాజ్ఞ నెట్లయిన నిర్వహింప వలయు ననియే - ఆతఁడు దుర్బలుఁడై యుండుటచే నిట్టియుద్యమము నందింకొకరిసాహాయ్యమునకై యన్వేషించుచున్నాఁడు. నేను నిజముగా విప్రకుమారుఁడ ననియే విశ్వసించి నేనాతనికిఁ దోడుపడెద ననునాశతో నాకీవృత్తాంత మంతయును జెప్పియున్నాఁడు. కాని నేనింతవఱకుసట్టి దారుణకృత్యమునకు సమ్మతించుట లేదు. అంతేకాదు - ఆతనిసంకల్ప మునకుఁ బ్రతికూలముగఁ బనిచేయుటకే నేను నిశ్చయించుకొంటిని. ఆదురాత్మునికి నామనసులోనియుద్దేశము నెంతమాత్రమును దెలియ నీయలేదు. నేనెన్నఁటికి నాపనిలో నీతనికిఁ దోడ్పడను. అట్టి దృఢో ద్దేశముతోనే నేను నిన్నుఁ గలిసికొనవచ్చితిని. కాని నేనిట్టికార్యమును గేవలస్వార్థపరత్వముచేమాత్రమే యాచరించుట లేదు. నీప్రాణదానము గావింపవలయుననియే - అందువలన నీవును, నాకుఁ గొంతయుపకారము గావింతువని -- " అనియెను.

కపా -- నేను నీకెట్టియుపకారము చేయవలయును.

లు — నీప్రాణరక్షణమునకుఁ బ్రత్యుపకారముగా నీవు నీస్వామిని త్యజించి నాకును ప్రాణదానము గావింపుము!

కపాలకుండల చాలసేపటివఱకు నేమియును మాటలాడలేదు. అట్లు కొంతసే పైనతరువాత నామె "నీవు వాంఛించునట్లు నేను నాభర్తను బరిత్యజించి యొక్కడకుఁ బొమ్మందువు?" అనియెను.

లు — విదేశమునకు - చాలదూర దేశమునకుఁ బోవలయును - అచ్చట నీకు నేనొక దివ్యభవనమును గట్టించి యిచ్చెదను — కావలసినంతధనము నిచ్చెదను — దాసదాసీజనమును గూర్చి యిచ్చెదను. నీవాసౌధము నందు మహావైభవముతో మహారాజ్ఞివలె నుండవచ్చును.

కపాలకుండల మరల నాలోచించుట కారంభించెను - ఆమె తన

మనోనయనములతో విశ్వమండల మంతయును బరిశీలించి చూచెను. ఎచ్చటనుగూడ నెవ్వరు నామె నేత్రములకు లక్ష్యము గాలేదు. పిమ్మట నామె తన యంతఃకరణమధ్యమునకు దృష్టిని మరలించుకొని వీక్షించెను. అచ్చటనుగూడ నామె నవకుమారుని గనుగొనఁజాలకపోయెను? ఇట్టి స్థితిలో నామె లుత్ఫున్నీసాసుఖమార్గమున కెందుకడ్డముగా నిలిచి యుండవలయును?

అట్టియుద్దేశముతోనే కపాలకుండల లుత్ఫున్నీసానుద్దేశించి "నీవు నాకుపకారమే చేయఁదలఁచి వచ్చితివో, కాక యపకారమునే చేయు నుద్దేశముతో నుంటివో నాకింకను స్పష్టముగా బోధపడుట లేదు. నాకు దివ్యభవనములు, ధనసంపదలు, దాసదాసీజనులు, భోగవైభవములు మున్నగునానితో నెట్టిప్రయోజనమును లేదు. నేనునీసుఖమార్గమునకుఁ గంటకమునై యేల నిరోధించి యుండవలయును? నీమనోరథము తప్పక సిద్ధించుఁగాక! నీప్రయత్నమున కంతరాయముగా నున్ననాయోగక్షేమములు నీకు రేపటిసుండియే తెలియకుండఁబోఁగలవు. నేను చిన్నతనమునుండియు వనచారినినే యైయుంటిని - మరల నిప్పుడు మహారణ్యపథమునే పట్టి నాపోఁబడి యిఁక నెవ్వరికిని దెలియకుండఁ బోయెదను" అనిచెప్పెను.

లుత్ఫున్నీసా యత్యద్భుతవివశహృదయయైపోయెను. కపాలకుండల యింతసులభముగా సమ్మతించునని యామె యెంతమాత్రము నాసించి యుండలేదు. అందుచే నామె కరుణరసవిముగ్ధహృదయయై మృదుల స్వరముతో "సోదరీ! నీవు చిరాయుష్మంతురాల వగుము. నీవునాకు జీవనదానమును గావించితివి. ఇట్టి నిన్నుఁ గేనల మసహాయురాలినిగాఁ జేసి యెంటిగాఁ బోవిడువఁజాలను. రేపటిప్రాతఃకాలమున నాకు మిగుల విశ్వాసపాత్రురాలును, జతురమతియు నగునొకదాసిని నీయొద్దకుఁ బంపించెదను. నీవామెను దోడు చేసికొని వెడలిపొమ్ము! వర్ధమాన

నగరమునందు సర్వప్రధానురాలగు నొకరమణీమణి యున్నది. ఆమె నాకుఁ బ్రియమైనబాల్యసఖ: ఆమె నీకెల్లవిషయములయందును సహాయురాలై నీయోగక్షేమములను గనుఁగొనుచుండఁగలదు" అని చెప్పెను.

ఇట్లు లుత్ఫుఉన్నీసాయును, కపాలకుండలయు హృదయములేకముగఁ జేసికొనిసంభాషించుకొనుచుండిరి గాని యెట్టియెదుటనే తటస్థించియున్న ప్రాతికూల్యము నించుకంతయును గ్రహింపఁజాలకయే యుండిరి.

ఆయిరువురును గూర్చుండియున్న ప్రదేశమునుండియే వెలుపలికిఁ బోవు నొకబాట యున్నది గదా! ఆమార్గముఖమునందే చెట్లచాటున దాఁగియుండి కాపాలికుఁడును నవకుమారుఁడును వారివంక నతిక్రూరములగు దృష్టులను బరగించుచు వారి సంభాషణముల నాలకింపవలయునని తల్లడపడుచుండిరి. పాపమాయువతులు వారిని జూడనేలేదు.

నవకుమారకాపాలికులు వారినిదూరమునందుండి చూచుచుండుట మాత్రమేకాని మరదృష్టవశమున నంతదూరమునుండి మాటాడుకొనుచున్న వారిసంభాషణములం దొక వాక్యమైనను నాయుభయులలో నొక్కరునుగూడ నాలకింపఁజాలకుండిరి.

మానవునిచూపుకెంతదూరము ప్రసరించునో చెవులుగూడ నంతదూరమునందలి శబ్దములను వినఁగలుగుట తటస్థించినచో నందువలన మానవదుఃఖజ్వాల ప్రశమితమే యగునో, ప్రజ్వలితమే యగునో యూహించి యెవ్వరు చెప్పఁగలుగుదురు? పరమేశ్వరునియీవిశ్వసంసృష్టి పరమకౌశలమయమైనదిగదా!

అప్పుడు కపాలకుండల విశీర్ణకుంతలయై యున్నట్లు నవకుమారుఁడు కనుఁగొనెను. ఆమె తనయిల్లాలు కాకపూర్వము వననివాసినియైయున్న సమయమునం దెల్లప్పుడు నట్లేయాగుల్భలంబితకేశదామయైయుండెను. నవకుమారుఁడు మరలఁ దిలకించెను. ఆవిరిసిన శిరోరుహము లావిప్రకుమారుని పృష్ఠప్రదేశమునఁ బడి యాతనిభుజములనుండి ప్రవేలాడుచున్న

శిరోరుహగుచ్ఛములతో సమ్మిళితములై యుండెను. అవి చాల పొడ వైనవగుటచే నయ్యిరువురును మెల్లమెల్లగా సంభాషించుకొనుటకై పరస్పరము దగ్గఱగాఁ జేరుకొనునప్పుడు లుత్పఉన్నీ సాపృష్ఠప్రదేశము వఱకును ప్రసరించుచుండెను. ఆదృశ్యము నాయిరువురిలో నొక్కఁ తెయును జూచుకొనలేదు. నవకుమారుఁడు చూచి మెల్లమెల్లగా నేలఁ గూలఁబడిపోయెను.

కాపాలికుఁ డాతనివై ఖరిం గాంచి తనకటిప్రదేశమునందు ప్రేలాడు చున్న యొకనారికేళపాత్రను బైకిఁ దీసి "వత్సా! క్రమముగా నీబలము క్షీణించిపోవుచున్నది. ఈ దివ్యమగు నౌషధమును సేవింపుము. ఇది విశ్వోజనని యగుభవానీదేవిప్రసాదము. దీనిని బానము గావించినచో శక్తిసంపన్నుఁడవు కాఁగలవు!" అని బోధించెను.

ఇట్లు చెప్పుచు గాపాలికుఁ డాపాత్రను నవకుమారుని నోటియొద్ద నుంచెను. నవకుమారుఁడు పరధ్యానముతో నందలిరసమును ద్రావి యతిదారుణ మగుతన పిపాసను దీర్చుకొనియెను. మంచిరుచిగల యా పానీయము కాపాలికుఁడు స్వహస్తములతో సిద్ధముగావించిన యతిదారుణ తేజఃపూర్ణమగుమధ్యమని నవకుమారుఁ డించుకంతయు నెఱుంగఁడు. దానిని సేవించినంతనే యాతని కెప్పటిశక్తి గలిగెను.

అప్పుడు లుత్పఉన్నీ సా మునుపటివలెనే మృదులస్వరముతోఁ గపాల కుండలనుద్దేశించి "సోదరీ! నీవునాకుఁ గావించినయుపకారమునకు బ్రత్యుపకృతిగావించుసామర్థ్యము నాకు లేదు. అయినను నేను చిర కాలమువఱకును నీస్మృతియం దుండఁగలిగితినేని నాకు సుఖముగా నుండఁగలదు. నేనింతకుఁ బూర్వము నీకొసంగియున్న యలంకారముల నన్నిటినిగూడ నీవప్పుడే యొకదరిద్రబ్రాహ్మణునకు దానముచేసి వైచితి వనుసంగతి వినియుంటిని. ఇప్పుడు నాచెంత నెట్టినగలును లేవు. నిన్నటిదినమున నేనొకకార్యము గావింపవలయు ననుద్దేశముతో నొక యంగుళీయకమును నా జుట్టుముడిలో దాఁచి తెచ్చియుంటిని.

పరమేశ్వరానుగ్రహముచే నేనూహించిన యాపాపకృత్యము గావింప వలసిన యావశ్యకము లేకుండఁ బోయినది. ఇదిగో! ఈ యుంగరమును నీయొద్ద నుంచుకొనుము. దీనిని జూచినప్పుడెల్ల నీయవనసోదరి నగు ననున్నఁ దలఁచుకొనుచుండుము. ఈయుంగర మెక్కడి దని నీస్వామి ప్రశ్నించినచో లుత్ఫున్నీసా యిచ్చిన దని చెప్పుము" అని బోధిం చుచు లుత్ఫున్నీసా బహుమూల్యము నిచ్చికొన్న యా యంగుళీయ మును బైకిఁ దీసి కపాలకుండల హస్తమునందుంచెను. నవకుమారుఁ డది యును స్వనయనములతో వీక్షించెను. తోడనే యాతనిసర్వాంగకము లును బ్రకంపితము లగుచుండెను. మరలఁగూలఁబడిపోవుననుభయ ముతోఁ గాపాలికుఁ డాతని గట్టిగాఁ బట్టుకొని మరల మదిరారసము నాతనిచేఁ ద్రావించెను. ఆమద్యశక్తి నవకుమారుని మెదడునందుఁ బ్రవేశించి దానిసహజశక్తినంతను సంహరించి వైచుచుండెను. అందలి ప్రేమాంకురమునుగూడ నిర్మూలముగఁ జేసివైచుచుండెను.

కపాలకుండల లుత్ఫున్నీసాయొద్ద నెలవుఁ దీసికొని మరల గృహాభి ముఖియై వచ్చుచుండెను. అప్పుడు నవకుమారుఁడును, గాపాలికుడుఁను లుత్ఫున్నీసాకుఁ గానరానిమార్గమునఁ గపాలకుండలఁ ననుసరించి పోవఁదొడంగిరి.

ఎ ని మి ద వ ప్ర క ర ణ ము

గృ హా భి ము ఖ ము

"No spectre greets me – no vain shadow this."

— *Wordsworth.*

కపాలకుండల మెల్లమెల్లగా మందిరాభిముఖముగాఁ బోవుచుండెను. మిగులమెల్లగా మృదుపద విన్యాసముతో నడచుచుండెను. కేవలము నతిగంభీరమగు నాలోచనయందు నిమగ్నయై యుండుటయే యందుకు గారణము. లుత్ఫున్నీసాతో మాటలాడుటమూలమునఁ గపాల కుండలహృదయ మొక్కసారిగా నపూర్వపరివర్తనము నందియుండెను.

ఆమె యిప్పుడాత్మవిసర్జనము గావించుటకు సిద్ధురాలై యుండెను. అట్లు చేయుట యెందుకొఅకు? లుత్పఉన్నీ సా యాత్మసుఖముకొఅకా? కాదు.

కపాలకుండలయంతఃకరణమును బట్టి చూడఁగా నామె కేవలమును దారిత్రికుఁడగు కాపాలికుని మానసపుత్రిక యనుటకుఁ దగినట్లేయుండెను. తాంత్రికుఁ డేవిధముగాఁ గాళికాదేవియనుగ్రహమును వాంఛించి యిత రుల ప్రాణములను దీయుట కెట్టిసంశయమును లేకయుండునో యట్లే యామెయును భవానీప్రసాదము నభిలషించి యాత్మార్పణమునైన గావించు స్వభావముగలదియై యుండెను. కపాలకుండల యాకాపాలి కునివలెనే యనన్యచిత్తముతో భవాని కృపాకటాక్షమునే నిత్యము నభ్యర్థించి పూజాహోమాదులను గావించుసంకల్పముగలది కాదు. అయినను నిరంతరము శాక్తేయమంత్రగీతపఠనముల నాలకించుచుండుట చేతను, భవానీ సందర్శనము గావించుచుండుటచేతను, నామెయెడల భక్తివిశ్వాసము లతిశయించియుండుటచేతను గపాలకుండలకు దేవీ సంబంధమగుభక్తి సంపూర్ణముగనే హృదయమునందు నిండియుండెను. ఆభైరవీదేవియే సృష్టిశాసన కారిణి యనియు, ముక్తిదాయిని యనియు విశ్వసించి శాక్తేయసుతాచారములం దత్యంతానురక్తయై యుండెను. ఆకాళికాదేవి పూజాపీఠము మానవరుధిరప్లావితమై యుండుట మాత్రము పరదుఃఖదుఃఖిత యగునామె హృదయము సహించుటలేదు గాని భవానిదేవియెడల భక్తి గలిగియుండుటలో నామె యెట్టిలోప మును గావించుట లేదు. ఇప్పుఁడావిశ్వాసనిధాయినియు సుఖదుఃఖ ప్రదాయినియు, కైవల్యప్రసాదినియు నగు భైరవీదేవి కాపాలికుని స్వప్నమునందు సాక్షాత్కరించి తన్ను బలిసేయుమనియునీ యాజ్ఞా కాజ్ఞ గావించి యున్నది. అట్టి యా దేవియొక్కను నిక్రమముగఁ బాలిం చుట కామె యెట్లు సహాయపడకుండఁగలదు?

నీవుగాని నేనుగాని ప్రాణత్యాగము గావించుట కెంతమాత్రము నిష్టపడఁజాలము. రాగసంకలితులమై యీసంసారము సుఖమయ

MEMORIAL NARLA P. R. I. Acc. No.

మనియే విశ్వసించుచుందుము. అట్టిసుఖమునందలి యనుర క్తిచేతనే అట్టి సుఖాశచేతనే యీసంసారచక్రమునందుఁబడి పరిభ్రమించు చుందుము – కాని దుఃఖమును వాంఛించి కాదు. ఎప్పుడైన మనము గావించు కర్మములవలనిదోషముచే మనము గోరుకొనుచున్న సుఖాశ ఫలింపకపోయినచో నదియే దుఃఖముగ భావించి పెద్దపెట్టున దుఃఖిం చుచు దల్లడిల్లిపోవుచుందుము. కాని దుఃఖమునుసది విధినియమము గాదని సిద్ధాంత మైపోయినది. అది కేవలము నియమము నతిక్ర మించుటమాత్రమే – నీకుఁగాని, నాకుఁగాని యెల్లయెడల సుఖమే నిండి యున్నది. ఆసుఖమే యీసంసారమునందు మనలను బంధించుటకు మూలకారణమై యున్నది. అందుచేతనే మనముదానిని వదలజాల కున్నాము. కాని యీసంసార బంధమునకుఁ బ్రణయమే ప్రధాన సూత్రము – కపాలకుండలకుమాత్ర మీబంధములేదు – మఱియేబంధ మునుగూడ నామెకు లేదు. ఇఁక గపాలకుండల కున్నది యేమి?

దేనికి బంధము లేకుండునో దానికే యప్రతిహత మగు వేగ ముండును. సెలయేరు పర్వతశిఖరమునుండి క్రిందికి జారి ప్రవహించు చున్నప్పుడు దానివేగము నెవ్వరరికట్టఁ గలుగుదురు? ఒక్కసారి వాయువు విజృంభించి వీచినచో దానిగమనవేగము నెవ్వరు నిరోధింపఁ గలుగుదురు? అట్లే యెట్టి నిర్బంధమును లేని కపాలకుండల చిత్తమే చలించినచో దానినెప్పటివలెఁ గుదురుపఱచుట కెవ్వరికి సాధ్యమగును? క్రొత్తగా నడవినుండి తీసికొనివచ్చిన గజకలభము మదమత్తమై నిరా ఘాటముగ సంచరించుచున్నప్పుడు దాని నెవ్వరు శాంతింపఁజేయఁగలరు?

కపాలకుండల తనమనసులోఁ దానే యిట్లు ప్రశ్నించుకొనెను: "ఏకారణముచేత నా యీశరీరమును జగదీశ్వరి యగు భవానీదేవికి సమర్పింపకుండవలయును? పాంచభౌతికమగు నీజీవితమువలన నేమి ప్రయోజనము?" అని – ప్రశ్నించునే యుండెను గాని యామె యెట్టి సదుత్తరమును బడయఁజాలకయే యుండెను. ఏదియు సిద్ధాంతము చేసి

కొన నేరకుండెను. ఈసంసారమునం దితరమగు నెట్టిబంధమును లేకపోయి నను జీవికిఁ బాంచభౌతికబంధము మాత్ర మొకటి యుండనే యున్నది.

కపాలకుండల యధోవదనయై నడచి పోవుచుండెను. మానవ హృదయ మెప్పుడు సముత్కటభావావేశముచే నుద్రిక్తమై యుండునో యెప్పు డాయేకాగ్రచింతనమువలన బాహ్యసృష్టియందలి లక్ష్యమే తప్పిపోవునో యట్టిసమయమునందుఁ గేవల మనైసర్గికమగు పదార్థము గూడఁ బ్రత్యక్షీభూత మైన ట్లనుభవమునకు వచ్చుచుండును. కపాల కుండల కిప్పు డట్టి యవస్థయే తటస్థించెను.

ఎవ్వరో యాకాశమండలమునందుండి యేదియో బోధించుచున్న మాట లామెశ్రవణకుహరములఁ బడుచున్నట్లుండెను: "వత్సా! నేను నీకు మార్గమును జూపెదను రమ్ము!" అని — కపాలకుండల యదరిపడి తలయెత్తిచూచెను. గగనమండలమధ్యప్రదేశమున నవనీలనీరదనిందిత దివ్యమూర్తి! ఆమెకంఠసీమను ప్రేలాడుచున్న నరకపాలమాలికల నుండి శోణితధారలు వర్షించుచుండెను. కటిప్రదేశమును జుట్టుకొని యున్న మానవచ్ఛిన్నహస్తములు వరుసగా నాందోళితము లగు చుండెను. ఆమూర్తివామహస్తమునందు కపాలము — శరీరమంతటను రుధిరధారలు — లలాటమునందు విషమోజ్జ్వల జ్వాలలచే విరాజిల్లు చున్న మూడవకంటికి సమీపమున బాలచంద్రరేఖ శోభాయమాన మగుచుండెను! ఆభైరవీమూర్తి దక్షిణహస్తమును బైకెత్తి కపాల కుండలను సంబోధించుచుండెను.

కపాలకుండల యూర్ధ్వముఖియై యాదేవిని దర్శించుచునే నడచు చుండెను. గగనమార్గమునుండి యా సజల నీరదశ్యామలమూర్తియును నామెకుఁ ద్రోవ చూపుచున్నట్లు ముందుగ నడచి చనుచుండెను. ఒకొకకప్పు డాకపాలమాలినీమూర్తి మేఘములచాటునఁ బడి యగ పడకుండఁ బోవుచుండెను. ఒకొకకప్పుడు దృష్టిపథమునందు

విస్పష్టముగ సాక్షాత్కరించుచుండెను. కపాలకుండల యేకాగ్రచిత్త ముతో నామూర్తివంకనే వీక్షించుచుఁ బోవుచుండెను.

నవకుమారునికిఁగాని, కాపాలికునికిఁగాని యది యేమియుఁ గాన వచ్చుటలేదు. నవకుమారుఁడప్పుడు సురాగరళప్రజ్వలిత హృదయుఁడై మదోద్రిక్తుఁడై యుండెను – కపాలకుండల యట్లు మెల్లమెల్లగాఁ బోవు చుండుటను గాంచి సహింపఁజాలక సమీపమం దున్న సహచరు నుద్దేశించి "కాపాలికా!" అని పిలిచెను.

కాపా – ఏమి?

నవ – మరల నాకొకసారి యాపానీయము నొసంగుము.

కాపాలికుఁ డెప్పటివలె నారికేళపాత్రమునందలి మద్యమును నవ కుమారుని కిచ్చి పూర్ణముగాఁ బ్రాగించెను.

నవ – (మదోద్రేకముతో) ఎంతసే పిట్లూరక చూచుచుండుట! ఇంకను నాలస్యము చేయు టెందుకు?

కాల – ఆలస్యము చేయనక్కఱ లేదు.

అప్పుడు నవకుమారుఁ డస్వాభావికము, నపూర్వము నగు రోష భీషణస్వరముతో "కపాలకుండలా!" అని కేకవై చెను.

ఆపిలుపు విని కపాలకుండల యదరిపడెను. ఈమధ్యకాలమునం దామె నెవ్వరును గపాలకుండలా యని పిలుచుట లేదు. మృణ్మయి యనియే యందఱును సంబోధించుచుండిరి. అట్లు పిలిచినవా రెవ్వరో తెలిసికొన వలయు నని కపాలకుండల వెనుకకుఁ దిరిగి నిలువఁబడి చూచెను. తీవ్రగమనములతో నవకుమారుఁడును, గాపాలికుఁడు నామె సమీపమునకు వచ్చుచుండిరి. కపాలకుండల మొట్టమొదట వారి నానవాలు పట్టలేకపోయెను. అందుచేతనే యామె "ఎవరు మీరు? యమదూతలా?" అని ప్రశ్నించెను.

ఆయుత్తరక్షణమునందే కపాలకుండల వారిని గుర్తించి కాపాలికు

నుద్దేశించి "నీవు యమదూతవుగావు! కావు! తండ్రీ! నీవు నన్ను భవానీదేవికి బలిసేయుటకై వచ్చియుంటివా?" అనెను.

ఆవెంటనే నవకుమారుఁడు తనదృఢముష్టితోఁ గపాలకుండల చేయి పట్టుకొనియెను.

కాపాలికుఁడు కరుణార్ద్రమధుర కంఠస్వరముతో "వత్సా! నీవిప్పుడు మావెంటరమ్ము!" అని చెప్పి శ్మశానాభిముఖముగా మార్గమును జూపుచు ముందు నడచుచుండెను.

కపాలకుండల యింకను దనదృష్టి నాకాశముమీఁదికే ప్రసరింపఁ జేయుచుండెను. ఎచ్చట గగనమండల విహారిణియు, లోకభీకర మూర్తియు నగుభైరవీదేవి యగపడుచుండెనో యావంకకే యామె చూపులు పరగించుచుండెను. అప్పు డారణరంగిణి యగు భవానీదేవి యట్టహాసము గావించుచుండెను; ఒకనిడుపాటి త్రిశూలాయుధమును హస్తమునందుఁ దాల్చి యాకాపాలికుఁడు పోవుచున్న మార్గము ననుస రింపుమని కపాలకుండలకు నిర్దేశించుచుండెను. కపాలకుండల ముందు సంభవింపఁబోవు కష్టసుఖంబుల నేమియు నెఱుంగనిదానివలె నేమియు మాటాడకుండఁ గాపాలికుని వెంబడించిపోవుచుండెను.

తొమ్మిదవ ప్రకరణము

ప్రేతభూమి

"వపుషాకరణోద్యతేనసా
నిపతంతీపతి మస్యపాతయత్
ననుతైల నిషేకబిందునా
సహదీప్తార్చిరుపైతి మేదినీమ్"

— రఘువంశము

చందమామ చల్లగా గ్రుంకుచుండెను. విశ్వమండల మంతయు నంధకార బంధుర మగుచుండెను. కాపాలికుఁ డెచ్చటఁ దనపూజా

స్థానము నేర్పఱచుకొనియుండెనో యచ్చటికిఁ గపాలకుండలను దీసికొని పోయెను.

ఆప్రదేశము గంగాతీరము నందలి విశాలమగు నొక యిసుకనేల. దానియెదుటనే యింకను విస్తృతమైన వాలుకాక్షేత్రఖండ మొకటి యుండెను. ఆచోటే శ్మశానభూమి.

ఆసైకతభాగములు రెంటినడుమను నీటిపోటు సమయమునందుఁ గొంచెముగా జలము ప్రవహించుచుండును. పాటువేళఁ దడిమైనను లేక తెరపిగనే యుండును. ఇప్పుడచ్చట జలము లేదు.

ఆశ్మశానభూమి గంగాతీరమువైపున నిసుకగుట్టలతోఁ జాలనెత్తుగా నుండును. అటనుండి గంగానదిలోనికి దిగవలసి వచ్చినచో నొక్క సారిగాఁ బైనుండి యగాధజలప్రవాహమున దుముకవలసి యుండును. ప్రబలమారుతా ఘాతములచేతను, గంగాతరంగ తాడనముల చేతను దానియెడ్డునఁ గలయుపకూలము లన్నియును క్షీణించి పోయినవి. అప్పుడప్పు డాతీరమునం దొడ్లు విరిగి యెంతయో లోతుననున్న జాహ్నవీప్రవాహమునఁ బడుచుండుటయును గలదు.

కాపాలికుఁడు పూజగావించుప్రదేశమునందు దీపములేదు. కాష్ఠ ఖండములనుండిమాత్రము పావకజ్వాలలు వెలువడుచుండెను. ఆయగ్ని కీలలవెలుఁగున నస్పష్టముగాఁ గానవచ్చుచున్న యాప్రేతభూమి మఱింత భయంకరముగా నుండెను. ఆసమీపమునందే పూజ, హోమము, బలిసమర్పణము మొదలగు తాంత్రికకర్మములకుఁ దగిన యుపకరణము లన్నియు సిద్ధముచేయఁబడి యుండెను.

అతివిశాలమగు నాగంగాతరంగిణీ హృదయ మంతయు గాఢాంధ కారావృతమై యుండెను. వసంతవాయువీచిక లప్రతిహతవేగముతో గంగాహృదయదేశమునుండి పరుగులువారుచుండెను. ఆకారణముచేత నుత్తుంగతరంగములు చెలరేఁగి మిన్నుముట్టుచు గలకల ధ్వానములచే దిక్కులఁ బ్రతిధ్వనింపఁ జేయుచుండెను. వల్లకాటి భూమియందు శవ

భుక్కు లగుజంతువులు కర్కశకంఠస్వరములతో నప్పుడప్పుడు భీషణా రావముల గావించుచుండెను.

కాపాలికుఁడు నవకుమారునితోఁ గూఁడఁ గపాలకుండలు నుచిత ప్రదేశమునందుఁ గుశాసనమున నుపవిష్టుఁ డాలిం గావించి తంత్రాదివిధుల ననుసరించి యథాశాస్త్రముగాఁ బూజ చేయుటఁ గారంభించెను. కొంత సేపైనతరువాతఁ గాపాలికుఁడు యథాసమయమున నవకుమారు నుద్దే శించి "నీవిప్పుడే కపాలకుండలను గంగానదికిఁ దీసికొనిపోయి స్నానము చేయించి తీసికొనిరమ్ము!" అని యాజ్ఞాపించెను.

నవకుమారుఁడును కపాలకుండలచేతిని గట్టిగాఁ బట్టుకొని స్నానా ర్థమై యాశ్మశాన భూభాగము మీఁదుగనే తీసికొని పోవుచుండెను. ఆతనిపాదముల కచ్చటియెముకలు గ్రుచ్చుకొను చుండెను. అచ్చట జలముతో నిండియున్న శ్మశానకుండిక యొకటి యాతని పదాఘాత ముచేఁ బగిలిపోయెను. దానిప్రక్కనే యొకశవము పడి యుండెను. ఆ యనాథ ప్రేతమునకు సంస్కారము చేయువారుకూడ నెవ్వరును లేక పోయిరి.

కపాలకుండలా నవకుమారులిరువురుకినిగూడ శవదేహము పాదము లకుఁ దగిలెను. కపాలకుండల దానికిఁ గొంచె మోసరిల్లిపోయెను. నవకుమారుఁడుమాత్రము దానిని ద్రొక్కుకొనుచునే పోయెను. నలు దెసలను సంచరించుచున్న శవమాంసభుక్కులగు క్రూరజంతువు లతి భీకరముగ నఱచుచు యథేచ్ఛావిహారము సేయుచుండెను.

ఇద్దఱుమనుష్యు లాప్రదేశమునుండి చనుచున్నట్లు గ్రహించి యా జంతువులుమఱింతభీషణముగా, మఱింతబిగ్గఱగా నఱచుటకారంభించెను. అందుఁ గొన్ని వారి నాక్రమించుటకై యురుకులు ద్రొక్కుకొనుచు నతివేగముగ నెదిరించి వచ్చుచుండెను. మఱికొన్ని వారి యడుగుల జప్పుడులకు భయపడి తప్పుకొని పోవుచుండెను.

అప్పుడంతయుం గాంచి నవకుమారుండు గడగడ వడఁకఁదొడంగెను.

కపాలకుండల యాతని భీతావస్థను గ్రహించెను. ఆమె సహజముగా నిర్భయురాలు! అందుచే నామె యెంతమాత్రమునుఁ జలింపలేదు.

కపాలకుండల వడఁకిపోవుచున్న నవకుమారునిం గాంచి "ఏమి? భయమగుచున్నదా?" అని ప్రశ్నించెను.

నవకుమారుని మదిరాపానమత్తత క్రమముగా తగ్గిపోవుచుండెను. అప్పుడు నవకుమారుఁ డతిగంభీరస్వరముతో "భయమా మృణ్మయీ! నేనట్లు భయపడువాఁడను గాను!" అనెను.

కపా – అట్లయినచో నీవిధముగా వడఁకిపోవు చెందుకు?

కపాలకుండల యెట్టిస్వరముతో నీప్రశ్న గావించినదో యట్టి స్వరము కేవలము రమణీమణుల కంఠములనుండి మాత్రమే వెలువడుట సంభవమగును! ఒక రమణీమణి యెప్పుడు పరులదుఃఖమును గాంచి జాలిపడునో యాసమయమునందే యారమణీకంఠమునుండి యిట్టి స్వరము వెలువడుట సంభవించును.

ఆసన్నమృత్యుసమయమున శ్మశానభూమికిఁ జేరుకొనియున్న కపాలకుండల కంఠమునుండి యట్టికరుణస్వరము బహిర్గతమగునని యెవ్వరనుకొన్నారు?

నవ – ఇది భయముకాదు. బిగ్గఱగా నేడువనేరకపోవుటచేఁ గ్రోధావేశమునఁ గంపించిపోవుచున్నాను.

కపా – ఏడ్చుట యెందుకు?

మరల నదియే కంఠస్వరము!

నవ – ఏడ్చుట యెందుకా? నీకేమి తెలియును మృణ్మయీ! నీవెన్నఁడును రూపసౌందర్యమునుగాంచి యున్నాదిని వగుదానవు కాదు!

అని వచించుచుండఁగనే నవకుమారుని కంఠస్వరము హృదయవేదనాభిభూతమై రుద్ధమైపోవుచుండెను. "మృణ్మయీ! నీవెన్నఁడును నీహృత్పిండమును స్వహస్తములతోనే ఛేదించుకొని శ్మశానమునఁ బాఱవైచుదానవు గావు!" అని చెప్పుచు నవకుమారుఁ డాకస్మికముగాఁ

బెద్దపెట్టున రోదనము చేయుచుఁ గపాలకుండల చరణప్రాంతమునఁ జాపచుట్టుగఁ బడిపోయెను.

అట్లు పతితుఁడై "మృణ్మయీ! — కపాలకుండలా! నన్ను రక్షింపుము. ఇదిగో! నీపాదములపైఁబడి పొరలుచుఁ బ్రార్థించుచున్నాను. 'నే ననుమానింపదగిన యవిశ్వాసినిని గా' నని యొక్కమారు చెప్పుము! ఒక్కటేసారి! 'సత్యముగా నే ననుమానింపదగిన దాననుగా' నని చెప్పుము! — నేను నిన్ను నాహృదయమునందు జేర్చుకొని యింటికిఁ దీసికొనిపోయెదను!" అని వేఁడుకొనెను.

అప్పుడు కపాలకుండల నవకుమారునిహస్తమును గ్రహించి లేవఁదీసి మృదులస్వరముతో "నీవట్లుగా నేల ప్రశ్నింపగూడదు?" అనెను.

ఆమె యెప్పుడీమాట యన్నదో యప్పటికి వారిరువురును నొక్కసారిగా నేటియొడ్డును జేరుకొని నిలిచి యుండిరి. కపాలకుండల ముందుండెను. ఆమె నదీప్రవాహమునకు వెనుదిరిగి యుండెను. ఆమె వెనుక నొకయడుగుదూరమునఁ జెంతయో యడుగునుండి గంగానది ప్రవహించుచుండెను. అప్పుడే జలోచ్ఛ్వాససమయ మగుచుండెను. కపాలకుండల యొడ్డుననే యొకమట్టిదిబ్బపై నిలిచి యుండెను. ఆమె యట్టిస్థితిలోనే యుండి "నీవట్లుగా నేలప్రశ్నింపఁ గూడదు" అని పలుమారు హెచ్చరించి యుండెను.

నవకుమారుఁడు త్రోపువడినవానివలె వికలస్వరముతో "నాకు బాహ్యస్మృతియే లేకుండఁబోయినది. ఏమని యెట్లు ప్రశ్నింపఁగలుగుదును? — చెప్పుము — మృణ్మయీ! చెప్పవా? — చెప్పవా? — చెప్పవా? — నన్ను బ్రదుకనిమ్ము! ఇంటికిఁ బోవుదము రమ్ము!" అని దీనముగా వేఁడుకొనెను.

కపా — ఏప్రశ్న యడిగినను జెప్పెదను. నే నిప్పుడు దర్శింపఁ బోయినవారెవ్వరో తెలియునా? — ఆమె పద్మావతి. నాసవతి! నేనెంత

మాత్రము నవిశ్వాసినినిగాను. యథార్థమును స్పష్టముగా నెఱింగించి తిని – నే నిఁక మరలి యింటికి రాఁదలఁచుకొనలేదు. భైరవీదేవి పాద సాన్నిధ్యమునం దీ నా దేహమును విసర్జించుటకై వచ్చియుంటిని – తప్ప కుండ నట్లే యాత్మసమర్పణము గావించి తీరుదును. మీరింటికిఁ బొండు! నేను మరణింతును. నాకొఱకు మీ రెంత మాత్రమును దుఃఖింపవలదు."

"వలదు! – వలదు మృణ్మయీ! – వలదు" అని నవకుమారుఁడు గద్గదకంఠముతో బిగ్గఱగా నుచ్చరించుచుఁ గపాలకుండలను దన వక్షమునండానుకొనుటకై బాహువులను జాచెను. కాని కపాలకుండలను బడయజాలకపోయెను.

వసంతవాయుతాడిత మగు నొక విశాల గంగాజలతరంగము వచ్చి కపాలకుండల యెచ్చట నిలిచియుండెనో యాతీరమున కథోభాగమును దాకి దొలిచివై చెను. ఆక్షణమునందే యా మెపాదములక్రింది మృత్తికా ఖండము కపాలకుండలతోఁగూడ దారుణధ్వని గావించుచు భాగీరథీ ప్రవాహమధ్యమున జారిపడిపోయెను.

ఆ యొడ్డు విరిగి పడిపోవుశబ్దమును విని నవకుమారుఁడు దానితో గపాలకుండలయు నంతర్హిత యగుటం గాంచెను. ఆవెంటనే యాతఁడు గూడ నొక్కయుదుటునఁబోయి గంగాగర్భమునం దురికెను. నవకుమా రుఁడు జలసంతరణము నెఱుంగనివాఁడు గాఁడు. ఆతఁ డీఁదుకొనుచుఁ బోయి కపాలకుండలను వెదకులాడుచుండెను. ఎంతశోధించినను నాతఁ డామెను బట్టుకొనఁజాలకపోయెను. ఆతఁడును బైకి రాలేదు!

ఆ యనంత గంగాప్రవాహమధ్యమున – ఆమధుమాససమీర విక్షిప్త ములగు తరంగమాలికలలోఁ దూఁగుచు, నూగుచుఁ గపాలకుండలా నవకుమారు లెక్కడకుఁ బోయిరో?

సం పూ ర్ణ ము

సరస్వతీ పవర్ ప్రెస్ – రాజమహేంద్రవరము

BCS

AOA10338121

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

అనువదించిన వాడుకభాష వచన గ్రంథాలు

గ్లేజు కాగితాలు - చక్కని అచ్చు - గట్టి బైండు

రామాయణం

వాల్మీకిమహర్షి సంస్కృతమూలానికి సరిఅయిన అనువాదం

ఒక్కొక్కకాండ ఒక్కొక్క సంపుటం

1	బాలకాండ	రు. **2-50**
2	అయోధ్యాకాండ	**4-50**
3	అరణ్యకాండ	**2-50**
4	కిష్కింధాకాండ	**2-50**
5	సుందరకాండ	**2-50**
6	యుద్ధకాండ	**4-50**
7	ఉత్తరకాండ	**3-00**

పూర్తిసెట్టు రు. **22/-**



పబ్లిషర్స్: అద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

ముద్రణ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA103B121
పుస్తకం పేరు	కపాల కుండం
తారీఖు	31 December 2025
ముందు అట్ట	ఉంది
వెనుక అట్ట	ఉంది
మొత్తం పేజీలు	145
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	లేవు
లేని పేజీలు	NO
తయారు చేసినది	SARANYA
పేజీలు విడదీసినది	LAKSHMI KANTHAM
స్కాన్ చేసినది	CHANDRA KUMARI
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిష్కృతి	పూర్తి